# శ్రీ సాయిబాబా విలువైన మాటలు

వేదాంత భాషణ



పబ్లికేషన్స్ & ఉచిత గ్రంథ వితరణ

**శ్రీ సాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్**

రచయితలు

**జయంతి వెంకట భాస్కర నాగేశ్వరరావు**

**డా॥ ఓరుగంటి ప్రసాద్**

# శ్రీ సాయిబాబా విలువైన మాటలు

ప్రథమ ముద్రణ : 20.01.2025

కాపీలు : 1000

సర్వహక్కులు : శ్రీ సాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్

వెల : మీ శ్రద్ధా భక్తులు

ప్రతులకు : శ్రీ సాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్
విజయవాడ & హైదరాబాద్
8555097978 & 7893000288

ప్రింటింగ్ : గాయత్రి గ్రాఫిక్స్, హైదరాబాద్
9849372314

డిటిపి & బుక్ లేఅవుట్ : అక్షర గ్రాఫిక్స్
నల్లకుంట హైదరాబాద్
9010444935

# శ్రీ సాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్

**(పరిచయం)**

శ్రీ సాయిబాబా వారికి ఈ విశ్వంలో కోటానుకోట్ల మంది భక్తులు ఉన్నారు వారిలో ఈ "శ్రీ సాయి జ్ఞానయజ్ఞం ట్రస్టు" వ్యవస్థాపకుడినైన నేను కూడా ఒక పాదరేణువును.

శ్రీ సాయి సచ్చరిత్ర అను మహాగ్రంథం సాయి బంధువులకు ఉచిత వితరణయే ధ్యేయంగా, శ్రీ సాయినాధుల వారి ప్రేరణతో, అనుగ్రహ ఆశీర్వాదాలతో ఏర్పడినదే ఈ మన "శ్రీ సాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్". మన ట్రస్ట్ 05.12.2019 నాడు ఆవిర్భవించడం జరిగింది.

**"జ్ఞానమే నిజమైన శక్తి సంపద"**

**సాయి జ్ఞాన సంకల్పం :**

ఈ మన ట్రస్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం "సాయి జ్ఞాన ప్రచారణ" ఈ క్రమంలో మనము మన సంస్థ ద్వారా 17 భాషలలో సాయి సచ్చరిత్ర ఉచిత గ్రంథ వితరణ చేస్తున్నాము. సాయి సచ్చరిత్ర తో పాటు శ్రీ సాయినాధుని స్తవణమంజరి, శ్రీ సాయినాథ సగుణోపాసన, శ్రీ సాయి హారతుల పుస్తకాలు ఉచితంగా భక్తులకు ఇవ్వటం జరుగుతోంది.

సాయి బంధువులు అందరూ "శ్రీ సాయి సచ్చరిత్ర" పారాయణ చేసి, ఆయన యొక్క శుభాశీస్సులు పొందాలన్నదే మా అంతిమ లక్ష్యం. కేవలం భారతదేశంలోనే కాకుండా, దేశ విదేశాలలో కూడా ఈ జ్ఞాన సేవను చేయడం జరుగుతోంది.

సాయి తత్వ విచారణ, సాయి జ్ఞాన సముపార్జన, సాయి లీలా వినోదాన్ని పదిమందికి అందించే క్రమంలో మన సంస్థ ద్వారా ఈ క్రింది జ్ఞాన కుసుమాలను ఆవిష్కరించి భక్తులకు ఉచితంగా అందించడం జరిగింది :-

1) స్తుతి స్మృతి
2) సాయి నామ కోటి
3) శ్రీ సాయి జ్ఞాన బిందువులు
4) శ్రీ సాయి హారతులు
5) శ్రీ సాయి జ్ఞానేశ్వరి

6) శ్రీ వినాయక వ్రతకల్పం

7) శ్రీ సాయిలీలా సంగ్రహం

8) శ్రీ సాయి మహాత్ముడు

9) శ్రీ రామకోటి

10) శ్రీ సాయికోటి

11) నాలో "మహాభారతం"

పైన తెలిపిన ఈ జ్ఞాన సత్ గ్రంథాలే కాకుండా మన సంస్థ ద్వారా అమూల్యమైన జ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేసే ఇతర రచయితల గ్రంథ ప్రచురణలకు ఆర్థికంగా తోడ్పడే భాగ్యాన్ని బాబాగారు మనకు కలిగించారు. ఆ గ్రంథముల వివరములు:-

1) శ్రీ సద్గురువుల దివ్య చరిత్రలు

2) కృష్ణ జోగేశ్వర భీష్మ (సాయి హారతులు రచయిత)

3) బాబా వారి అద్భుత లీలా తరంగిణి

4) ఋణానుబంధం

5) సాయి గురుకులం షిరిడి

6) శ్రీ నృసింహ పురాణము

మొదలగునవి

## "మానవసేవే మాధవసేవ"

**సాయి సేవా సంకల్పం :**

ఎందరో అభాగ్యులు, ఎందరో నిరుపేదలు, మరెందరో ఆర్తితో ఎదురుచూసే అనాథాశ్రమాలలోని చిన్నపిల్లలు మరియు వయోవృద్ధులు, పూట గడవడం కూడా ఇబ్బందికరమైన పరిస్థితులలో ఉన్న అతి సామాన్య ప్రజలు మన చుట్టూ ఎందరో ఉన్నారు...

**సాయి అమృత పలుకు :**

నీ దగ్గరకు ఆర్తితో వచ్చిన ఏ ప్రాణిని అయినా సరే నీకు అవకాశం ఉన్న విధంగా వాటికి చేతనైన సాయం - అంటే అన్నం, నీరు, వస్త్రం, సేదతీరేందుకు స్థలం ఇలా ఏది అవకాశం ఉంటే అది ఇచ్చి పంపు - సద్గురు శ్రీ సాయినాథ్ మహారాజ్.

బాబా వారి ఈ అద్భుత అమృత పలుకులను ఆధారం చేసుకొని ఆ సాయి

తండ్రి అనుమతి, అనుగ్రహములతో మన "శ్రీ సాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్" "అన్నసంతర్పణ" సేవా కార్యక్రమానికి నాంది పలకడం జరిగింది.

మన ట్రస్ట్ ద్వారా భారతదేశపు నలుమూలలా గల వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, శారీరక - మానసిక పునరావాస కేంద్రాలు, రహదారులపై ఉండే వెనుకబడిన వారికి అన్నదానం, ఆహారపొట్లాల పంపిణీ, అవసరం మేరకు నిత్యవసర సరుకుల కిట్స్, పిల్లల ఆశ్రమాల్లో స్నాక్స్ కిట్స్, ఇలా అవసరం ఉన్న చోట్ల మన శక్తి మేర సాయి సేవలు నిర్వహిస్తున్నాము.

మా లక్ష్యం బాధితులందరికీ సేవ చేర లేకపోవచ్చు, కానీ అది ఖచ్చితంగా సహాయం కావాల్సిన వారిలో కనీసం కొందరికైనా చేరుతుంది అని మా ఆశ.

ఈ సేవా సంకల్పంలో పైన తెలిపినవే కాకుండా అనేక గోశాలలో గోమాతలకు ఆహార సేవ, పిల్లలకు పుస్తకములు, వయోవృద్ధులకు అవసరమైన నెలవారి మందులు, దుప్పట్ల పంపిణీ చేయడం, ఇలా అనేక విధాలుగా మన శక్తి కొలది సేవా కార్యక్రమాలను గత మూడు సంవత్సరాలుగా చేస్తున్నాము.

శ్రీ సాయినాథుని సూచనల మేరకు పై సేవలను దశలవారీగా నిర్వహిస్తున్నాము.

ఏదో..చేయాలనే ఉద్దేశంతో మాత్రమే కాకుండా ప్రతి యొక్క సమస్యని కూడా స్వయంగా మేము ఎంక్వయిరీ చేసి, సమస్య నిర్ధారణ చేసుకొని, దాని తీవ్రతను బట్టి సహకారం అందివ్వడం జరుగుతోంది.

దేశవ్యాప్తంగా మన "శ్రీ సాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్" నిర్వహించిన, నిర్వహిస్తున్న అనేకానేక సేవా కార్యక్రమాలను మీరు సోషల్ మీడియాలో ఒక్కసారి వీక్షించగలరు.

ఈ సేవ మార్గంలోకి నేను సైతం అని మరింత మంది సాయి బంధువులు పాల్గొనాలని ఆ సాయినాథుడిని వేడుకుంటున్నాము.

**సర్వేజనా సుఖినోభవంతు !**

**లోకా సమస్తా సుఖినోభవంతు !**

**సద్గురు శ్రీ సాయినాథ్ మహారాజ్ కీ జై !**

# కృతజ్ఞతలు

1. ముఖ్య రచయిత జయంతి వెంకట భాస్కర నాగేశ్వరరావు (వేద ప్రభాస్) గారికి
2. నా భార్య అనంతలక్ష్మి సత్యవతికి
3. శ్రీ సాయి జ్ఞాన యజ్ఞం ట్రస్టీ వారికి
4. సలహాలు ఇచ్చిన శ్రీ ఇమ్మడిశెట్టి ప్రభాకర్ రావు గారికి

ఇట్లు
శ్రీ సాయి పాదరేణువు
డా॥ ఓరుగంటి ప్రసాద్

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| * | మొదటి అధ్యాయం<br>**సిరి సంపదలు** | 10 |
| * | అధ్యాయం 2<br>**ఆహార వ్యవహారాలు** | 23 |
| * | అధ్యాయం 3<br>**వాగ్ధార** | 39 |
| * | అధ్యాయం 4<br>**భక్తి మార్గం** | 52 |
| * | అధ్యాయం 5<br>**పునర్జన్మవలయాలు** | 82 |
| * | అధ్యాయం 6<br>**కర్మ సిద్ధాంతం** | 92 |
| * | అధ్యాయం 7<br>**మనిషి జన్మ** | 104 |
| * | అధ్యాయం 8<br>**ఇంద్రియ లాలసలు** | 115 |
| * | అధ్యాయం 9<br>**"మాయ"** | 122 |

* అధ్యాయం 10 131
స్వీయాడంబరం
* అధ్యాయం 11 138
అహింస
* అధ్యాయం 12 145
సత్ప్రవర్తన
* అధ్యాయం 13 149
బ్రహ్మానందం
* అధ్యాయం 14 155
నిష్ఠ
* అధ్యాయం 15 163
"సబురి"
* అధ్యాయం 16 171
ఆపద్బాంధవసేవ
* అధ్యాయం 17 179
పుస్తకపఠనం
* అధ్యాయం 18 189
గురుభక్తి
* అధ్యాయం 19 204
నభోమండలం
* అధ్యాయం 20 212
వేరు వేరు మత ధోరణులు
* అధ్యాయం 21 222
సంక్షిప్తంగా శ్రీ సాయిబాబా గారి బోధనలు


సాయి సచ్చరిత్ర
చాంద్ పాటిలుని పేరుతో పిలచి
తర్వాత తప్పిపోయిన గుఱ్ఱం గురించి తెల్పుట

## మొదటి అధ్యాయం

# సిరి సంపదలు

భగవాన్' శ్రీ సాయిబాబా, తన జీవితకాలంలో తన భక్తులకు సిరిసంపదలు లేదా ధనం గురించి ఇచ్చిన అమూల్యసూచనలు శ్రీ సాయి సచ్చరిత్ర గ్రంథంలో, ప్రతీ చోటా గోచరిస్తాయి. సంపదలను ప్రోగుచేయాలనే వైఖరి ప్రజలందరిలో దినదినమూ పెరిగిపోతూ ఉండటం మనకి కనిపిస్తూనే ఉంది.రాత్రనక పగలనక, న్యాయ బద్ధంగానో, అన్యాయంగానో ఎలాగో ఒకలాగా ధనం సంపాదించుకోవాలనే తా పత్రయం ప్రతీ వారిలోనూ నేడు స్పష్టంగా కనిపిస్తూనే వుంది. ఈ విషయంలో భగవాన్ 'శ్రీ సాయిబాబా వారు నిరంతరమూ చెపుతూ వచ్చినబోధలు అందరికీఎంతో ఆమోదయోగ్యంగా ఉంటాయి.

ధన సంపాదన ధ్యేయంగా ఉన్నవాళ్ళుతాము కావాలనుకున్న సర్వసౌఖ్యాలనీ, ఆనందమయ జీవితాన్ని ధనం వల్లనే సాధించగలుగుతామనీ, తమ వారసులు కూడా ఎంతో హాయిగా జీవించగలుగుతారనీ అనుకుంటారు. అయితే వాళ్ళు కొద్దిసేపు ఆలోచించగలిగితే, వాళ్లు తాము నిజమైన ఆనందంతోలేమ నిగ్రహించగలుగుతారు. సమస్యలతో నిరంతరం వ్యాకులమైన మనస్సుతోనూ, తరచుగా వ్యాధుల బారిన పడుతున్న శరీరాలతోను

వాళ్లు ఉంటారు. ఏ ఒక్క రాత్రైనా వాళ్ళు సుఖంగా నిద్రపోవడమన్నది ఉండదు. అయినప్పటికీ ధనం ఇబ్బడి ముబ్బడిగా సంపాదించుకోవాలన్న కాంక్ష ఇంకా వారిలో పెరుగుతూనే ఉంటుంది.

ఎవరైతే తమను తాము తెలుసుకోవాలనుకుంటారో,ఎవరైతే సామాన్యమైన, నిర్మలమైన జీవితాన్ని గడపాలని కోరుకుంటూ ఉంటారో వారికి సంపదల విషయంలో శ్రీ సాయిబాబా ఇచ్చిన సూచనలు చాలా ఉపయుక్తమైనవి.

**ఆత్మస్వరూప జ్ఞానం తెలుసుకోవాలనుకునే వారికి ఆయన బోధించినది :**

ధన సంపాదన మీద వ్యామోహం వొదులుకోలేని వాళ్ళు ఆత్మ స్వరూప జ్ఞానం తెలుసుకోవడమన్నది అసాధ్యమని శ్రీ సాయిబాబా స్పష్టంగా చెప్పేరు." శ్రీ సాయిసత్చరిత్ర" గ్రంథంలోని 16,17 అధ్యాయాలలో అందుకు ఉదాహరణగా ఆయన ఒక కథ చెప్పేరు.బాబా దర్శనానికి వచ్చిన ఒక వ్యక్తి ఆయనను "బ్రహ్మం అంటే ఏమిటి?" (విశ్వం ఉనికికి కారణం దాని ఉద్దేశం) అని ప్రశ్నించేడు.ఆ వ్యక్తి ధనికుడు కానీ పిసినారి అనే చెప్పాలి. అతని జేబులో 250 రూపాయల నోట్లకట్ట ఉంది. కానీ కనీసం 5 రూపాయలైనా బాబా గారికి ఇవ్వడానికి సిద్ధంగా లేడు.

బాబా అతనితో అన్నారు" బ్రహ్మజ్ఞానం ఎల్లప్పుడూ లోభానికి లేదా దురాశకి శత్రుత్వాన్ని కలిగి ఉంటుంది. ఎవరికి దురాశ ఉంటుందో వారికి ధ్యానం చేయడం సాధ్యపడదు. అలాంటప్పుడు ఎవరికైనా పరమలక్ష్యమైన భవబంధాల నుండి విమోచన పొందడం, లేదా సర్వ పరిత్యాగం అన్న వాటిని, దురాశాపరులెప్పుడైనా సాధించగలుగుతారా? అంతేకాదు

లోభులెప్పుడూ ధ్యానయోగులకు నిర్దేశించబడిన విధులకూ, పనులకూ వ్యతిరేకంగానే ఉంటారు. (69వ పేజీ)

భత్వంతో జీవించే వాళ్ళకి ప్రశాంతత ఉండదు. తృప్తి అన్నది కలుగనేకలుగదు. ఆరాటం తీరదు.మనసునిండా దురాశ నిండి ఉన్న వారికి ఎన్ని సాధించినా అవి ఏవీ పరమ లక్ష్య సాధనకు పనికి రానివే అవుతాయి. ఆత్మ విమోచనం సిద్ధించదు.(70పేజీ ) – అధ్యాయం 17.

"ఈ సంగతి గుర్తుపెట్టుకోండి. ఎవరికైతే ధన సంపాదనే ప్రధాన లక్ష్యం గా వుంటుందో వారికి ఆత్మజ్ఞానం ఎన్నటికీ సిద్ధించదు." (165 పేజీ)

"పరమాత్మ గురించి, బ్రహ్మజ్ఞానం గురించి నేను చెపుతున్నప్పుడు తెలుసుకోవాలని, వింటున్న వారె వరికైతే, ఆలోచనలు వారి ఇంద్రియ సుఖాలు ,లౌకిక వ్యవహారాల చుట్టూతానే పరిభ్రమిస్తూ ఉంటాయో వారికి కూడా ఆత్మజ్ఞానం సాధించడం సాధ్యం కాదు." (166 పేజీ) –అధ్యాయం – 16

"మహల్సాపతి ,శ్రీ సాయి బాబాకి బాగా ఇష్టమైన,తోడుగా వుండే భక్తుడు. పేదవాడు. ఆరోజుల్లో తన కుటుంబాన్ని నిర్వహించుకు రావడం అతనికి చాలా కష్టంగా వుండేది. అతడు రోజూ శ్రీ సాయి బాబా, వందలాది రూపాయలు ఎందరికో పంచి పెడుతుండటం చూస్తూ వుండేవాడు. కానీ ఏ రోజూ అతడు బాబాని తనకు కొంత సొమ్ము ఇవ్వమని అడగలేదు. ఒకరోజుహంసరాజ్" అనే ధనవంతుడు బాబా దగ్గరకి వచ్చినప్పుడు, మహల్సాపతికి కొంత డబ్బు ఇవ్వబోయేడు.కానీ అతను తీసుకోలేదు. బాబా కూడా తీసుకోమనీ చెప్పలేదు.

అప్పుడు బాబా అన్నారు. "నా భక్తుడుని డబ్బు ఆకర్షించలేదు. అతడు ఐశ్వర్య మాయాజాలంలో చిక్కుకోడు." (71పేజీ) అధ్యాయం–16

29 వ అధ్యాయం ఈ విషయంలో ఒక స్త్రీ గురించి మనకి తెలియజేస్తుంది. మద్రాసులో నివశించే ఆస్త్రీకి, శ్రీరాముడిని చాలా సార్లు చూసినట్టు అనిపించేది గానీ. ఆమెకు డబ్బు మీద ఉన్న వ్యామోహం వల్ల ఆమెకు శ్రీరాముడి దర్శనం ఆగిపోయింది. ఆమె తన భర్తతో షిరిడీ వచ్చి సాయి బాబా దర్శనం చేసుకున్నప్పుడు .ఆయన ఆమె ఆధ్యాత్మిక జీవితాన్ని గురించి గుర్తుచేస్తూ ఆమెకి శ్రీరాముడి దర్శనం అయ్యేలా చేసి ,ఆమె భర్తను తన భక్తుడుగా మార్చుకున్నారు.

కాకామహాజన్'యజమాని 'ధర్మాసి థాకర్సి షిర్డీ వచ్చినప్పుడు శ్రీ సాయిబాబా ఆయనకు చెప్పిన ఈ ప్రవచనం చాలా సుందరమైనదిగా ఉంటుంది.

"ఒక మనిషి ఉండే వాడు. అతని ఇల్లంతా పాడి పంటలతో ,ధన సంపదతో నిండి ఉండేది. కానీ అతని మనసంతా ఎల్లప్పుడూ అశాంతిగా వుండి అనేక బాధలతో సతమతమవుతూ వుండేది. అతడికి శారీరక, మానసిక పరమైన వ్యాధులూ, రుగ్మతలూ ఏవీ లేవు. అతనెప్పుడూ అవసరం లేని పనులలో మునిగి తేలుతూ ఉండేవాడు." (115 పేజీ)

అతడు, పెద్ద కారణాలేమీ లేకుండా తల మీద బరువులెత్తుకుని ఇక్కడకీ, అక్కడికీ అదేపనిగా తిరుగుతూ వుండేవాడు. అప్పుడప్పుడూ ఆ బరువులను కిందకి దించుతూ మళ్ళీ తలమీద కెత్తుకుని పోతూ వుండేవాడు. అతడికి మానసిక ప్రశాంతత అన్నదే లేదు (116పేజీ)

నేను, అతనితోఅన్నాను" ఎందుకలా తిరుగుతున్నావు? ఎక్కడో ఒక దగ్గర కూర్చుని మాట్లాడకుండా వుండలేవా?అని (118పేజీ)–అధ్యాయం 35

శ్రీసాయిబాబా తనను చూడటానికి, మాట్లాడటానికి వచ్చే డబ్బున్న భక్తులతో ఇలా చెప్పే వారు." మీ ఇంద్రియ సుఖాలకో సండబ్బు ఖర్చు చెయ్యకండి. ఏదైనా ఒక మంచి పని కోసం, దానిని ఉపయోగించండి." ధనవంతుల దగ్గరున్న డబ్బు వాళ్ళు దాన ధర్మాలు చెయ్యడానికి ఉపయోగ పడుతుంది. ఆ దాన ధర్మాల ఫలాలు, వాళ్ళని నిజమైన ఆధ్యాత్మిక జ్ఞాన సంపాదన వైపు నడిపిస్తాయి."(132 పేజీ)

" ప్రజలు తాము చాలా కష్టపడి సంపాదించిన ధనాన్ని,దానాలు చేయటం వలన తాము పొందే లాభాలను పక్కన పెట్టి, దానిని తమ ప్రాపంచిక ఆనందాలకోసం అనవసరంగా ఖర్చుపెడుతూ ఉంటారు." (133పేజీ)

"తాను ప్రతీ పైసాకూడబెట్టి, కోట్ల విలువైన సంపదను పోగుచేసిన ధనవంతుడు ఆధనాన్ని విలాసాలకు అనవసరంగా ఖర్చు చేయకపోతే, అతడేఆనందంగా జీవించగలడు."(134పేజీ)

శ్రీసాయిబాబాగారి,ఆలోచనాత్మక బోధనల వల్ల ప్రభావితుడై, గుండుగోపాల రావు, ఒకశిధిలమై పోతున్న శనీశ్వరాలయాన్ని పునర్నిర్మాణం చేసేడు. రావుబహదూరుసాథే, కాకాసాహెబ్' దీక్షిత్' అనే వారు కూడా ఆ బోధనల ప్రభావంతోనే, బాబా సందర్శనానికి వచ్చే భక్తులకోసం విశ్రాంతి మందిరాలు నిర్మించేరు. ధనవంతుడైన బాపూ సాహెబ్' భట్టీ అనే ఆయన శ్రీ సాయిబాబా వారి సమాధి కోసం సమాధి మందిరాన్ని కట్టించేరు.

నానాసాహెబ్ చందోర్కర్ గారినుండి శ్రీ సాయి బాబా గారు అందరికన్నాముందే చాలా సహాయం పొందేరు. తన డబ్బుతో, అధికార హోదాతో నానా సాహెబ్ గారు శ్రీ సాయిబాబా గారి దర్శనం కోసం వచ్చే భక్తులు ఉండటానికి గుడారాలు వేయించడమే కాకుండా, అంతకు

ముందు శ్రీ సాయి బాబా గారు తనకోసం వచ్చే భక్తులు ఉండేందుకూ, వారికి అన్న పానాదులు అందజేయడానికీ చేసినసదుపాయాలకోసం ఆయనకేర్పడిన ధన రుణాన్నికూడా తీర్చివేసేరు.

అలా శ్రీ సాయిబాబా పుష్కలంగా ధనం, అధికార హోదాలు కలిగి అహంభావంతో ఉన్న వ్యక్తులలో వారి అహాన్నిఅణచి వేసి, వారిని నెమ్మదిగా ఆధ్యాత్మిక మార్గంలోనికి తీసుకు వచ్చేరు. అందుకు ఆయన చేపట్టిన పద్ధతి వారికి, "నీ సిరి సంపదలు, మధ్యాహ్నం నీడల్లాగా చాలా తాత్కాలికమైనవి. ఆ సంగతి మరచిపోకు. నీఐశ్వర్యం మత్తులో మునిగిపోయి, అనవసరంగా నువ్వు ఎవరినీ ఇబ్బందులకు గురిచేయకు." అని చెప్పినట్టుగా ఉంటుంది.

(–ఇది''దాస్ గణుమహరా అనే ఆయున రాసిన''భక్త లీలామ్రుతం"అనేగ్రంథంలోని 32వ అధ్యాయంనుండి సేకరించినది.)

ఆత్మస్వరూపజ్ఞా నాన్ని, పొందాలనుకు నేనిరు పేదలకు శ్రీసాయిబాబా వారు ఒక శాశ్వత భరోసానిచ్చేరు." నా భక్తుల నివాసాల్లో ఏనాడూ ఆహారానికీ, దుస్తులకీ కొరత అన్నది రానే రాదు."(33 పేజీ)–అధ్యాయం

"ఎవరైతే నన్నుఅనవరతం ఆరాధిస్తూ ఉంటారో, ఎవరైతే నిరంతరం మనసు నిండానా మీద భక్తి భావం కలిగి ఉండి, నన్నుసేవిస్తారో,నేను వారి జీవితాలకి పర్యవేక్షకుడిగా,వారికి రక్షకుడిగా ఉంటానని వాగ్దానం చేస్తున్నాను." (34 పేజీ) – అధ్యాయం 6

**లౌకిక జీవితం గడుపుతున్నవారికి శ్రీ సాయిబాబా వారు చెప్పినది.**

లౌకిక జీవితం గడుపుతున్నసాయి భక్తుల కోసం బాబా గారు ఇలా చెప్పేరు."నిజాయితీగా తన ధన సంపాదన కోసం కష్టపడి ధనాన్ని ఆర్జించేవారు తాము సంపాదించిన దానితో ఆనందంగా జీవించాలి.ధన సంపాదనకోసం వ్యధ చెందుతూ,ఆందోళన కి గురవుతూ అందుకోసం

లంచాలను స్వీకరిస్తూ, హత్యలుచేస్తూ, అనైతికంగా, జీవించకూడదు. ఎందుకంటే అలాంటి వారు తమ దుర్మార్గాలకు సంభవించే దుష్ఫలితాలను ఈజీవితంలో కాకుంటే, ఆతర్వాత జీవితాల్లో నైనా అనుభవించవలసి ఉంటుంది. దీనికి సంబంధించి, శ్రీ సాయిబాబా వారు నానాసాహెబ్ చందోర్కర్ గారికి ఒక చక్కని ఉదాహరణని ఇచ్చేరు.

"ఒక గుమాస్తా తన యజమానిని చంపి, అతడు పని చేస్తున్న సంస్థకి యజమాని అయ్యేడు.(12 పేజీ) అలా ఒక సంస్థకి యజమానిగా మారిన అతడు, తనజీవితాన్ని సౌఖ్యంగా, విలాసవంతంగా గడిపేడు. అతడు గుర్రపు బళ్లల్లో షికార్లు చేస్తూ తాను చాలా ఆనందంగా ఉన్నానని చెప్పేవాడు.(13పేజీ)

అయితే, తన యజమానిని హత్య చేయడం ద్వారా అతడు ఒక పాపాన్ని స్వంతం చేసుకున్నాడు. ఈ జీవితంలో లేదా అతడి తర్వాత జీవితాల్లో, అతడు చేసే మంచి,చెడుపనుల ఫలితాలు దానికి తోడవుతాయి.కాకపోతే, ఈ జీవితంలో చేసే మంచి, చెడు పనుల పర్యవసానంగా పొందే ఆనందం, బాధలు ఈ జన్మలో కాకపోతే తర్వాత జన్మలలో కూడా సంభవిస్తాయి.(14పేజీ)

(శ్రీ దాస్'గణుమహరా రచించిన"భక్త లీలామ్రుత్' గ్రంధంలోని 33వ అధ్యాయం నుండిసేకరించినది.)

శ్రీ సాయి సత్చరిత గ్రంథం 46వ అధ్యాయంలో, శ్రీ సాయిబాబాగారు రెండు ఆడమేకల గతజన్మ జీవిత చరిత్రలు ఇలా చెప్పేరు.అవి రెండూ గతజన్మలో అన్నదమ్ములు.వాళ్ళు మొదట్లో ఒకరిపట్ల మరొకరు, ఎంతో ప్రేమతో ఉండేవారు. తర్వాత కాలంలో డబ్బుకోసం ఒకరి నొకరు చంపుకున్నారు. వాళ్ళే ఈ జన్మలో మేకలుగా పుట్టేరు.

అలాగే అధ్యాయం47లో, ఒక పాము, కప్పల 3 పూర్వజన్మల సంగతులు చెపుతూ ఆయన "జాగ్రత్తగా వినండి. వీటిగత జన్మల చరిత్రలు గమనిస్తే, దురాశా పూరితమైన ధనకాంక్ష కలిగిన వారి జీవితాలు ఎంత దారుణంగా పతనమవుతాయో మీకు అర్థమవుతుంది." అన్నారు.(15 పేజీ)

"శత్రుత్వాన్నికలిగి ఉండటం కూడా ఎవరికీ మంచిది కాదు. మీమనస్సులలో ఆభావాన్ని అసలుదరిచేర నివ్వకండి. లేకపోతే అది మీ జీవితాలను ఎంతో నాశనం చేస్తుంది." (అధ్యాయం 47)

"ఎవరైనా, సరైన పద్ధతులను అవలంబించి గా నీలేదాతమ భాగ్యం వల్లనోగానీధనార్జన చేసినట్లైతే, దానిని వారు అనుభవించి ఆనందించవచ్చు.అదే సమయంలో వాళ్ళు ఇతరులని మరీ ముఖ్యంగా పేదలను, ధనం అవసరమైన వారిని కూడా తమ ఆనందంలో పాలు పంచుకునేలా చేయాలి."

శ్రీసాయిబాబాచెప్పేరు."అతిథులని గౌరవించండి. దాహంతో తల్లడిల్లుతున్న వారికిమీరు మంచినీళ్ళు ఇస్తే,ఆకలితో అలమటిస్తున్నవాళ్ళకి మీరుఅన్నంపెడితే, ఇల్లు లేనివారికి మీరు బట్టలు ఇచ్చి, వసతి కల్పిస్తే, శ్రీ క్రృష్ణభగవానుడు ఆనందిస్తాడు "(142 పేజీ)–అధ్యాయం 19.

అన్నా సాహెబ్ దభోల్కర్ తాను తినడానికి, తన కోటు మడతల్లో దాచుకున్నవేపిన బఠాణీలను చూసి, అతనితో శ్రీ సాయి బాబా

గారుచమత్కారంగా అన్న మాటలు "ఎవరైనా తాను తింటున్నది ఇతరులకి ఇవ్వకపోవడం మంచిదికాదు." కూడా ఆవిషయాన్నేమనకు చెపుతాయి. – అధ్యాయం 24.

అదే విధంగా శ్రీ సాయిబాబా గారు, తన దగ్గర ఉన్నధనం తన సుఖం కోసం గానీ, ఇతరుల కోసం గానీఖర్చు చెయ్యని పిసినారుల మనస్తత్వాన్ని కూడాఎంతగానో, చీదరిస్తారు. అంతులేని ధనాన్ని కలిగి ఉండి పిసినారిగా బతకడం సిగ్గు..సిగ్గు.. అలాటి బతుకంతా అలసట, అసహ్యమే" అని ఈసడిస్తారు.(30పేజీ)– అధ్యాయం 47

అయితే ఎటువంటి దానమైనా (భిక్ష వెయ్యటం, ఆలయాలు నిర్మించటం వంటివి) స్వచ్ఛందంగా చేస్తేనే ఫలితమున్నది అవుతుంది. ఎవరి బలవంతం వల్లనైనా దానమిచ్చినా, లేదా కీర్తి కోసం దానమిచ్చినా అందువల్ల ఎటువంటి ఫలమూ దక్కదు. ఈ సందర్భంగా శ్రీ సాయిబాబా ఇలా చెపుతారు" భగవంతుడు ప్రేమ లేకుండా ఇచ్చిన దానినీ,భయంతో ఇచ్చిన దానినీ,బలవంతం మీద ఇచ్చిన దానినీ ఇవ్వక తప్పని పరిస్థితుల్లో ఇచ్చిన దానినీ ఇష్టపడడు. ప్రేమతో, నిజాయితీగా ఇచ్చిన ఎంత చిన్నదైన దానాన్ని అయినా ఆయన ఆనందంగా స్వీకరిస్తాడు."(101 పేజీ)

"నిజాయితీ లేకుండా ఒకరేది దానమిచ్చినా,ఆ ఇచ్చినది విలువ లేనిదే అవుతుంది. తమ దానానికి ఎటువంటి ఫలం లేదని,ఆ దానం ఇచ్చిన వారు తమ ఆఖరి దినాల్లో తెలుసుకుంటారు."(109పేజీ)–అధ్యాయం 47.

భిక్ష ఇవ్వటం మీద శ్రీ సాయి బాబా గారు ఒక గుర్తు పెట్టుకోవలసిన మాట చెప్పేరు." నువ్వు డబ్బు గానీ,మరేదైనా గానీ ఒకరికి ధర్మం చెయ్యటానికి ఇష్టంలేకపోతే, ఇవ్వకు. కానీ ఆ మనిషి మీదకేకలు వెయ్యకు.

అతడి మీద ఒక కుక్కలాగా విరుచుకు పడకు."(143పేజీ)-అధ్యాయం 19.

ఎవరైతే తమ ఇహలోక సంబంధమైన జీవితం కోసం, కుటుంబం నడపటం కోసం అవసరమైన ధనసంపాదన చేస్తూ,ఎంతో జాగ్రత్తగా మితవ్యయంతో తమ ఐహిక జీవితాన్ని కొనసాగిస్తున్నారో వారికోసం కూడా శ్రీ సాయిబాబా గారు ఒక విలువైన మాట చెప్పేరు."అన్ని సమయాల్లో ఉదారంగా వుండటమన్నదికూడా అటువంటి వాళ్లకు మంచిది కాదు. వాళ్లు సంపాదించుకున్న ధనం అంతా ఖర్చయిపోతే,ఎవరూ వాళ్ల గురించి ఆలోచించరు". (76పేజీ)

"గుర్తుంచుకోండి. మీఆదాయం ప్రకారమే మీ దాన ధర్మాలు(భిక్ష వేయటం, ఆలయాలు నిర్మించటం వంటివి) ఉండేలా చూసుకోండి. అంతేగానీ అప్పులు చేసి మరీ దాన ధర్మాలు చేయకండి"(72పేజీ)

"డబ్బు దానం చేసే ముందు, మీరు ఎవరికైతే ఇవ్వాలనుకుంటున్నారో వారి అవసరాన్నీ, వారి అర్హతనీ మీరు పరిగణనలోకి తీసుకున్నాకనే, వారికి ఉదారంగా ఆ ధనమివ్వండి"(78 పేజీ)

( శ్రీదాసుగణమహరాజు గారి"భక్తలీలామ్రుతం" పుస్తకంలోని 32 వ అధ్యాయం నుండి సేకరించినది.)

**శ్రీ సాయిబాబా స్వీయ సంఘటన**

స్వస్వరూప జ్ఞానాన్ని తెలుసుకోవాలనుకునే వాళ్ళకీ, ఐహిక జీవితాన్ని గడుపుతూ వుండే వాళ్ళకీ, శ్రీ సాయి బాబా గారు సిరి సంపదల విషయంలో పాటించదగిన సూచనలు చేసేరు. అవి వేరు వేరుగా ఉన్నప్పటికీ అందరూ అనుసరించవలసినవి గానే గోచరిస్తాయి. ఆయన చెప్పిన మాటలు ఏవీ ప్రవచన పదాడంబరాలు కానేకావు. ఆయన ఆచరించి చూపిన మార్గాలే

అవి. ఉదాహరణ చెప్పాలంటే, ఆయన ఇంద్రియ చాపల్యాలకు, ఆనందాలకు లొంగిపోయే మనిషి కాదనీ, అన్నీ విడిచి పెట్టినసిద్ధుడనీ అనీఅందరికీ తెలుసు. ఆయన మనోరథసిద్ధి పొందిన మహానుభావుడని ఆ నాటి వారందరికీ తేటతెల్లమైన సంగతి మరి.ఆయన బహిరంగ ప్రదేశంలో ఉన్న ఒక వేప చెట్టు కింద గానీ శిథిలమైపోతున్న మశీదులో గానీ ,చావడిలో గానీ నివసిస్తూ ఉండటం లోకమెరిగిన సత్యం. ఆయన ధరించేది కూడా ఒక మాసికలు పడిన పొడవైన దుకూలం, తలకి చుట్టిన ఒక గుడ్డముక్క మాత్రమే. ఆయన కూర్చునేది కూడా ఒక చిరిగిపోయిన గోనె గుడ్డ మీదనే. భోజనం కోసం ఆయన గ్రామంలో అందరినీ యాచించే మనిషి కూడా ... ఇంతకన్న ఒక పరిత్యాగికి ఉదాహరణ మరేముంటుంది?


ఆయన గురించి ఆ తర్వాత కాలంలో చాలా మందికి తెలిసి,అనేక మంది భక్తులు ఆయన కోసం తండోప తండాలుగా వస్తూ వుండేవారు.అందులో కొందరు ఆయనను చాలా ఎక్కువగా ఆరాధించే భక్తులు, ఆయన కూర్చునేందుకు మెత్తటి దిండ్లతో కూడిన పీఠాన్నిఅమర్చేరు. ఆయన శరీరానికి చక్కగా అల్లిన పట్టువస్త్రాలను ధరింపచేసి, ఆయనను వజ్రాభరణాలతో, ముత్యాలతో అలంకరించేరు. అయితే శ్రీ బాబా గారికి వాటిమీద ఎటువంటివ్యామోహం లేదు. అంతేకాదు చాలా సార్లు ఆయన తన వొంటి మీదున్నవాటిని కోపంతో బయటకు విసిరి పారేసేవారుకూడా..

ఆయనను, చావిడి ఊరేగింపులో కూర్చోపెట్టడానికి భక్తులు ఒక పల్లకీని ఏర్పాటు చేసేరు. కానీ ఆయన ఏనాడూ దానిలో కూర్చోనే లేదు.ఆయన భోజన సమయంలో ఆయనకు సమర్పించేందుకు భక్తులు ఎన్నో తినుబండారాలను తెచ్చి పెట్టేవారు.బాబా వాటిని రుచి చూడటమే తక్కువ. అంతే కాకుండా ఆయనవాటిని అక్కడున్న భక్తులందరికీ పంచిపెట్టే

వారు. ఇవే కాకుండా ప్రతీ రోజూ వందల కొద్దీ రూపాయల ధనం ఆయనకు, బహుమతిగా ఇచ్చే భక్తుల నుండి సేకరించినప్పటికీ, ఆయన ఏనాడూ ఒక్క రూపాయిని కూడా తన దగ్గర పెట్టుకోలేదు. ఆధనాన్నిఅంతటినీ పంచిపెట్టేవారు. సాయంత్రానికి, ఆయన దగ్గర అసలేమీ ఉండేదే కాదు. వీధుల్లో తిరుగుతూ పళ్లమ్ముకునే స్త్రీ ఆయనకి పళ్ళు ఇస్తానన్నా.. ఇంటి పై కప్పు మీదకి ఎక్కేందుకు ఒక కుర్రాడు ఆయనకి ఒక నిచ్చెన తెచ్చి ఇస్తానన్నా, శ్రీ సాయి బాబా గారు వాళ్ళకి వెంటనే డబ్బు ఇచ్చేసే వారు.

చివరగా ఈ అధ్యాయంలో శ్రీ సాయి బాబా గారు సిరి సంపదల విషయంలో చేసిన భోధలు గురించి సంక్షిప్తంగా చెప్పాలంటే, ఆయన చెప్పిన ఈ మాటలు సరిపోతాయి.

**"దారిద్ర్యం నిజమైన రాజరికం. ఔన్నత్యాని కంటే చాలా అధికమైనది. అల్లా పేదవారికి మిత్రుడు."**


సాయి సచ్చరిత్ర
పార్వతీపరమేశ్వరులు
వృద్ధదంపతుల రూపంలో
రాత్రివచ్చి ఆశీర్వదించుట

## అధ్యాయం 2

# ఆహార వ్యవహారాలు

శ్రీసాయిబాబాగారి, సరళమైన మాటలు, ఎవరైతేక ఠినమైన ప్రాచీన సంప్రదాయాలు, మూఢ నమ్మకాలతో జీవనం సాగిస్తూఉంటారో వారిని గొప్పగా కుదిపివేస్తాయి. ఆహార విషయాల్లో ఆయన బోధనలు ఎంతో విప్లవాత్మకంగా, వుండి వారి ఆలోచనలను సర్దు బాటుకు గురిచేస్తాయి. వాస్తవంగా చెప్పాలంటే అవి సరైనవి. పూర్తిగా ఉపయోగపడేవిగానే ఉంటాయి.

**మాంసాహార భోజనం**

ప్రత్యేకించి, హిందూ, జైన, బౌద్ధ మతాల్లో మాంసాహార భోజనం పట్ల ఒక నమ్మకం బలంగా వుంది. ఎవరైతే మాంసాన్ని ఆహారంగా భుజిస్తారో, వారికిమోక్షం సిద్ధించదు. పరమాత్మ జ్ఞానం లభించదు అన్నది ఆ నమ్మకం. శ్రీ సాయి బాబాగారు ఒక సిద్ధ పురుషుడు. ఆయన పరమాత్మ గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నయోగమూర్తి. ఎంతో మందికి ఆ జ్ఞానం సిద్ధించేలా చేసిన రుషి. అయినప్పటికీ, ఆయనకి మాంసాహారం అంటే ఎలాంటి వ్యతిరేకతా లేదు. తన భక్తులనెవరినీ ఆయన మాంసాహారం తినవద్దని చెప్పలేదు కూడా. ఆయన మొదటి రోజుల్లో, ఆయన తన కోసం మాంసాహారాన్ని ఒక పెద్ద కుండలో వండుకునే వారు. తర్వాత దానిని

ఒక మౌల్వీ చేత ఫాతిహా జపం చేయించేక ముందుగా మాలస్పతికీ, తాత్యా కోటేకీ ప్రసాదాలుగా పంపించేవారు. తర్వాత అందరికీ పంచేవారు.– అధ్యాయం 38.

అందుకు రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది ఆయన నిర్దేశించుకున్న కార్యాల్లో ఒకటైన హిందూ, ముస్లింల ఐక్యత సాధించటం. అందుకోసమే ఆయన ముస్లిం ఫకీరులా వస్త్రాన్ని ధరించేవారు. ఫకీరులాగానే జీవించేవారు. ఆయన మాంసాహారాన్ని స్వీకరించటం కూడా అందుకోసమే.

రెండవ కారణం ఏమిటంటే, మనం చాలా నిశితంగా మన ఆధ్యాత్మిక గ్రంధాలను పరిశీలించినట్లైతే, పరబ్రహ్మజ్ఞాన సముపార్జన కోసం, మోక్షసాధన కోసం ఉన్నమార్గాలలో, మాంసాహారాన్ని త్యజించట మన్నది, కేవలం ఒక మార్గమేకానీ, అదే ప్రధానం కాదని మనకి అర్ధమవుతుంది. వేదాల్లో ఉన్న ఎన్నో శ్లోకాలకి, విశ్వామిత్రుడు వంటి క్షత్రియ రుషులు కర్తలుగా ఉన్నారు. అలాగే జనకుడులాంటి బ్రహ్మజ్ఞానులు  కూడా రాజులు, పోరాటయోధులు. మాంసాహారం వాళ్ళకి నిషిద్ధం కానే కాదు.

ఒకరు తన ఆనందం కోసం లేదా రుచికరమైన ఆహారం కోసం అమాయకమైన జంతువులను చంపకుండా ఉండటంకోసం లేదా యోగసాధన చేసేటప్పుడు, ఏకాగ్రత కలిగి ఉండటానికి అవరోధాలను కలిగిస్తుంది కనుకా ,రజో, తమో గుణాలను పెంపొందేలా చేస్తుంది కనుకా మాంసాహార భోజనం వద్దనటం మెచ్చదగిన నిర్ణయమే.కానీ మాంసాహారాన్ని తినడం మానివేయకుండా ఎవరికీ  మోక్షం సిద్ధించదనీ, బ్రహ్మజ్ఞానం కలగదనీ అన్నది మాత్రం సరైన మాట కాదు. అదే సరైందయితే మహమ్మదు, జీసస్ క్రైస్ట్ వంటి మహాత్ముల ఉనికే ఉండేది కాదు. ఇంకా చెప్పాలంటే

భారతదేశంలో కొందరు మాంసాహారం ఎందుకు తినరంటే, వాళ్ళు అహింసా సిద్ధాంతాన్ని ఇష్టపడతారు. రజో తమో గుణాలను అది ఎక్కువయ్యేలా చేస్తుందని భయ పడతారు కనుక.

మాంసం తినకూడదన్నసాంప్రదాయం, తరతరాల నుంచీ వంశ పారంపర్యంగా వస్తూ ఉన్నది కనుక భారతదేశంలో కొన్ని కులాల వారు శాకాహారులుగానే కనిపిస్తారు. వారు ఏనాడూ మాంసాహారాన్ని రుచి చూడరు కనుక వారికి దానిపట్ల అయిష్టత, ఏహ్యాభావం ఎక్కువగా ఉంటాయి. ఈ రోజుల్లో ఆ కులాలకు చెందిన యువతీ యువకులు హొటళ్ళలో, విశ్రాంతమందిరాల్లో మాంసాహారాన్ని ఎంతో ఇష్టంగాతింటున్నారు. అలాగే శాకాహారంతినే వాళ్ళు కూడా అహింసా సిద్ధాంతాన్ని పాటించేవారుగా, కనిపించినప్పటికీ, వాళ్ళుతమలోరజో, తమోగుణాలను పెంచే, మసాలాదిను సులతో వేయించిన ఆహార పదార్థాలనీ, తేలికగా జీర్ణంచేసుకోలేని తీపి పదార్థాలను కూడా తినడం వల్ల, అవి వారి ఏకాగ్రతను భగ్నం చేసి, వారి యోగసాధనకు ప్రతిబంధకాలే అవుతాయి.

నిజంచెప్పాలంటే, ఏమనిషి అయితే తన సాధనలో ముందుకు సాగుతూ ఉంటాడో  అతనికి మాంసాహారం మీదా ఖరీదైన రుచికరమైన వంటకాలమీద ఆకర్షణ కలిగితే అతడి సాధనా క్రియ క్రమంగా తగ్గిపోతూ చివరికి అతడు దానికి దూరమైపోతాడు.

భజనమేళాలకు హాజరవుతూ, ముసలి తనంలో దేవాలయాలను సందర్శిస్తూ వుండే వాళ్ళు, గుడ్లు, చేపలు, మాంసం తినడం మానేసినా వాళ్ళు సాధకులలో శ్రేష్టులు కాలేరు. ఒకరు మాంసా హారాన్ని తినడం మానేయవచ్చు. అతడు గానీ ఆమెగానీ శాకాహారులు అనిపించుకోవచ్చు. అయినప్పటికీ పసందైన వంటకాల మీద నుంచి వారు చూపులు

మరలించలేకపోయినా, గోవులను, గేదెలను, పక్షులను సరిగ్గా చూడలేకపోయినా, వ్యాపారలా వాదేవీల్లోఎవరినైనా మోసంచేయడానికీ, దోచుకోవడానికీ కనీసం దేహించకపోయినా అతడు లేదా ఆమె శాకాహారిగా ఉండటమన్నది ప్రయోజనం లేనిదే అవుతుంది.

శ్రీసాయిబాబాగారి ఆలోచనా సరళి అదే విధంగా ఉంటుంది. ఆయన ఏనాడూ తన భక్తులను మాంసాహారాన్ని మానివేయమని చెప్పలేదు. కొన్ని సార్లు ఆయన (అధ్యాయం38లో) తమాషాకి, తన దగ్గర ఉన్నదాదా కేల్కరు అనే ఛాందస బ్రాహ్మణ భక్తుడిని బజారుకి వెళ్ళి మాంసం కొని తెమ్మని చెప్పేవారు. అలాగే (అధ్యాయం23 లో)తనకు పరమ భక్తుడైన బ్రాహ్మణుడు కాకాసాహేబ్' దీక్షితుడిని కత్తితో మేకను చంపమని ఆదేశించేవారు. అయితే అవన్నీ తాను ఏమి ఆదేశించినా తన భక్తులు చేయడానికి సిద్ధపడతారా! లేదా అని పరీక్షించడానికే ఆయన చేసేవారు. వాళ్లు ఆయన చెప్పినట్టు చేసేందుకు ముందుకు రాగానే, ఆయన వారిని ఆపేసే వారు. అదే విధంగా ఆయన ఏనాడు తన భక్తులలో శాకాహారులని, మాంసాహార భోజన పదార్ధాలను తినమని ఆదేశించలేదు.

శ్రీ సాయిబాబా గారు తన భక్తులను మాంసాహారాన్ని విడిచిపెట్టమని బోధించే పద్ధతి భిన్నంగా ఉంటుంది. అందుకు అవకాశం లభించిన ప్రతీసారీ, ఆయన తన భక్తులకు, సంచరిస్తున్న ప్రతీ జీవిలోనూ తాను ఉన్నానంటూ చెప్పే వారు. ఆయన శ్రీమతి తార్ఖాడ్ గారితో(అధ్యాయం9)" అమ్మా! భోజనంచేసే ముందు నువ్వు చూసిన కుక్క, దేనికైతే నువ్వు ఒక రొట్టెముక్క తినమని ఇచ్చావో, అదినాలోనే ఉంటుంది. అలాగే అన్నిఇతర జంతువులూ(పిల్లులు, పందులు, ఈగలు, ఆవులు, మొదలైనవి.) నాలోనే ఉంటాయి. నేను వాటి రూపాల్లో సంచరిస్తూ ఉంటాను. ఎవరైతే, నన్నుఈ

అన్ని రూపాల్లో చూడగలరో వాళ్ళు నేను ప్రేమించే వాళ్ల వుతారు. అందువల్ల నీలో జీవుల పట్ల ఉండే ఆ భేదభావాన్ని, ప్రత్యేకతలనీ తొలగించి నన్నుఈరోజు సేవించినట్టే సేవించు."

శ్రీసాయిబాబాగారి ఈమాటలను అర్థం చేసుకున్నవాళ్ళె వరైనా మాంసాహారాన్నిఎలా తినగలుగుతారు? యాంత్రికంగానే దాన్ని విడిచిపెడతారు. అలాశ్రీసాయిబాబాగారు ఆహార విషయంలో జీవహింస మంచిది కాదని, ఎంతో చాతుర్యంతో, ప్రయోగాత్మకంగా, అనుభవ పూర్వకంగా తన భక్తులకు బోధించేరు.

**ఉల్లిగడ్డలు**

మాంసాహార భోజనం యోగసాధనకు మంచిది కాదన్నకారణాలే ఉల్లిగడ్డలను ఆహారంలో ఉపయోగించకూడదు అన్న మాటకూ వర్తిస్తాయి. శ్రీ సాయిబాబా గారు ప్రతీరోజూ తాను భుజించే రొట్టెలతో పాటు ఉల్లిగడ్డలను కూడా తినేవారు. ఆయన వాటిని తినకూడదని ఎవరన్నాఅంటే, వారి మాటలను లెక్కచేసే వారు కాదు. వాటిని తింటే చెడు వాసన వస్తుందని, వాటిని తినని వారినసలు ఆయన పట్టించుకునే వారే కాదు. దాదా కేల్కరు గార్నీ, దాసుగణు గారి నీకుశ భావు గారినీ వారు ఆట పట్టించడం, అల్లరి చేయడం అందరికీ తెలిసినదే.

ఒకసారి ఆయన ఒక యోగసాధన చేస్తున్న శిష్యుడి ముందుకూర్చు నిరొట్టె, ఉల్లిగడ్డ తింటూ ఆశ్చర్యపరిచేరు. తర్వాత అతని ముందు ఆయన తన అద్వితీయ యోగశక్తులని ప్రదర్శించి చూపేరు. అది ఆయన ప్రజలందరికీ, ఉల్లిగడ్డల మీద అర్థం పర్థంలేని అపనమ్మకాలు, మూఢ విశ్వాసాలు వల్లనే వాటిని తినడం మానేస్తున్నారని చెప్పడం కోసమే, చేసేరని వేరుగా చెప్పనక్కరలేదు.

ఉల్లిగడ్డలని, వెల్లుల్లిగడ్డలని, భారతీయ వైద్యశాస్త్రం అయిన ఆయుర్వేదం ప్రశస్తమైన ఆరోగ్యం కలిగించే ఆహార పదార్థాలుగా ప్రశంసించింది. పేదవారైన రైతులు రొట్టె, ఉల్లిగడ్డలు మాత్రమే తిని, పొలందున్నటం వంటి కష్టమైన పనులు చేయటంలేదా? మారుమూల గ్రామాల్లో ఎవరైనా మూర్ఛ వచ్చిపడిపోతే, ముక్కలు చేసిన ఉల్లిగడ్డ వారిని లేపికూర్చో పెట్టడానికి చాలా తేలికైన, సులభమైన ఔషధంగా ఉపయోగపడటం లేదా? కొత్తగా పడమట దేశాల్లో చాలా పరిశోధనలు చేసి, శాస్త్రవేత్తలు, గుండె జబ్బులనీ, అధిక రక్తపోటు వ్యాధులనీ వెల్లుల్లి అద్భుతంగా నయం చేస్తుందని చెపితే, అప్పటి నుంచి, భారతీయులు కూడా వెల్లుల్లి సారాన్ని కలిగిన ఖరీదైన మాత్రలని వాడటమన్నది మొదలుపెట్టేరు కదా!

**ఉపవాసము**

శ్రీసాయిబాబా వారు ఆహారం విషయంలో 'ఉపవాసం' ఉండటం గురించి కూడా మరో మంచి మాట చెప్పేరు. వాస్తవంగా చెప్పాలంటే ఆయన ఎప్పుడూ ఉపవాసం ఉండలేదు. ఎవరినీ అందుకు అనుమతించ లేదు. షిరిడీలో ఒకసారి శ్రీమతి ఘోకలేగారు మూడు రోజులుఉపవాసంఉండాలని అనుకున్నారు.(అధ్యాయం32)కానీ బాబాగారు ఆమెని, దాదా కేల్కరుగారి ఇంటికి వెళ్ళి, అక్కడ కాకా గారి భార్య ఇంట్లోకి రాకూడని సమయం కనుక ఆమె వంట చేయకూడదు కనుక నువ్వే అక్కడ వంట చెయ్యమని చెప్పేరు. అంతే కాదు కాకా గారికీ, అతని కుటుంబ సభ్యులకీ షడ్రుచులతో కూడిన పసందైన వంటకాలు చేసి వడ్డించమనీ, పూర్ణంతో కూడిన తియ్యటి పోలీలు చేసి పెట్టమనీ ఆదేశం ఇచ్చేరు.శ్రీమతి ఘోకలే గారిని కూడా ఉపవాసం చేయకుండా, ఆ భోజనాన్ని కడుపునిండా తినమనీ చెప్పేరు.

బాబా ఇలా చెప్పే వారు. ”ఉపవాసం చేసేవారి మనసు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండదు. అలాటప్పుడు వాళ్ళు జీవిత పరమార్ధాన్ని ఎలా సాధించగలుగుతారు. ఖాళీకడుపుతో దేవుడిని దర్శించలేరు. ముందు ఆత్మని శాంతింప చేయాలి. క్లుప్తంగా చెప్పాలంటే మన శరీరంలోని అన్ని అవయవాలకు సరైన ఆహారం లభించి, అవి ఆరోగ్యంగా ఉంటేనే మనం, భగవంతుని దర్శించడానికి ధ్యానాన్ని, ఇతరయోగ సాధకాలనీ సాధన చేయగలుగుతాం. అందువల్ల ఉపవాసం ఉండటం గానీ, ఎక్కువగా తినడంగా నీమంచిది కాదు. మితాహారం మాత్రమే మన శరీరాన్నీ, మనసునీ ఆరోగ్యంగా ఉంచగలుగుతుంది.(123,129 పేజీలు)అధ్యాయం-32

శ్రీమతి రాధాబాయి దేశ్‌ముఖ్‌అనే భక్తురాలు తాను మరణం సంభవించేంత వరకూ ఆహారం తినకుండా, నీరుతాగకుండా ఉపవాసం చేస్తానని తీర్మానించుకున్నప్పుడు, ఆమెకి శ్రీసాయిబాబా తగిన కారణాలు చెప్పి ఆమె ఉపవాసం చేయకుండా చేసేరు. ఆయన తన గురువు దగ్గర తనస్వీయ అనుభవాలను ఆమెకి వివరంగా చెప్పి, ఆమెకి, అంత వరకూ ఎవరికీ బోధించని ఉపదేశమంత్రాన్ని తెలియచేసేరు. అంతేకాదు... ఆమెకు పరమాత్మతో, తాదాత్మ్యం చెందటానికి సులభపద్ధతి” నువ్వు నన్నుచూడు. నేను నిన్ను చూస్తాను”అనికూడా బోధించేరు(73 పేజీ) అధ్యాయం 19.

ఉపవాసానికి సంస్కృత పదం ఉప+వాసము అంటే “దగ్గరఉండటం”. ఉపవాసాన్ని సాధారణంగా ఆధ్యాత్మిక లక్ష్యాల సాధన కోసమే చేస్తారు.ముఖ్యంగా భగవంతుని సన్నిధిలో కూర్చోవడం కోసమని చెప్పవచ్చు. వివరంగా చెప్పాలంటే, మనలో ఉపవాసం చేసే వారు, ఉపవాసం చేసే రోజు పవిత్రమైన మనస్సుతో ఆలోచిస్తూ, ప్రవర్తిస్తూ, ప్రశాంతంగా భగవంతుని రూపాన్ని ధ్యానం చేస్తూ ఉండాలి. వాస్తవానికి అలా చేయడమన్న

దిమనందరికీ చాలా కష్టమైన పని అనే చెప్పాలి. మనం ఉపవాసం చేస్తున్నప్పుడు, ఆరోజు మనం ఎల్లప్పుడూ చేస్తూ ఉండే విధంగానేమనలౌకిక విధులు, వ్యాపార వ్యవహారాలు యధాలాపంగా నిర్వహిస్తూ, అబద్ధాలు చెపుతూ, ఇతరులని మోసం చేస్తూ ఉండటం లాంటివి చేస్తూనే ఉంటాము. మనశాస్త్రగ్రంధాల్లో, ఉపవాసం గురించి చాలా పద్ధతులు రాసి ఉన్నాయి. ప్రస్తుతం ఈకింద రాసిన పద్ధతులే వాడుకలో ఉన్నాయి.

1. పగటి వేళ, రాత్రి వేళ భోజనాలు చేయడం మాని, పళ్ళు, పాలు మాత్రమే తీసుకోవడం.

2. సూర్యాస్తమయం ముందు వరకూ పళ్ళు, పాలు స్వీకరించి, సూర్యుడు అస్తమించేక భోజనం చేయడం.

3. పగటివేళ ఒక భోజనం మాత్రమే చేసి, రాత్రి వేళ పళ్ళు, పాలు తీసుకోవటం.

అయితే, వీటిలో దేనినైనా మనం సరిగ్గా పాటిస్తున్నామా? ఉపవాసం ఉన్న రోజు మనం దేనిని తినాలనుకున్నా అది కొద్దిగానే తినాలి. ఉపవాసమన్నది మన జీర్ణవ్యవస్థకి విశ్రాంతినివ్వాలి అనే ఆలోచన. కానీ మనం ఏమి చేస్తున్నట్టు? పళ్ళు తినడం అన్నది తక్కువ చేసి, తినవచ్చు అనుకున్నపదార్థాలని మాత్రం చాలా సమయాల్లో చాలా ఎక్కువగా తినేస్తాము. ఒకే భోజనం చేయాలనుకున్న వాళ్ళం కూడా ఎక్కువగా తినడం మాత్రమే కాదు ఎక్కువ పదార్థాలను కూడా భుజిస్తాము. ఫలితంగా తిన్నదిజీర్ణం కాదు. చివరకి అటువంటి ఉపవాస ప్రతిఫలం ఆధ్యాత్మికంగా గానీ, ఆరోగ్యపరంగా గానీ ఏమీ ఉండదు. శ్రీసాయిబాబా గారికి ఈ సంగతిస్పష్టంగా తెలిసి ఉంటుంది కనుకనే ఆయన తన భక్తులని మతపరంగా ఉపవాసం చేయడాన్ని అంగీకరించలేదు.

### ఆహారాన్ని నిరాకరించడం

ఈవిషయమై శ్రీసాయిబాబాగారు ఒక సూచన చేసేరు. మీకు ఎవరైనా భోజన సమయంలో తినమని ఏమైనా ఇస్తే, వద్దని చెప్పి ఖాళీకడుపుతో వెళ్ళిపోకండి. ఎందుకంటే వారు మీకు ఇవ్వడమన్నది మీ విజయానికి ఒక గుర్తు అన్నది మీరు గ్రహించాలి. మనం ఏదైనా ఒక పని సక్రమంగా పూర్తి చేయాలంటే, అందుకు తగినంత శక్తికావాలి. అది ఆహారం మాత్రమే ఇస్తుంది. మరొకసంగతి ఏమిటంటే, మనకి ఎంతో ప్రేమతో అవతలి వారు తినడానికి ఏమన్నా ఇచ్చినపుడు మనం వద్దని చెప్పడం వాళ్ళ మనసులని కష్టపెట్టడమే అవుతుంది. అది మంచి పని కాదు. ఈసందర్భంగా సాయిబాబా గారు తన స్వంతానుభవాన్ని ఒకదాన్ని చెప్పేరు.

ఒకసారి అడవిలో ఆయన, ఆయన సహచరులు, బంజారీస్త్రీలు వారికి ఆహారం ఇచ్చి, అడవిలో వెళ్లేందుకు మార్గాన్ని చెపితే, ఎవరూ ఆఆహారం తినలేదు. వాళ్లు చెప్పినతోవ గురించీ పట్టించుకో లేదు. (అధ్యాయం32). అందువల్ల వారందరూ అడవిలో, తోవతప్పిపోయేరు.

ఆతర్వాత శ్రీసాయిబాబాగారు, ఆబంజారీస్త్రీలు ఇచ్చిన ఆహారం స్వీకరించి,వారు చెప్పిన తోవలో వెళితేనే ఆయన అన్వేషణ ఫలించింది.

అలాగే ఒకసారి అప్పాసాహెబ్'కులకర్ణి అనే భక్తుడు, తన భోజన సమయంలో భోజనం మానేసి ఖాళీ కడుపుతో హడావుడిగా తన ఇంటి నుండి ఒక ఫకీరుని చూసేందుకు వెళితే, అతనికి ఆఫకీరు కనిపించలేదు (అధ్యాయం 33).

అయితే, అతడు ఇంటికి వచ్చి, భోజనం చేసి, తన మిత్రుడితో కలిసి వీధిలో నడిచి వెళుతున్నప్పుడు, ఆ ఫకీరేస్వయంగా అప్పా సాహెబ్' కులకర్ణి ఎదురుగా వచ్చి"దక్షిణ'ఇమ్మని అతడిని అడిగేడు.

**ఏదైనా తినేటప్పుడు నలుగురితో పంచుకుని తిను.**

అధ్యాయం 24లో శ్రీసాయిబాబాగారు పైసూచనను చాలా ప్రతి భావంతంగా, అన్నా సాహెబ్‌దభోల్కర్‌గారిని ఆటపట్టిస్తూ మరీచెప్పేరు. ఆయన 'శ్రీసాయిసత్చరిత' గ్రంథరచయిత. ఆయన కోటు చేయిమడతల్లో ఇరుక్కున్న కొన్ని శెనగపప్పు గింజలను చూసి, శ్రీసాయిబాబాగారు పైమాటఅన్నారు. తర్వాత దానిని వివరించేరు. ఎవరైనా, తాను దేనినైనా తినేముందు, దగ్గరలో ఏమనిషి గానీ, జంతువు గానీ లేకపోతే, మొదట శ్రీసాయిబాబాగారి నిస్మరించుకుని, ఆపదార్థాన్నిఆయనకిసమర్పించి తర్వాత తాను తింటేసరిపోతుందన్నారు. ఏభక్తుడైనాతాను తినవలసిన ఆహారంబాగులేదనో, శుభ్రంగాలేదనోవొదిలేయాను కుంటే, ఆభక్తుడు ఈ పని చేస్తే, రుచిలో గానీ మిగిలిన అన్ని విషయాల్లో గానీ,ఆ పదార్థం అతడికి మంచి ఫలితాన్నే కలుగచేస్తుంది.(39.41పేజీలు) అధ్యాయం

2. శ్రీసాయిబాబాగారి, ఈసూచనను విశదీకరించేందుకు అదేఅధ్యాయంలో శ్రీహేమద్పంత్', సుదాముడి కథచెప్పేరు. శ్రీక్రిష్ణుడు, బలరాముడు ఇద్దరూ గురువు సాందీపని ఆశ్రమంలో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు, సుదాముడు వారి సహాధ్యాయిగా ఉండేవాడు. ఒకసారి వాళ్ళు అడవిలోకికట్టెపుల్లలు ఏరుకురావడానికి వెళ్ళేరు. అప్పుడు శ్రీక్రిష్ణుడికి దాహంవేసి, తాగేందుకు నీరుకావాలన్నాడు. అప్పుడుసుదాముడు ఏదీ తినకుండా నీరు తాగ కూడదన్నాడు. అప్పుడు శ్రీక్రిష్ణుడు, సుదాముడితొడ మీద తల పెట్టుకుని నిద్రపోయేడు. కొంతసేపటి తర్వాత శ్రీక్రిష్ణుడుకి సుదాముడు ఏదో తింటున్నచప్పుడుకి మెలకువ వచ్చింది. నువ్వు తింటున్నదేమిటి? అనిశ్రీక్రిష్ణుడు అతణ్ణి అడిగేడు. దానికి సుదాముడు తాను నములుతున్నది పప్పుబద్దలు అన్ననిజం చెప్పకుండా, తానేమీ తినడం లేదనీ చలివల్ల తన దంతాలుకటకట మంటున్నాయనీ అబద్ధంచెప్పేడు. దాని

ఫలితంగా తర్వాత కాలంలో సుదాముడు, శ్రీక్రిష్ణుడి బాల్యమిత్రుడే అయినప్పటికీ, జీవితంలో నిత్యదరిద్రుడిగానే, మిగిలిపోయేడు.

అతడు, తర్వాత శ్రీక్రిష్ణుడికి తన భార్య కష్టపడి సంపాదించిన అటుకులు, చేతితో తెచ్చి ఇచ్చేడు. శ్రీక్రిష్ణుడు ఆనందభరితుడై అతడికి బంగారు భవనంతో, పాటు ఐశ్వర్యాన్ని కూడా ప్రసాదించి అతడు జీవితాన్ని సంతోషంగా జీవించేలా చేసేడు. (74-87పేజీలు)అధ్యాయం 24

శ్రీసాయిబాబాగారు, ఏనాడూ తాను ఇతరులతో పంచుకో కుండా ఏదీ తినలేదు. ప్రతీ రోజూ ఆయన భిక్షాటనానికి బయలుదేరి వెళ్ళి, ఏ ఆహారమయితే ఆనాడు భిక్షగాలభిస్తుందో దానిని, మశీదుకి వచ్చేక, మట్టి పాత్రలో వుంచేవారు. కొందరు యాచకులు, దానిలోనుంచి మూడో, నాలుగో రొట్టెముక్కలు తీసుకునే వారు. కుక్కలూ, పక్షులూమరి కొంత తినేవి. శ్రీసాయిబాబా వారి నెవరినీ పారద్రోలలేదు. ఎప్పుడైనా ఒక భక్తుడు ఆయనకి రుచికరమైన భోజన పదార్ధాలు, పండ్లు తెచ్చి ఇస్తే, శ్రీసాయిబాబాగారు వాటిని కొద్దిగా రుచిచూసి,

మిగిలిన దానిని అక్కడే వున్న భక్తులందరికీ పంచి పెట్టేవారు. ద్వారకామాయిలో ప్రతీరోజూ మధ్యాహ్నం భోజనం అందరికీ వడ్డించి, తినడానికి రమ్మని పిలిచేవారు. 'బడేబాబా' గా పిలవబడే మాలెగావు ఫకీరుని గౌరవనీయ అతిధిగా సంభావించి, శ్రీసాయిబాబాగారు, ఆయననిభోజనానికి రమ్మని పిలిచి, తన ఎడమ పక్కనే కూర్చోమని చెప్పేవారు. అంతేకాదు భోజనం పూర్తయ్యేక, ఆయన బడే బాబాగారికి రూ.50లు దక్షిణగా ఇచ్చి, ఆయనతో పాటు100 అడుగులునడిచి ఆయనను సాగనంపేవారు.

తైత్తరీయ ఉపనిషత్తు రెండో అనువాకంలో ఈకింది విధంగా చెప్పబడింది.

**"అతిథి నీకు భగవంతుడే అవుతాడు" (అతిథిదేవోభవ:)**

భగవద్గీత3వ అధ్యాయంలో శ్రీక్రిష్ణుడు ఇలా చెప్పేడు.

"తాను ఇతరులకి పెట్టేక మిగిలినది తినేపుణ్యాత్ములకి అన్ని పాపముల నుండి విముక్తి కలుగుతుంది. ఎవరైతే తమ కోసమే ఆహారాన్నిసిద్ధంచేసుకు **నితాము మాత్రమే తినాలనుకుంటారో, వాళ్ళు పాపాలను మాత్రమే తినే వాళ్ళవుతారు.**"

ఆవిధంగా, శ్రీసాయిబాబా చాలా ప్రతిభావంతంగా ఉదాహరణలతో సహా, ఏ ఆహారాన్నైనా ఎవరితోనైనా పంచుకోకుండా తినకూడదనే ఈధర్మనిర్ణయాన్ని గురించి బోధించేరు. చేసి చూపేరు కూడా.

"అతిథి" అంటేతిథి (దినము) చెప్పకుండా వచ్చే వ్యక్తి అని అర్థం. ఎవరైతే చెప్పకుండా తన ఇంటికి వచ్చి, ఒక రోజు పాటు మాత్రమే, సమయం తనతో గడిపేందుకు వస్తాడో ఆ వ్యక్తి తన ఇంటికి అతిథి అవుతాడు.

ఈరోజుల్లో ఆహార ధాన్యాల కొరత, వాటి ధరలు పైకి ఎగబాకుతూ వుండటం వల్ల ఈధర్మ నిర్ణయం మన మనసులలో ఉన్నప్పటికీ, మన ఉదార స్వభావం మనకు అక్కర్లేని,వెంటపడే వ్యక్తులకు ప్రయోజనం కలిగించేదిగా ఉండకూడదు.

**(అన్నదానం)**

ఆహారం విషయంలో శ్రీసాయిబాబాగారు, చివరగా ఒక ముఖ్యమైనసందేశాన్ని ఇచ్చేరు. అది' అన్నదానం 'గురించి. వేరువేరు యుగాల్లో, మన ఆశయాల సాధన కోసం వేరు వేరు మార్గాలను మనశాస్త్రాల్లో పొందుపరిచేరు. అవిక్రృతయుగంలో 'తపస్సు' త్రేతాయుగంలో

'జ్ఞానసముపార్జన' ద్వాపరయుగంలో 'యజ్ఞము' కలియుగంలో (ప్రస్తుతకాలంలో) 'దానము'గాఉన్నాయి. అయితే అన్ని దానాల్లో 'అన్నదానం' మాత్రమే ఉత్తమమైనది. మధ్యాహ్నం వేళలో మనకి తినేందుకు ఏమీలేకపోతే, మనంఆందోళనకు గురవుతాము. ఎవరైనా అటువంటి పరిస్థితుల్లో మనలాగే ఆందోళన చెందుతారు. ఇది తెలిసి, ఏధర్మ శీలి అయితే పేదవాళ్ళకీ, ఆకలితో ఉన్నవాళ్లకీ ఆసమయంలో అన్నం పెట్టగలడో, అతడినే ఉత్తమ దానగుణ శీలిగా చెపుతారు.

ఈ విషయంలో తైత్తరీయోపనిషత్తు కింది విధంగా చెపుతుంది.

**"అన్నం పరబ్రహ్మ. అన్ని జీవులూ ఆహారం వల్లనే జన్మిస్తాయి. జన్మించేక ఆహారం వల్లనే జీవిస్తాయి. మరణించేక కూడా, అవి మళ్ళీ ఆహారంలోనే భాగమవుతాయి."**

దానాలలో చాలా ఉన్నాయి. ధనం దానమివ్వడం, భూమి దానమివ్వడం, వస్త్రదానమివ్వడం, వంటివి వాటిలో కొన్నిమాత్రమే. అయితే వాటిలో కొన్నిసూక్ష్మమైన భేదాలున్నాయి. అవి గుర్తించి ఆయాదానాలు చేయాలి. అదే అన్న దానంలో అయితే దేనినీ పట్టించుకోనవసరం లేదు. ఎవరైనా మిట్టమధ్యాహ్నం వేళ మన ఇంటి ముందుకు వస్తే, వారికి ముందు అన్నం పెట్టాలి. వాళ్ళు అవిటి వాళ్ళు కానీ, అంధులు గానీ, అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్ళు గానీ అయితే, వాళ్లకు ముందు ఆహారం పెట్టాకే, ఆరోగ్యంతో వున్నమనం, మన బంధువులూ భుజించాలి."(19-23 పేజీలు)అధ్యాయం 38.

శ్రీమతి తార్ఖాడ్' అనే భక్తురాలు ఆమె భోజనం చేసే సమయంలో ఒక ఆకలితో ఉన్న శునకానికి కూడా కడుపునింపడాన్ని చూసి, శ్రీసాయిబాబా ఎంత ఆనందంతో పొంగి పోయారో మనకి తెలుసు. (అధ్యాయం9).

అప్పుడు ఆయన చెప్పేరు." ఇలా ఎప్పుడూ చేస్తూ ఉండండి. అందువల్ల మీరు మంచి మార్గంలో నిలుస్తారు. ముందు ఆకలితో ఉన్నవాళ్ళకి ఆహారం పెట్టి, ఆ తర్వాతనే మీరు తినండి."(122పేజీ) అధ్యాయం 9

అదే విధంగా, మరో సందర్భంలో లక్ష్మీబాయిషిండే అనే ఆమె, తాను శ్రీసాయిబాబాగారి కోసం కష్టపడి ఎంతో వేగంగా వండితెచ్చిఇచ్చినరొట్టెలు, కూరలని ఆయన తినకుండా, పక్కనే ఉన్నకుక్కకి పెట్టెయ్యడం చూసి కోపం తెచ్చుకుంది. అప్పుడామెతో, ఆయన ఇలా అన్నారు. "ఏమీ కాని దానికి నువ్వు బాధపడతా వెందుకు? ఆకుక్క ఆకలిని పోగొట్టడం అన్నది, నాఆకలిని తీర్చడం లాంటిదే. కొందరైతే మాటలతో చెప్పగలరు. కొందరు చెప్పలేరు. కానీ జీవజాలం అంతటికీ, ఆకలి సమానమే కదమ్మా! నువ్వు ఒక సంగతి మాత్రం ఇప్పుడు తెలుసుకో...! ఎవరైతే ఆకలితో ఉన్న వాళ్ల కడుపు నింపుతారో వాళ్ళు నాకు నిజంగా భోజనం పెట్టినవాళ్ళే అవుతారు." (98-105 పేజీలు) అధ్యాయం 42.

ఈవిషయంలో శ్రీసాయిబాబాతానే ఒక ఉదాహరణగా నిలిచిపోయేరు. మొదటి రోజుల్లో ఆయన చాలా తరచుగా పెద్ద పెద్ద కుండల్లో(భాండీలు) తానేవండి, అన్నార్తులకీ, పేదవాళ్లకీ భోజనం పెట్టేవారు. ఆయనే స్వయంగా బజారుకి వెళ్ళి, పప్పులూ, ఇతర ఆహార సరకులూ కొని తెచ్చుకుని, కావలసిన పిండిని, తానే, తిరగలిలో విసరి తయారు చేసుకునేవారు. తర్వాత కాలంలో, షిర్డీగ్రామానికి ఆయన భక్తులు గుంపులు, గుంపులుగా వచ్చి ఆయనకి ఇచ్చే" నైవేద్యం "కోసం, చాలా ఎక్కువగా ఆహారం వండిపెడుతూ వుండేవారు. అందువల్ల ఆయనకి ఆహారం పెట్టేందుకు, తాను వంటచేయాల్సిన పరిస్థితి తొలగిపోయింది. అయినా ఆయన ఏనాడూ ఆహారాన్ని అందరికీ పంచిపెట్టడం అన్నది మానలేదు. ఆయన, తన భక్తులు ఇచ్చిన దానిని,

రుచి చూసిన సందర్భాలు చాలా తక్కువ అనే చెప్పాలి. (అధ్యాయం 38)

**ముగింపు**

శ్రీసాయిబాబాగారు ఎప్పుడూ ఆయన బోధల్లో నిష్కర్షగా, యదార్ధ వాదిగానే ఉండేవారు. దానశీలత్వం గురించి ప్రశంసిస్తూనే, ఆయన అధికంగా దానధర్మాలు చేసి, ఎవరూ రుణగ్రస్తులు కాకూడద నిహెచ్చరించేరు కూడా.(శ్రీ దాసగణు మహరాజుగారి "భక్తిలీలామ్రుతం" గ్రంధంలోని అధ్యాయం32).

ఆహారం విషయంలో ఆయన భక్తుల కోసం చెప్పిన మాటల్లో సంక్లిష్టాంశం ఏమిటంటే, ఆకలితో ఉన్నవాళ్ళకి ఏఆహారం, తమకు తినేందుకు లభిస్తుందో, దానితో సంత్రృప్తిచెందటం నేర్చుకోవాలని. అందు వల్ల మంచి ఆరోగ్యం లభించటమే కాదు. ఆత్మ విమోచన సాధించేందుకు, చేసే అన్ని సాధనలకూ మంచి సహకారం లభిస్తుందని చెప్పేరు.

# సాయి సచ్చరిత్ర

నీళ్ళు పుక్కిలించి,
డొకుతో పోసి, నూనె
లేకుండా మసీదులో
దీపాలు వెలిగించుట



# అధ్యాయం 3

# వాగ్ధార

"నువ్వు ఎప్పుడైతే, అన్నిబంధాలను విడిచిపెడతావో, కామాన్ని, రుచుల మీద మోహాన్ని జయిస్తావో, అన్ని రకాల అంతరాయాలను అధిగమించి, భగవంతుడిని సంపూర్ణ హృదయంతో సేవిస్తావో, భిక్షాపాత్రను ఆశ్రయిస్తావో (సన్యాసం స్వీకరిస్తావో) అప్పుడునిన్ను, భగవదర్పితమైన మనిషిగా గుర్తిస్తాను."(140-142 పేజీలు)అధ్యాయం 44.

బాపూసాహెబ్ 'జోగ్' అడిగినప్రశ్నకు సమాధానంగా శ్రీసాయిబాబా పై మాటలు చెప్పేరు. అతడు బాబా గారిని, ఎన్నో సంవత్సరాలుగా సేవిస్తున్నా, అతని మనస్సుకి ప్రశాంతత, స్థిరత్వంచేకూరటంలేదు. స్వస్వరూపజ్ఞానం కోసం అతడెన్నిప్రయత్నాలు చేసినా అవి ఫలించటమన్నది లేదు. అందుకు కారణం ఏమిటని అతడు శ్రీసాయిబాబాగారిని అడిగితే, ఆయన ఇచ్చి నసమాధానం అది.

ఇంద్రియసౌఖ్యాలను అదుపులో ఉంచుకోవడం గురించి తనబోధల్లో ఆయనఎప్పుడూ ప్రాధాన్యత ఇచ్చేవారు. ముఖ్యంగా సంసారసుఖం గురించీ, సంభాషణ గురించీ ఎక్కువగా చెప్పేవారు. సంసారసుఖం గురించి తర్వాత

అధ్యాయంలో తెలుసుకుందాం. ప్రస్తుతం సంభాషణ అంశం మీద ఆయన చెప్పిన సూచనలు అవగతం చేసుకుందాం.

మననాలుక రెండు కార్యాలు నిర్వహిస్తుంది. ఒకటి ఆహారపదార్థాల రుచులను చెప్పడం. రెండు మాట్లాడటం. ఆహారపదార్థాల రుచుల గురించి శ్రీసాయిబాబాగారు మనకి చెప్పిన మాటలను, మనం ముందు అధ్యాయంలో తెలుసుకున్నాం. ఆయన మాట్లాడటం గురించి మనకి చేసిన బోధలు ఇప్పుడు గుర్తు చేసుకుందాం.

**నిందాపూర్వకమైన, అగౌరవపరిచే మాటలు**

మన శాస్త్రగ్రంథాల్లో, అహింసఅనే పదానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఎవరిని కూడా శారీరకంగా గానీ, మానసికంగా గానీ, మాటల ద్వారా గానీ హింసకి గురిచెయ్యకూడదని ఆ'అహింస' పదంమనకి చెపుతుంది. శ్రీసాయిబాబాగారు అన్నిహింసలకంటే, మనం నిందిస్తూ, పరుషంగామాట్లాడేమాటలు ఎదుటి వ్యక్తిని ఎక్కువగా బాధిస్తాయని మనని గుర్తించమన్నారు. అలా మనం మాట్లాడిన పదాలు అవతలి మనిషి తొందరగా మరచిపోలేడు. అంతేకాదు వాటిని మనం వెనక్కి తీసుకోలేముకూడా. ఆ మాటలు అతనిలో మన మీద ఎప్పటికీ చెరిగిపోని చెడుభావాన్నికలిగిస్తాయి.

అందువల్ల శ్రీసాయిబాబాగారు, తన భక్తులకి "ఎవరితోనూ బాధకలిగించే లాకరకుగా మాట్లాడకండి. (143పేజీ,అధ్యాయం19)అంతే కాదు ఎవరైనా మిమ్మల్ని ఉద్దేశించి, మీ మీదవంద సంగతులను చెడుగామా

ట్లాడినా వాటిని మీరు అవమానంగా తలచి, ఆగ్రహంగా సమాధానమివ్వకండి. అవన్నిటినీ మీరుసహించ గలిగితే, మీరుతప్పని సరిగా ఆనందాన్నిపొందుతారు". (144 పేజీ అధ్యాయం 19).

తన ఉపదేశాన్ని భక్తులందరూ తప్పని సరిగా పాటించాలన్నసంగతిని ఆయన ఇలా చెప్పేరు."ఎవరైతే ఇతరులలో తప్పులు ఎన్ను తారో, అపనిందలు వేస్తారో వాళ్ళు నాహృదయాన్ని ముక్కలు చేసి, నన్ను గాయపరిచినట్టే అవుతుంది. ఎవరైతే అన్నిటినీ సహిస్తూ, జీవిస్తారో వాళ్ళు నాకు ఎక్కువగా ఆనందం కలిగించే వాళ్ళవుతారు.".(175పేజీ అధ్యాయం44)

**(తగువులు,వాగ్వాదాలు)** మాటలను నియంత్రణలో ఉంచుకు నేందుకు శ్రీసాయిబాబాగారు" ఇతరులతో మాట్లాడేటప్పుడు ఏవిషయం మీదైనా, వాదాలకీ, ఘాటైనచర్చలకు ఆస్కారమివ్వకండి. వాదాలు, అహంకారం నుండి పుడతాయి. అవిశ్రుత్వాన్ని పెంచుతాయి. గొడవలకు దారితీస్తాయి." అని, మరొక ఆదేశాన్నిచ్చేరు.

మనకి 2వఅధ్యాయంలో షిర్డీలో తాను అడుగు పెట్టిన మొదటి రోజే దభోల్కరు, బాలాసాహెబ్' భటేతో ఆధ్యాత్మిక గురువు అవసరం మీద చాలా గట్టిగా వాదించడం కనిపిస్తుంది. దభోల్కరు హేతువాద ధోరణిని, శ్రీసాయిబాబా, ఆయనని' హేమద్' పంతూ'అని పిలవడం ద్వారా పూర్తిగా ఆగిపోయేలా చేసేరు. (ఆపేరు13వ శతాబ్దంలో మహదేవు, రామదేవు అనే యాదవరాజుల దగ్గర మంత్రిగా ఉన్న సమర్ధుడని పేరుగాంచిన' హేమాద్రిపంతు" నుఅనుకరించినది)

**ఇతరుల సంగతుల్లో తలదూర్చటం,పుకార్లను వ్యాప్తిచేయడం.**

శ్రీసాయిబాబా తన భక్తులని ఇతరుల మీదపుకార్లని ప్రచారం చేయడంలో భాగస్వాములు కావద్దని, చాడీలు చెప్పవద్దని చెప్పేరు. అలా చేసే వాళ్ళని సరిదిద్దటం కోసం ఆయన కొన్ని స్వంత పద్ధతులని ఆచరణలో పెట్టేరు. ఆయన సర్వసాక్షి అయినందు వల్ల ఎప్పుడైతే, ఎక్కడైతే ఆయన

భక్తులు ఆతప్పులు చేసేరో, ఆ భక్తులని ఆతప్పులు ఎత్తిచూపి అభిశంసించే వారు. వాళ్ళని సరిదిద్దే వారు.

అలాంటి వాళ్ళలో ఒకరికి, ఒక పందిని చూపి చూడు.. అది ఆరోత కలిగించే పెంటనంతటినీ ఎంతఇష్టంగా తినేస్తోందో..! నీ పద్ధతి కూడా అలాగే వుంది. నీస్వంత సోదరుడిని, నీమనస్సులో ఉన్నకోపంతో తిట్టిపోస్తున్నావు." (అధ్యాయం19). ఆయన మాటలకి ఆవ్యక్తి సిగ్గుపడి, వాటినే ఒక పాఠంగా స్వీకరించి మళ్ళీఎప్పుడూ అలాటి పని చేయలేదని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు.

అలాగే (అధ్యాయం21) పంధార పురం నుంచి వచ్చిన ఒక న్యాయవాది, వాళ్ల ఉపన్యాయాధికారి నూల్కరు తన అనారోగ్యం నుంచి బయటపడేందుకు షిర్డీవచ్చి, వుండటం మీద, కొంత మంది న్యాయవాదులు తమ, బార్' రూంలో మాట్లాడుతూ వుంటే, వాళ్లతో అవసరం లేని వాదాలు చేసేడు. అతను షిర్డీరాగానే శ్రీసాయిబాబా అతనితో" మనుషులు ఎంతక పటాన్ని కలిగి ఉంటారంటే, వాళ్లు నాకాళ్ళ మీద పడతారు. దక్షిణలూ ఇస్తారు. వెనక్కి వెళ్ళిపోయేకతిట్టడం మొదలు పెడతారు. ఇది ఆశ్చర్యంగా లేదూ?" అన్నారు.

ఆ న్యాయవాది, ఆయన తనను ఉద్దేశించే ఆమాటలన్నారని అర్థం చేసుకున్నాడు. తన తప్పుతెలుసుకుని, అతడు తర్వాత కాకాసాహెబ్' దీక్షితులతో ఇలాఅన్నాడు." అది నాకు ఆయన చీవాట్లుపెట్టడం కాదు. నామీద అభిమానంతో ఇచ్చిన సలహా మాత్రమే అవుతుంది. ఇతరుల మీద పుకార్లలో గానీ, ఎవరికైనా అపకీర్తి, అపనింద కలిగించే మాటలలో గానీ పాలుపంచుకోవడమన్నది చేయవద్దని, ఆయన చెప్పిన మాటఅది." (106-117,120 పేజీలు) అధ్యాయం-21

**ఎల్లప్పుడూ నిజమే మాట్లాడు**

మన ప్రాచీన పురాణ, ఇతిహాసగ్రంధాల్లో, కావ్యాల్లో నిజమేచెప్పాలన్న సంగతి, చాలా బలంగా చెప్పేరు. మన జాతీయనినాదం" సత్యమేవజయతే" అంటే, నిజమే గెలుస్తుంది అనిదాని భావం. మనకి, మహాభారతంలో ఉన్న పాండవులలో అగ్రజుడు ధర్మరాజు ఎల్లప్పుడూ సత్యాన్నే పలికే వాడు అని తెలుసు. కానీ ఒక్క సందర్భంలో మాత్రం అతడు పలికిన అసత్యం, అతడికి కొన్ని గంటల పాటు నరకలోక వాసాన్ని కలిగించింది. శ్రీ సాయిబాబాగారు ఎప్పుడూ తన ఉపదేశాల్లో చెప్పే సంగతులు నిజమైనవీ, ఆయన ఆచరించేవిగానే ఉండేవి. ఆయన తన భక్తుల కెప్పుడూ నిజాలే పలకండి.. అబద్ధాలు చెప్పకండి. అని బోధించలేదు. అయితే, ఆయన భక్తులందరికీ ఆయన అంతర్జ్ఞాని అనీ, (భక్తుల మనస్సులలో వుండే అంతర్గత రహస్యాలను తెలుసుకోగలిగిన మనిషి) భక్తులలో ఎవరైనా అబద్ధం చెపితే, వెంటనే ఆయన దాని నిగుర్తించగలరనీ, తెలుసు. అందువలన ఆయనతో మాట్లాడే వారెవరూ, అసత్యాన్ని ఆయనతో చెప్పే ధైర్యం చేయలేకపోయేవారు.

తాను రాసిన 'శ్రీసాయిసత్చరిత" పుస్తకంలో హేమద్పంతుగారు ఈ క్రింది విషయాన్ని రాసేరు.

**("సాయిముందు అసత్యం పనిచెయ్యదు. అసత్యంతో ఎవరూ సాయిని పొందలేరు.)**

**(అసత్యం అంటే అధోగతే..అసత్యం నరకానికే తీసుకుపోతుంది.") (138 పేజీ)అధ్యాయం38.**

**"విజయాన్ని అసత్యంతో సాధించలేరు.సాయిసర్వసాక్షి"** (49)

ఈసందర్బంగా, శ్రీసాయిబాబాగారు కూడా తన జీవితంలో అబద్ధాలు పలికిన సందర్భాల గురించి చెప్పుకోవాలి. ఒకసారి ఆయన "భగవద్గీత

తర్వాత అంత ముఖ్యమైనదిగా అందరూ భావించే" విష్ణుసహస్రనామ" గ్రంధాన్ని, రామదాసి దగ్గర నుండి తీసుకుని, తన భక్తుడైన షామాకి ఇచ్చి కంఠస్తంచేయమని చెప్పాలనుకున్నారు. అందుకు, ఆయన రామదాసి నిపిలిచి, "నాకు బాగా కడుపునొప్పిగా ఉంది. నువ్వు బజారుకి పోయి, "సునా ముఖి' ఆకులని (విరోచనం కలిగించేమందు కోసం ఉపయోగించేవి) తీసుకురా" అని పంపించేరు. అతడు బజారుకి వెళ్ళగానే, ఆయన లేచి, విష్ణు సహస్ర నామగ్రంధాన్ని తీసుకుని, షామాకి ఇచ్చేరు. షామాకి అది తీసుకోవటం ఇష్టం లేదు.(అధ్యాయం27).

అలాగేజామ్' నర్'గ్రామంలో ఉన్న నానాసాహెబ్' చందోర్కరు గారి అమ్మాయికి, వేగంగా ఉది, హారతి పంపించేందుకు, ఆయన, టోంగావాలా వేషంధరించి, బాపుగిరితో, ఆటోంగా, కానుకలు జామ్' నర్' గ్రామం నుండి, శ్రీనానాసాహెబ్' చందోర్కరుగారు పంపేరనిచెప్పేరు.

ఈ రెండు సందర్భాలలో, ఆయన చెప్పిన అబద్ధాలను ఎలా అర్థం చేసుకోవాలి? మొదటగా, అవి మంచి చేసినా, చెడు చేసినా ఆ అసత్యాల ఫలితాలను సాధువులుకి ఆపాదించలేము. ఎందుకంటే ఆసంఘటనల ఆద్యులు, వారు కారుకనుక. రెండోదిగా ఆచర్యలు పాపభరితమైనవి అయినా, సాధుపురుషులు తమ భక్తుల కోసం, ఆఫలితాలను తాము స్వీకరిస్తారు.

శ్రీసాయిబాబా మొదటి సందర్భంలో, తన భక్తుడు షామాకి దైవప్రార్ధనలో సహకరించేందుకు, నటించేరు.

మాటలతో చెపితే, ఆమాటలు అతడిని అంతగా ప్రభావితం చేయకపోవచ్చుని, అనుకుని ఆయన అలా చేసివుండవచ్చు.

రెండవ సంఘటన దగ్గరకి వస్తే, గర్భవతిగా వుండి, ప్రసవవేదనలకు బాధపడుతూజామ్ 'నర్' గ్రామంలో వున్న నానాసాహెబ్' చందోర్కరు గారికు

మార్తె'మైనతాయి' ప్రాణాలు కాపాడమని, ఆమె తండ్రి శ్రీసాయిబాబాగారిని, నిరంతరం ప్రార్థిస్తూవున్నందుకు, అదే రాత్రి100మైళ్ళ దూరంలో ఉన్న జామ్' నర్ 'గ్రామానికి ఉది, హారతి అత్యవసరంగా చేర్చవలసి ఉందని, శ్రీసాయిబాబా తలచినందు వలన, ఆయన బాపుగిరిని, ఆరాత్రివేళ, అతనిస్వంత ఊరికి వెంటనేవెళ్ళమని చెప్పేరు. అందుకోసం ఆయన జలగావ్' రైల్వేస్టేషను నుండి జామ్' నర్ 'గ్రామానికి చేరడానికి బాపుగిరికి, టోంగాని సమకూర్చేరు కూడా.

ఈవిషయాలు, మనకి సాధువులు, తమ భక్తులకోసం ఏమైనా చేస్తారని, వాళ్ళు ఇబ్బందులలో ఉన్నప్పుడు, సహాయపడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని తెలియచేస్తాయి. ఎంతోమంది సాధువులు, సద్గురువులు, తమ భక్తులు తీవ్రమైన అనారోగ్యాలకు, నయంకాని వ్యాధులకీ గురై బాధలు పడుతూ ఉంటే,

వారిరుగ్మ తలనీ, వ్యాధులనీ తాము తీసుకుని, వాళ్ళ బాధలు తామే పడిన సంగతులు అనేకం మనకి తెలుసు. తన భక్తుడు, దాదాసాహెబ్' ఖపర్డి, చిన్నకుమారుడు నాలుగు పెద్దబిళ్ళలు చేతులకిందా, గజ్జల్లోనూ ఏర్పడి, బిళ్ళ సంకటంతో విపరీతంగా బాధపడుతూ ఉంటే, ఆకుర్రాడిని బాధపెడుతున్నఆ నాలుగు బిళ్ళలనీ తానే, తన శరీరంలోకి తీసుకుని, తన భక్తుడి కోసం ఆబాధని శ్రీసాయిబాబా అనుభవించిన సంగతి అధ్యాయం7లోలి ఖించబడి ఉంది.

ఈవిషయాలు తెలుసుకున్నాక, సాధు, సత్పురుషులె వరైనా సరే తమ భక్తులకోసం, ఎటువంటి కష్టమైన లేదా పాపపుపనుల నైనాచేయడానికి తామే, ముందుకు వచ్చి, వాటి ఫలితాలను అనుభవించడానికి కూడా

తామే సిద్ధపడతారని, అందుకు ఏనాడూ వెనక్కి తగ్గరని మనకి అర్థమవుతుంది. (106-110పేజీలు) అధ్యాయం 7.

నిజాలు చెప్పడమన్నది.. నిజంతప్ప మరేదీచెప్ప కూడదన్నది, నిత్య జీవిత కార్యకలాపాలలో కొన్ని సందర్భాలలో, కొందరికి సమస్యలను తీసుకు వస్తుంది. ప్రస్తుత దినాల్లో చిల్లర నాణేలకొరత ఎక్కువగా వుంది.

మనం బస్సులోలే దారిక్షా మీద ప్రయాణం చేస్తున్నప్పుడు, ఆ బస్సు కండక్టరు గానీ, రిక్షానడిపేఅతను గానీ, తమ దగ్గర చిల్లరలేదనీ, తమకి ఇవ్వవలసిన మొత్తం ఖచ్చితంగా ఇవ్వాల్సిందేననీ మనకి గట్టిగా చెపుతారు. మన దగ్గర నిజంగానే, వాళ్లకివ్వవలసిన మొత్తం ఉన్నప్పటికీ, మనతిరుగు ప్రయాణానికి కూడా ఆచిల్లర డబ్బు అవసరం ఉంటుంది కనుక మనం అబద్ధం చెప్పడానికి సిద్ధపడిపోతాం. ఎందుకంటే, నాదగ్గర ఆమొత్తం ఉందికానీ, నేను తిరిగి వెళ్ళడానికి ఆచిల్లర అవసరం పడుతుందని నిజంచెపితే, అది పని చేయదు. అందువల్ల మనకి తిరుగు ప్రయాణంలో ఇబ్బందులు ఎదురవుతాయి. నిజానికి ఆబస్సు కండక్టరు, ఆరిక్షానడిపేఅతనూ, వాళ్ళ దగ్గర చిల్లరలేదని మాయ మాటలు చెపుతారు. అప్పుడు నిజాలు మాత్రమే చెప్పాలనుకున్న వాళ్ళు చేయవలసిందేమిటి?.. ఎప్పుడూ నిజాన్నేచెప్పాలి అన్న సూక్తి ప్రకారమే నడుచుకోవాలి.

మరొక సంగతి కూడా చెపుతాను. మామనవడు ఎప్పుడూ, తాను బొమ్మలు గీసుకునేందుకు తెల్లకాగితాలు ఇమ్మనినన్ను అడిగేవాడు. సాధారణంగా ఒకటి రెండుసార్లు వాటిని ఇవ్వడానికి నాకేమీఇబ్బంది కాదు. ఎక్కువగానే నాదగ్గర వుండేవి కనుక. కాగితాలు తక్కువ అయిపోయినప్పుడు, వాడికి ఏమనిచెప్పాలి? అలా వాడు అడిగినప్పుడల్లా వాటిని ఇస్తూవెళితే, నాముసలి వయస్సులో వాటిని కొనడానికి బజారుకి వెళ్ళవలసి వస్తుంది.

అందుకని మనవడితో, తెల్ల కాగితాలు లేవు అని చెపితే, సత్యమే పలకాలి అన్నవచనానికి, దూరమైనట్టు అవుతుంది. అలాటప్పుడు నేను ఏమి చెయ్యాలి? ఎలా చెప్పాలి?

పైసంగతులకి నాదగ్గర ఉన్న అభిప్రాయాలు చెపుతాను. ఎప్పుడూ నిజమే చెప్పాలి. అసత్యం ఎన్నడూ పలకకూడదు. తనస్వంత విషయంలో అయినాసరే. అయినప్పటికీ కొన్ని సందర్భాలలో అవతల వారికి ప్రయోజనం వుంటుందని తలిస్తే, చిన్న అబద్ధం చెపితే, అపకారం ఏమీ జరగదు. ఉదాహరణకి, ఎవరికైనా దిగ్భ్రాంతి కలిగించే, చెడు వార్తని మనం చెప్పవలసి వస్తే, ఆసంగతి జరగ లేదని, లేదా అసలా విషయం మనకి తెలియదని చెప్పడం అబద్ధమే అవుతుంది గానీ, అది అపకారం మాత్రం కలిగించదు.

అలాగే ఎవరైనా మన మీద ప్రేమతో, లేదా అభిమానంతో రుచిచూడ మని మనకి ఏదైనా ఇస్తే, దానిని మనం తినకపోయినా, అది ఎంతో బావుందని, చాలా రుచిగా వుందని మనం పొగడటం అన్నది, అసలేం బాగాలేదని నిజాన్ని చెప్పి, వాళ్ళ మనస్సులని బాధపెట్టడం కన్నా మేలైనదేకదా!

మహాభారతం శాంతిపర్వంలో ఇలా ఉంటుంది. "నిజం చెప్పడం మంచిది. ఇతరులకి ఉపయోగకరమైనది చెప్పడం ఇంకా మంచిది. దేని వలనైతే, అందరికీ శుభం కలుగుతుందో అదే నిజమైన సత్యమవుతుంది."

మనుస్మృతి అధ్యాయం నాలుగులో ఇలా ఉంటుంది. "ప్రతీ ఒక్కరూ నిజమే చెప్పాలి. అందరికీ ఆనందం కలిగించే, ఆమోదయోగ్యమైన సత్యాన్నే పలకాలి. ఇతరులకి సంతోషాన్ని ఇవ్వని, ఎవరూ అంగీకరించలేని సత్యాన్ని పలకకూడదు"

## ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

శ్రీసాయిబాబా" నువ్వు ఎవరికయినా, ఏదైనా మాట ఇచ్చి ఉంటే, దానిని నువ్వు తప్పని సరిగా అమలు చెయ్యవలసి ఉంటుంది. కనుక ఎన్నడూ శుష్కవాగ్దానాలు చెయ్యకు."అని బోధించేరు.

భక్తులు, సాధారణంగా వాళ్ళు ఆరాధించే దేవుడిని గానీ, గురువును గానీ, తమ కోరికలను సిద్ధింపచేస్తే, ఏదైనా పని చేస్తామని, లేదా దేనినైనా సమర్పిస్తామని గానీ, ఒక మాట అంటారు. కానీ వాళ్ళ కోరికలు నెరవేరితే, వాళ్ళు చేస్తామన్నదానిని మరచిపోతారు.

శ్రీసాయిబాబా ఎన్నో సందర్భాలలో అలామాట చెప్పి మరచిపోయిన ఎందరోభక్తులకి ఆ విషయాలు గుర్తు చేసేరు. ఒక్క ఉదాహరణ చెపుతాను. అప్పాసాహెబ్ కులకర్ణి, తాను ఇంటి దగ్గర లేనప్పుడు, తమ ఇంటికి వచ్చి, వెళ్ళిన ఒక ఫకీరుకి 10రూపాయలు ఇస్తాననుకున్నాడు. ఆసంగతి శ్రీసాయిబాబాగారు, ఆయనకి చాలాసార్లు గుర్తుచేసి, ఆ10 రూపాయలనీ, ఆఫకీరుకి ఇచ్చే దాకా ఊరుకోలేదు.(అధ్యాయం33).

అలాగేషామా, సప్తశింగి దేవతకు, బాకీ ఉన్న చాలా కాలం కిందటి మొక్కు బడిని చెల్లించేంత వరకూ శ్రీసాయిబాబాగారు, అతడిని విడిచి పెట్టలేదు. (అధ్యాయం30).ఆయన భక్తుడు, చోల్కరు తాను షిర్డీవచ్చి, శ్రీ సాయిబాబాగారికి, చెరుకుగడ ఇచ్చే వరకూ, పంచదారవాడననీ, పంచదారలేని 'టీ' నిమాత్రమే తాగుతాననీ శపథంచేసి, ఆమాట నిలబెట్టుకోవడం ఆయనకి అమితానందాన్ని కలిగించింది.

## తక్కువగానే మాట్లాడు.

శ్రీసాయిబాబాగారు, తానేస్వయంగా పైవచనాన్ని ఆచరించే వారు.

ఆయన ఏనాడూ తన భక్తులకి దీర్ఘప్రసంగాలని చేయలేదు. తాను బోధించాలనుకున్న నీతిసూత్రాలనీ, జీవన విధానాలనీ, వాటికి సరిపోయే, ఉదాహరణలని ఇచ్చి, కథలని చెప్పిమరీ చెప్పే వారు. అధ్యాత్మిక పురోగమనానికి, ప్రతీరోజూ కొంతసేపు నిశ్శబ్దంగా ఉండటమన్నది చాలా అవసరం. ఆయన సమాధిచెందే వరకూ శ్రీసాయిబాబాగారు, లెండిబాగ్ లో ప్రతీరోజూ రెండుసార్లు ఆసమయాలని గడిపేవారు. ఎక్కువగా మాట్లాడటమన్నది, ఎక్కువ శక్తిఖర్చు అయ్యే విషయం. అందువల్ల రోజువారీ కార్యకలాపాల్లో, అనవసర మాటలు విడిచి పెట్టడం మంచిది.

## దైవనామస్మరణం

శ్రీసాయిబాబాగారి ఉపదేశాల్లో అత్యంత ముఖ్యమైనది' దైవనామస్మరణ' గురించి ఆయన చెప్పిన మాట. ఆయన తను మాట్లాడుతున్నప్పుడు, నిరంతరం" అల్లామాలిక్' హై" అని (భగవంతుడే యజమాని) ఎక్కువగా అంటూ ఉండేవారు. ఆయనరాత్రి, పగలుఅన్నది లేకుండా ఒకవారం రోజులపాటు, నిరంతరం భగవంతుడి నామాన్ని ఉచ్ఛరించమని ఇతరులకి చెప్పడాన్ని, ఎంతగానో ఇష్టపడేవారు. అలా చేయడాన్ని "నామసప్తాహం' అని పిలుస్తారు.

హేమద్పంత్' దాని గురించి ఇంకొక మాటచెప్పేరు." దైవనామస్మరణ" అమోఘమైనఫలితాన్నే ఇస్తుందని మనకి తెలుసు. అది, మన మందరినీ చెడునడతల నుండీ, పాపకార్యాల నుండీ, విముక్తులని చేస్తుంది.

జనన, మరణ చక్రబంధనం నుండి మనకు స్వేచ్ఛను కలిగిస్తుంది. అంతకన్నా సులభమైన సాధన మరేదీలేదు. మనమనస్సుల నిఅత్యంత పవిత్రమైన వాటిగా అది మార్చగలుగుతుంది. దానికి ఏ ఉపకరణాల అవసరం లేదు. ఏ నిబంధనలూ ఉండవు. అది చాలా సులభంగా

ఆచరించగలిగే ప్రతిభావంతమైన కార్యమనే చెప్పాలి.” (85-91 పేజీలు) అధ్యాయం 27.

సారాంశం.

శ్రీ సాయిబాబాగారు, వాగ్ధార గురించి మనకి ఉపదేశించిన అంశాలు సంక్షిప్తంగా :

1. ఇతరులను నొప్పించేలా ఎవరితోనూ కర్కశంగా మాట్లాడకు. అంతేకాదు ఎవరైనా పరుషంగా మాట్లాడు తున్నప్పుడు ప్రశాంతంగా విను.
2. వాదాలకు, వివాదాలకు దూరంగా ఉండు.
3. పుకార్లను, ఇతరులను నిందించే మాటలను వినడంలో కానీ, వినిపించడంలో గానీ భాగస్వామిగా ఉండకు.
4. ఎప్పుడూ సత్యమే మాట్లాడు.
5. మధురమైన, మృదువైన మాటలతోనే, నీప్రసంగాలు చేయి.
6. ఇచ్చిన వాగ్దానాలని తప్పకు. ఆచరించు.
7. మిత భాషిగానే ఉండు. తరచుగా నిశ్శబ్దం పాటించు.
8. నీకు వీలైనంత కాలం దైవనా మస్మరణ చేస్తూనే ఉండు.



## సాయి సచ్చరిత్ర

తంబొలితో కుస్తీలో
ఓడిపోయి, శిర్డీ వదులుటకు
సిద్దమగుట.

## అధ్యాయం 4

# భక్తి మార్గం

ఎవరికైనా, భగవంతుడి సాక్షాత్కారాన్ని పొందేందుకు నాలుగు విధానాలు ఉన్నాయి. అవి 1.జ్ఞానం 2.యోగము 3.కర్మ 4.భక్తి. శ్రీసాయిబాబాగారు బ్రహ్మజ్ఞానాన్ని సిద్ధింపచేసుకున్న మహాపురుషుడు. అంతేకాదు ఆయన, అతీంద్రియ శక్తులు కలిగిన గొప్పయోగి అని అందరికీ తెలుసు. ఆయన తన జీవితాన్నంతటినీ, కఠోరతపస్సులోనూ, స్వార్థరహిత కార్యక్రమాలను నిర్వహించడంలోనూ గడిపేరు. అయితే ఆయన తన భక్తులని మాత్రం భగవంతుడి మీద ప్రేమ కలిగి ఉండాలని, అందుకు భక్తి మార్గం అనుసరించమనీ చెప్పే వారు. జ్ఞాన మార్గం ద్వారా శీఘ్రంగా భగవంతుడిని చేరుకోవచ్చు కానీ, అదిచాలా కష్టతరమైనది. పైగా దాని వలన కలిగే అహంభావం వల్ల, ఫలితం దక్కకుండా పోయే అవకాశం కూడా ఉంది. యోగ మార్గంలో, శరీరాన్ని, మనసునీ అధిక శ్రమకి గురిచేయాలి. తినడం, తాగడంలో ఉన్న కొద్దిపాటి పరిమితులనీ పాటించాలి. కర్మ మార్గం అనుసరించాలంటే, తాను చేసే కార్యాలన్నిటి బాధ్యతలనూ, వాటి వల్ల సంభవించే ఫలితాలను విడిచి పెట్టాలి. సామాన్యులకి ఇదిసాధ్యం కాదు. భక్తి మార్గం వీటన్నిటి కన్నా భిన్నమైనది. చాలా సులభ సాధ్యమైనది కూడా. లౌకికమైన సంసార జీవితం గడుపుతూ కూడా ప్రశాంతమైన ఈమార్గాన్ని అవలంబించి, భగవంతుడి సాక్షాత్కారాన్ని పొందవచ్చు. అందువల్లనే,

శ్రీసాయిబాబాగారు ఎప్పుడూ తన భక్తులని, భక్తి మార్గం లేదా భగవంతుడి మీద ప్రేమ కనబరచడం అన్నమార్గాన్నేఅనుసరించమని బోధించేవారు.

శ్రీసాయి సత్చరిత గ్రంథం 6వ అధ్యాయంలో, సాయిబాబాగారి ప్రవచనాల గురించి, హేమద్పంత్' గారు ఈ కింది మాటలు చెప్పేరు.

"నాలుగు మార్గాలు అయిన కర్మ, జ్ఞాన, యోగ, భక్తి మార్గాలు మనలను, వేరువేరుగా భగవంతుని దగ్గరకి నడిపిస్తాయి. వీటిలో భక్తి మార్గం మాత్రమే, ముళ్ళతో, గోతులతో, కందకాలతో ఉన్నప్పటికీ, ఎటువంటి మలుపుల కూడా లేని చక్కటి రహదారి. నువ్వు, సద్గురువుని ఆశ్రయిస్తే, ఎటువంటి ముళ్ళు, గోతులబారిన పడకుండాతిన్నగానీ గమ్యమైన భగవంతుని చేరగలవు."(15-17పేజీలు)అధ్యాయం6.

**(భక్తి అంటే ఏమిటి?)**

భక్తి అంటే భగవంతుడి మీద ప్రేమ. శాండిల్య భక్తి సూత్రాలు' అనే గ్రంథంలో శాండిల్యముని, భక్తి గురించి నిర్వచనంగా" భగవంతుడికి అంకితం కావడం లేదా భగవంతుడిని ప్రేమించడం" అని పేర్కొన్నాడు. అలాగే నారద మహాముని కూడా తన" నారద భక్తి సూత్రాలు" గ్రంథంలొ భక్తి గురించి" భగవంతుడి మీద, అవధులులేని అపారమైనప్రేమ"అని చెప్పేడు.

శ్రీసాయి సత్చరిత 'గ్రంథంలో హేమద్పంతు, భక్తి గురించి ఇలా చెప్పేరు." ఈ భూమి మీద, దేనినైనా ప్రేమించని మనిషి ఒక్కరు కూడా ఉండరు. ప్రతీమనిషి కలిగి ఉన్నప్రేమ, తనదిగానే ఉంటుంది. మిగిలిన వ్యక్తుల ప్రేమ కూడా వేరువేరుగా ఉంటుంది. ఉదాహరణకి, ఒక వ్యక్తితన సంతానం మీద ప్రేమ కలిగి ఉంటె, ఇంకొకరు సిరిసంపదల మీద ప్రేమతో ఉండొచ్చు. కొందరు తమ రూపం మీదా, మరికొందరు ఇంటి మీదా, పదవుల మీదా, కీర్తి పురస్కారాల మీద, అభినందనలు, గౌరవాలు పొందటం

మీదా, జ్ఞాన సముపార్జనమీదా అంతు లేని ప్రేమతో ఉండిఉండొచ్చు. సూక్ష్మంగా చెప్పాలంటే, ఐహిక ఆనందాలకి మూలమైన ప్రేమలన్నీ ఒక దగ్గరకి చేరి, మూర్తి మంతమై భగవంతుడిగా, మారితే ప్రేమ, భక్తిగా మారుతుంది. "(మరాఠీభాషలో ఉన్న శ్రీ సాయి సత్చరిత గ్రంథం నుండి అను వాదం చేయబడింది. పేజీలు 126-128-అధ్యాయం10.)

## వేరు వేరు భక్తి మార్గాలు

భగవంతుడిని, లేదా పరబ్రహ్మని ఆరాధించడంలో, నిర్గుణ లేదా సగుణ అనే రెండు ప్రధాన దర్శనాంశాలు ఉన్నాయి. రెండు అంశాల లక్ష్యం ఒకటే. కానీ నిర్గుణ విధానంలో పరమాత్మరూపరహితుడిగా, సగుణ విధానంలో రూపధారిగా ఆరాధించడం ప్రధానంగా ఉంటాయి. కొందరు భక్తులు నిర్గుణో పాసకులుగా ఉంటే, కొందరు సగుణో పాసకులుగా ఉంటారు.

భగవద్గీత 12వఅధ్యాయంలో 2వశ్లోకంలో భగవంతుడిని, సగుణో పాసకులుగా ఆరాధించడం సులభమైనదీ, అందరికీ సాధ్యమైనదీ అవుతుందని ఉంటుంది. ఎందుకంటే మానవులకి ఉన్నరూపము, గుణములలా గానే, భగవంతుడికి కూడా, గుణ, రూపలావణ్యాలుంటాయని భావిస్తే, ఆభగవదారాధన మానవులకి సులభమైనదీ, చాలా ఇష్టమైనదీ అవుతుంది. కొంత కాలం మనం సగుణబ్రహ్మారాధన చేసి, మనలో ఉన్న భగవంతుడి మీద భక్తి, ప్రేమ, మరింత ముందుకు వెళ్ళేందుకు నిర్గుణో బ్రహ్మారాధకుల మవ్వటం(యోగసాధకులవ్వటం) వల్లనే మనలక్ష్య సాధకులం కాగలుగుతాం.

అందువల్లనే, శ్రీసాయిబాబా, తన భక్తులకి సగుణ భక్తిని బోధించడమే కాదు, దాని ఫలితాల మీద వారికి అనురక్తి కలిగించడానికి, తనస్వంత

అనుభవాలను కూడా చెప్పేవారు. సగుణభక్తిని పెంపొందించడానికి, అలా తన అనుభవాలను బోధనల్లో పొందుపరచిన ఒకే ఒక సద్గురువు శ్రీ సాయిబాబా గారుమాత్రమే.

బొంబాయి నుంచి' బాలబువా' అనే పరమ భక్తుడు తనదైవారాధన, పవిత్రతలవలన" ఆధునికతుకారాం"గా పేరు పొందిన వ్యక్తి. ఆయన మొదటి సారిగా 1917లో షిర్డీవెళ్ళి, శ్రీసాయిబాబాగారిని దర్శించేడు. ఆయన ముందు నిలబడి వొంగినమస్కరించేడు. అప్పుడు బాబాగారు ఇలా అన్నారు." ఇతడు నాలుగు సంవత్సరాల నుండీ నాకు తెలుసు."

బాలబువా ఆశ్చర్యపోయి,"ఇది ఎలా సాధ్యం? నేను షిర్డీ వచ్చినది ఈరోజే కదా!" అనుకున్నాడు. కాస్సేపు దీర్ఘంగా ఆలోచించేక, నాలుగు సంవత్సరాల కిందటతాను బొంబాయిలో శ్రీసాయిబాబాగారి చిత్రపటం ముందు మోకరిల్లటం అతడికి గుర్తుకొచ్చింది. అప్పుడు అతనికి శ్రీసాయిబాబా మాటలు అర్థం అయ్యేయి. బాబా సర్వసాక్షి అనీ, అంతటా వ్యాప్తి చెంది ఉన్నసిద్ధుడనీ, అతనికి అర్థం అయ్యింది. తన భక్తుల మీద ఆయన ఎంతో దయగలిగి ఉన్నవారనీ తెలిసింది.

"నేను, అప్పుడు ఆయన పటం ముందు నిలబడినమస్కరించేను. ఇప్పుడు ఆయన ముందు నిలబడి ప్రత్యక్షంగా దర్శించేను. రెండూ సమానమే అని ఆయన ఇప్పుడు నాకు తెలియ చేసేరు.'' అని అతడు గ్రహించేడు.(152-162పేజీలు)అధ్యాయం33

అధ్యాయం9లో బాంద్రావాసి అయిన బాబాసాహెబ్ తార్కాడ్, మరియు ఆయనభార్య, కుమారుల అనుభవాలను గురించి రాసేరు.

బాబాసాహబ్ తార్కాడ్' ప్రార్థనా సమాజం సభ్యుడు. ఆయన విగ్రహా రాధననీ, దేవతల చిత్ర పటాలనీ, గురువులనీ, సాధు, సిద్ధులనీ విశ్వసించే

వాడుకాదు. ఒకసారి ఆయన భార్య, కుమారుడూ షిర్డీ వెళ్ళేరు. వాళ్ళు ప్రతీరోజూ శ్రీసాయిబాబాగారి, చిత్రపటానికి పూజచేసి, నైవేద్యంగా పంచదారపలుకులనిసమర్పించే వారు. వాళ్ళులేనప్పుడు, ఆపనులు చేయవలసిన బాధ్యత తార్కాడ్' మీద పడింది. అతడు తన కుమారుడు చేసినట్టేపూజలు చేయడానికి ప్రయత్నించే వాడు. అయితే, ఒక రోజు తాను తొందరగా తన పని మీద బయటకి వెళ్ళవలసి రావడంవల్ల, ఆయన నైవేద్యం పెట్టడం మరచిపోయేడు. అదేరోజు, షిర్డీలో ఉన్నతార్కాడ్' గారిభార్యా, కుమారుడూ, శ్రీసాయిబాబాగారి దర్శనానికి వెళ్లినప్పుడు, బాబాగారు, తార్కాడ్' గారిభార్యతో ఇలాఅన్నారు." అమ్మా! ఏదైనా తిందామని బాంద్రాలో ఉన్న మీ ఇంటికి వెళ్ళేను. మీ ఇల్లుతాళం పెట్టిఉంది. నేను ఎలాగోలోపలకి వెళ్ళేను. కానీ వెతికి చూస్తే, మీ భర్తతార్కాడ్' గారు నాకు తినడానికి ఏమీ పెట్టలేదమ్మా! నా కోరిక తీరకుండానే, నేను వెనక్కివచ్చేను."

ఆసంగతి, తర్వాత భార్య చెపితేవిని, దేవీ, దేవతల, భగవంతుడు, సాధువుల విగ్రహాల ముందు కానీ, చిత్రపటాల ముందు కానీ తినడానికి గానీ, త్రాగడానికి గానీ నైవేద్యంగా పెట్టినవి, వారిని చేరుతాయిఅని, తార్కాడ్' తెలుసుకున్నాడు. అందుకుభక్తి, విశ్వాసం కలిగివుండటం ప్రధానం అని కూడా ఆయన గ్రహించేడు. (107-109పేజీలు)అధ్యాయం9.

1917వసంవత్సరం పౌర్ణమి నాటి హోలీ పండుగరోజు, తన ఇంటికి భోజనానికి రమ్మని, హేమద్పంతుకలలో కనిపించి, శ్రీసాయిబాబా చెప్పేరు. ఆరోజు మధ్యాహ్నం నాడు ఆయన భోజనానికి పిలిచిన వాళ్ళందరూ వచ్చి, కూర్చుని తినడం మొదలు పెట్టే ముందు, హేమద్పంతు మిత్రులైన ఇద్దరు ముస్లిం వ్యక్తులు ఆలీమహమ్మదు, ఇస్మూముజావరు వచ్చేరు. వాళ్ళు ఆరోజు పొద్దున్న హేమద్పంతు కలలో శ్రీసాయిబాబా కనిపించి, చెప్పినట్టుగానే,

తమతో పాటు ఫ్రేము కట్టిన శ్రీసాయిబాబా చిత్రాన్ని కూడా తెచ్చేరు. (అధ్యాయం 40). ఆ తర్వాత ఒకసారి వాళ్ళు కలుసుకున్నప్పుడు, (అధ్యాయం 41) ఆలీమహమ్మదు, ఆరోజు వాళ్ళు ఆచిత్ర పటాన్ని ఎందుకు తీసుకు వచ్చారో వివరంగా చెప్పేడు. బాంద్రాలోని తన ఇంట్లో అతడు, బొమ్మలు అమ్మే వ్యాపారి దగ్గర శ్రీసాయిబాబాగారి చిత్రపటాన్నికొని తీసుకువచ్చి, తన ఇంటిలోనే, గోడ మీద మిగిలిన గురువుల చిత్రపటాలతో పాటు వేలాడ తీసేడు. ఆతర్వాత కొన్ని రోజులు పోయేక అతడు తన కాలి మీద కురుపుతో బాధపడుతూ, బాంద్రాలోనితన ఇంటికి తాళం పెట్టి, బొంబాయిలో ఉన్న తన బావమరిది, దగ్గరకి వెళ్ళి, అక్కడ కొన్నిరోజుల పాటు, ఉండిపోయేడు.

అతడి బావ మరిది, అతనితో ఇంట్లో గురువుల చిత్రపటాలని ఉంచి, వాటిని ఆరాధించడం అన్నది ఇస్లాంమతం నిబంధనలకు వ్యతిరేకమైన విగ్రహారాధన కిందకి వస్తుందని, నీకాలి మీద కురుపు, తొందరగా తగ్గిపోవాలని, కోరుకుంటే, వెంటనే నీఇంటిలో ఉన్న ఆ బొమ్మలన్నిటినీ తీసి వేయాలని చెప్పేడు. అది విన్న ఆలీ అహమ్మదు వెంటనే, తన దగ్గర పని చేసే గుమాస్తాని పిలిచి, బాంద్రాలోని తన ఇంటిలో ఉన్నగురువుల పటాలన్నిటినీ, తీసుకువచ్చి, వాటిని సముద్రంలో పారేసేందుకు తన బావ మరిదికి ఇవ్వమని చెప్పేడు.

చాలా ఆశ్చర్యంగా మూడు నెలల తర్వాత, ఆకురుపు తగ్గిపోయి, ఆలీమహమ్మదు, బాంద్రాలోని తన ఇంటికి వచ్చినప్పుడు, శ్రీసాయిబాబాగారి చిత్రపటం, తన ఇంటిగోడ మీద వ్రేలాడుతూ అతడికి కనిపించింది. అతడిబుద్ధికి, అందుకు కారణమేమిటో తోచలేదు. మిగిలిన బొమ్మలన్నిటినీ తొలగించినా అతడిగుమాస్తా శ్రీసాయిబాబా చిత్రాన్ని ఒక్కదాన్నీ ఎందుకు

తీయలేదో అతడికి అర్థం కాలేదు. హేమద్పంతు సాయి భక్తుడని తెలిసిన వాడవ్వటం వల్ల, అతను ఆచిత్రాన్ని తీసుకువచ్చి, భద్రపరచమని ఇచ్చేడు.

ఆసంఘటన ద్వారా శ్రీసాయిబాబా తన భక్తులకి, తాను, తన చిత్రాల్లో కూడా ఉంటానని తెలియ చెప్పేరు. అలాగే ముస్లిం మతస్తులకి, హిందువులలోని విగ్రహారాధన అన్నది తప్పు కాదని కూడాచెప్పేరు.

కాకాసాహెబ్' దీక్షితు, నాగపూరుపట్టణంలో తానుచేయబోతున్నతన కుమారుడి ఉపనయన ఉత్సవానికి, ఆయనని ఆహ్వానించేడు. అలాగేనా నాసాహెబ్' చందార్కరు, గ్వాలియరు పట్టణంలో జరిగేతనకుమారుడివి వాహానికి కూడా ఆయననిరమ్మని పిలిచేడు. బాబా వాళ్ళతో మాధవ రావుదేశపాండే లేదా షామా అన్న పేరుతో పిలిచే ఆయనని, తనకి బదులుగా తీసుకువెళ్ళమని చెప్పేరు. కాకాసాహెబ్' తప్పకుండా మీరేరావాలిఅని, శ్రీసాయిబాబాగారిని నిబ్రతిమాలాడేడు. అప్పుడు ఆయన" సరే.. నేను కాశీ, ప్రయాగలకు వెళ్ళిషామా మీ దగ్గరకి చేరకముందే, నేను తప్పకుండా వస్తాను." అని అభయమిచ్చేరు. షామాగయ చేరేటప్పటికి, అక్కడ వున్న పురోహితుడి ఇంటి దగ్గర చిత్రపట రూపంలో శ్రీసాయిబాబా అప్పటికే చేరి ఉన్నారు.(అధ్యాయం46)

అలా తన భక్తులకి ఎన్నో ఉదాహరణలను చూపిన శ్రీసాయిబాబా, తన చేతల ద్వారా, బోధనల ద్వారా వారిలో సగుణ భక్తి పెంపొందేలా చేసేరు. షిర్డీలో ఉన్న పాత దేవాలయాలనిత నసంపన్న భక్తుల చేత బాగుచేయించేరు.

అంతేకాదు షిర్డీలో ఉన్నఅన్ని దేవాలయలలో పూజలు నిర్వహించిన తర్వాత మాత్రమే, తన భక్తులు తనను ఆరాధించడానికి అనుమతించేరు. ఆయన తన భక్తులు, తమ పూజా మందిరాలలో, ఉంచి పూజలు చేసేందుకు

వారికి వెండిబిళ్ళలు కూడా ఇచ్చే వారు. శ్రీమతి ఎమ్'. డబ్ల్యు. ప్రధాన్' అనే ఆమె వంటి కొందరు భక్తులు,ఆయన వెండి పాదుకలని, తమ పూజ గదులలోఉంచి ఆరాధించేవారు.

## నవ విధ భక్తి మార్గాలు

సగుణ భక్తి మార్గంలో తొమ్మిది పద్ధతులు ఉన్నాయని 21వ అధ్యాయంలో రాసేరు. అవి1. శ్రవణం 2. కీర్తన 3. స్మరణ4. పాదసే వనము 5. అర్చన 6. వందనం 7. దాస్యము 8. సఖ్యత 9. ఆత్మనివేదన.

"వీటిలో ఏపద్ధతిని అయినా విశ్వాసంతో ఆచరిస్తే, భగవంతుడు హరి(శ్రీక్రృష్ణుడు) ఎంతో ఆనందించి, తన భక్తుల హ్రృదయంలో ప్రత్యక్షమవుతాడు." (96పేజీ,అధ్యాయం21). అని దాదాకేల్కరు గారు అదే అధ్యాయంలో స్పష్టంచేసేరు. శ్రీసాయిబాబాగారు, తన చేతల ద్వారా గానీ లేదాప్రసంగాల ద్వారా గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా, ఈ నవ విధ మార్గాలనీ అనేక సమయాల్లో ఉదహరిస్తూ వచ్చేరు. 21వ అధ్యాయంలో ఉన్న ఒక బల్ల, తొమ్మిది బంతులు అనేకథఇందుకు ఉదాహరణగా మనకి కనిపిస్తుంది. అలాగే, భగవంతుడికి సమర్పించిన తొమ్మిది నాణేలను, విబూదినీ కలిపి, ఆయన అప్పాసాహెబ్' కులకర్ణికి ఇవ్వటం, (అధ్యాయం33) చనిపోయేముందు, లక్ష్మీబాయిషిండేకి, తొమ్మిది రూపాయలు ఇవ్వటం (అధ్యాయం41) కూడా అలాటి వేని చెప్పాలి. ఈ మార్గాలను ఆయన భక్తులు, ఆయన ఆరాధనలో అనుసరిస్తూనే ఉన్నారు.

### 1. శ్రవణం (భగవంతుడి స్తుతులను వినడం)

విద్యావంతులైన తన భక్తులు కాకా సాహెబ్'దీక్షితు, బాపూసాహెబ్' జోగి,లను ప్రతీరోజూ, జ్ఞానేశ్వరి, ఏక్' నాధభాగవతం, భావర్తు రామాయణ గ్రంధాలని చదివివినిపించమని చెప్పేవారు. మిగిలిన భక్తులను, అక్కడకి

వెళ్ళివినమని చెప్పేవారు. శ్రీసాయిసత్చరిత గ్రంథం గురించి ఆయన ఇలా చెప్పేవారు. "నాకథలను, బోధనల గురించి వినటం వలన, భక్తుల హృదయాలలో విశ్వాసంయపెరుగుతుంది. అందువల్ల వాళ్ళు తొందరగా ఆత్మజ్ఞానాన్నీ, పరమానందాన్నీ పొందగలుగుతారు." (56పేజీ)అధ్యాయం2.

**2. కీర్తన (భగవంతుడి స్తోత్రాలను పాడటం)**

శ్రీరామనవమి, గోకులాష్టమి పర్వదినాలలో, శ్రీసాయిబాబా, ద్వారకామాయి ముందు ఉన్న ఖాళీస్థలంలో, భగవంతుడి కీర్తనలు గానం చేయడానికి కీర్తంకరులను ఏర్పాటు చేసే వారు. అధ్యాయం15లోశ్రీ సాయిబాబా తన శిష్యుడు, దాసగణుడిని, అతడు కీర్తనలుగానం చేసేటప్పుడు, ఎటువంటి హంగులు, ఆర్భాటాలూ లేని నారద మహాముని పాత్రనిధరించమని. మెడలో పూలదండధరించి, నడుము పైభాగంలో ఎటువంటి వస్త్రధారణ లేకుండా, ఒకచేతిలో చిడతలు పట్టుకుని, గానం చేయమని పట్టుబట్టేవారని, రాసిఉంది.

శ్రీసాయిబాబాగారే, దాసగణుడిని, అతడు తాను చేస్తున్న పోలీసు శాఖలోని ఉద్యోగాన్ని విడిచిపెట్టి, భగవంతుని కీర్తనాలాపనలో పాలుపంచుకునేందుకు కారకులయ్యేరు.

అధ్యాయం3లో శ్రీసాయిబాబాగారే ఇలా చెప్పినట్టు రాసిఉంది." నాజీవితం గురించీ, నా క్రుత్యాల గురించీ

ఎవరైనా మనస్ఫూర్తిగా పాడితే, అతని ముందు నేనుదిగ్బంధుడనవుతాను. నన్ను నమ్మండి.. ఎవరైతే, నాలీలలను గానంగా ఆలపిస్తారో వారికి పరమానందాన్ని, శాశ్వతమైన త్రృప్తినీ కలగచేస్తాను. (11-19పేజీలు) అధ్యాయం3.

అదే అధ్యాయంలో, రోహిల్లా, కల్మాలని (పవిత్రఖురానులోని స్తుతులు)కర్ణకఠోరంగా, గట్టిగా అరుస్తూ చదువుతూ," అల్లాహెూఅక్బరు" అని బిగ్గరగాకేకలు పెడుతూఉంటే, ఆశబ్దాలకు, నిద్రపట్టని గ్రామస్థులు, సాయిబాబాకి, ఆసంగతిని మొరపెట్టుకున్నారు. అయితే, బాబాకి, భగవంతుడికి, రోహిల్లా భగవంతుడికి కోసం చేస్తున్న స్తుతులు, చాలా ఉన్నత మైనవి అని తోచి, ఆయన రోహిల్లాని ప్రోత్సహించి, గ్రామస్తులను, ఆశబ్దాలను నిశ్శబ్దంగా భరిస్తూ, వేచి ఉండమన్నాడు. (పేజీలు 109–141) అధ్యాయం 3.

### 3. స్మరణ(భగవంతుని రూపాన్ని,నామాన్నితలచుకుంటూ ఉండటం)

స్మరణ అంటే ఇక్కడ ప్రధానంగా, నామస్మరణ అనే చెప్పాలి. భగవంతుడి రూపాన్నిగుర్తు చేసుకుంటూ, ఆయన నామాన్నిఏ అంతరాయం లేకుండా జపిస్తూ ఉండటమేనా మస్మరణ. శ్రీసాయిసత్చరిత గ్రంథంలో ఇలారాసి ఉంది." భగవంతుడినామస్మరణ ప్రభావం అందరికీ తెలిసినదే. అది, మనందరినీ, మనపాపాల నుండి, దుర్మార్గధోరణుల నుండి రక్షించి, జనన, మరణవలయాల నుండి విముక్తులను చేస్తుంది. ఇంత కంటే సులభమైన సాధనమరేదీ లేదు. ఇది మనమనస్సులను పరిశుద్ధంగా ఉంచే, ఉత్తమమైన సాధన. ఈనామస్మరణకి ఎటువంటి నిబంధనలూ ఉండవు. ఎలాంటి సామగ్రినీ వినియోగించే అవసరం కూడా లేదు." (85–91పేజీలు)అధ్యాయం27.

అదే అధ్యాయం 27లో రాసి ఉన్నఒక కథనం ప్రకారం శ్రీసాయిబాబా గారు, అందుకేతన ఆంతరంగిక భక్తుడు షామాను, రామదాసి, విష్ణుసహస్రనామ పుస్తకం (వేయివిష్ణు నామాలురాసి ఉన్నది) ప్రతిని తీసుకుని, ఆనామస్మరణ చేయమని, గట్టిగా చెప్పేరనడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

అలాగే శ్రీసాయిబాబాగారు తన నామస్మరణ ప్రయోజనం గురించి ఈమాటలు చెప్పేరు." నానామాన్ని ఎవరైతే, ప్రేమతో పలుకుతారో, వారి కోరికలన్నీ నెరవేర్చి, నేను వారిలోని భక్తిని ఇనుమడింపచేస్తాను." (పేజీ11,అధ్యాయం3)

"నువ్వు ఎల్లప్పుడూ "సాయి.. సాయి.. అని పలుకుతూ ఉంటే, నేను నిన్ను సప్తసముద్రాలనూదాటింప చేస్తాను. ఈ మాటలు నమ్ము. నువ్వు తప్ప కుండా ఫలితాన్ని పొందుతావు" (12వపేజీ, అధ్యాయం13)

**4. పాదసేవనము (పాదపూజ)**

పాదసేవనం' అంటే, తాను ఆరాధించే, దేవుడు లేదా దేవతకి, గురువుకి, భక్తితో రెండు చేతులతో వారి పాదాలనుతాకి, తన శిరస్సును, ఆపాదాల మీద ఆన్చి, నమస్కరించడం లేదా పాద మర్దన చేయడం అని చెప్పాలి. పైన చెప్పిన వారి పాదాలను స్మరించుకోవడం, లేదా వాటి నేధ్యానించడం కూడా పాద సేవనమే అవుతుంది.

శ్రీసాయిసత్చరితలో, పాదసేవనము గురించి, శ్రీసాయిబాబావారు కూర్చున్న భంగిమని వివరంగా రాసేరు. ఆయన ఒక రాతి మీద, కుడి మోకాలుని, ఎడమకాలి, ముణుకు మీద పెట్టుకుని కూర్చుంటారు. ఆయన ఎడమచేతి వ్రేళ్ళు, పూర్తిగా కుడికాలి పాదం మీద పెట్టుకుని ఉంటారు. కుడికాలి బొటన వేలు మీద ఆయన చూపుడు వేలు, మధ్యవేలు ఆన్చి ఉంటాయి. ఆ చిత్రం ప్రకారం, మనకి శ్రీసాయిబాబా వారు ఈ కింది మాటలు చెపుతున్నట్టే భావించాలి." మీరు నాకాంతిని దర్శించాలంటే, అత్యంత వినయ పూర్వకంగా, అహంభావర హితంగా, నాచూపుడు వేలు, మధ్య వేలు మధ్య ఉన్న ఖాళీలో నుండి, నాకుడి కాలిబొటన వేలిని చూస్తూ, నన్ను ధ్యానం చేసినట్టైతే, మీకు నాతేజస్సుగోచరిస్తుంది. భక్తి సాధనకు

ఇది అతి సులభమైన మార్గం."(పేజీలు10-18,24-25)అధ్యాయం22.

ద్వారకామాయిలో ఉన్న శ్రీసాయిబాబా వారితైల వర్ణచిత్రం, చూస్తే అందులో ఆయన కుడి పాదాన్ని ముందుకు చాపి, కూర్చుని ఉంటారు. అలాగే, ఆయన మహల్సాపతి, షామాతో కలిసి ఉన్న చిత్రాన్ని చూస్తే, అందులో ఆయన రెండు కాళ్ళనీ ముందుకు చాపికూర్చుని ఉంటారు. ఆయనని దర్శించే భక్తులు, ఆయన పాదాలకినమస్కరించడానికి, లేదా పాదమర్దన చేయడానికి, ఆభంగిమ సదుపాయంగా ఉంటుంది.

సూక్ష్మంగా చెప్పాలంటే, శ్రీసాయిబాబాగారు, నవవిధ భక్తి మార్గాలలో, పాద సేవనము పద్ధతిని చాలా ప్రోత్సహించేరు.

దేవీ, దేవతల, లేదా సద్గురువుల పాదాలను, ప్రక్షాళన చేయడానికి ఉపయోగించే నీటిని, తల మీద చల్లుకోవటం, లేదా తీర్ధంగాస్వీకరించడం కూడా పాద సేవనంలోనికే వస్తాయి. నాలుగవఅధ్యాయంలో ,శ్రీసాయిబాబాగారు, ప్రయాగ (అలహాబాదు)లో సంగమం చెందుతున్న గంగా, యమునా నదుల నీరు ఎంత పవిత్రమైనదో, ఎంతశ్రేష్టమైనదో, పాదసేవనములో సేవించే నీరు కూడా అంతపవిత్రమైన దేనని, దాసగణుడికి చెప్పేరు. అంతేకాదు, ఆ రెండు నదుల ప్రవాహాలు, తన రెండు పాదాల బొటనవ్రేళ్ళ గుండా సాగడాన్ని చూపి, అతడిని అద్భుత, ఆశ్చర్యాలకి గురిచేసి ఒప్పించేరు కూడా. (పేజీలు 102-105, అధ్యాయం4)

అదే విధంగా, 45వ అధ్యాయంలో, మనం మరొకసంగతినీ చూస్తాము. ఏకనాధ భాగవతంలోని రెండవ అధ్యాయం చదివేక, శ్రీసాయిబాబాగారి భక్తుడు, కాకాసాహెబుదీక్షితుకి, తన భక్తి మీద అను మానాలు కలిగేయి. రిషభవంశానికి చెందిన 9మంది నాధులు, లేదా సిద్ధులు అవలంబించిన కఠినమైన భక్తి మార్గం

తాను అనుసరిస్తున్న భక్తి మార్గం కాదని ఆయన భావించి, ఆందోళన చెందేడు. అయితే, కాకాసాహెబుగారి సంశయాలను తొలగించేందుకు, శ్రీసాయిబాబాగారు, తన మరొక భక్తుడు, ఆనందరావుపఖాడే, తనకు వచ్చిన కలని, వివరంగా చెప్పేలా చేసేరు. దాని ప్రకారం, ఎవరైనా తన దేవీ, దేవతలకి, లేదా సద్గురువుకి పాదాభివందనం చేస్తే, అది ఉత్తమమైన భక్తి మార్గమే అవుతుంది. -అధ్యాయం45.

**5.అర్చన (పూజచేయడం)**

ఎవరైనా తమ దేవుళ్ళను, లేదా తమ గురువుల విగ్రహాలను లేదా చిత్రాలను గానీ, వ్యక్తిగతంగా గానీ, ఆరాధించడాన్నినవ విధ భక్తి మార్గాలలో ఒకటైన' అర్చన' అంటారు. ఇందులో పాదాలను నీటితో కడగటం, నుదుటిపై చందనంపూయడం, వస్త్రాలుధరింపచేసి, పూలతో అలంకరించడం, దీపాలను వెలిగించడం, నైవేద్యం అర్పించడం వంటి కార్యక్రమాలు ఉంటాయి. ప్రారంభకాలంలో శ్రీసాయిబాబా తన భక్తులు, తనని అర్చించడానికి అంగీకరించ లేదు. తర్వాత కాలంలో, వారు పట్టుపట్టడం వల్ల, ఆయన, వారుతనని అర్చించడాన్ని అంగీకరించేరు. అప్పటినుంచి, శ్రీసాయిబాబాగారి అర్చన, షిర్డీలోని సమాధి మందిరంలో ప్రతీరోజూ

ఒకటే పూజా విధానంలో జరుగుతూ వస్తోంది. దానితో పాటు ప్రతీ సంవత్సరం గురుపౌర్ణిమ పర్వదినం నాడు, సద్గురు ఆరాధన అన్న అర్చన కూడా, చేయాలని, దాదాకేల్కరు, తాత్యాసాహెబునూల్కరు, మాధవరావు దేశపాండే అనే భక్తులు పట్టుపట్టడం వల్ల, ఆ ఆరాధనని శ్రీసాయిబాబాగారే స్వయంగా మొదలు పెట్టేరు.

**6.వందన (నమస్కరించడం)**

తనను దర్శించాలని వచ్చే వ్యక్తి, తనకి నమస్కరించాడా.. లేదా?

అన్న సంగతిని, శ్రీసాయిబాబాగారు ఏనాడూ పట్టించుకోలేదు. కొన్నిసమయాల్లో శ్రీబాబాగారే, కొన్ని అద్భుతాలు ప్రదర్శించి, నాసిక్' పట్టణంలో ఉంటున్న ఛాందస అగ్నిహోత్రి బ్రాహ్మణుడైన ములాయి శాస్త్రినీ, (అధ్యాయం12), వైద్యుడైన భక్తుడు రామనీ (అధ్యాయం35), కాకామహాజని, యజమాని అయిన శేటుధక్క రుధరం సేనీ, తన ముందు మోకరిల్లేలా, ఆయన చేయగలిగేరు. ఆయన అలా చేయడమన్నది ఆవ్యక్తులకీ, అక్కడ ఉన్న భక్త జనసమూహాలకీ, వారు తనకి నమస్కరించడమంటే, ప్రధానంగా ఒక సాధువుకి, వాళ్ళు గౌరవంగా ఆధీనులవ్వడమన్నదే అవుతుంది కానీ, తన గొప్పతనాన్నీ, ప్రాముఖ్యతనీ పెంచడంకాదని తెలియచెప్పడం కోసం మాత్రమే.

నమస్కరించడం, ఒకరి అహంభావాన్నీ, దురభిమానాన్నీ తొలగించుకోవడానికీ వినయ, విధేతలని పెంపొందించుకోవడానికీ కారణభూతమవుతుంది. షిర్డీలోశ్రీసాయిబాబాగారి ముందుసాష్టాంగ నమస్కారం చేసినప్పుడు, తాను పొందిన అనుభూతిని, హేమద్పంతు ఇలా చెప్పేరు." నేను పరుగెత్తి, శ్రీబాబాగారి ముందు మోకరిల్లేను. అప్పుడు నా ఆనందానికి అవధులు లేవు. నాసర్వేంద్రియాలు సంతుష్టిచెందేయి. నాకు ఆకలి, దప్పిక అన్నవి తెలియనే లేదు. నేను ఆయన పాదాలను తాకిన మరుక్షణం, నుండి నేను కొత్త జీవితాన్ని ప్రారంభించేను." (అధ్యాయం2)

దాస్యము(సేవచేయడం)

నాందేడుకి చెందిన అబ్దుల్', నెవాసాకి చెందిన బాలాజీపాటిల్', పండరీపురానికి చెందిన రాధాక్రిష్ణమాయి మొదలైన వారిని, ఈ దాస్యము అనే భక్తి మార్గానికి ఉదాహరణలుగా శ్రీసాయిసత్చరిత గ్రంథం పేర్కొంటుంది. అబ్దుల్' తన 19ఏళ్లవయస్సప్పుడు, భార్యా, బిడ్డలని

విడిచిపెట్టి, శ్రీసాయిబాబా వారి దగ్గరకి వచ్చిచేరేడు. అతడు సాయిబాబాగారు మహా సమాధిచెందేంత వరకూ26 సంవత్సరాల కాలంఆయనసేవలోనే తన జీవితం గడిపేడు. ఆదాస్య సేవలో అతని ప్రధానమైన పని ఏమిటంటే, ద్వారకామాయి, చావిడి, లెండితోటలలో ఉన్ననూనెదీపాలలో, నూనెపోసి వాటినన్నిటినీ వెలిగించడం. మశీదుని ప్రతీరోజూ శుభ్రం చేయడం, మట్టి కుండలన్నిటిలో తాగేందుకు నీరు పోయడం, బాబాగారి దుస్తులను లెండీతోటలోని కాలువ దగ్గర ఉతికి పెట్టడం వంటివి మరికొన్ని అతను చేసేపనులు. బాబాగారు సమాధి చెందిన తర్వాత కూడా షిర్డీవిడిచి, తన భార్యా, పిల్లల దగ్గరకి పోలేదు. తాను బాబాగారి సమాధి ప్రాంతాన్ని శు భ్రం చేయడం, వచ్చిన భక్తులకు మార్గ నిర్దేశనం చేయడం వంటివి చేసేవాడు.

నెవాసాకి చెందిన బాలాజీపాటిల్, షిర్డీలో ప్రతీరోజూ, శ్రీసాయిబాబాగారు, చేతులు, కాళ్ళు కడుక్కోవటం, స్నానం చేయటం కోసం వాడిన నీళ్ళని, అవి బయటికి వెళ్ళేకాలువలో నుంచి తీసుకుని, వాటిని మాత్రమే త్రాగేవాడు. బాబాగారి ఆదేశాల మేరకు, అతడు షిర్డీలో ఉన్న రోగుల దగ్గరకి వెళ్ళి, వారి అపరిశుభ్ర వాతావరణాన్ని శుభ్రపరచి, వారి కోసం కష్టమైన పనులు ఎన్నో చేసే వాడు. బాబాగారు ప్రతీరోజూ, లెండివనానికి, చావడికినడిచి, వెళ్ళివచ్చే మార్గాలను తుడిచి శుభ్రంగా ఉంచాలని, మొదటిగా ఆలోచించిన భక్తుడు ఆయనే. అతడు ప్రతీ సంవత్సరం, నెవాసా గ్రామంలోని తన పొలంలో పండిన ధాన్యం అంతటినీ షిర్డీ తీసుకు వచ్చి, శ్రీసాయిబాబాగారి ముందు రాశిగా పోసి, ఆయన తనకు ఇచ్చిన ధాన్యాన్నే వెనక్కి తీసుకువెళ్ళే వాడు.

అహమ్మదు నగరానికి చెందిన'దాము అన్న' అనేభక్తుడు ఒకసారి బాబాగారిని తనఇంటికి భోజనానికి రమ్మని ప్రార్ధించేడు. అప్పుడు

శ్రీసాయిబాబాగారు, అతనితో బాలాజీపాటిల్' నితనబదులు తీసుకువెళ్ళమని, ఆదేశించేరు. అందుకు ఆశ్చర్యపడనక్కరలేదు. అంతేకాదు. ఆయన దాము అన్నతో బాలాజీపాటిల్'ని ఒక గౌరవనీయుడైన అతిధిగా సంభావించమని హెచ్చరించేరు కూడా. అలాగే బాలాజీపాటిల్' మరణించేక, అతడి వర్ధంతినాడు వచ్చిన అనేక మంది అతిధులకి, ఆహారం, అందించటంలో ఏలోపమూరాకుండా శ్రీసాయిబాబాగారే స్వయంగా దగ్గరుండి పర్యవేక్షించేరు. అతడి కుటుంబ మర్యాదని కాపాడేరు.

రాధాక్రిష్ణమాయి అనే భక్తురాలు 30 సంవత్సరాల ప్రాయంలో ఉన్నఅందమైన విధవరాలు. ఆమె, ఏనాడూ శ్రీసాయిబాబాగారు మశీదులో ఉన్నప్పుడు, మశీదుమందిరానికి వెళ్ళలేదు. అంతేకాదు. బాబాగారి ముందు ఎప్పుడు నిలబడినా, ఆమె తన మొఖాన్ని ఎప్పుడూ చీర చెంగుతో, కప్పుకునే ఉండేది. అలా ఉన్నప్పటికీ, ఆమె ఎంతో శ్రద్ధగా, ప్రతీ రోజూతాను షిర్డీలో చేసే పనులను ఏమరిపాటు లేకుండా చేస్తూనే ఉండేది. మశీదు నేలని ఆవుపేడతో ప్రతీరోజూ శుద్ధి చేయడం, చావిడిలోనిసాయిబా బాగారు నిద్రించేగదిని, నిలువుటద్దాలు, చిత్రపటాలు, గుత్తులుగా ఉన్న దీపస్థంభాలు వంటివాటితో అలంకరించడం చేస్తూ ఉండేది. చావిడి నుంచి కొనసాగే బాబాగారి ఊరేగింపు కోసం, అవసరమైన దుస్తులు, ఆభరణాలు, ఛత్రాలు, దీపాలు వంటి వాటిని, ఆమె ధనికులైన భక్తుల నుండి, సేకరిస్తూ ఉండేది. ఆమె బ్రాహ్మణ స్త్రీ అయినప్పటికీ, బాలాజీపాటిల్' మరణానంతరం, శ్రీసాయిబాబాగారు లెండివనం, చావిడికి వెళ్ళేమార్గాలలో ఉండే మలమూత్రాలనీ, పశువుల పేడలనూ ప్రతీరోజూ ఊడ్చి వేయటమనే అతడి పనిని, చేయటంలో ఆమె వెనక్కి తగ్గనే లేదు. ఇలా ఆమె చేస్తున్న సేవలవల్ల, ఆమె మీద ప్రేమతో, వాత్సల్యంతోబాబాగారు ప్రతీరోజూ మధ్యాహ్నం

వేళరొట్టెలు, కూరలు ఆమె కోసం పంపే వారు. అలాగే, తన భక్తులలో వయసు మళ్ళిన వారు, విద్యావంతులు అయిన, ఇండోరుకు చెందిన బాబాసాహెబురెగే, నాగపూరుకి చెందిన బాపూసాహెబుబుట్టీ, బొంబాయికి చెందిన కాకాసాహెబుదీక్షితు, వామనరావుపటేల్' (స్వామీశరణంజడాజీ) వంటి వారిని భక్తి గురించి పాఠాలు ఆమె దగ్గర నేర్చుకోమని పంపేవారు.

**8.సఖ్యత (స్నేహభక్తి)**

శ్రీసాయిసత్చరిత గ్రంధంలో మనకి, స్నేహభక్తికి ఉదాహరణగా కేవలం షామా లేదా మాధవరావు దేశపాండే అన్న భక్తుడు మాత్రమే కనిపిస్తారు. అతడు 42 లేదా43 సంవత్సరాల పాటు సాయిబాబాగారితోనే ఉన్నాడు. అతని లాగే ఆయన సాన్నిధ్యాన్ని పొందే అద్రుష్టం, బహుశాతాత్యాకోటే పాటిలు, మహల్సా పతివంటి భక్తులకి మాత్రమే కొంత వరకూ దక్కి ఉంటుంది. అయితే షామాకి, సాయిబాబాగారితో ఉన్న సాన్నిహిత్యం చాలా ప్రత్యేకమైనది. బాబాగారు, మాధవరావు మీద ప్రేమతో, అభిమానంతో అతన్ని 'షామా' అని పిలిచేవారు. మాధవరావు, ఆయన్ని ఎంతో భక్తితో' దేవా' అనిపిలిచి బదులు పలికేవాడు. అంతేకాదు. షామా ఆయనని, ఏకవచనంతో పిలిచి, చనువుగా మాట్లాడేవాడు. షామా అంతచనువుగా సాయిబాబాగారితో మాట్లాడేవ్యక్తి, ఆయనతో ధైర్యంగా వాదించగలిగే భక్తుడు మరొకరు లేరు.

అధ్యాయం 36లో మనకి, శ్రీసాయిబాబాగారు చమత్కారంగా ఒక సారి షామా బుగ్గ మీద గిల్లి నట్టురాసి ఉంటుంది. అదేఅధ్యాయంలో ఒక సారి శ్రీమతి ఔరంగాబాద్కరుగారు, తనకి మగ సంతానం కలగాలన్న కోరికతో శ్రీసాయిబాబాగారి దగ్గరకి వచ్చి, ఆయనకి కొబ్బరి కాయని సమర్పించినప్పుడు, మాధవరావుగారు అన్నమాటలు" అమ్మా! మీరు

నామాటల కిసాక్షులు. పన్నెండు నెలల కాలంలో మీకు, ఏ ఫలిత మూసిద్ధించకపోతే, నేను ఒక కొబ్బరికాయను ఈ బాబాతల మీద పగలకొట్టి, ఆయనను మశీదు బయటకు వెళ్ళగొడతాను.'' రాసి ఉన్నాయి. (పేజీలు155-157)అధ్యాయం36.

ఎంత తెంపరితనం ఇది? బాబాగారి ముందు ఇలాటి మాటలు షామాకాక పోతే, మరెవరు మాట్లాడ గలరు?

తనకి అప్పుడప్పుడూ కలిగే కోపానికి, భక్తులను తన చేతి కర్రతోకొట్టే సాయిబాబాగారితో ఇలా మాట్లాడాలంటే, ఎంత దగ్గరి తనం ఉండాలి ఆమనిషికి.

మాధవరావుకి శ్రీసాయిబాబాగారి మీ ఉండేభక్తి కూడా చాలా గొప్పదే. ఒకసారి మాధవరావు, దీక్షిత్' వాడలో నిద్రిస్తూ ఉండగా, అతడిని నిద్రలేపడానికి కాకాసాహెబుదీక్షితు, తని దగ్గరకి వెళ్ళేడు. అప్పుడతనికి మాధవరావు నోటినుండి, ప్రవాహంలా'' శ్రీసాయినాధమహరాజ్'' శ్రీ సాయినాధమహరాజ్' మాటలు వస్తూ ఉండటం వినిపించింది. అలాటి మాధవరావు, తన జీవితాన్ని, సంతోషంగా, సౌకర్యంగా గడిపేలా చేసేందుకు శ్రీసాయిబాబాగారు తన మార్గానికి భిన్నంగా నడిచినా ఆశ్చర్యంలేదు.

అధ్యాయం 46లో, మాధవరావు కాశీ, గయ, ప్రయాగవంటి పుణ్యక్షేత్రాలకు, తీర్ధయాత్ర చేయడానికి గాను, అతనికి ఎటువంటి ఖర్చులేకుండా అన్ని ఏర్పాట్లను స్వయంగా బాబాగారే చూసుకున్నరని రాసి ఉంది.

సాయిబాబాగారి మరణానంతరం, మాధవరావుగారు 22సంవత్సరాలు జీవించేరు. తనకు అత్యంతసన్ని హితుడైన ఆ భక్తుడి జీవయాత్ర, గౌరవంగా, సుఖప్రదంగా సాగేందుకు బాబాగారు అన్ని ఏర్పాట్లూ చేసేరు. ఎంతోమంది

కోటీశ్వరులూ, రాజ్యాధికారులూ, మాధవరావుకి పాదాభివందనం చేసేవారు. ఆలింగనం చేసుకునే వారు. తమతో పాటు ఆయనను కూడా తీర్ధయాత్రలకు ఎంతో మర్యాదగా తీసుకువెళ్ళే వారు.

సఖ్యతలేదాస్నేహభక్తి నిజంగాచాలాగొప్పది అని మనకి అర్ధమవుతుంది.

మహాభారత యుద్ధంలో అర్జునుడి రథాన్నిస్వయంగా శ్రీకృష్ణుడే నడిపేడు కదా!.

### 9. ఆత్మనివేదన (ఆధీనులవ్వడం)

ఆత్మనివేదన అంటే పూర్తిగా భగవంతుడికి వశులైపోవడం. ఈ భక్తి మార్గం అవలంబించే భక్తుడు, తాను మాత్రమే కాకుండా తన భార్య, సంతానం, యావత్తుస్థిర, చరాస్తులతో పాటు తన తెలివి తేటలను, అహంభావాన్ని, తనది అని చెప్పుకు నేప్రతీ దాన్నీ, తాను కొలిచే దేవుడుకి లేదా దేవతకి లేదా సద్గురువుకి స్వంతంచేస్తాడు. ఈ ఆత్మనివేదన భక్తి రూపం చాలా ప్రాముఖ్యత ఉన్నదిగాభావిస్తారు. సాధువురామదాసు, ఆత్మని వేదన గురించి ఇలా చెప్పేరు." ఎవరైనా ఆత్మనివేదన భక్తి మార్గాన్ని అను సరిస్తూత మని సంపూర్ణ సమర్పణ చేసుకోలేకపోతే, వారికి జనన, మరణ వలయాల నుండి తప్పించుకోవడమన్నది జరగదు"

నవవిధ భక్తి మార్గాలలో మొదటిది స్మరణ అయితే చివరది ఆత్మని వేదన.

శ్రీసాయిసత్చరిత గ్రంథంలో మనకి, ఆత్మని వేదన భక్తి మార్గాన్ని అనుసరించినవారుగా కాకాసాహెబుదీక్షితు' కనబడతారు. ఆయన షిర్డీవచ్చినప్పుడల్లా, బొంబాయిలో తనకు ఎంతోపేరు, గుర్తింపు తెచ్చిన తన న్యాయవాది వృత్తిని, ఉన్నతమైన సామాజికస్థాయిని మాత్రమే కాకుండా

తన భార్యా, పిల్లలను కూడా పక్కన పెట్టి, ఎన్నో రోజులు అక్కడే వుండిపోయేవారు. అతడు ఒకసారి లండనులో ఉన్నప్పుడు, రైలుఎక్కబోతూ, కాలుజారికింద పడిఅవిటి వాడయ్యేడు. అతడేనాడూతనకాలు నయంచేయమని బాబాగారిని కోరలేదు. తన చంచలమైన, వికలమైన మనస్సును స్థిరీకరించి, తనను బ్రహ్మానందం పొందేలా చెయ్యమని మాత్రం కోరేడు. (పేజీ33, అధ్యాయం51.)

కాకాసాహెబు, సాయిబాబాగారికి శారీరకంగా, మానసికంగా పూర్తిగా వశుడయ్యేడు. ఒకసారి అతడు, ఒక మహారాజా తరఫున కేసునివాదించి, నెగ్గి, తనరుసుముగా భారీమొత్తాన్ని పొందగలిగేడు. ఆ వెండి నాణేలని అతడు ఒక పెద్దరేకు పెట్టెలోపెట్టి, దానిని తీసుకువచ్చి సాయిబాబాగారి ముందు పెట్టేడు." బాబా! ఇదంతా మీదే." అని చెప్పేడు." ఆహా! అలాగా!!" అని శ్రీసాయిబాబాగారు ఆ పెట్టెతెరిచి, అందులో ఉన్న వెండి నాణేలనన్నిటినీ, రెండు చేతులతో తీసుకుని, అక్కడ ఉన్న భక్తులందరికీ, తన మనస్ఫూర్తిగా ఎంతో ఆనందంతో పంచిపెట్టేరు. రేకుపెట్టె ఖాళీ అయిపోయింది. ఆసమయంలో నాగపూరు పట్టణంలో పని చేస్తున్న ఉపన్యాయాధికారి గర్దేగారూ, కాకాసాహెబు మరొక మిత్రుడు అక్కడే ఉన్నారు. వాళ్ళు కాకాసాహెబువంకతదేకంగా చూడసాగేరు. అయితే వాళ్లకి ఆశ్చర్యం కలిగించిన సంగతేమిటంటే, తాను కష్టపడి ఆర్జించిన ధనాన్నిబాబాగారికిస్తే, ఆయన నిర్లక్ష్యంగా, నిముషాల్లో ఆధనాన్నంతటినీ పంచి పెట్టెయ్యడం, అన్నది, అతనిలో ఎటువంటి భావాన్నీకలిగించక పోవడమే.

అది ఎంత గొప్ప పరి త్యాగం! సద్గురువుకి పరిపూర్ణంగా ఆధీనుడవ్వటం ఇదే కదా!

ఒకసారి శ్రీసాయిబాబాకాకాసాహెబుని, కత్తితో ఒక మేకని చంపమని

చెప్పేరు. పుట్టుకతో బ్రాహ్మణుడై, తన జీవిత కాలంలో చంపడం అంటే ఏమిటో తెలియని అతడు, వెంటనే ఆయన చెప్పినది చెయ్యడానికి సిద్ధపడిపోయేడు. అతడు బాబాగారితో అన్నాడు" తేనెలాంటి మీ మాటమాకు చట్టంతో సమానం. మాకు వేరేశాసనాలు ఏవీ తెలియవు. మేము మిమ్మల్ని ఎప్పుడూ తలుచుకుంటూనే ఉంటాము. మీరూపాన్నేధ్యానిస్తాము. రాత్రీ, పగలూమీ విశ్వాసులుగానే ఉంటాము. చంపడం అన్నది సరైనదా ?తప్పా? అన్నసంగతి మాకు తెలియదు.. మేము పట్టించుకోము. వాటి గురించి తర్కించడం, వాదించడం మాకు ఇష్టం ఉండదు. మేము, గురువు ఆదేశాలను విధేయులమై పాటించడమే మావిధి అనీ మాధర్మం అనీ భావిస్తాము" (పేజీ126, అధ్యాయం23)

బాబాగారు జీవించి ఉన్న కాలంలో ఏనాడూ కూడా కాకాసాహెబు, ఎటువంటి ముఖ్యమైన పని చేయాలన్నా ఆయనతో సంప్రదించి, ఆయన ఆదేశాల మేరకే చేసేవాడు. ఆయన సమాధి చెందేకకూడా, కాకాసాహెబు, చిన్నచిన్నకాగితం ముక్కల మీద తాను అనుకున్నవి వేరువేరుగా రాసి, వాటిని సాయిబాబాగారి చిత్రపటం ముందు పెట్టి, ఒక చిన్నపిల్లవాడితో వాటిలో ఒక దానిని తీయమని చెప్పి, ఆబాలుడు తీసినదే సాయిబాబాగారి మాట అనినమ్మి, ఆప్రకారమే పనులు నిర్వర్తించే వాడు. అతడు ఎప్పుడూ ఒకే మాట అనేవాడు" గురువుకి ఈశరీరాన్ని స్వాధీనం చేసినప్పుడు, అది చేసేకార్యాల మీద మనకు హక్కు ఎందుకు ఉంటుంది?".

అందుకే హేమద్పంతు, తాను మరాఠీ భాషలో రాసిన శ్రీసాయిసత్చరితలో కాకాసాహెబు గురించి" మేలిమి పసిడివంటివాడు" అని చెప్పడంలో ఆశ్చర్యం ఏమీ కలగదు. ఏభైరెండు సార్లు శుద్ధి చేసిన బంగారం వంటివాడు అతడు అని హేమద్పంతుచెప్పేడు. (పేజీ135, అధ్యాయం23)

కాకాసాహెబుకి, తాను సుఖవంతమైన మరణాన్ని ప్రసాదిస్తానని, తనతో పాటు విమానంలో తీసుకుపోతానని, సాయిబాబాగారు అతనితో ఒక మాటచెప్పేరు. అలాగే చేసేరు కూడా. 1926జూలై 5వ తేదీనాడు, కాకాసాహెబుగారు, అన్నా సాహెబుధభోల్కరుగారితో కలసి, బొంబాయిలో ఒకలో కల్'రైలులో ప్రయాణిస్తూ, సాయిబాబాగారి గురించి మాట్లాడుతూ, ఉన్నట్టుండి ధభోల్కరుగారి మెడమీద తన తలవాల్చి మరణించేరు. ఎటువంటి బాధా, అసౌకర్యం లేని మరణమాయనది. ఆరోజు హిందువులు, మరణానికి ఎంతో పవిత్రదినంగా భావించే ఏకాదశి కూడా.

**(శ్రీసాయిబాబాగారు అనుసరించిన, అతిసులభమైన, ప్రతిభావంతమైన భక్తి మార్గం.)**

ఇంత వరకూ మనం, మన శాస్త్రగ్రంధాలలో పేర్కొనబడిన తొమ్మిది విధాలైన భక్తిమార్గాల గురించి, వాటిని శ్రీసాయిబాబా గారు ఎంతగాతన భక్తుల కిబోధించి, స్వీకరించేలా చేసారో తెలుసుకున్నాం.

అవన్నీఅలావుంటే, శ్రీసాయిబాబాగారిని, భక్తి మార్గంలోచాలా తేలికైన

ప్రభావంతమైన ఏదైనా మంత్రాన్ని గాని, ఉపదేశాన్నిగానీ ఇవ్వమని కోరిన, రాధాబాయి దేశముఖ్'గారికి,

"నావంకమన: పూర్వకంగాచూడు. అప్పుడు నేను నీవంక అలాగే చూస్తాను" అని ఆయన చెప్పేరు. వాస్తవానికి అది స్మరణ భక్తికి లేదా ధ్యానానికి మరొకరూపం. ఆ తర్వాత బాబాగారు హేమద్పంతుతో ఇలా చెప్పేరు. "జ్ఞానం రూపమై, నిత్యం చైతన్య వంతంగావుండి, అవధులులేని ఆనందాన్ని కలిగించే, నా రూపరహిత స్వభావాన్ని ఎల్లప్పుడూ ధ్యానం చెయ్యండి. మీరు అది చెయ్యలేకపోతే, మీరు రాత్రింబవళ్ళు చూస్తున్నా ఈ రూపాన్ని ఆపాదమస్తకం, మనస్సులో ఉంచుకుని ధ్యానించండి. మీరు

అలా చేస్తున్నప్పుడు, ధ్యాత(ధ్యానం చేసేవారు), ధ్యానం (ఏకాగ్రత) ధేయ(ధ్యానం లక్ష్యమైనది) మధ్య వ్యత్యాసాలు తొలగిపోయి, మీవృత్తులన్నీ ఒకటే లక్ష్యంగా మారి, ధ్యానం చేసే మీరు బ్రహ్మలోలీనమై పోతారు."

తాబేలు పిల్లలు, నదికి అవతలివైపు ఉండి, తల్లి ఇవతలవైపు ఉంటే, ఆతల్లి వాటికి పాలనూ ఇవ్వలేదు. వెచ్చదనాన్నీ అందివ్వలేదు. ఆతల్లి వాటి పైప్రసరింప చేసే చూపులే వాటికి పోషణ అందిస్తాయి. ఆ తాబేలు పిల్లలు తల్లిని, గుర్తులో ఉంచుకోవడం తప్ప మరే మీ చెయ్యలేవు. వాటికి, ఆతల్లి చూపులే అమృతధారలవుతాయి. ఆహారాన్నీ, ఆనందాన్నీఇస్తాయి. గురువుకి,శిష్యులకు ఉండే సంబంధంకూడాఅటువంటిదే"

(పేజీలు105-113)అధ్యాయం19.

నిజానికి, నువ్వు ప్రేమతో గానీ, ద్వేషంతో గానీ ఏరూపాన్నిఅయినా ధ్యానిస్తే, వచ్చే ఫలితం మాత్రం ఒకటిగానే ఉంటుంది. నువ్వు ఆరూపంలోకి మారిపోతావు. అందుకు ఉదాహరణలుగా మనకి, రావణుడు, కంసుడు కనిపిస్తారు. సాలెపురుగుగూటిలో చిక్కుకున్నకీటకం కూడా ఒక ఉదాహరణే.

**ఆదర్శభక్తి అంటేఏమిటి?**

భక్తి అంటే మొట్ట మొదటిగా చెప్పాల్సింది.. భక్తులు ఎవరికైనాతాను పూజించే దేవతల మీదా, లేదా ఆరాధించే గురువుల మీదా అమితమైన ప్రేమ ఉండాలి. వాళ్ళగొప్ప దనం మీదా, ఆధిక్యత మీదా అపారమైన నమ్మకం కూడా ఉండాలి. వాళ్ళకి అర్పించే కానుకలు ఎంతగొప్పవి లేదా ఎంత విలువైనవి అన్నది ముఖ్యం కాదు. అలాగే, ఎన్ని గంటల పాటువాళ్ళకి పూజలుచేసేమన్నదీ ముఖ్యం కాదు. అర్పణలో నిజాయితీ అవసరం. అధ్యాయం 16లో హేమద్పంతు, బాబాగారి గురించి ఇలాపేర్కొన్నారు." ఎవరు ప్రేమతో, భక్తితో, ఏమిచ్చినా, ఎంతచిన్న కానుక ఇచ్చినా ఆయన

వారిని ప్రశంసిస్తారు. అదే కానుకను, ఎవరైనాగర్వంగా, అహంభావంతో ఇస్తే, ఆయన వెంటనే తిరస్కరిస్తారు.”-అధ్యాయం16

శ్రీసాయిబాబా ఇలా చెప్పేవారు “నన్నుఆరాధించడానికి, ఎవరైనా ఎక్కువ పూజాసామగ్రితో ఆడంబరంగా చేస్తామంటే, ఆ ఆడంబరాలు ఎనిమిదింతలు అయినా లేదా పదహారింతలు అయినా, ఆపూజలు నాకవసరం లేదు. సంపూర్ణ భక్తితో, ఎక్కడనా పూజ జరిగితే, అక్కడే నేను ఉంటాను.” (పేజీ 13)అధ్యాయం13.

శ్రీక్రృష్ణపరమాత్ముడు, భగవద్గీతలో అదే మాటని ఇలా చెప్పేడు.” ఎవరైతే ప్రేమతో నాకు ఒక పత్రాన్ని, లేదా ఒక ఫలాన్ని, లేదా జలాన్నిగానీ ఇస్తే, అటువంటి పరమ భక్తుడు, స్వఛ్ఛమైన జ్ఞాని ముందు నేను ప్రత్యక్షమై, అతను ప్రేమతో ఇచ్చిన దేనినైనా ఆనందంగా స్వీకరిస్తాను.’’ (పేజీ26)అధ్యాయం9.

ఆదర్శ భక్తిలో ,ప్రధానమైన రెండవ అంశం ఏమిటంటే, ఈ భక్తికలిగిన వారిలో ఎటువంటి ప్రతిఫలా పేక్ష ఉండకూడదు. దేవుళ్ళని లేదా సద్గురువులని, ఏదైనా ప్రతిఫలాన్ని కోరుకుని పూజచేసినా, ఆకోరిక నెరవేరితే ఏదైనా చెల్లిస్తానని చెప్పినా, అది వ్యాపారమే అవుతుంది. భగవంతుడిని ఫలానాది ఇమ్మని వొత్తిడిచేస్తే, అది ఏమవుతుంది?. శ్రీసాయిసత్చరితలో అందుకు కొన్నిచక్కటి ఉదాహరణలనే్గ్రంధస్తం చేసేరు.

బాబాగారు, షామాని బుగ్గమీద గిల్లినప్పుడు, అతడు బాబాగారితో ఇలా అన్నాడు.” మేము, మిమ్మల్ని మాకు గౌరవాన్ని ఇవ్వమని గానీ, స్వర్గం, లేదా విమానం వంటివి గానీ మాకు ఇమ్మని గానీ, ఎప్పుడూ కోరుకునేదిలేదు. మేము, మీపాదాల మీద భక్తితోనే, అన్ని వేళలా ఉండాలని కోరుకుంటాము.” (పేజీ142,అధ్యాయం36).

అమీర్ షక్కరు. కీళ్ళవ్యాధితో బాధపడుతూ ఉన్నప్పుడు, అతను భగవంతుడిని, అల్లాని, సాయిబాబాని ఎలా గుర్తుకు తెచ్చుకున్నాడో, హేమద్పంతు తన గ్రంథం శ్రీసాయిసత్చరితలో వివరంగారాసేరు. అతడు మహాభారతంలోని, పాండవుల తల్లికుంతీ దేవి, శ్రీక్రృష్ణుడితో అన్నమాటలను పేర్కొన్నాడు కూడా. మహాభారత యుద్ధం జరిగిపోయేక, శ్రీక్రృష్ణుడు, కుంతీదేవిని ఏమి కోరుకుంటున్నదో తెలపమని అడిగేడు. అంతులేని వ్యధలకు గురవుతూ, అరణ్యాలలో జీవిస్తూ, రహస్య జీవితాన్ని గడపడంతో అలసిపోతూ బతుకును కొనసాగించిన ఆమె, అప్పుడు శ్రీక్రృష్ణుడితో ఇలా అంది." క్రృష్ణా!ఆనందం కావాలని, నిన్నుఎవరు అడుగుతా రోవాళ్ళకి ఆనందాన్ని ప్రసాదించు. నాకు మాత్రం కష్టాలనీ, దు:ఖాలనీ మళ్ళీ, మళ్ళీకలగజేయి. అందువల్ల నేను నిరంతరాయంగా, విరామమన్నది లేకుండా భగవంతుడినే, స్మరిస్తూ ఉండిపోగలుగుతాను" (పేజీలు110-112) అధ్యాయం22.

శ్రీసాయిసత్చరిత గ్రంథం, ముగింపు మాటలో హేమద్పంతు సాయిబాబాగారిని ఇలా గట్టిగా అడుగుతాడు." నువ్వు మామనస్సులను ఎటోవెళ్ళిపోకుండా, నిన్ను తప్ప మరి వేటినీకోర కుండా కట్టడిచెయ్యి. ఈ సత్చరిత గ్రంధాన్నిఅందరి ఇళ్ళల్లో ఉండేలా, అందరూ దీనిని రోజూ చదివేలాచెయ్యి. అలా చదివే వాళ్ళకు ఎటువంటి ఆపదలనూ రానివ్వకు."

అతడు అలా ఆయన్ని అడగడం, ఇతరుల సంక్షేమంకోరడం, భక్తులందరిలో శాశ్వతంగా సాయిబాబాగారి మీదభక్తి ఉండాలని కాంక్షించడమే అని అర్థం చేసుకోవాలి.(23,43పేజీలు)అధ్యాయం52.

ఆదర్శభక్తి కలిగిఉండటం కోసం, శ్రీసాయిబాబాగారు, తన భక్తులకోసం రెండు పదాలసూక్తిని చెప్పేరు. అవి శ్రద్ధ(ప్రగాఢవిశ్వాసం) సబురి (సహనం).

భక్తులు, తాముకొలిచే దేవుడి మీదనైనా, సద్గురువు మీదనైనా, వాళ్లు ఏమి చేసినా, తమ మేలుకోసమే చేస్తారన్న అపారమైన నమ్మకం లేదా ప్రగాఢమైన విశ్వాసంతోనే ఉండాలి. అదిశ్రద్ధ అనిసాయిబాబాచెప్పేరు.

సబురి అంటే సహనం. ఆపదలు, విపత్తులు జీవితంలో సంభవించినప్పుడు, భక్తులుధైర్యంగా ఉండాలి. గురువు మీద వ్యతిరేక భావనలు మొదటకలిగినప్పటికీ, సహనం కలిగిఉండి, తమ భక్తిని సన్నగిల్లనివ్వకూడదు. ఈరెండు లక్షణాలు, ఒకరిలో ఉన్న భక్తిని పదును పెడతాయి.

సాయిబాబా గారుభక్తి గురించి చాలాముఖ్యమైన సంగతి ఒకటి చెప్పేరు. భక్తిఎప్పుడూ స్థిరంగా, ఒకటేలక్ష్యంగా ఉండాలి. పతివ్రతా శిరోమణులైన స్త్రీలకు, భర్తేలక్ష్యమైనట్టుగా భక్తి ఉండాలి. కుటుంబ సాంప్రదాయాల మూలంగానో, ముందునుంచీ ఉన్న సాంగత్యాల వల్లనోతాము కొలిచేతమ సద్గురువుల మీద భక్తిని, విడిచి పెట్టి,శ్రీ సాయిబాబాగారి దగ్గరకి, ఉపదేశం పొందాలనివచ్చే వారిని, ఆయన అంగీకరించలేదు.

మరొక గురువు భక్తుడై ఉన్న పంత్' అనే ఆయన, బాబాగారి దగ్గరకు దర్శనం కోసం వచ్చినప్పుడు, ఆయన ఇలా అన్నారు." ఏదైనా, రానివ్వండి. మీగురువుని విడిచిపెట్టకండి. ఆయనతో కలిసి ఉండండి. ఆయనకి మద్దత్తునివ్వండి పేజీ55) అధ్యాయం26.

అధ్యాయం 14లో సాయిబాబా ఇలా చెప్పినట్టుఉంది." ఈప్రపంచంలో అనేక మంది సాధువులు ఉన్నారు. కానీ మనకి జన్మనిచ్చిన తండ్రిమనకి నిజమైన గురువు అవుతాడు. మిగిలిన వాళ్ళు ఎన్నెన్నో మంచి మాటలు

చెపుతారు. కానీ మనం మన తండ్రి మాటలు ఎన్నటికీ మరచిపోకూడదు." (62వపేజీ)

విఠలుడి మీద భగవంతరావు క్షీరసాగరుకి ఉన్న నిజమైన భక్తిని (అధ్యాయం4), హరిశ్చంద్రపీతల్' గోపాల్ 'అంబేద్కరు గార్ల విషయంలో, అక్కలకోట స్వామిగారి అసలైనభక్తి గురించీ (అధ్యాయం26) శ్రీసాయిబాబాగుర్తు చేసేరు. ఒక సందర్భంలో తన భక్తుడు నానాసాహెబు చందోర్కరు, షిర్డీలోని తన దగ్గరకు రావాలన్న తొందరలో, కోపరుగావ్' గ్రామంలో ఉన్న దత్తాత్రేయ దేవాలయాన్ని దర్శించకుండా వచ్చేయడాన్ని గురించి ఆయన కోపం తెచ్చుకున్నారు కూడా.(అధ్యాయం38)

తన భక్తులకు, వాళ్ళు ఆరాధించే దేవీ, దేవతలు, సద్గురువులు అందరూ ఒకటే అనీ, అందువల్ల చీటికీ, మాటికీ దేవుళ్ళనూ, గురువులనూ మార్చుకోవడమన్నది అర్థం లేనిదనీ, ఆయన చాలా బలంగానే చెప్పేరు. దానిని నిరూపించటానికి ఆయన,తన భక్తులకి వారు ఆరాధించే, విఠలుడు, శ్రీరాముడు, దత్తాత్రేయుడు, మారుతిరూపాల్లోనూ దర్శన మిచ్చేవారు. అలాగే వారు అభిమానించి, కొలిచేఘోలప స్వామి, (అధ్యాయం12) కానారసీసాధువు (అప్పా) (అధ్యాయం21) మౌలీసాహెబు (అధ్యాయం14) లరూపాల్లో కనిపించి, వాళ్ళుచేసిన అద్భుతాలను, తానూచేసి చూపించేవారు.

శ్రీసాయిసత్చరిత, మరాఠీగ్రంథంలో శ్రీసాయిబాబాగారిని, ఏవిధంగా ఆరాధించాలో, మంచి ఉదాహరణలతో చాలాచక్కగా తెలియచేసేరు." భక్తులు తమమనస్సుని, సద్గురుని చరణాలకుగట్టిగా ముడివేసుకోవాలి. అది ఎలా ఉండాలంటే, ఒక లేగదూడ, తన తల్లి పాలను వదల కుండా తాగుతూ, ఎంత ఆనందాన్ని అనుభవిస్తుందో, ఎన్నడూ తల్లిని విడిచిపెట్టి, దూరంగా వెళ్ళడానికి అది ఇష్టపడదో అలాగ భక్తులందరూ ఉండాలి." (పేజీ77) అధ్యాయం37.

“శ్రీసాయిబాబాగారి రూపం, భక్తులందరూ వాళ్ళురోజూ నిర్వహించే కార్యక్రమాల్లో, తీరికలే కుండాఉన్నా సరే, వాళ్ళ మనస్సులలో ఎల్లప్పుడూ నిలిచేఉండాలి. ఎలాగంటే, ఒకపిసినారి, తాను పనుల మీద స్వంత ఊరుకు దూరంగా, గ్రామాలు, పట్టణాలు తిరుగుతూ ఉన్నా, తనమనసు ఎప్పుడూ తన ఇంటిలో దాచి పెట్టిన నిధిమీదే ఉన్నట్టు.” (పేజీ185) అధ్యాయం 3.

“ఒకచీమ, తన శరీరం నుండి తల వేరయిపోయినా, తాను పట్టుకున్న బెల్లం ముక్కను విడిచిపెట్టనట్టు, భక్తులు కూడా, తాము ఆరాధించే దేవీ, దేవతలలే దాసద్గురువుల పాదాలను విడవకుండా అంటిపెట్టుకునే ఉండాలి.” (పేజీ171) అధ్యాయం27.

**శ్రీసాయిబాబాగారు భక్తులకు ఇచ్చిన హామీలు.**

శ్రీసాయిబాబాగారు తన భక్తులకు ఇచ్చిన హామీలు కొన్నింటిని ఈ అధ్యాయం చివర పేర్కొంటున్నాను.

“నాభక్తులు, నా నుండి ఎంత దూరంలో ఉన్నా, వెయ్యిక్రోసుల దూరంలో ఉన్నాసరే, కాళ్ళకి తాడు కట్టిన పిచ్చుకలా, వాళ్ళు షిర్డీకి తీసుకు రాబడతారు.” (పేజీ15) అధ్యాయం28.

“నాభక్తుల ఇళ్ళల్లో ఆహారం, వస్త్రాలవంటి వాటిలో కొరత,వారికి ఏనాడూ రానివ్వను. (పేజీ33) అధ్యాయం6.

“మీరు ప్రపంచంలో ఏచోటికైనా వెళ్ళండి. నేను మీతోనే ఉంటాను. నానివాసం మీహృదయంలోనే కనుక, నేను మీతోనే ఉంటాను. మీమనస్సులలో లాగానే, అన్ని జీవులహృదయాల్లో కూడా నేను ఉంటాను కనుక నన్ను ఎల్లప్పుడూ ఆరాధిస్తూనే ఉండండి. నాగురించి అలా తెలుసుకుని, నన్ను ఆరాధించే వాళ్ళు అదృష్టవంతులు, ఆశీర్వదించబడిన వాళ్ళూ అవుతారు.”(పేజీలు67-73)అధ్యాయం15.

“నన్ను నమ్మండి. నేను గతించిపోయినప్పటికీ, నా సమాధిలో ఉన్న, నాఎముకలు, మీకు ఆశనీ, విశ్వాసాన్నీ ఇస్తాయి. నాకు ఎవరైతే సంపూర్ణంగా ఆధీనులవుతారో, వాళ్ళతో నేనే కాదు. నాసమాధి కూడా మాట్లాడుతుంది. చలిస్తుంది. సంభాషణలు చేస్తుంది. నేను మీకు దూరమైపోయేనని, చింతించకండి. మీతో, మీసంక్షేమం గురించి, నాఎముకలు చర్చిస్తాయి. మీతో అవి మాట్లాడతాయి కూడా. నన్నుఎల్లప్పుడూ మీ గుర్తులో ఉంచుకోండి. మీమనస్సుతోనూ, ఆత్మపరంగానూ నన్నునమ్మండి. అప్పుడు మీరు చాలా లబ్ధిపొందిన వారవుతారు. (పేజీ105–108) అధ్యాయం 25.

## సాయి సచ్చరిత్ర



అన్నా చించిణీకర్,
మావశీబాయి, బాబా సేవలో
ముఖాలు దగ్గరకురాగా, ఆమె
తనని ముద్దుపెట్టుకోవడానికి
ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణ
బాబా దానికి హాస్యపూరితంగా
సమర్థన

## అధ్యాయం 5

# పునర్జన్మవలయాలు

ఒక ముస్లిం ఫకీరులా వస్త్రాలు ధరించి, మశీదులోనే నివశించిన శ్రీసాయిబాబా, హిందూ మతానికి సంబంధించిన పునర్జన్మ సిద్ధాంతాన్ని పూర్తిగా విశ్వసించే వారు. ఆయన, హిందూ మతానికి చెందిన భక్తులతో, మాట్లాడుతున్నప్పుడు, చాలా సార్లు ఈ సిద్ధాంతాన్ని గురించి చెప్పడం మాత్రమే కాకుండా అందుకు వారిని వొప్పించేందుకు కొన్ని అద్భుతాలు కూడా చేసేరు.

ఒక రోజు మధ్యాహ్నం భోజనం పూర్తయ్యేక, ఆయన ఆత్మీయ భక్తుడు, షామా తన తడిచేతులను తువ్వాలుతో తుడుచుకుంటున్నప్పుడు సాయిబాబాగారు, అతడి బుగ్గ మీద గిల్లేరు. షామాకోపాన్ని నటిస్తూ, ఇలా అన్నాడు. "దేవా! మీరు నన్ను ఇలా గిల్లడం భావ్యమా? మమ్మల్ని ఇలాగిల్లి, అల్లరి పెట్టే దేవుడు మాకక్కర్లేదు. మేము మీ మీద ఆధారపడి బతుకుతున్నామా? మీతో నా, సాన్నిహిత్యానికి ఫలితం ఇదా?"

షామా అన్న ఆమాటలకి, బాబాఇలాఅన్నారు. "ఓ..షామా! గత 72జన్మల నుండీ నువ్వు, నాతోనే ఉన్నావు. ఇంతవరకూ నేను నిన్ను

ముట్టుకోనే లేదు. నేను ఇప్పుడు నిన్ను ఒక్కసారి సరదాగా గిల్లితే, నీకు రోషం వచ్చింది. " (135-143పేజీలు) అధ్యాయం36.

అలాగే దురంధర సోదరులతో, ఆయన" మనకి గత 60 జన్మలుగా పరిచయం ఉంది." అన్నారు (పేజీ 206) అధ్యాయం 51.

అహమ్మదు నగరంలోని కలెక్టరుకి, కార్యదర్శిగా ఉన్న నానాసాహెబుచందోర్కరుగారు, సాయిబాబా శిష్యులు. సాయిబాబాగారు, అప్పాకులకర్ణిఅనే గ్రామకరణంతో, ఆయనకు తననిచూడటానికి రమ్మని, ఒకసారి కాదు మూడు సార్లు కబురుపెట్టేరు. చివరగా కబురు పెట్టినప్పుడు, నానాసాహెబు షిర్డీవచ్చి, "బాబా! నన్నెందుకు రమ్మని కబురుపంపేరు? "అనడిగేడు.

అందుకు బాబాగారు ''ఈమొత్తం ప్రపంచంలో ఒకే ఒక నానాసాహెబ్' ఉన్నాడా? నేను నిన్నే,రమ్మని పిలిచేనంటే, అందుకు కారణం ఉంటుంది కదా! గత నాలుగు జన్మల నుంచీ, నువ్వు, నేను కలిసే ఉన్నాము. అది నీకు తెలియకపోవచ్చు గానీ, నాకు మాత్రం తెలుసు."

భగవద్గీత,నాలుగవ అధ్యాయంలోశ్రీక్రిష్ణుడు,అర్జునుడితోఅదేమాట ఇలాఅన్నాడు.

“అర్జునా! నువ్వూ,నేనూ చాలా జన్మల నుంచి కలిసే ఉన్నాము. నాకవన్నీ చాలా బాగాతెలుసు. ఓయి. శత్రువులను భస్మం చేసేవాడా! నీకు మాత్రం ఆవిషయం తెలియదు."

ఒకసారి, కొంతమంది దర్వేషులు, (కోతులతో, ఎలుగు బంట్లతో చిత్ర,విచిత్రమైన పనులు చేయిస్తూ, ఊరూ, వాడాతిరుగుతూ, తమను పోషించుకునే మహమ్మదీయ సాధువులు) బాబాగారి దగ్గరకి, చాలా ఎక్కువగా బాధపడుతున్న పెద్దపులిని, తీసుకు వచ్చేరు. బాబాగారి దగ్గరకి రాగానే, ఆపెద్దపులి తుదిశ్వాస విడిచింది.

దర్వేషులు, వాళ్ళ పోషణకి ఆధారం అయిన ఆపెద్దపులి మరణానికి, చిన్నబోయి, విచారించేరు. వాళ్ళని ఓదారుస్తూ, సాయిబాబాగారు, పునర్జన్మ సిద్ధాంతాన్ని ప్రస్తావించేరు. "ఆపులి, మీకు పూర్వజన్మలో రుణపడిఉంది. ఈజన్మలో తాను, మీరుణాలను ఇప్పటి వరకూ తీరుస్తూ వచ్చింది. ఆరుణం తీరిపోగానే, స్వేచ్ఛ కలిగినదై, నాపాదాల దగ్గర, మరణించింది. "(పేజీలు127-163)అధ్యాయం31.

ఒక మధ్యాహ్నం వేళ, దాదాసాహె బుక పర్దిగారి భార్య మశీదుకి వస్తూ, తనతొ పాటు సాయిబాబాగారి కోసం భోజనం తీసుకు వచ్చింది. వాటిలో సాంజా, పూరీలు, అన్నం, పులుసు, పాయసం మాత్రమే కాకమరి కొన్నిపదార్థాలు, కూడా ఉన్నాయి. సాధారణంగా ఎవరు ఆయన కోసం భోజనం తీసుకు వచ్చినా, ఆయన తినడంకోసం, వాళ్ళు గంటల తరబడి వేచిఉండేవాళ్ళు. అయితే, ఆరోజు మాత్రం, సాయిబాబా గారు ఆమె తన భోజనం తెచ్చిన వెంటనేలేచి, గబగబా భోజనం బల్లదగ్గరకి వెళ్ళికూర్చుని, ఆమె తెచ్చిన పళ్ళెం మీద, మూతతీసి, ఆకలితో ఉన్నవాళ్ళు తిన్నట్టు, ఆపదార్థాలను హడావుడిగా తినడం మొదలు పెట్టేరు. అదిచూసి, షామా ఆయనని" మీరు ఈపక్షపాతం ఎందుకు చూపిస్తున్నారు?. మీ భోజనం వేరేవాళ్ళెవరు తెచ్చినా, వాళ్ళుతెచ్చిన పదార్థాలను చూడకుండానే విసరిపారేస్తారు. కానీ ఈవిడతెచ్చిన ప్రతీదాన్నీ మీరు తేరిపారచూసిమరీ, పూర్తి గాతి నేస్తున్నారు. ఈవిడవంటలు అంతబాగా ఉన్నాయా? "అని అడిగేడు.

అప్పుడు బాబాగారు అతడికి సమాధానంగా "ఈభోజనం సాధారణమైనది ఎంతమాత్రం కాదు. పూర్వజన్మలో ఈస్త్రీ, ఒక వ్యాపారి వద్ద ఉన్న బలిష్టమైన ఆవు. అతడికి ఆ ఆవుఎన్నో పాలనిచ్చేది. ఆతర్వాత

ఆమె ఒకతోట మాలికుటుంబంలో పుట్టింది. ఆతర్వాత జన్మలో ఆమె ఒక క్షత్రియస్త్రీగా జన్మించి, ఒక వ్యాపారస్తుడిని వివాహం చేసుకుంది. తదుపరి జన్మలో ఆమె ఒక బ్రాహ్మణ స్త్రీగా జన్మించింది. ఆమెని చాలా కాలానికి, ఇప్పుడు నేను చూస్తున్నాను. అందుకే, ఆమె తెచ్చిన భోజనంలోని ప్రతీ మధుర పదార్థాన్నీ, నన్ను ప్రేమగా, ఇష్టంగాతిననివ్వు ''అన్నారు.(పేజీలు152-161)అధ్యాయం27.

ఆస్త్రీ, పూర్వజన్మల కథచెప్పడం ద్వారా, సాయిబాబాగారు, తన భక్తులకి, ఒక ఆత్మతాను చేసే పుణ్యకార్యాల వల్ల ఎలా జంతు రూపం నుండి, మానవరూపంలోకి, బ్రాహ్మణజన్మలోకి రూపాంతరం చెందగలుగుతుందో వివరించిచెప్పేరు.

శ్రీసాయిబాబాగారు సర్వవ్యాపి. ఆయన నేత్రాల ముందు. భూత, వర్తమాన, భవిష్యత్' కాలాలుఎప్పుడూ కనిపిస్తూనే ఉంటాయి. అందుకు, ఉదాహరణగా ఆయన ఒకసారి' బాబు'' అనే కుర్రవాడి పూర్వజన్మల గురించి భక్తులకి చెపుతూ, అతడి భవిష్యతుజన్మల గురించి, పుట్టబోయే ప్రదేశాల గురించి కూడా చెప్పి, అందరిలో ఆత్మ, మరల మరలజన్మలు పొందుతూనే ఉంటుందని అవగాహన కలిగించేరు.

''శ్రీసాయిబాబాగారితో భక్తుల అనుభవాలు'' అని, శ్రీనరసింహ స్వామీజీగారు రాసినగ్రంథం (పేజీ114)లో ఈక్రింది కథ రాసి ఉంది.

రావుబహదూర్' సాథేగారు ఇలాచెప్పేరు. ''సాయిబాబాగారు, మామామగారు దాదాకేల్కరు గారి మేనల్లుడు' బాబు' పట్ల చాలా ఆకర్షితులయ్యేరు. ఆకుర్రాడు, నాసహాయకుడు లిమాయే దగ్గర, కొలతలు కొలిచే ఉద్యోగి గానియ మితుడయ్యేడు. (నేను అప్పుడుకోపర్గావు, యోలా పట్టణాలలో రెవెన్యూసర్వే విభాగంలో అసిస్టెంటు సూపరెండెంట్'గా పని

చేస్తున్నాను). అయితే, అతడు, తన ఉద్యోగ కార్యభారాన్ని పక్కన పెట్టి, షిర్డీవెళ్ళి, అక్కడ సాయిబాబాగారి సేవల లోని మగ్నమైపోయే వాడు. అప్పుడు, నాసహాయకుడు లిమాయే, నాతోడల్లుడైన బాబు, తాను చేయవలసిన పనులను, నిర్లక్ష్యం చేసి, సాయిబాబాగారి దగ్గరకి వెళ్ళిపోతున్నాడని, ఫిర్యాదు చేసేడు.

నేను ఆసంగతి మామామగారు కేల్కరుగారికి చెప్పేను. "నేనేం చేసేది? అతను, బాబాగారి ఆదేశాల ప్రకారం, ఆయన చూపిన మార్గంలో నేముందుకు వెళుతున్నాడు. "అన్నాడాయన. నిజానికి బాబుకి తొందరలోనే ఏది జరుగుతుందో ముందేతెలిసిన సాయిబాబాగారు" నువ్వు చేస్తున్న ఉద్యోగం విడిచిపెట్టి, నాసేవలోనే ఉండిపో"" అని బాబుకి చెప్పేరు. బాబు అలాగే, రాత్రీ, పగలూ సాయిబాబాగారి సేవకే అంకితమై పోయేడు. బాబాగారు కూడా, అవకాశాలు లభించినప్పుడల్లా, అతడికి మధురమైన వంటకాలు, తినేందుకు ఇస్తూ ఉండేవారు. లిమాయే కూడా బాబుని ఏమీ అనకుండా, అతడికి నచ్చినట్టే చేసుకోనిచ్చేడు. ఆతర్వాత కొద్దిరోజులకే, తన 22వ ఏట, సంతానం లేని తన భార్యను, విధవరాలిని చేసి, బాబు అమరుడయ్యేడు."

ఈ విషయానికి సంబంధించి, శాంతాక్రజ్'కి చెందినమోరేశ్వర్' ప్రధాన్'ఈ సంగతిచెప్పేరు." మేముషిర్డీ వెళ్ళినప్పుడు, సాయిబాబాగారు మాధవరావు దేశపాండే  గారికి, మా ఆవిడని చూపిస్తూ ఇలా అన్నారు. "ఈమె మా'బాబు'కి తల్లి". చందోర్కరుగారు, బాబాగారు చెపుతున్నది అప్పటికే గర్భవతిగా ఉన్న నాకోడలునుద్దేశించే అనిభావించేరు. వెంటనే ఆయన బాబాగారికి, నాకోడలిని చూపిస్తూ, ఈమేకదా! అనిఅడిగేరు. దానికి బాబాగారు" కాదు. ఈమె" అని నాభార్యనే మళ్ళీ చూపించేరు. ఆరోజుకి

12నెలల తర్వాత నాభార్య ఒక మగశిశువుకి జన్మనిచ్చింది. మేమాబాలుడికి' బాబు' (బాబాగారు అన్నది) అని పేరు పెట్టుకున్నాము.

మాఅబ్బాయి' బాబు'కి నాలుగు నెలల వయస్సు వచ్చేక, మేము అతడిని షిర్డీ తీసుకువెళ్ళేము. సాయిబాబాగారు, వాడిని ఎంతోప్రేమగా తన చేతుల్లోకి తీసుకుని, వాడితో ఇలా అన్నారు. "బాబూ! నువ్వు ఇంత వరకూ ఎక్కడ ఉన్నావు? నువ్వు నాతో విసిగిపోయావా? లేకపోతే అలసిపోయేవా?.

బాబు మళ్ళీషిర్డీకి రావడం వల్ల కలిగిన ఆనందంతో, ఆయన తన జేబులోంచి రెండు రూపాయలు తీసి, వాటితో బర్ఫీమిఠాయి తెప్పించి, ఎవరైనా తమకి పిల్లలు పుడితే, ఎంత సంతోషంగా తీపిమిఠాయిలు పంచుతారో, అలాగే అందరికీ పంచిపెట్టేరు. అప్పుడే బాబాగారు మరొక మాట కూడా అన్నారు. "బాబు వశించే అందమైన భవనం సిద్ధంగాఉంది" .ఆయన మాటలు అక్షర సత్యాలయ్యేయి. మేము ఉంటున్న భవనాన్ని, అతి తొందరగానే, నేను కొనగలి గేను.

పైరెండు సంగతులనూ చదివిన తర్వాత, పాఠకులు పునర్జన్మ సిద్ధాంతాన్ని తప్పకుండా విశ్వసిస్తారని నేను భావిస్తాను. అంతేకాదు శ్రీసాయిబాబాగారు, తన భక్తులను ఒక జన్మనుండి మరొక జన్మ వరకూ ఎంతగాకనిపెట్టుకుని ఉంటారో కూడా గ్రహిస్తారని తలుస్తాను.

పునర్జన్మల గురించి చెప్పేటప్పుడు శ్రీసాయిబాబాగారు ఎప్పుడూ ఇదే ఉపదేశించేవారు. "ఈజన్మలు సుఖసంతోషాలు కలిగించేవైనా, దు:ఖ పూరితమైనవి అయినా, అవి పొందిన వాళ్ళుపూర్వజన్మలో చేసిన కార్యాలవల్లనే లభిస్తాయి. ఉదాహరణలుగా అధ్యాయాలు 46,47ల్లో, సాయిబాబాగారు రెండు మేకల, కప్ప, పాములగత జీవితాల గురించి,

ప్రస్తుత జీవితాల గురించి చెపుతూ, ఇలా ముగించేరు. "వీటి కథల నుండి మనకి తెలిసే, నీతి ఏమిటంటే, ఒకరు దేనిని నాటుతారో, ఆపంటనే కోసుకుంటారు. ఎవరైనా, ఇతరులతో చేసిన లావాదేవీలు, రుణాల గురించి, అదే జీవితంలో పరిష్కారం చేసుకోవటం లేదా కష్టపడటం చేస్తేతప్ప, తర్వాత జీవితంలో ఎదురయ్యే ప్రతి కూలపరిస్థితుల నుండి తప్పించుకోవడమన్నది అసంభవమే అవుతుంది."(32పేజీ)అధ్యాయం47.

ఆయన, ఆ విషయాలు అన్నీ తెలిసిన సర్వజ్ఞుడు కావడంవల్లనే, తన భక్తులను ఎల్లవేళలా నిజాయితీగా, చిత్తశుద్ధితో జీవించమని చెప్పేవారు. ఏది సరైనదో ఏదికాదో తేల్చిచెప్పగల మనస్సాక్షి, అన్ని వేళలా జాగరూకతతో ఉండేలా జీవించమని చెప్పేరు. ఆయన, అందుకోసం ఎప్పుడూ చెప్పే మాట ఒకటే. "మీరు మంచి మార్గంలో జీవిస్తే, మీకు అన్నివేళలా మంచే జరుగుతుంది". -అధ్యాయం47.

అధ్యాయం 14లో ధభోల్కరుగారు, అలాటి ఒక ఉపదేశాన్నే, బ్రృహదారకోపనిషత్తు నుండి ఉదాహరించేరు. దాని ప్రకారం, ప్రజాపతి, దేవుళ్ళకీ, మనుష్యులకీ, రాక్షసులకీ' ద'అనే ఒక అక్షరాన్ని పాటించమని చెప్పేడు. దేవతలు ఆఅక్షరాన్ని 'దమ' (స్వీయనియంత్రణ)గా స్వీకరించాలని, పాటించాలని భావించేరు. మనుష్యులు దానిని" దానం"గా స్వీకరించి, దానములు చేయడంగా పాటించాలని భావించేరు. రాక్షసులు, దానిని' దయ' అంటే కరుణతో ఉండటం అని తలచి అలాగే పాటించాలని భావించేరు.

ప్రజాపతి, మనుష్యులకు చెప్పిన దానగుణాన్ని, తన భక్తులలో పెంపొందించాలని, వారిలో ధనం మీద ఉన్న మమకారాన్ని, తొలగించాలని, వారి మనస్సులను శుద్ధిచేయాలని, సాయిబాబాగారు, వారి నుంచి దక్షిణలు స్వీకరించేవారు. (పేజీలు144,146,151,154) అధ్యాయం14.

శ్రీసాయిబాబాగారు పదేపదే, "మనం గత జన్మలలో చేసిన పుణ్యకార్యాల వల్లనే, ఈమానవదేహాన్ని పొందగలిగేము. ఇది ఎంత ఉపయుక్తమైనదంటే, దీని సహకారంతోనే, మనం ఈజన్మలోనే భక్తినీ, ఆత్మస్వేఛ్ఛనీ పొందగలుగుతాము. కనుకమీరెప్పుడూ మీజీవితలక్ష్యాన్నీ, ముక్తినీ సాధించడానికి మెలకువగానే ఉండండి. సోమరులుగా ఉండకండి. "అని భక్తులతో చెపుతూ ఉండేవారు.(పేజీ41) అధ్యాయం 8.

అధ్యాయం 8లోనే, ఆయన చెప్పిన మరో సందేశం కూడా ఇలా కనిపిస్తుంది. "జీవులన్నిటికి, ఆహారం, నిద్ర,భయం, మైధునం అన్న నాలుగూ సాధారణమైన అవసరాలు. లక్షణాలు కూడా. మానవులకైతే భగవంతుడు జ్ఞానం అనే మరొక ప్రత్యేకలక్షణాన్ని ప్రసాదించేడు. దేనివల్లనైతే మానవుడు దైవదర్శనాన్ని పొందడం సాధ్యమవుతుందో అది మానవజన్మలో తప్ప మరేజీవుల జన్మలలో మనకి కనిపించదు." (పేజీలు9,11,12,15) అధ్యాయం 8.

తన జీవిత చరమాంకంలో ఉన్న ప్రతీమానవుడూ, తన ఆఖరి క్షణాల్లో ఏమి కావాలని కోరుకుంటాడో, దేని గురించి ఆలోచిస్తాడో అతడు లేదా ఆమె భవిష్యత్తు జీవితం, దాని ప్రకారమే నిర్ణయించబడుతుంది. దానినే

శ్రీక్రిష్ణ పరమాత్ముడు, భగవద్గీత, ఎనిమిదో అధ్యాయంలో 5,6, శ్లోకాల్లో, ఇలా బోధిస్తాడు. "తన ఆఖరి క్షణాల్లో ఎవరైతే నన్ను స్మరిస్తారో, వాళ్ళు ఖచ్చితంగా నాదగ్గరకే వస్తారు. ఎప్పుడూ ధ్యానమగ్నులై వుండే వాళ్లు, వాళ్ళ ధ్యాన లక్ష్యానికే చేరుకుంటారు."

మనం మన జీవితం ఆఖరి క్షణంలో, మనం కోరుకున్నట్టే మంచి ఆలోచన చేస్తామని, భగవన్నా మస్మరణ చేయగలుగుతామనీ ఖచ్చితంగా చెప్పలేం. అందుకు, మనం వ్యాధుల వలన పొందుతున్న బాధలు, కుటుంబ

సమస్యల గురించిన మనోక్లేశం, వాళ్ళ భవిష్యత్తు గురించి బెంగవంటి ఎన్నో కారణాలు, మనకి బంధనాలు కావచ్చు. అందుకే మన సద్గురువులు మనకి ఎల్లప్పుడూ భగవంతుడి నిరంతర నామస్మరణని, ఆచరిస్తూనే ఉండమని బోధిస్తూ ఉంటారు. అందువల్ల, మనం జీవితం నుంచి నిష్క్రమించే ఆఖరిక్షణంలో ఎటువంటి అయోమయానికీ గురికావడమన్నది జరగదు. అందుకే, తెలివైన భక్తులు అందుకోసం ఒక చిన్న పని చేస్తారు. వాళ్ళు తమ చివరి రోజులు సమీపిస్తున్నప్పుడు, సద్గురువులను చేరి, సర్వజ్ఞాని అయిన తమగురువు, తమకి కావలసినట్టే చేస్తాడని వారికి అమితమైన విశ్వాసం ఉంటుంది కనుక వాళ్ళ ఆధీనులుగానే మిగిలిపోతారు.

శ్రీసాయిసత్చరిత (అధ్యాయం31)లో అటువంటి భక్తుల గురించి అయిదు ఉదాహరణలు మనకి తెలియచేసేరు. విజయానంద సన్యాసి, బలరాం మంకరు, తాత్యాసాహెబునూల్కరు, మేఘా, దర్వేషుల పెద్దపులి అటువంటి భక్తులలోకి వస్తారు. వారి ఆఖరి శ్వాస, షిర్డీలో శ్రీసాయిబాబాగారి సన్నిధిలోనే ముగిసిపోయింది.

శ్రీసాయిబాబాగారు, తన భక్తులతో కేవలం పునర్జన్మల విషయాలు మాత్రమే మాట్లాడలేదు. వాళ్ళకి భవిష్యత్తులో ఒక మంచి జీవితాన్ని పొందాలంటే ఎలా జీవించాలో, లేదా మరలజన్మ అన్నదే లేకుండా ఎలా విముక్తువ్వాలో కూడా తెలియచేసేరు.

# సాయి సచ్చరిత్ర

బాబా బసవప్ప -
వీరబద్రప్పల పూర్వజన్మల
కథను వివరించుట



## అధ్యాయం 6

# కర్మ సిద్ధాంతం

కర్మ సిద్ధాంతాన్ని గ్రాహ్యం చేసుకోవడమన్నది అంతతేలికైనది కాదని, పండితులందరూ చెపుతున్నప్పటికీ, భౌతికశాస్త్రంలో న్యూటన్' శాస్త్రవేత్తచెప్పిన సూత్రం" ప్రతీచర్యకీ సమానమైన ప్రతిచర్య ఉంటుంది" గురించి తెలిసిన వాళ్ళకి, అది సులభ సాధ్యం అవుతుంది.

మనం, మన జీవితంలో ప్రతిరోజూ ఎన్నో పనులు చేస్తూ ఉంటాము. వాటిలో కొన్నిటి ప్రతి ఫలాలు వెంటనే, లభిస్తాయి మరికొన్నిటికి ఆలస్యంగా లభిస్తాయి. ఉదాహరణకి మనం నిప్పుని ముట్టు కుంటే, మనచేయి వెంటనే కాలుతుంది. మనం సిగరెట్లు కాల్చినా, మద్యం తాగడం చేసినా, కొంత కాలానికి మన శరీరం, అనేక రోగాలకినిలయమే అవుతుంది. ఆవిధం గానే, మనం గత జన్మలో చేసిన, మంచి, చెడుపనుల ఫలితాలు ఈజన్మలో అనుభవించడానికి, మనం సిద్ధపడే ఉండాలి. వాటి నుంచి తప్పించుకు నేందుకు మార్గమేదీ ఉండదు.

"ఈకథల నీతి ఏమిటంటే, ఒకరు ఈజన్మలో దేనినైతేనాటేరో, తర్వాత జన్మలో దాని పంటనే కోసుకోవాలి. ఇతరులతో తన కున్నరుణ బంధనాలను, లావాదేవీల వ్యవహారాలను, ఈజన్మలో పరిష్కరించుకోలేని వారు, వాటి

నుండి తర్వాత జన్మలో తప్పించుకోవడమన్నది అసాధ్యమే అవుతుంది.” (పేజీ 50) అధ్యాయం 47.

రఘువీర్' పురందరేకి శ్రీసాయిబాబా ఈకింది మాటలు హిందీలో చెప్పేరు.

“జైసే జిస్'కీ నియత్',వైసే ఉస్'కీబర్కత్'”

(ఎవరైతే మంచి మార్గంలోప యనిస్తారో, వారిని మంచి ఎప్పుడూ అనుసరిస్తూనే ఉంటుంది.)

**(మంచి పనులనే ఎప్పుడూ చేయండి)**

మన శాస్త్రగ్రంధాలు చెప్పినట్టే, మనం నడుచుకోవాల ని శ్రీ సాయిబాబా తన భక్తులందరకీ బోధించేరు. ”ప్రతీ ఒక్కరూ నీతిగా, నిజాయితీగా, ధర్మంగా మసలుకోవాలని, ఏదిమంచో, ఏది చెడో గ్రహించే, విచక్షణతో మెలగాలని మన బాధ్యతలను సక్రమంగా పూర్తిచేయాలని, ఎటువంటి కర్తృత్వ అహంకారాన్ని కలిగి ఉండకూడదని, కర్మఫలాలని లేదా ఫలితాలని, భగవంతుడికే సమర్పించాలని, అందువల్లనే, మనం, మన బంధనాలకు దూరంగా ఉండగలుగుతాము” అన్నవి ఆయన మాటలు.

“మనం, మన చుట్టూ ఉండే చరాచర జీవరాశి పట్లా, ప్రేమతో ఉండాలి. వాద, వివాదాలలో ములిగి పోకూడదు. వాటికి చాలా దూరంగా ఉండాలి. ఎవరైనా, మనని నిందించినా, మన పట్లకోపంగా ప్రవర్తించినా, మనం ప్రశాంతంగానే వాటిని భరించాలి. ఆనిందా వాక్యాలు, గద్దింపులు మనశరీరానికితూట్లే మీ పొడవవు. మనం ఇతరులతో, శత్రువులుగా ఉండకూడదు. ఎవరినీ దూషించ కూడదు. ఇతరులు ఏపనులు చేస్తున్నా మనం పట్టించుకో కూడదు. వాళ్ళ కర్మల ఫలితాలు వాళ్ళవి. మన కర్మ ఫలాలు మనవిగానే ఉంటాయి.

శ్రీమతి సావిత్రిబాయి టెండూల్కరుగారు రాసిన" సాయినాథభ జనమాల" పుస్తకానికి రాసిన ముందు మాటలో కాకాసాహెబు దీక్షితుగారు, సాయిబాబాగారి బోధనలను, చాలా క్లుప్తంగా ఇలా చెప్పేరు.

"ఎప్పుడూ పనిచేస్తూనెఉండండి. సోమరులుగా ఉండిపోకండి. భగవన్నా మస్మరణ చేస్తూనే ఉండండి. ఆధ్యాత్మిక గ్రంధాలను చదవండి."

మన ఆధ్యాత్మిక గ్రంధాలలో (తైత్తరీయ ఉపనిషత్తు) దాన ధర్మాల ప్రాధాన్యతను గొప్పగా చెప్పేరు. "విశ్వాసంతో కూడిన దానం చెయ్యటమే సరైనది. విశ్వాసం లేకుండా దానం చెయ్యటం వ్యర్ధమే అవుతుంది. ధారాళంగా దానం చెయ్యండి. హుందాగా దానం చెయ్యండి. సానుభూతితో, వినయంగా మీ దాన ధర్మాలు చేస్తూ ఉండండి." (పేజీలు 143,144,146) అధ్యాయం14.

శ్రీసాయిబాబాగారు కూడా ఇదే సంగతిని, భక్తులకు బోధించేరు. "నువ్వు, దాహంతో ఉన్నవాడికి నీరు, ఆకలితో ఉన్న వాడికి రొట్టె, నగ్నంగా ఉన్న వాళ్ళకి బట్టలు, కూచోడానికి, విశ్రాంతి తీసుకోవడానికి ప్రదేశం లేని వారికి, నీఇంటి వరాండాను నువ్వు ఆశ్రయంగా ఇస్తే, దేవదేవుడు శ్రీహరి ఆనందిస్తాడు. "(పేజీ142)అధ్యాయం19.

సత్కార్యాలు చేయాలనుకున్న భక్తులకి, సాయిబాబాగారు ఒక హెచ్చరిక చేసేరు.. నువ్వు ఏదైనా ఒక మంచి పని అనుకున్నది వెంటనే చేయకు. ఎందుకంటే చాలా మంది నిన్ను అను సరించడానికి ప్రయత్నిస్తారు.

ఏదైనా ఒక సత్కార్యం చేయాలనుకున్న మనిషి, శారీరకంగా, ఆర్ధికంగా, అధ్యాత్మికంగా తన స్థాయి, సామర్ధ్యాలను, ముందు తెలుసుకోవాలి. అని అన్నారు. అధ్యాయం 45లో, ఈసంగతికి ఉదాహరణ మనకి కనిపిస్తుంది. కాకాసాహెబు దీక్షితు, సాయిబాబా నివసిస్తున్న ప్రదేశం,

పైకప్పు నుండి, ఆయన కూర్చోడానికి, వేలాడుతున్న ఎత్తుగా ఉన్న చెక్క పలకలాంటిదే మరొక దాన్ని, తాను మహల్సాపతి కోసం కూడా ఏర్పాటు చేస్తానని, చెపితే సాయిబాబాగారు, దానిని తిరస్కరించేరు.

అనేక మంది గురువులను, సందర్శించడం, వారు చెప్పే సలహాలను, ప్రవచనాలను ఆచరించాలని ప్రయత్నాలు చేయడం ఎంతో మంది భక్తులు, నాడూ, నేడూ చేస్తూనే ఉంటారు. దాని గురించి సాయిబాబాగారు ఆనాడు ఒక మాట ఇలా చెప్పేరు. "ప్రపంచంలో వేలాది మంది మత గురువులు ఉన్నారు. కానీ మన తండ్రేమనకి నిజమైన గురువు. మిగిలిన వాళ్ళు ఎన్నోమంచి విషయాలు చెపుతారు. కానీ మన మెప్పుడూ మనగురువు, ఆదేశాల నేనాడూ మరచిపోకూడదు. ఎందుకంటే అతనెప్పుడూ మనకి ఏది మంచి చేస్తుందో, దానినే మనకి బోధిస్తాడు.' (119, 122 పేజీలు) అధ్యాయం45.

**సాధు సాంగత్యం అవసరం**

దుర్మార్గులు, మతాలని స్వీకరించని వాళ్ళు, నాస్తికులు తో, దూరాన్ని పాటించమని శ్రీసాయిబాబాగారు తన భక్తులకి చెప్పేరు. అందుకు బదులుగా సాధువులతో, సాన్నిహిత్యాన్ని పెంచుకోమని, ఆయన గట్టిగా చెప్పేరు. "సద్గురువులతో, సాధువులతో దగ్గరగా ఉండటం చాలాగొప్ప సంగతి. నువ్వు వాళ్ళని, మన: స్ఫూర్తిగా ఆశ్రయాన్ని కోరితే, వాళ్ళు నిన్ను సురక్షితంగా, క్షేమంగా ఈ భవసాగరాన్ని దాటించగలుగుతారు. ఆమంచి పనిచేయడం కోసమే సాధువులు అవతరిస్తారు. పవిత్రనదులైనగంగా, గోదావరి వంటివి ప్రపంచంలో ఉన్న పాపాలను తొలగించడానికి, నిరంతరం ప్రవహిస్తూనే ఉంటాయి. వాటిలో స్నానం చేయడం ద్వారా సాధువులు, తమ భక్తుల పాపాలను పోగొట్టితాము పవిత్రులవుతారు. (108, 115, 137, 141, 148, 149, 151 పేజీలు) అధ్యాయం10.

సాధు, సన్యాసుల కథలను వినడం లేదా, వాళ్ళు రాసిన గ్రంధాలను చదవడం, కూడా సాధు సాంగత్యమే అవుతుంది.

**చెడుపనులకు దూరంగా ఉండండి**

"అప్పు చేయడం, ఇతరులతో శత్రుత్వాన్ని పెంచుకోవడం, హత్యలు చేయడం వంటి పాపపు పనులు చేసిన వాళ్ళని, అవి ప్రపంచం అంతమయ్యే వరకూ వాళ్ళని వెంటాడుతూనే ఉంటాయి. మరోక మాటగా చెప్పాలంటే, వాటి ఫలితాల నుండి వచ్చేబాధలను తప్పించుకుని ఎవ్వరూ పోలేరు." అనిశ్రీ సాయిబాబాబాగారు చెపుతూ ఉండేవారు. అప్పు అన్నది డబ్బురూపంలో, ఆహారం రూపంలో, లేదా సేవారూపంలో కూడా వుండవచ్చు. ఆ అప్పుని చేసిన వాళ్ళు,ఈ జీవితంలో,లేదా తరువాత జన్మలో అయినా చెల్లించి తీరాలి.

అధ్యాయం 31లో, ఇంతకు ముందు మనం, సాయిబాబాగారి దగ్గరకి, దర్వేషులు ఒక అనారోగ్యంతో బాధపడుతున్న పెద్దపులిని, బాగుచెయ్యమని తీసుకువస్తే, అది ఆయన ముందే మరణించడం, అందుకు దర్వేషులు, తమ ఆదాయవనరుని పోగొట్టుకున్నామని, రోదించడం గురించి చదివేం. అందుకు సాయిబాబాగారు వారితో" ఆపులి, పూర్వజన్మలో మీకు రుణపడి ఉంది. అది మళ్ళీ జన్మ దాల్చి, మీ దగ్గరకి, ఆబంధనం వల్ల వచ్చి, చేరి తన బాకీ మొత్తం మీకు చెల్లించి, వెళ్ళిపోయింది. ''అని చెప్పేరు.(పేజీ163)అధ్యాయం31.

ఒకసారి సాయిబాబాగారిని, ఒక భక్తుడు,"బాబా! మీ రెందుకు, ఒక నిచ్చెనతెచ్చి, గోడకి ఆనించిపెట్టిన కుర్రాడికి, రెండు రూపాయలు ఇచ్చేరు?" అని అడిగేడు. అందుకు బాబా" ఎవరూ, ఇతరుల శ్రమని ఊరికే తీసుకోకూడదు. శ్రామికుల శ్రమఫలితాన్ని ఖచ్చితంగా, ఉదారంగా

మరీ ఇవ్వాలి. "అన్నారు. (పేజీలు246,247) అధ్యాయం19.

క్లుప్తంగా చెప్పాలంటే, డబ్బు, ఆహారం, చిన్న పాటి సహాయం, మనకి ఇతరుల నుండి అందినట్లైతే, మనం వాటిని తిరిగి చెల్లించాలి. ధన రూపంలో కాకపోతే మరొక రూపంలో ఆ చెల్లింపన్నది ఉండాలి. మనం, బాబాగారు, ఎవరి సహాయం కోరకుండా, తానేస్వయంగా మశీదు గోడలను బాగుచేయడం, ఆవుపేడతో, నేలను అలకడంవంటి పనులు చేసే వారని, విని ఉన్నాం. అలాగే, బాబాగారు ఏరోజైనా పేదవాళ్ళకి భోజనం పెట్టాలని,

అనుకున్నప్పుడు, అందుకు కావలసిన జొన్నలు, గోధుమపిండి, మసాలాసామగ్రి వంటివాటిని, బజారుకి వెళ్ళికొని తేవడం, తిరుగలివిసరటం, వండటం, వడ్డనలుచేయటం లాంటి పనులన్నీ, మొదటి నుండి, చివరవరకూ తానేస్వయంగా చేసేవారు.

ఇటువంటి సందర్భాలలో, ఆయన ఎప్పుడూ తన భక్తులను, డబ్బు సంపాదన కోసం దురాశ పెంచుకోవద్దని చెప్పేవారు. ఎందుకంటే, ఆదురాశ, శత్రుత్వాన్ని కలిగిస్తుంది. హత్యలకు కూడా దారి తీస్తుందని బోధించేవారు., ఆవిషయాన్ని ఆయన రెండు మేకలగత జన్మల సంగతిని (అధ్యాయం46లో) ఒకకప్ప, పాము సంగతిని (అధ్యాయం47లో) చెప్పడం ద్వారా, భక్తులకు తన సందేశాన్ని చాలా బలంగా, వినిపించగలిగేరు.

ఆ కథలనీతిగా ఆయన, మనకి చెప్పిన దేమిటంటే," డబ్బుకోసం, దురాశ పాలయ్యే మనుషులను ఆ డబ్బు, అధోగతికి కూలదోస్తుంది. అంతేకాదు, వారికీ, ఇతరులకీ విధ్వంసాన్నే తెస్తుంది. "(పేజీ15) అధ్యాయం45.

తన భక్తులకు, డబ్బుతో ఏర్పడిన, అనుబంధం నుండి దూరం చెయ్యాలనే. శ్రీసాయిబాబాగారు, తన భక్తులను దక్షిణకోరే వారు.

(పేజీలు17,19)అధ్యాయం 33. ఆయన వాళ్ళు ఇచ్చిన డబ్బుని, తన దగ్గర ఉంచుకునే వారే కాదు. అదేరోజు సాయంత్రాని కల్లా, తన భక్తులకి, పేదవారికి పంచిపెట్టేసే వారు. అదిత్యాగమే, ధన వ్యామోహాన్ని త్యజించటమే అవుతుంది.

## సత్కార్యాలు చేయడంలో ఎదురయ్యే అవరోధాలు

ఎవరైనా, శాస్త్రగ్రంధాలలో చెప్పినట్టు చాలాసార్లు, ఒక మంచి పని చేయాలని, సంకల్పించినా సరే, ఏవేవో కారణాలవల్ల, చేయలేక చెడు మార్గం వైపు తిరిగి పోతారు. ఎందుకలా జరుగుతుంది? కారణం చెప్పాలంటే, గతజన్మలో చేసినకొన్ని పనులు, అందుకు ఫలితంగా లభించిన ఈ జీవితంలోని ప్రవర్తన అందుకు దారితీస్తాయి.

మరొక కారణం కూడా ఉందనేచెప్పాలి. చెడునడతవున్న ఎవరైనా, మంచి పని చేయాలనుకున్న వారిని, ఆపని చేయవద్దని సలహాలు ఇవ్వడం వల్లకూడా, మంచి పనులు చేయడం జరగక పోవచ్చు. అటువంటి సందర్భాలలో అటువంటి సలహాలు ఇచ్చేవారికి దూరంగా ఉండటం, వాళ్ళ సలహాలను కూడా పట్టించుకోకుండా, మంచి పనులు చేయడానికి ముందుకు వెళితే, తప్పని సరిగా అనుకున్న ఫలితాన్ని సాధించవచ్చు.

శ్రీసాయిబాబాగారు, మంచి పనులు చేయాలనుకున్న లక్ష్యంతో ఉన్నతన భక్తులకు, అందుకు సహాయం చేస్తూనే ఉండేవారు. ఒక ఉదాహరణ అందుకు చెప్పాలంటే, ఒకగురువారం నాడు, విరామం లేకుండా' రామనామగానం 'చేయడానికి, ఆయన భక్తుడు దభోల్కరు గారు సంకల్పించినప్పుడు, సాయిబాబాగారు, ఒక ఔరంగాబాదుగాయకుడు పాడిన రామ నామ గానాన్ని వినేందుకు ఏర్పాట్లు చేసేరు. (పేజీలు161-187) అధ్యాయం19.

తన దగ్గరకి వచ్చే భక్తులలో చాలా తక్కువ మంది మాత్రమే ఆధ్యాత్మిక ప్రయోజనాల సాధన కోసం రావడమన్నది, బాబాగారికి విచారాన్ని కలగచేసేది. ఎక్కువ మంది సంపదలు, ఆరోగ్యం, గౌరవం, హోదా, వ్యాధులునయం కావటం వంటితాత్కాలిక ప్రయోజనాలు కలగచేయాలని కోరుకోవడం కోసమే ఆయన దగ్గరకి వచ్చేవారు. "నాదగ్గరున్న సంపద భాండాగారము, ఆధ్యాత్మిక సంపదతో నిండిపోయి, పొంగిపొరలుతోంది. రండి, తవ్వి, బండ్లకొద్దీ ఆసంపదను తీసుకుపొండి. ఒక తల్లి, దీవించినకు మారుడు వస్తే, ఈసంపదతో, తనని పరిపూర్ణుడుగా చేసుకోగలుగుతాడు. ఇటువంటి అవకాశం మళ్ళీ ఏనాడూ, ఎవరికీ లభించదు."(పేజీలు160-164)అధ్యాయం32.

**పునర్జన్మలనుండి విముక్తులు కావడం**

మనం ఏపనీ, అది మంచి పని కానీ, చెడు పని కానీ చెయ్యకుండా జీవిస్తే, అందుకు పర్యవసానాలుగా, మనం బాధపడేందుకు, లేదా సుఖపడేందుకు ఏ అవకాశం వుండదన్న వాదనలు పునర్జన్మల మీద కొన్నిసార్లు, వినిపించేయి. అందువల్ల మనం పునర్జన్మలవలయంలో చిక్కుపడకుండా, విముక్తులం అవుతామని, ఆవాదనల సారాంశం రూపుదిద్దుకుంది. నిజమే, కానీ ఏపనీ చేయకుండా ఒక జీవితకాలం గడపటం సంభవమేనా? ఎవరైనా జీవించినంత కాలం, ఏదో పనిచేస్తూనే ఉండాలి. చివరకి, సిరిసంపదలు, భవబంధనాలను తెంచుకున్న సన్యాసి అయినా సరే, తన క్షుద్బాధ తీర్చుకోవటానికి బిచ్చమెత్తు కోవడం చెయ్యాలి. ఒకవేళ, అతను ఎక్కడకీ వెళ్ళకుండా, తన దగ్గరకు భక్తులు తెచ్చి, ఇచ్చిన ఏ ఆహారపదార్థాన్ని అయినా అతడు, నమలితినాలి. మింగాలి. అందువల్ల వచ్చే ఫలితాలు మంచివైనా, చెడువైనాసరే అనుభవించాలి. అంత మాత్రమే

కాదు. ఇతరులు తనకు ఇచ్చిన ఆహారమన్నది రుణస్వీకారమే అవుతుంది. దానిని ఈ జీవితంలో గానీ, తర్వాత పొందే జీవితంలో గానీ ఏదో ఒక రూపంలో, తిరిగి చెల్లించడమన్నది చేయాలి మరి.

కనుక, పునర్జన్మల చక్రం నుండి, వేరు పడాలంటే, ప్రతీ మనిషి, తనకి ఈ జీవితంలో విధి నిర్ణయించిన కార్యాలనన్నిటినీ, తాను చేయాలనుకున్న సత్కార్యాలనీ, చిత్తశుద్ధితో, నిజాయితీగా నిర్వర్తించాలి. అదే సమయంలో, ఆకార్యాల కర్తృత్వాన్ని తనదిగా, వాటి ఫలితాలు మంచివైనా, చెడువైనా అవితనవిగా, తాను స్వీకరించకూడదు.

శ్రీకృష్ణుడు, భగవద్గీత 2వ అధ్యాయంలో అదేవిషయాన్నిచెప్పేడు.


“పనినిచేయడం మాత్రమేనీ హక్కు. ఫలితాలునీ హక్కుకాదు. నీకర్మ ఫలితమే నీలక్ష్యం కానివ్వకు. అలాగే, ఆకార్యంతో నీకున్నకర్మ భారాన్నినిష్క్రియాత్మకంగా ఉండనివ్వకు.”

భక్తులకు, శ్రీసాయిబాబాగారు ఇచ్చిన సందేశం కూడా, అటువంటిదే. అన్నా సాహెబుదభోల్కరు గారు, బాబాగారి జీవిత చరిత్రను, తాను రాయడానికి, ఆయన షామా(మాధవరావు దేశ్‌పాండే)ద్వారా అనుమతిని కోరినప్పుడు, బాబాగారు, షామాతో ఇలా అన్నారు. ”అతను కేవలం ఒక బాహ్య ఉపకరణం మాత్రమే. నేనే, నాజీవిత చరిత్ర రాసి, నాభక్తుల కోరికలను తీర్చి, వాళ్ళను ఆనంద పరవశులను చేయాలి. కానీ అతడు, దానిని రాయడం అనేకార్యాన్ని చేపట్టడం వల్ల, తన అహంకారాన్ని వొదిలిపెట్టి, నాపాదాల ముందు మోకరిల్లుతాడు. అలాగ, అతడు సిద్ధ పడినప్పుడు, నేను అతడికి పూర్తిగా సహకరిస్తాను.” (పేజీలు75-79) అధ్యాయం2.

ఇందుకు, మరొక సంఘటన కూడా గ్రంథంలో రాసి ఉంది. ఒక సారి, ఆంధ్రప్రదేశ్' రాష్ట్రంలో గోదావరి నదివొడ్డున ఉన్న రాజమండ్రి పట్టణవాసి అయిన శ్రీవాసు దేవానంద సరస్వతి అనే పీఠాధిపతి, శ్రీసాయిబాబాగారి కిమ్మని, ఇచ్చిన కొబ్బరి కాయని, నాందేడుకి చెందిన పుండలీకరావు అనే భక్తుడు, షిర్డీ వస్తూతోవలో దానిని పగల గొట్టితినే సేడు. ఆతర్వాత అతడు, తన తప్పుని గుర్తించి చాలా కలవరానికి గురయ్యేడు. క్షమించరాని నేరంచేసేనని దిగులు పడ్డాడు. దానికి సాయిబాబా ఇలా అన్నారు. "నాకు ఇవ్వడం కోసం, ఆకొబ్బరికాయనీకు అప్పగించబడింది. నువ్వు దానిని పగలగొట్టి, తిన్నావు. అది నాకోరిక. నువ్వు చేసిన పనికి బాధ్యుడవు, నువ్వు ఎందుకవుతావు? మంచి పనులు చేసినా, చెడు పనులు చేసినా, ఆకర్మ ధారి నువ్వు అనుకోకు. ఎటువంటి అహంకారం, గర్వంలేకుండా పనులు చేయడం వల్లనే, నీఆధ్యాత్మిక పురోగమనం ముందుకు సాగుతుంది." (పేజీలు 125-183) అధ్యాయం 51.

హేమద్పంతు రాసిన' మరాఠీభాషలోని మూలగ్రంథం అయిన శ్రీసాయిసత్చరిత'లో ఆయన ఇలా పేర్కొన్నాడు." ఎవరైనా ఒకమంచి పనిని చేయాలనుకున్నపుడు, సద్గురుని పవిత్రపాదాలను, మనసులో తలచుకుని నిజాయితీతో, నిష్కపటంగా ఆపనిని మొదలుపెడితే, ఆకార్యనిర్వహణలో ఎదురయ్యే, అన్ని అవరోధాలను, ప్రతిబంధకాలను, సద్గురువే తొలగించి, ఆసత్కార్యం చక్కటి ఫలితాలనిచ్చేలా చేస్తాడు. ఆయన అలాచేస్తాడని విశ్వసించే భక్తులు, తాము చేయాలనుకున్న పనిని, పూర్తిచేసి, ఫలితాల విచక్షణను, సద్గురువు మీద విడిచిపెట్టాలి. అప్పుడు ఆపని ఖచ్చితంగా సత్ఫలితాలను ఇస్తుంది." (పేజీలు43,44) అధ్యాయం 48.

దీనినే కర్మయోగము, లేదాకర్మసిద్ధాంతం అని అంటారు. అంటే' ఒకపనిని పూర్తిచేయడానికి కావలసిన నైపుణ్యం' అని చెప్పాలి. భగవద్గీత రెండవ అధ్యాయంలో 'కర్మేషుకౌశలమ్' అని చెప్పబడింది. ఆనైపుణ్యం సంప్రాప్తించినపుడు, అది సాధించిన వ్యక్తి, తామరాకు లాగా ఉండిపోతాడు. అతడు చేసిన పనిఫలితాలు తామరాకుని అంటని నీటిబిందువుల్లా అతనిని ప్రభావితం చేయవు.


సాయి సచ్చరిత్ర
సదాశివవటికర్ ఆకలితో బాధపడుతూ
బాబాకు చెప్పుకుండుటా, గ్రహించి బాబా
అతని వడిలోకి పేడాలు విసురుట

## అధ్యాయం 7

# మనిషి జన్మ

భారతీయశాస్త్ర గ్రంథాల ప్రకారం, ఈప్రపంచంలో 84లక్షల రకాలైన జన్మలున్నాయి. అవి 20లక్షల మొక్కలు, చెట్లు, 9లక్షల జలచరాలు, 11 లక్షల కీటకాలు, పురుగులు 10లక్షల పక్షులు, 30లక్షల జంతువులు, 4లక్షల మానవరూపాలుగా ఉంటాయి. ఆత్మలు, తమ గతజన్మలో చేసిన పుణ్య, పాపకర్మల కారణంగా, పైనచెప్పిన వివిధరూపాల్లో తమజన్మలు, పునర్జన్మలను పొందుతూ ఉంటాయి. తాముగత జన్మలో చేసిన, పాప, పుణ్యాలు సమతుల్యమైన ఆత్మలు, మనుష్యులుగా జన్మించి, తాముపునర్జన్మల వలయం నుండి, విముక్తులు కావడానికి, ఒక అవకాశాన్ని సంపాదించుకుంటాయి.

సకల జీవరాశికి, నాలుగు విషయాలలో సారూప్యత ఉంటుంది. అవి ఆహార, నిద్రా, భయ, మైధునాలు. ఒక్కమనిషిలో మాత్రమే జ్ఞానంకలిగి ఉండటం అన్నప్రత్యేక లక్షణం ఒకటి ఉంటుంది. దానిసహాయంతో, అతడు లేదా ఆమె, ఆత్మసాక్షాత్కారాన్ని పొంది, పునర్జన్మల వలయం నుండి విముక్తి పొందగలుగుతారు. అది మిగిలిన జీవరాశికి సాధ్యం కాదు.

శ్రీసాయిబాబా గారు, అందుకే తన భక్తులను, ఇంద్రియలాలసతను విడిచిపెట్టమని, తమకు చాలా అరుదుగా లభించిన ఈ మానవజన్మ అవకాశాన్ని, వినియోగించుకోమని, వృధాచేసుకోవద్దని చెప్పేవారు. అలాచేయనివారు, కొమ్ములులేని జంతువుకన్నా ఎక్కువ ఏమీ కానివారుగానే మిగిలిపోతారని ఆయన హెచ్చరించేరు. (పేజీలు76,78) అధ్యాయం8.

సాయిబాబాగారు, ఆధ్యాత్మిక విషయాలను తెలుసుకోవాలని, నిజమైన ఆసక్తి చూపే తన భక్తులను అమితంగా ఇష్టపడేవారు. వారికష్టనష్టాలన్నిటినీ తొలగించి, వారిని ఆనందభరితులుగా చేసేవారు. బాలక్రిష్ణదేవు, జ్ఞానేశ్వరిగ్రంధాన్ని చదివేటందుకు, అతడికి ఎదురైన ఇబ్బందులన్నిటినీ, శ్రీసాయిబాబా గారు తొలగించడమే కాకుండా, అతడి కలలలో కనిపించి, అతడిని ఎలా ముందుకుపోవాలో నిర్దేశించారని, మనం 41వధ్యాయంలో చదువుతాము.

సాయిబాబాగారు, తనభక్తుల మీద ఫిర్యాదు చేస్తున్నట్టుగా చెప్పేవారు." ఎందరో నా దగ్గరకి వస్తారు. నన్నుధనం కోసం, ఆరోగ్యం కోసం, అధికారం కోసం, పదవి కోసం, ప్రతిష్ట కోసం, నయంకాని వ్యాధులు తగ్గించడం కోసం, మరెన్నోతాత్కాలిక సదుపాయాల కోసం వేడుకుంటూ ఉంటారు. చాలా అరుదుగా ఒకవ్యక్తి, వచ్చి ఆత్మసాక్షాత్కారం లేదా బ్రహ్మజ్ఞానాన్ని బోధించమని కోరుతాడు. (పేజీలు40,42) అధ్యాయం 16.

అలా అరుదుగా వచ్చేవ్యక్తులను, సాయిబాబా షిర్డీ పదేపదే వచ్చేలా చేస్తారు. అనేకరీతులలో వారికి బోధనలు జరిపి, వాళ్ళు సరైన ఆధ్యాత్మిక జీవనం గడిపేలా చేస్తారు కూడా. ఆయన అటువంటి భక్తుల కోసం ఎప్పుడూ ఒక మాట చెప్పేవారు." నామనిషి ఎక్కడైనా ఉండనివ్వండి. నాకు వెయ్యిక్రోసుల దూరంలో

ఆవ్యక్తి ఉన్నాసరే, కాళ్ళకు తాడు కట్టి తీసుకువచ్చిన పిచ్చుకలాగా, ఆ మనిషి షిర్డీకి రావడం జరుగుతుంది. (పేజీ15) అధ్యాయం 28

అందుకు మూడు ఉదాహరణలు అదే అధ్యాయంలో మనకి కనిపిస్తాయి.

1. అహమ్మదు నగరం కలెక్టరు గారి దగ్గర, ఆంతరంగిక కార్యదర్శిగా పనిచేస్తున్న నానాసాహెబు చందోర్కరు గారిని, తన గ్రామకరణంగా పనిచేస్తున్నఅప్పాకులకర్ణి గారితో, ఒకసారికాదు, మూడుసార్లు సందేశాలు పంపి, పిలిచి మరీసాయిబాబాగారు, ఆయనని షిర్డీకి రప్పించుకున్నారు. ఆతర్వాత, చందోర్కరు గారు, బాబాగారికి ఎంత ఆత్మీయభక్తుడిగా మారిపోయేరో, ఆధ్యాత్మిక, లౌకిక విషయాల్లో ఎంత అప్రమత్తులుగా మెలిగేవారో, మనం ముందు అధ్యాయాలలో తెలుసుకున్నాం.

2. శ్రీ సాయిబాబాగారు, పంజాబుకు చెందిన లాలాలక్ష్మీచందు (అధ్యాయం28) మరియు రామలాల్' (అధ్యాయం30) గార్లకి, వచ్చిన కలలలో, తానుదర్శనమిచ్చి వారిని షిర్డీవచ్చేలా చేసేరు.

3. బర్హానపురానికి చెందిన ఒక స్త్రీకలలో, బాబాగారు కనిపించి, తనకు తినేందుకు కిచిడీ తెమ్మని కోరడంతో, ఆమె తనభర్తతో కలిసి షిర్డీవచ్చి, ఆయన కోరికను నెరవేర్చారు. -అధ్యాయం28.

కొందరు భక్తులు, శ్రీసాయిబాబాగారి మీద ప్రేమతో, తాము అంతకుముందు కొలిచే ఇలవేల్పులను, లేదా సద్గురువులను ఆరాధించడం మాని, బాబాగారిని పూజించడం మాత్రమే చేసేవారు. అలాటివారిని, బాబాగారు షిర్డీవచ్చేలా చేసి, వారు విడిచిపెట్టిన కులదేవతారాధనను మళ్ళీ మొదలుపెట్టేలాగ చేసేరు. అందుకు గ్రంథంలో పేర్కొన్న కొన్ని ఉదాహరణలు

1. శ్రీసాయిబాబా గారి భక్తుడు, భగవంతరావు. ఆయన తండ్రి, పండరీపురంలో వెలసి ఉన్నదేవుడు, విఠోబా (శ్రీక్రిష్ణుడు) కి పరమభక్తుడు. ఆయన ప్రతీ సంవత్సరం, తప్పనిసరిగా పండరీపురం వెళ్ళి, విఠోబాని దర్శించుకునేవాడు. ప్రతీ నిత్యం తన ఇంట్లో విఠోబాపూజలు చేసేవాడు. ఆయన చనిపోయేక, ఆ ఇంటివాళ్ళు, పండరీపురం వెళ్ళడం మానేసారు. అంతేకాదు. ఇంట్లో విఠోబాపూజలనూ ఆపుచేసేరు. భగవంతరావు షిర్డీవచ్చినపుడు, శ్రీసాయిబాబాగారు, అతనివైపు వేలు చూపించి ఇలాఅన్నారు." ఇతడితండ్రి, నాస్నేహితుడు. ఇతడిని, నేను ఎందుకు షిర్డీ రప్పించానంటే, ఇతడు నాకు, నైవేద్యం పెట్టడం మానేసి, నన్నుఆకలితో ఉంచుతున్నాడు. ఇకమీదట, ఇతడు మానివేసిన పూజలు మళ్ళీ మొదలుపెట్టేలా, నేనుచేస్తున్నాను." –అధ్యాయం4.

2. శాంతాక్రజ్'కి చెందిన రావు బహదూరు ప్రధాన్ అనే అతను, అతడి కులగురువు హరిబువా దగ్గర 'గురుమంత్రాన్ని' స్వీకరించేడు. అయితే, ఆమంత్రజపాన్ని అతడు నిర్లక్ష్యం చేసేడు. ఒకసారి సాయిబాబాగారు, తాను నివశిస్తున్న మశీదు ముందున్న ఖాళీప్రదేశంలో, పేదలకి పెట్టేందుకు, భాండీ(వంటగిన్నె)లో అన్నంవండుతున్నారు. ఆయన దగ్గరకు వచ్చేందుకు ఎవరినీ ఆయన అనుమతించలేదు. అయితే, ప్రధాన్, చందోర్కరు గార్లకుమారులు ఇద్దరిని మాత్రం ఆయన, వద్దని చెప్పలేదు. ఆసమయంలో

ఆయన చాలా సంతోషంగా కనిపిస్తున్నారు. గట్టిగా ఏదో పాడుతున్నారు కూడా. ప్రధాన్' తాను కూడా పాటని, తెలుసుకోవాలని చాలా జాగ్రత్తగా విన్నాడు." శ్రీరామ జయ రామ జయ జయరామ'. అదివినగానే, ప్రధాన్'కి తమగురువు నుంచి, తానుగ్రహించిన' గురుమంత్రం' ఒక్కసారిగా గుర్తుకువచ్చింది. ప్రధాన్'ఉద్వేగంతో, తన తప్పుని తెలుసుకుని,

కన్నీటితో, శ్రీసాయిబాబా గారి పాదాలను ఆశ్రయించేడు. అప్పటి నుంచీ, ప్రధాన్' తాను గ్రహించిన మంత్రోఛ్చారణను ఏనాడూ విడిచిపెట్టలేదు.

సాయిబాబా గారి మరొకభక్తుడు హరిశ్చంద్రపితలే గారి అబ్బాయికి, మూర్ఛవ్యాధి ఉంది. దానిని పోగొట్టడానికి ఆయన, ఎన్నోఅల్లోపతి, ఆయుర్వేద ఔషధాలను వినియోగించేడు. కానీ ఫలితం దక్కలేదు. ఒకసారి ఆయన దాసగణు గారి, సాయిబాబా కీర్తనలను విన్నాడు. వెంటనే, తన కుమారుడిని, షిర్డీ తీసుకువెళ్ళి, సాయిబాబా గారి ముందు ఉంచేడు. చాలా ఆశ్చర్యకరంగా, బాబాగారి చల్లని చూపుల వల్లా, ఆయన ఆకుర్రాడికి రాసిన ఉదీ వల్లా, ఆవ్యాధి పూర్తిగా తొలగిపోయింది. పితలేగారు షిర్డీనుంచి బయల్దేరుతుంటే, సాయిబాబాగారు, అతడికి మూడురూపాయలనిచ్చి, అతనికి, అంతకుముందు అక్కల కోటస్వామి గారు ఇచ్చిన రెండురూపాయల గురించి, గుర్తుచేసి, అతడు విడిచిపెట్టిన అక్కల కోటస్వామి, ఆరాధనను మళ్ళీ మొదలుపెట్టమని చెప్పేరు. –అధ్యాయం26.

కొందరు భక్తుల విషయంలో మాత్రం, వారిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడానికి కఠినంగా వ్యవహరించేరు. ఆధ్యాత్మిక మార్గంనుండి, వెనుకకు మళ్ళిన వారిని, తిరిగి ఆమార్గంలోకి తీసుకురావడానికి, ఆయన అద్భుతాలను చేసేరు కూడా.

1. శ్రీసాయిబాబాగారికి, సన్నిహితుడు, ఆయనకి, అత్యంతఆప్తుడైన భక్తుడు, షామాలేదా మాధవరావు దేశ్'పాండే ఆధ్యాత్మికమార్గంలో ఉన్నతుడుగా ఉండాలని, బాబాగారు కోరుకోవడంలో ఆశ్చర్యం వుండనక్కర్లేదు. షామా,' విష్ణుసహస్రనామ స్త్రోత్రాన్ని" నేర్చుకోవాలని, దానిని నిత్యం స్మరిస్తూ ఉండాలని కోరుకున్న సాయిబాబా గారు, ఒకపని చేసేరు. ఆయన తనదగ్గరే ఉన్నమరొకభక్తుడు రామదాసిని పిలిచి, తనకి కడుపులో చాలాబాధగా

ఉందని అబద్ధం చెప్పి, అదితగ్గటానికి, అతడిని బజారుకి వెళ్ళి, తనకోసం' సునాముఖి' (విరేచనకారి) ఆకుని తీసుకురమ్మని పంపేరు. అతడు వెళ్ళగానే అతడి విష్ణుసహస్రనామ స్తోత్రమాలని దొంగిలించి. షామాకి ఇచ్చి, అతడు బాబాగారు చేసినపనికి అభ్యంతరం చెప్పినా, వినకుండా దానిలోని విష్ణుసహస్రనామాన్ని చదివినేర్చుకోమని, అతడిని బలవంతం చేసేరు. షామా, బాబాగారు చేసిన ఆపనివల్ల, రామదాసి తనకి వ్యతిరేకిగా మారతాడని భావించేడు తప్ప, ఆమాలని తన మెడలో వేయడం ద్వారా తనను బాబాగారు, తనను ఈలౌకిక బాధల నుండి విముక్తి చేసేందుకే, ఆపనిచేసేరని గ్రహించలేకపోయేడు. భగవన్నామస్మరణ పరమార్ధం అందరికీ తెలిసినదే. అది, మనలను పాపాల నుండి, చెడునడత నుండి దూరంగా వుంచుతుంది. జనన, మరణాల వలయం నుండి విముక్తులను చేస్తుంది. దానికన్నా సులభమైన మోక్షసాధనం మరేదీలేదు. (అధ్యాయం 27లోనిది)

2. పురుషోత్తమ్' సఖారామ్' భాటే, లేదా బాలాసాహెబు అనేపేరు కలిగిన సాయిబాబా గారి భక్తుడు, తాను కాలేజీలో చదువుకుంటూ ఉన్నప్పుడు స్వంత ఆలోచనాపరుడు, యదేచ్ఛగా ధూమపానం చేసే యువకుడు, చార్వాకసిద్ధాంతపరుడుగా వుండేవాడు. క్లుప్తంగా చెప్పాలంటే, అప్పట్లో, అతడి జీవనవిధానం" ఈరోజుతినాలి. తాగాలి. సంతోషంగా గడపాలి. ఎందుకంటే, రేపు మనం మరణిస్తాం కదా!" అన్నట్టుగా వుండేది. ఆతర్వాత అతడు మామ్లత్దార్' (తాశీల్దారు) ఉద్యోగంలో చేరి, చాలా సమర్ధుడైన అధికారిగా పేరు సంపాదించి, అక్కడి జిల్లాకలెక్టరు గారి అబిమానాన్ని పొందేడు. అతడు కోపర్గావ్' పట్టణంలో తాశీల్దారుగా అయిదు సంవత్సరాలు (1904–1909) పనిచేసేడు. ఆకాలంలో, శ్రీసాయిబాబా గారిని దర్శించడానికి, షిర్డీకి వెళుతున్న తన స్నేహితులను అపహాస్యం చేసేవాడు. భాటే, సాయిబాబాని' పిచ్చివాడు' గా గేలిచేసేవాడు. అతని స్నేహితులు,

అతనితో," నువ్వు ఒకసారి సాయిబాబా గారిని సందర్శించి అప్పుడు మాట్లాడు." అని చెప్పేవారు. 1909 సంవత్సరంలో, భాటే, షిర్డీలో ఉద్యోగరీత్యా మకాంవేసి, ప్రతీరోజూ శ్రీసాయిబాబా గారి దర్శనానికి వెళ్ళేవాడు. ఐదవరోజునాడు, బాబాగారు అతడికి మతగురువులు ధరించే ఎర్రటి వస్త్రాన్నికప్పేరు. ఆరోజు నుంచి భాటే మారిపోయేడు. అతడు సంపాదననీ, ఉద్యోగాన్నీ లక్ష్యపెట్టడం మానేసేడు. తాను నిత్యం షిర్డీలో బాబాగారి సన్నిధిలోనే ఉండి, అక్కడే ప్రాణాలు విడవాలని అనుకున్నాడు. బాబాగారు, అతడి స్నేహితుడు దీక్షితుతో, భాటేకి, ఉద్యోగం నుండి, ఒక సంవత్సరం పాటు శెలవు కావాలని, కలెక్టరు గారికి అతడి పేరుతో, ఒకదరఖాస్తుని రాసి, దానిమీద భాటే, సంతకాన్ని తీసుకోమని చెప్పేరు. కలెక్టరు గారు, అతడికి, ఒక సంవత్సరం తర్వాత, భాటేని మళ్ళీ సమర్ధుడైన తాశీల్దారుగా చూడవచ్చని భావించి, ఆశెలవు మంజూరు చేసేరు. కానీ, ఆసంవత్సర కాలం గడిచిపోయినా భాటే, ఏమీ మారలేదు. తనగురువుపట్ల పిచ్చిపట్టిన వాడిలా వుండిపోయేడు. అతడికి' మతవిచారంతో' ఇబ్బందులు పడుతున్న వ్యక్తిగా నెలకి 30 రూపాయలు, కారుణ్య ఫించనును, కలెక్టరు గారు మంజూరు చేసేరు. భాటే, ఆతర్వాత తనకుటుంబంతో పాటు షిర్డీలోనే నివాసముండిపోయేడు. అతడు ప్రతీరోజూ సాయిబాబాగారి ముందుకు, నిత్యకర్మలు పూజాకార్యక్రమాలకీ, ఉపనిషత్తుల పఠనానికి హాజరవుతూనే వుండేవాడు. ఉపనిషత్తుపఠనం మీద, అప్పుడప్పుడూ అతడు వ్యాఖ్యానాలు కూడాచేస్తూ ఉండేవాడు. శ్రీసాయిబాబాగారి మహాసమాధి అనంతరం, ఆయన అంత్యక్రియలు నిర్వహించే, గొప్పగౌరవం భాటే గారికే లభించింది. అందుకే, హేమద్పంతు తాను మరాఠీభాషలో రచించిన' సాయిసత్చరిత' గ్రంధంలో భాటే గారిని" భక్తరత్నం' గా రాసేడంటే, ఆశ్చర్యం ఏమీ కలగదు.

3. దాసగణులేదా' గణేశ దత్తాత్రేయ సహస్రబుద్ధి' అనే పేరుగల సాయిబాబా గారిభక్తుడు, పోలీసుశాఖలో ఉద్యోగం చేసన్తా ఉండేవాడు. అతడు మహారాష్ట్రలోని గ్రామాలలో ప్రజల వినోదం కోసం రాత్రిపూట జరిగే' తమాషాలు' (నాటకాల వంటివి) లో, నటించే స్త్రీలు పాడేందుకు, అభినయించడానికి,' లావణి' గీతాలు (రసికత ఉండే గీతాలు) రచించేవాడు. అతడు 1894లో మొదటిసారిగా, తన ఉద్యోగ విధుల్లోభాగంగా అహమ్మదు నగరం కలెక్టరు గారి, ఆంతరంగిక కార్యదర్శి, నానాసాహెబు చందోర్కరు గారితో కలిసి, షిర్డీ వచ్చేడు. అతడికి అప్పట్లో బాబాగారి మీద భక్తిలేదు. అటువంటి అతడిని సాయిబాబా గారు క్రమంగా, తన భక్తుడిగా మలచుకున్నారు. తర్వాత తన మీద అమితమైన భక్తితో ఉన్న దాసగణుని, అతని పోలీసు ఉద్యోగాన్ని విడిచిపెట్టేలా, ఇతరవ్యసనాలనూ, లౌకిక సంబంధ బాంధవ్యాలనూ తోసిపుచ్చేలా చేసి, అతడిని, తన తరువాత జీవితంలో, వేలాదిమందిని, తనశిష్యులుగా మార్చుకోగలిగిన పరమసాధువుగా, సాయిబాబాగారు, తీర్చిదిద్దేరు.

శ్రీసాయిబాబా గారి జీవితం కలిగించిన ప్రేరణతో, దాసగణు, ఆధునిక సాధుజీవిత చరిత్రలను, మూడు సంపుటాలుగా రాసేరు. అవి మాత్రమే కాకుండా ఆయన ఎన్నోపుస్తకాలను (సాధుసందేశాలుగా), ఆధ్యాత్మిక విషయాల మీద రాసేరు. ఆయన, సాధుకవిగా పేరుపొందేరు. ప్రసిద్ధి చెందిన కీర్తనకారుడయ్యేరు. సాయిభక్తితత్వం, మహారాష్ట్ర పశ్చిమతీరంలో, బొంబాయిలో వ్యాప్తిచెందేలా ఆయన చేసేరు. ఆయన తన 95 సంవత్సరాల వయస్సులో, 1962 సంవత్సరంలో పవిత్రమైన రోజున పరమపదించేరు.

4. కాశీనాధ గోవింద ఉపాసని లేదా ఉపాసని మహారాజ్' అనే అతను, షిర్డీరాక ముందు, సకోరీపట్టణంలో ఉండేవాడు. అతడు యోగాలో,

ఆధ్యాత్మిక ధ్యానసాధనలో మంచి సమర్ధత కలిగిన పేరు పొందిన వ్యక్తి. అయితే, అతను, చేసిన కొన్ని తప్పుల వల్ల, అనారోగ్యానికి లోనై, తనసాధనలో, పురోగమనం సాధించలేకపోయేడు. అప్పుడు అతను, షిర్డీవచ్చి, సాయిబాబా గారిని దర్శించగానే, బాబాగారు, అతడిని వుండిపోమనీ. షిర్డీవదిలి వెళ్ళవద్దని గట్టిగాచెప్పేరు. ఆతర్వాత, తన అద్భుతమైన శక్తులను ఉపయోగించి, అతడు ఖండోబాదేవాలయంలో 4సంవత్సరాల పాటు వుండిపోయేలా చేసేరు. అక్కడ అతడు, అనేకానుభవాలను పొంది, ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థాయిని అందుకునేలా చేసేరు. సాయిబాబాగారి మహాసమాధి అనంతరం, అతడు, అందరికీ చాలా ఆరాధ్యనీయుడు, పూజించబడే వ్యక్తీఅయ్యేడు. జాతీయసంక్షేమం కోసం, ప్రార్ధనలు చెయ్యమని కోరడానికి, మహాత్మాగాంధీ, అతడి దగ్గరకి వెళ్ళేరు. బొంబాయిలో అతడు, ఉన్నసమయంలో 'ఉపాసని' దర్శనం కోసం భక్తులు నిలబడిన వరసలు, పూర్తికావడానికి ఒకరాత్రి, ఒకపగలు సమయం పట్టేది. సకోరీలో అతడు స్థాపించిన' కన్యాకుమారి ఆశ్రమం' చాలాపేరు పొందింది.

సాయిబాబాగారు, ఉన్నత ఆధ్యాత్మిక లక్ష్యసాధన ఆశయంతో ముందుకుసాగుతున్న తన భక్తులను, తన మహాసమాధి అనంతరం కూడా సహకరిస్తూనే ఉన్నారు. 1976లో తనువు చాలించిన గుజరాతు రాష్ట్రానికి చెందిన ప్రఖ్యాతి చెందిన సాధువు' మోటా' ఇందుకు ఒకవిలక్షణ ఉదాహరణగా నిలుస్తారు. శ్రీ మోటాగారు మొదట మధ్యప్రదేశ్ 'రాష్ట్రానికి చెందిన' ధునివాలా దాదా సంఖేడా' గురువు దగ్గర ఆధ్యాత్మిక మార్గనిర్దేశాన్ని పొందేరు. తర్వాత 1938లో (బాబాగారు మహాసమాధి పొందిన 20 ఏళ్ళ తర్వాత,) మోటా సాధువు గారు కరాచీ (ప్రస్తుతం పాకిస్థాను దేశంలో ఉన్నపట్టణం) లో ఉన్నప్పుడు, ఆయన ముందు, సాయిబాబాగారు, చాలాసార్లు ప్రత్యక్షమై, కొన్నియోగాభ్యాస ప్రక్రియలను, ప్రయోగాత్మకంగా బోధించేరు.

అతీంద్రియ అంశాలను దర్శింపచేసి, ఆ సాధుగురువును చాలా శీఘ్రంగా ఆధ్యాత్మిక పురోగతి సాధించేలా చేసేరు. ఆఖరిసారిగా, శ్రీసాయిబాబాగారు, మోటాసాధువు గారికి, కాశీలో మార్చి 29తేదీ, 1939సంవత్సరంలో (శ్రీరామనవమినాడు) కనిపించి, ఆత్మ, పరమాత్మ వేరు, వేరు కాదనీ, ద్వంద్వత్వం ఉండదనీ తెలియచేసి, అతనికి అంతిమంగా ఆత్మ సాక్షాత్కారం కలిగించేరు. అందుకు సాయిబాబా గారికి గౌరవాభివందనగా," నాఆధ్యాత్మిక ప్రవాసానికి, బాబా గారు తుదిమెరుగులు దిద్దేరు" అని చెపుతూ, గుజరాతీ భాషలో, 17చరణాలు కలిగిన ఒక కీర్తనను, ఆయనపై రచించేరు.

అలా, తాను జీవించి ఉన్నకాలంలో, తర్వాత కూడా,శ్రీసాయి బాబాగారు, అన్నివేళలా తనభక్తులకు, తమకు అవకాశంగా లభించిన, వెలకట్టలేని మనిషి జన్మను, ఆత్మసాక్షాత్కారం పొందడానికి సద్వినియోగం చేసుకోమని, సలహాలు ఇవ్వడానికి, ప్రయత్నిస్తూనే ఉన్నారు. అదేవిధంగా తన భక్తులని, కఠోర తపస్సులు చేయవద్దని, తమశక్తికి మించి కఠిన ఉపవాసాలు చేయవద్దనీ, శరీరాలను అధికంగా శ్రమపెట్టవద్దని, హెచ్చరిస్తూనే ఉంటారు." శరీరాలను, అలక్ష్యం చేయకండి. అలాగే అమితంగా ప్రేమించకండి. కానీ చాలా జాగ్రత్తలు తీసుకోండి. ఆ జాగ్రత్తలు ఎలా ఉండాలంటే, గుర్రం మీద తన ప్రయాణాన్ని సాగిస్తున్న ఆశ్వికుడు, ఎలాగైతే తాను గమ్యస్థానాన్ని చేరుకుని, తిరిగి, తన ఇంటికి చేరుకునే వరకూ, తన గుర్రాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడో అలాగే ఉండాలి."(పేజీలు 24,33,34,78)

## సాయి సచ్చరిత్ర

దామోదర్ యస్ రసనె
వివాహము తర్వాత
యిద్దరు భార్యలకు
సంతానము లేకపోవుట
నాలుగు పండ్లు
యిచ్చి దౌలర్ షా,
దాణాషాగా కుమార్లకు
పేర్లు పెట్టుకొనుట



## అధ్యాయం 8

# ఇంద్రియ లాలసలు

శ్రీసాయిబాబాగారి విషయానికి వస్తే, ఆయన, తన ఇంద్రియాల, ఆనందం కోసం వెంపర్లాడటం అన్నది లేనేలేదు. "సాయిబాబాగారు, అప్పుడప్పుడు తన నాలుకతో, ఆహారపదార్థాలను రుచిచూస్తున్నట్టుగా, కనిపించినా, ఆయన, ఆరుచిని ఆస్వాదిస్తున్నట్టుగా గానీ, ఆపదార్థం ఏమిటన్నది ఆయనకి తెలిసినట్టు గానీ మనకి అని పించదు. ఇంద్రియాల ఆనందాల కోసం తాపత్రయాలు లేనివాళ్ళు, వాటిని, ఏనాడన్నా అసలుగుర్తిస్తారా? అన్నది పెద్దప్రశ్న. పంచేంద్రియాలు చేసే, వినడం, తాకడం, చూడటం, రుచి, వాసనలను గుర్తించడం వంటిపనులకు, కారణమైన వస్తువులుకొన్ని, ఆ అవయవాలదరి దాపులకి చేరుకోవుకూడా. అటువంటివాటి మోహంలో ఎవరైనా ఎలాచిక్కుకు పోతారు?

"సాయిబాబాగారు బ్రహ్మచారి. రామాయణంలోని ఆంజనేయస్వామి వారిలాగానే, ఆయన కూడా లైంగిక ఆనందాలకి, చాలా దూరంగా ఉన్న సిద్ధుడు. ఆయన పురుషాంగం, మేక మెడచన్ను లాంటిదే. ఆయనకి అదికేవలం మూత్రవిసర్జనకు, ఉపయోగపడే అవయవం మాత్రమే." (పేజీలు96,105) సాయిసత్చరిత అధ్యాయం–10.

శ్రీసాయిసత్చరిత గ్రంథంలో, చాలా చోట్ల, ఇంద్రియ ఆనందాల వల్ల సంభవించే ప్రమాదాల గురించి రాసేరు. అధ్యాయం 47లో, హేమద్పంతు ఇలా చెపుతారు. ''ఇంద్రియ సుఖాలలాలస చాలా ప్రమాదకరమైనది. వాటికోసం వెంపర్లాడే మనిషిని అవి, నాశనం చేస్తాయి. జింక,శబ్దం పట్ల ఉన్న కోరిక వల్ల మరణిస్తుంది. నాగుపాము తన తల మీద ధరించిన అందమైన మణిఆభరణం మీద ప్రేమవల్ల, శలభాలు, దీపంకాంతి మీద కాంక్షతో చనిపోతాయి. ఇంద్రియాల సహచర్య అలాంటిది. మానవులకు ఇంద్రియసుఖాలను పొందడం కోసం ధనం అవసరమవుతుంది. ఆధనం సంపాదనలో మనిషిని నిమగ్నమైపోతూ ఉండగా, ఇంద్రియ ఆనందాల కోసం అతను పడేతపన, మరింతగా పెరుగుతూ చివరకు ఆపుకోలేనిదిగా మారిపోతుంది.” (పేజీలు 121-123) అధ్యాయం47.

శ్రీకృష్ణ పరమాత్ముడు, భగవద్గీతలోని రెండో అధ్యాయంలో ఇదే విషయాన్ని రెండు శ్లోకాల్లో ఇలాచెపుతాడు.

“ఇంద్రియానందాల కోసం తాపత్రయపడే వ్యక్తి, వాటితో అనుబంధాన్ని పెంచుకుంటాడు. అందువల్ల కోరికలు పుడతాయి. అవి నెరవేరకపోతే, అతనికి ఆగ్రహం కలుగుతుంది.”

“ఆఆగ్రహం, పొగరు బోతుతనాన్నికలిగిస్తుంది. దాని వల్ల జ్ఞాపకశక్తి తారుమారవుతుంది. హేతువుకను మరుగవుతుంది. అలా వివేకం శూన్యమై పోయిన మనిషి పూర్తిగా నాశనమే అవుతాడు”.

శ్రీక్రిష్ణ పరమాత్మ, అదే అధ్యాయంలో, ఏవిధంగా ఇంద్రియాలను అదుపులో వుంచుకోవాలో, తాబేలుని ఉదాహరణగా చూపి, మనకి చెప్పేడు.

“తాబేలు, తన పాదాలను అన్ని మార్గాల నుండి లోపలకి తీసుకున్నప్పుడు, తన ఇంద్రియ సుఖాలకోసం అవసరమైన, వస్తువులు

అన్నిటినీ దూరం పెడుతుంది. తన మనస్సును మాత్రంస్థిరంగా నిలుపుకుంటుంది.”

పైన చెప్పిన ఉదాహరణ, ఎవరైతే, ఆత్మ సాక్షాత్కారం కోసం, నిరంతరం పరితపిస్తూ, ఇంద్రియ ఆనందాల నుండి దూరంగా ఉండడానికి కఠోరపరిశ్రమ కొనసాగిస్తూ, తమ అంతిమలక్ష్యమైన ఆత్మసాక్షాత్కారాన్ని పొందగలుగుతారో, వారికి సరితూగుతుంది. బలహీన మనస్కులుగా ఉండి ఎల్లప్పుడూ ఇంద్రియ సౌఖ్యాలను, విడవలేకుండా సామాన్య కుటుంబ జీవితాలని కొనసాగిస్తున్న మానవుల సంగతేమిటి? వాళ్ళు ఎలా ఇంద్రియ ఆనందాలవల్ల, తమ ఆధ్యాత్మిక పురోగతికి ఎదురయ్యే ఆటంకాలను తప్పించుకోగలుగుతారు? వాళ్ళు తమ కుటుంబ జీవితాలను విడిచిపెట్టి బయటకి రావాలా?

శ్రీసాయిబాబాగారు, తన భక్తులని అలా చెయ్యమని ఏనాడూ చెప్పలేదు. అందుకు వ్యతిరేకంగానే చెప్పేవారు. ఒకసారి, నానాసాహెబు చందోర్కరుగారు, తన కుటుంబ జీవితంతో విసుగుచెంది, దానిని విడిచిపెట్టడానికి బాబాగారిని అనుమతినివ్వమని ప్రార్థించేడు. అతనికి ఆయన ఇలా చెప్పేరు. ”నీఆరోపణలో అర్ధముంది. కానీ శరీరం ఉన్నంత వరకూ ప్రాపంచిక బాధ్యతలను తప్పించుకోలేము. చివరకి యోగి అయినా సరే, తన కౌపీనం కోసం, ఆహారం కోసం, చింతనతోనే, జీవితాన్ని గడపాలి. నాసంగతికి వస్తే, నేను, సంరక్షకుడినై, బద్ధుడనై ఉండాల్సి వస్తోంది. (దాసగణు రాసిన భక్తలీలామృతం గ్రంధంలోని అధ్యాయం 32లోని పేజీలు 91, 92). బాబాగారు, ఆధ్యాత్మిక వేత్తలు, తమ కుటుంబ జీవనాన్ని ఎలా సాగించాలో, చందోర్కరు గారికి వివరించేరు కూడా. శ్రీసాయిసత్చరితలో, ఇంద్రియ ఆనందాల ఉచ్చులో చిక్కుకోకుండా, అనైతిక మార్గాలను

అనుసరించకుండా ఎవరైనాసరే, యోగసంక్షేమాన్ని సాధించడానికి, సాయిబాబా గారు చెప్పిన అనేక సులభమైన పద్ధతుల గురించి రాసేరు.

1. ఒకసారి నానాసాహెబు, షిర్డీలోని ద్వారకామాయిలో సాయిబాబాగారి సన్నిధిలో కూర్చున్నప్పుడు, ఒక ధనికుడైన ముస్లిం వ్యక్తి, బాబాగారి దర్శనానికి, తన కుటుంబంతో కలిసివచ్చేడు. బాబాగారి పాదనమస్కారం చేస్తున్నప్పుడు, వారిలో ఒక స్త్రీ, తన మేలిముసుగును తొలగించింది. ఆమె, అందమైన మొహాన్ని చూసిన, నానాసాహెబు పరవశించిపోయి, ఆమె మొహాన్ని మళ్ళీ, మళ్ళీ చూడాలని తహతహలాడేడు. కానీ, బాబాగారి సముఖంలో, ఇతర భక్తుల ముందు అలా చూసేందుకు సంశయించేడు. నానా ఇబ్బందిని గమనించిన బాబాగారు, ఆస్త్రీ వెళ్ళి పోయిన తర్వాత ఇలా అన్నారు" నానా! నువ్వు ఎందుకు వ్యాకుల పడుతున్నావు. నీ ఇంద్రియాలను, అవిచేసే పనిని, చేయనియ్యి. వాటిపనిలో మనం జోక్యం చేసుకోకూడదు. భగవంతుడు ఈ సుందరమైన ప్రపంచాన్ని సృష్టించేడు. ఆ అందాన్ని పొగడడమే మన విధి. మనస్సుకి ప్రశాంతత అన్నది నెమ్మదిగా, క్రమక్రమంగా చేకూరుతుంది. ఇంటికి, ముందున్న ద్వారం తెరచి ఉన్నప్పుడు, వెనుక నుండి వెళ్ళడమెందుకు?

హృదయం పరిశుద్ధంగా ఉన్నప్పుడు, మనకి ఎందులోనూ కష్టం కలగదు. చెడు ఆలోచన అన్నది మనలోలేనప్పుడు మనం ఎవరి దగ్గరైనా, దేనికోసం భయపడాలి? నీకళ్ళు వాటి పని అవి చేస్తాయి. నువ్వెందుకు తడబడి పోవాలి? సిగ్గుపడాలి?." అధ్యాయం-49.

"మన మనస్సు చంచలమైనది. దానిని చెడు మార్గాలవైపు మళ్ళించకూడదు. మన ఇంద్రియాలు మనకి అశాంతి కలిగించినప్పుడు, మనం శరీరాన్ని నిరంతరం, పర్యవేక్షణలో పెట్టుకుని, దానిని అసహనానికి గురి కానివ్వకూడదు. ఇంద్రియాలు వస్తువుల వెంట పరుగెడతాయి. మనం

కూడా వాటికోసం ఆరాటపడుతూ, వాటి వెంట పరుగెత్తకూడదు. మనం చేసే సాధనను, మెల్ల మెల్లగా, క్రమ క్రమంగా పెంచుకుంటూపోయినప్పుడు, మాత్రమే మనం, మనలో కలిగే అశాంతిని జయించగలుగుతాము." అధ్యాయం-49.

2. హేమద్పంతు, తన కోటు, చేతి మడతలో కొన్ని పప్పు బద్దలను, తినేందుకు దాచుకున్న సంగతిని, గుర్తించి అతడిని ఆటపట్టించిన శ్రీసాయిబాబాగారు, అతడికి, మరికొందరు భక్తులకీ, పంచేంద్రియాలను అదుపులో పెట్టుకోవడానికి, ఉపయుక్తమైన సులభ మార్గాల గురించి, ఇలా చెప్పేరు." పంచేంద్రియాలను, వస్తువులకు దూరంగా, ఉంచడమన్నది ఎవరూ, ఎన్నడూ చేయలేని పని. కనుక, ఒక వ్యక్తి, ఒక వస్తువుతో తన ఇంద్రియానికి, మనసుకి, బుద్ధికి, ఆనందాన్ని కలిగించాలనుకున్నప్పుడు, ముందు బాబాగారి నిస్మరించుకోవాలి. అలాస్మరించడం వల్ల, దానిని బాబాగారికి, నైవేద్యంగా సమర్పించినట్టవుతుంది. అందువల్ల, దానితో, అతని అనుబంధం సహజంగానే తొలగిపోతుంది." (పేజీలు 46,57) అధ్యాయం-24.

పైసంఘటనలో బాబాగారు చెప్పిన మాటలకి, ఈ విధంగ తన మాటలని, హేమద్పంతు తన గ్రంధంలో జతపరిచేడు. "ఒక వస్తువుతో, ఇంద్రియానందాన్ని పొందాలనుకున్నప్పుడు మీరు సాయిబాబాగారి నిస్మరించి, ఆయన మీ ముందున్నారని భావిస్తే, మీలో, ఈవస్తువు నుండి ఆనందాన్ని పొందేందుకు, ఇది తగినదా? కాదా? అన్న సందేహం మొలకెత్తుతుంది. అప్పుడు, మీరు ఆవస్తువు తగినది కాదని గుర్తిస్తే, దానిని వదిలివేస్తారు. ఆరకంగా మీరు, మీలోనివ్యసనాలని, చెడు అలవాట్లని దూరంగా పెడతారు. మీలో మంచి స్వభావం మెరుగుపడుతుంది." (పేజీ128) అధ్యాయం24.

3. పైనచెప్పిన హేమద్పంతు విషయంలో జరిగిన సంఘటనకన్నా, భిన్నమైన దానిని, మనం అధ్యాయం 20లో చదువుతాం. కాకాసాహెబు

దీక్షితుగారి, పరిచారిక ద్వారా మనకి, సాయిబాబాగారు, ఇంద్రియ ఆనందాలను, అందంగా, చమత్కారంగా ఆస్వాదించడం ఎలా గోచెపుతారు. ఆపని మనిషి ఎప్పుడూ, నవ్వుతూ, సంతోషంగానే కనిపించేది. ఒకరోజు, చిరిగిపోయిన చీరకట్టుకున్నా, మర్నాడుప్రధాన్' గారు ఇచ్చిన కొత్త చీరధరించినా, ఆతర్వాత రోజు మళ్ళీ చిరిగిపోయి ఉన్న చీరను ధరించినా, ఆమె ఒకే లావుండేది. ఆమె ఈశావాస్యోపనిషత్తులోని, ఒక శ్లోకానికి, నడుస్తున్న ఉదాహరణగా కనిపించేది.

ఆ శ్లోకం "భగవంతుడు, ఈప్రపంచంలో, కదిలేవీ, కదలనివీ ఎన్నో వస్తువులను సర్వవ్యాప్తంగా చేసేడు. ఆయనని స్మరిస్తే, ఆయన ప్రసాదించినవన్నీ, ఐశ్వర్యంతో ఎవరూ మరుగుపరచనివన్నీ, మనకు అమితానందాన్నే కలుగచేస్తాయి."

ఈవిధంగా శ్రీసాయిబాబాగారు, మనం మన కుటుంబ జీవితాన్ని వదులుకోకుండా, మన ఇంద్రియాలను అదుపులో ఉంచుకునేందుకు ఎన్నో సులభమైన పద్ధతులను చెప్పేరు. అలాగే ఆత్మ సాక్షాత్కారం కోరుకునే వాళ్ళకు, కఠోరమైన శ్రమ, క్రమశిక్షణ చాలా అవసరమనీ, ఆయన మరీమరీ ఉద్ఘాటించేరు.

ఆయన చెప్పేరు. ''ఇంద్రియ సంబంధాలైన వస్తువులు ప్రమాదకరమైనవి. మన వివేకాన్ని, మన రథసారధిగా మలచుకుని, మన మనస్సుని అదుపులో పెట్టుకుని, మన ఇంద్రియాలను, పక్కదారి పట్టకుండా, నడిపించినప్పుడే, మన రథసారధి మనని, మన జీవితాల అంతిమలక్ష్యమైన విష్ణు పాదాల చెంతకు చేరుస్తుంది. మన శాశ్వతని వాసమైన అక్కడ నుంచి, మనమెవరం వెనుకకు తిరిగిరాము." (పేజీలు 80,97) అధ్యాయం 20.

## సాయి సచ్చరిత్ర

నాచ్నే తమున్ని శస్త్ర
చికిత్స సమయంలో
బాబాసాధు రూపంలో
వచ్చి భోజనము చేయుట
బెండకాయ కూర చేయమని
చెప్పెను. ఆ విషయం
తర్వాత నాచ్నె షిర్డి వెళ్ళగా
తెలుపుట.



## అధ్యాయం 9

# మాయ

మాయ అన్నపదానికి మూడు అర్థాలు ఉన్నాయి. మొదటిది ప్రపంచ ఉనికికి మూలాధారమైన పరమాత్మ లేదా బ్రహ్మ నిర్మాణాత్మక శక్తి. రెండవది మనకి కనిపించే విశ్వం నిజమైనదని, అది పరమాత్మ, వేరని మనకి కలిగే భ్రమ. మూడవది లౌకిక ప్రపంచం మీద, దానిలోని సర్వవిషయాల మీద మనకి కలిగే అపారమైన, అవ్యాజ్యమైన అనురాగం లేదా ప్రేమ.

### పరమాత్మ నిర్మాణశక్తి

భారతీయ పురాణాల్లో, ఇతిహాసాల్లో మాయకి స్త్రీమూర్తిత్వం కలిగించి, ఆమె, పరమాత్మ లేదా బ్రహ్మ అర్ధాంగిగా పేర్కొన్నారు. ఆమెలో మూడు ప్రధాన లక్షణాలు ఆకారందాల్చి కనిపిస్తాయి. అవి సత్వము (మంచితనం, పవిత్రత) రజస్సు (క్రియాశీలత, అభిరుచి) తమస్సు (భ్రమ, అజ్ఞానం). ఆమె సాధారణంగా కనిపించదు. బ్రహ్మని కూడి ఉంటుంది. ఆమె మరొక రూపమే, మనకి కనిపించే చరాచర ప్రకృతి. ఈమాయతో, మానవులకి ప్రత్యక్ష సంబంధం ఉండదు. ఆమె అసాధారణ, అమేయ శక్తికి, పరమాత్మతో ఆమె మమేకంకావడానికీ మనం, ఆమెకి బద్ధులమై, విధేయులమై, భక్తితో ఆమెని ఆరాధిస్తాము. ఆమెకి మన భారతీయ పంచాంగ కాలమానం

ప్రకారం, చైత్ర, ఆశ్వయుజ మాసాలలో, నవ రాత్రపర్వదినాలలో మన దేశమంతటా ఘనంగా పూజలు నిర్వహిస్తాము.

## భ్రమయొక్క అపారమైనశక్తి.

భ్రమకి ఉన్న శక్తి అపారమైనది. శ్రీసాయిసత్చరితలో, సాయిబాబా గారు భ్రమ గురించి చెప్పిన మాట ఇలా రాసి ఉంది. "నేను, అన్ని చింతనలనూ విడిచిపెట్టి, సన్యాసాశ్రమం స్వీకరించి, ఇక్కడ ఒంటరిగా కూర్చున్నప్పటికీ, నన్ను మాయ పదేపదే, ఇబ్బందులు కలిగిస్తూనే ఉంటుంది. ఆమె విష్ణు భగవానుడిది. ఆమె బ్రహ్మవంటి ఎందరో దేవుళ్ళనే కలవర పెట్టినపుడు, ఒక బలహీనమైన నావంటి ఫకీరు, ఆమె శక్తి నుండి ఎలా తప్పించుకోగలడు? " (పేజీలు 4,6) అధ్యాయం13.

మనం, మాయ కబంధహస్తాలబారి నుండి తప్పించుకోవడానికి ఎందుకు ప్రయత్నించాలి? ఎందుకంటే, మనంభ్రమలో చిక్కుకుంటే, మనకి మన మీదా, మన చుట్టూ ఉన్న ప్రపంచం మీదా ఏర్పరుచుకునే అవగాహన, మసకచీకటిలో మనం తాడుని చూసి పాము అనుకున్నట్టు, తప్పుదారి పడుతుంది. అప్పుడు మనం ఈప్రపంచం నిజమైనదని, మన శరీరమే మన ఆత్మ అనే భ్రమకులోనై, ప్రాపంచిక సౌఖ్యాలలో మునిగిపోయి, జనన, మరణాల చక్రంలో బందీలమైపోతాము. అందువల్ల భ్రమలో చిక్కుకుని, అందువల్ల కలిగే ఫలితాల నుండి తప్పించుకోవడానికి మనం ఏంచెయ్యాలి?

అందుకు ఒకటే మార్గం ఉంది. మన చుట్టూ ఉన్న ప్రపంచం గురించి, మన గురించి యదార్థం తెలుసుకోవడానికి, మనం సద్గురువుని ఆశ్రయించాలి. ఇది సాధ్యం కాకపోతే, మరొక తేలికైన మార్గం ఏమిటంటే 'భగవదారాధన' చేయటం. ఆ మార్గం ఎన్నుకున్న భక్తులకి భ్రమలో చిక్కుకుంటామనే బాధ అవసరం లేదు. ఎందుకంటే మాయ వారి దగ్గరకు చేరదు. వారిని ఇబ్బంది పెట్టదు.

**అభిమానం కలిగిఉండటం లేదా వశ్యులవ్వడం.**

సాధారణ మానవులందరూ, మాయ పదానికి ఉన్న ఈఅర్థానికి ప్రతిబింబాలవుతారు. ఈ లౌకిక ప్రపంచంలో, తన భార్య, సంతానం, ఆస్థులు, సంపద మొదలైనవి ఏవీ, ఎవరూ శాశ్వతం కారనీ, తన మరణానంతరం వెంటరారనీ, రావనీ, స్పష్టంగా తెలిసినా కూడా, మనిషి వాటన్నిటికీ లొంగిపోయి, వాటి మీద అభిమానం లేదా ప్రేమతో, మైమరచిపోయి తన ఆనందాలని కోల్పోతూనే ఉంటాడు.

శ్రీదుర్గాసప్తశతి 'గ్రంథంలో దీనికి సంబంధించి, సూరత్ అనే రాజు గురించి, సమాధి అనే వ్యాపారస్తుడి గురించీ ఒక కథచెప్పబడింది. అది ఆసక్తికరంగా ఉంటుంది. చైత్రరాజుల వంశంలో సూరత్' అనే రాజు ఉంటాడు. అతడు తన ప్రజలను, కన్న బిడ్డలలా చూసుకునేవాడు. దురదృష్టం వల్ల ఒకసారి అతడు, కొల్విధ్వంశి అనే రాజుతో జరిగిన యుద్ధంలో పరాజితుడవుతాడు. అతడి రాజధాని మీద శత్రువుదాడి జరిగింది. దానిని సాకుగా తీసుకున్న అతని మంత్రులలో దుర్మార్గులు, అతడి ఖజానాను దోచుకుని, సైన్యాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. వాళ్ళ నుంచి, తప్పించుకోవడానికి రాజు, వేటకి వెళుతున్నానని చెప్పి, కోటనుండి తప్పించుకుని, అడవిలోకి పలాయనమయ్యేడు. ఆ అడవిలో దిక్కుతోచ కుండా తిరుగుతున్న ఆరాజుకి, అక్కడ ఉన్న మేధారుషి ఆశ్రమం కనిపించింది. రాజుని ఆ ఆశ్రమవాసులు, సాదరంగా ఆహ్వానించేరు. కొన్ని రోజులు పవిత్రమైన ఆ ఆశ్రమంలో అతడు కాలాన్నిగడిపేడు. ఒకరోజు అతనికి తనకి ఎంతో ఇష్టమైన వ్యక్తులు, వస్తువులు గుర్తుకి వచ్చి ఎంతో ఆందోళన కలిగింది. అతనికి అంతకుముందు తన జీవితంలో జరిగిన కొన్ని

సంఘటనలు గుర్తుకి వచ్చి బాధ కలిగింది కూడా. అతను ప్రేమగా పెంచుకున్న ఏనుగు, మరికొన్ని తనకి ఇష్టమైన విలువైన, అందమైన వస్తువులు గురించి తలుచుకున్నాడు. ఎన్నో విలువైన వజ్రాలు, రత్నాలు, బంగారు ఆభరణాలు, ధనంతో నిండివుండే తన ఖజానా కూడా అన్నిటితో పాటు ధ్వంసం అయిపోయి వుంటుందని భావించి, అతడు ఎంతగానో కలత చెందేడు. కొత్త రాజు, తన కన్న బిడ్డల్లాంటి ప్రజలను ఎంతగా వేధిస్తున్నాడో అని పరితపించేడు. అలా దిగులుగా అతడు ఆ ఆశ్రమంలో అటూ, ఇటూ తిరుగుతూ ఉంటే, అతడికి అదే ఆశ్రమంలో ఉంటున్న 'సమాధి' అనే వ్యాపారస్తుడు కనిపించేడు.

అప్పుడు రాజు అతడిని "నువ్వెవరు? నువ్వు ఈఆశ్రమానికి ఎందుకు వచ్చేవు? నువ్వు దేనికో బాధపడుతున్నట్టుగా కనిపిస్తున్నావు."అని అడిగేడు.

అప్పుడు ఆ వ్యాపారస్తుడు" ఓ!సూరతురాజా! నేను వైశ్యుడిని. నాపేరు సమాధి. నేను చాలా ధనిక కుటుంబంలో పుట్టేను. నేను పెరిగి, పెద్ద వాణ్ణయ్యేక చాలా డబ్బు సంపాదించేను. నాకు వివాహమయ్యి, సంతానం కూడా కలిగింది. నేను ముసలివాడినయ్యేక, నా భార్య, పిల్లలూ నన్ను ఇంటి నుండి వెళ్ళగొట్టేరు. నా బంధువులు, నా ఆస్తిని కొల్లగొట్టేరు. అందువల్ల, ఇప్పుడు నాకు, నా భార్యా పిల్లలకి ఏమవుతుందోనని దిగులుగా వుంది. నేను లేనప్పుడు వాళ్ళు ఎలా ఉన్నారో! ఏంచేస్తున్నారో!! అని బాధగా వుంది. నా పిల్లలు చెడుమార్గాలు పట్టకూడదని నేను ఆశపడుతూ ఉన్నాను. ఇలాంటివి, మరికొన్ని ఇతర సమస్యలతో నేను, ప్రస్తుతం బాధపడుతూ ఉన్నాను."

అప్పుడు రాజు, ఇలా అన్నాడు. "వైశ్యశ్రేష్టుడా! నిన్ను ఇంటి నుండి, వెళ్ళగొట్టిన నీ భార్యా, పిల్లల గురించి, నీకు ఇప్పుడు దిగులెందుకు?"

అప్పుడా వైశ్యుడు, "ఓ. రాజా! నువ్వు చెప్పినది యదార్థమే. వాళ్ళు నన్ను ఇష్టపడరని తెలిసీ, నేను వాళ్ల పట్ల, దురుసుగా ఉండలేను. ఎందుకలా ఉండలేనన్నది నాకు తెలియడం లేదు."

ఈ సంగతిని, అవగతం చేసుకోవడానికి, రాజు, వైశ్యుడు ఇద్దరూ కలిసి, మేధారుషి దగ్గరకి వెళ్ళి, అతడిని, అభిప్రాయం చెప్పమన్నారు.

ఆరుషి, దానికి" అనురాగం అన్నది, మానవుల్లో, జంతువుల్లో, పక్షుల్లో కూడా చాలా బలంగా ఉంటుంది. తాము, ఆకలితో ఇబ్బందిపడుతున్నప్పటికీ, పక్షులు, తమ పిల్లలకి ఆహారాన్ని ఎలా ఇస్తున్నాయో, చూడండి. అలాగే, ఎంతో తెలివైన మానవులు కూడా, తాము తమ సంతానాన్ని పెంచి, పెద్దవాళ్లని చేయడానికి, పడినకష్టానికి ప్రతిఫలాన్ని, తమ పిల్లల నుండి ఆశిస్తూ ఉంటారు. అది నిరర్థకమే అవుతుందని తెలిసినా, అందరూ మహామాయకి వశ్యులై, ఈమోహపు సుడిగుండంలో చిక్కుకుపోయి ఉంటారు. అందులో ఎవరూ ఆశ్చర్యపడనక్కర్లేదు.

శ్రీదుర్గాసప్తశతి మొదటి అధ్యాయంలో ఈ విషయం ఇలా రాసి ఉంది.

"శ్రీమహావిష్ణువు, యొక్క మహామాయ శక్తి వలన, ఈప్రపంచం అంతా మోహవలయంలో చిక్కుకుపోయి ఉంది. అమితమైన తెలివితేటలు ఉన్నవాళ్ళు, వివేకవంతులు కూడా ఆమెకి లొంగిపోతారు, వశ్యులైపోతారు. ఆమె ఇష్టపడిన వాళ్లని, పునర్జన్మలు లేకుండా ఆమె చేస్తుంది. ఆమె చాలా పురాతనమైన, అవధులులేని జ్ఞానం. ఆమె దేవతలకే దేవత. ఆమె కలిగించే మోహబంధనాలలో చిక్కుకుని పోవడం, లేదా తప్పించుకుపోవడం అన్నీ, ఆమె కలిగించేవే."

అన్నీ తెలిసినప్పటికీ, ఈ ప్రాపంచిక బంధనాల నుండి, మోహవలయం నుండి తప్పించుకోవడానికి, ప్రతీ ఒక్కరూ ప్రయత్నం చేస్తూనే

ఉండాలి. శ్రీసాయిసత్చరిత గ్రంథంలోని 17,23 అధ్యాయాలలో దీని గురించి విపులంగారాసేరు. మానవ శరీరంలోని ఆత్మని, బంగారు పంజరంలోని, ఇనుపకడ్డీ మీద కూర్చుని, ఎటువంటి పనీ చేయకుండానే సంపాదించిన ఎర్రమిరపకాయలను, దానిమ్మ గింజలనూ, తింటూ ఆనందిస్తున్న రామచిలకతో పోల్చిచెప్పేరు. దానికి ఎలాగైనా ఆపంజరం నుంచి, తప్పించుకుని స్వేచ్ఛగా ఎగిరిపోయి' ఎక్కడికైనా వెళ్ళిపోయి, తోటల్లో ఉన్న జామి పళ్ళను, దానిమ్మ పళ్ళను కావలసినన్ని తినమని సలహా కూడా ఇచ్చేరు. (పేజీలు23,30) అధ్యాయం 23.

మాయకి సంబంధించి శ్రీసాయిబాబాగారు, మనకిచ్చిన ఆఖరి సందేశం మేఘాల్లోని మెరుపులాంటిది ఈభూలోక సంబంధ జీవితం. ఈ జీవితంలో ఎవరికైనా ఆనందించే సందర్భాలు చాలా తక్కువగానే ఉంటాయి. అమ్మ, నాన్న, అక్క, చెల్లి, అన్న, తమ్ముడు, భర్త, భార్య, కొడుకు, కూతురు, మామ.. వంటి మానవ సంబంధాలన్నీ, ప్రవహిస్తున్న నదిలో తేలుతూ ప్రయాణిస్తున్న కట్టెదుంగల్లాంటివే. అవి కలిసి ప్రయాణం చేస్తున్నపుడు, ఎల్లప్పుడూ కలిసే వుంటాయని అనిపించినా, ఎప్పుడో ఒక అనుకోని అల తాకిడికి, అవి వేరయిపోయి మళ్ళీ కలవడమన్నది జరగనే జరగదు." (పేజీలు 21,23) అధ్యాయం 14.

"ఒక మనిషి, తాను పుట్టిన క్షణం నుండే, మరణం అనే గమ్యానికి ఉన్న రహదారి మీద ప్రయాణం మొదలు పెడతాడు. అందువల్లే ఎవరైనా, నేను రేపు లేదా తర్వాత రోజు ఈపని ఖచ్చితంగా చేస్తాను అనుకుంటే, వారు, తమకి ఆక్షణంలో ఉన్న అవకాశాన్ని చేజార్చుకోవడమే అవుతుంది. ఎప్పుడూ, మరణం, మన చుట్టూనే ఉంటుందని, ఏసమయంలోనైనా, మన శరీరం, మరణానికి దొరికిపోతుందని మనం ఎప్పుడూ గుర్తులో


ఉంచుకోవాలి. అదే ఇహలోక జీవితం. అందుకే ఎల్లవేళలా, ఆ జాగరూకతతోనే ఉండండి."(పేజీలు25,26) అధ్యాయం14.

"మానవ అస్థిపంజరం, లేదా శరీర నిర్మాణ చట్రం అన్నది చర్మంతో, మాంసంతో, రక్తంతో, ఎముకలతో నిర్మించబడి, ఆత్మసాక్షాత్కారాన్ని, బంధనాల నుండి విముక్తి చెంది, స్వేచ్ఛను గ్రహించాలనే అంతిమలక్ష్యాన్ని చేరుకోనీ కుండా ఆటం కాలుకలిగించే భారమే అవుతుంది. అందువల్ల శరీరం మీద అభిమానాన్ని విడిచి పెట్టండి. ఆశరీరానికి. ప్రాధాన్యతని ఎక్కువగా ఇచ్చి, విగ్రహంగా మలచుకోకండి. దానిని ఒక సేవ చేసేదిగానే భావించండి. దానిని అదే పనిగా అపురూపమైన దానిగా చూసుకుంటూ, నరకానికి ప్రవేశ మార్గంగా చేసుకోకండి. దానికి ఆహారమివ్వండి, బట్టలుకట్టండి, జీవించి ఉండడానికి తగినంత శ్రద్ధచూపండి. దానిని మీ ఆధ్యాత్మిక పురోగమనానికి, జనన, మరణ వలయాల నుండి విముక్తుల వ్వడానికి, సాధనంగా చేసుకోండి." (పేజీలు 32,34) అధ్యాయం 8.

"ఎన్నో సత్కర్మలు చేసి ఉండటంవల్ల, ఎంతో అద్రుష్టం కలగడం వల్ల, మీకు మానవజన్మ లభించింది. అందుకు మీరు ప్రతీక్షణాన్ని మంచిగా వినియోగించుకోండి. మీశరీరం చనిపోయే వరకూ, ఆత్మసాక్షాత్కారాన్ని పొందటంకోసం, అధికంగా శ్రమించండి. ఏ ఒక్క క్షణాన్నీ వృధాచేయకండి." (పేజీలు 41,78) అధ్యాయం8.

ఇంకా అతి ముఖ్యమైనది" మాయ కబంధహస్తాలబారిన పడకుండా వుండటంకోసం, సద్గురుపాదాలను ఆశ్రయించండి. ఆయన శరణుకోరితే, మీరు, మరొక జన్మతో జీవించాలన్న భయాన్ని, పోగొట్టుకుని, జన్మ రాహిత్యాన్ని పొందగలుగుతారు. అనివార్యమైన మరణాన్ని రానివ్వండి. భగవంతుడైన హరిని (శ్రీ కృష్ణ పరమాత్ముడిని) మాత్రం మరచిపోకండి.

మీపంచేంద్రియాలతో, మీజీవితంలో ఏకార్యాలు చేయడాన్ని, శాస్త్రగ్రంధాలు శాసించాయో, వాటిని భగవంతుని నామస్మరణ చేస్తూనే, పూర్తి చేయండి.” (పేజీలు 82,83) అధ్యాయం–39.


సాయి సచ్చరిత్ర
నానాసాహెబ్ డేంగ్లే
ఆహారపదార్థములు తేగా
దానిని నల్లకుక్క ముట్టుకొనుట,
బాబా దానికి తప్పేమిటని,
కోపంతో పళ్ళెం
విసిరివేయుట

## అధ్యాయం 10

# స్వీయాడంబరం

తనని గురించి తాను, అతిగా ఊహించుకోవటం, డాంబికంగా లేదా గర్వంగా ప్రవర్తించటం వంటిపనులు చేసే వ్యక్తులను స్వీయాడంబరపరులు అని పిలుస్తారు. శ్రీసాయిబాబాగారు, ఈలక్షణాలకు బద్ధవ్యతిరేకి గానే ఉండేవారు. ఆయన తన భక్తులను, ఈలోకంలో వినయంగా మెసలుకోమని చెప్పేవారు.

“భక్తులారా! సంపదలు మిమ్మల్ని చేరినప్పుడు, పళ్ళతో నిండి ఉన్న చెట్టువొంగి ఉన్నట్టుగా మీరు కూడా, చాలా వినయంగా ఉండండి.” (పేజీ67)

“అన్ని వేళలా ఆధ్యాత్మిక గురువులను, పవిత్ర మూర్తులను గౌరవించండి. వీస్తున్న గాలి ముందు, వొంగివుండే గడ్డిపరకలా వాళ్ళ ముందువొంగి నిలబడండి.” (పేజీ70)

“ఐశ్వర్యాన్ని కలిగి ఉండటమన్నది, మధ్యాహ్నం వేళ నీడలా తాత్కాలికమైనదని మర్చిపోకండి. ధనం మీకు కలిగించే మత్తుకులోనై, ఎవరినీ బాధపెట్టకండి. వేధించకండి.”(పేజి71) సాయిబాబాగారు చెప్పిన ఈసందేశాలన్నీ, దాసుగణు రచించిన ”అర్చవన భక్తలీలామృతం’ గ్రంథంలోని అధ్యాయం 32లో కనిపిస్తాయి.

శ్రీ దభోల్కరు గారు, శ్రీసాయిబాబాగారి జీవిత చరిత్రను రాయడానికి సంకల్పించి, షామాగారి ద్వారా, బాబాగారిని అనుమతి కోరినప్పుడు, ఆయన ధబోల్కరులోని అహంభావాన్ని, అవసరం లేని గర్వాన్ని ముందు విడిచిపెట్టాలన్నారు. తర్వాత ఇలా చెప్పేరు. " షామా1 అతను బాహ్యసాధనం మాత్రమే. నాజీవిత చరిత్రను నేనే రాసినా భక్తులు, ఆనందించేలా చేయగలను. అతడు తన అహంభావాన్ని, నాపాదాల ముందు విడిచిపెడితే, అతడికి నాపూర్తి సహకారాన్ని అందిస్తాను. "అధ్యాయం2.

శ్రీసాయిబాబాగారు, తాను బోధించిన ప్రకారమే ప్రవర్తించారు. ఆయన జీవించి ఉన్న రోజుల్లోను, ఈనాడూ  అసంఖ్యాకంగా ఉన్న ఆయన భక్తులు, ఆయనను భగవంతుడి అవతారంగానే నమ్ముతారు. కానీ సాయిబాబాగారు ఏనాడూ" నేను దేవుడిని" అని చెప్పలేదు. "నేను దేవుడి వినయపూర్వకమైన సేవకుడిని" అని చెప్పుకున్నారు. భగవంతుడిని అన్నివేళలా స్మరిస్తూ" అల్లామాలిక్' ఏక్'హై" (భగవంతుడే సర్వాధికారి లేదా యజమాని) అంటూ వుండేవారు.

తర్వాత కాలంలో సాయిబాబాగారి గురించి తెలిసి, అనేక ప్రాంతాల నుండి, బహుదూర ప్రదేశాల నుండి ఎంతోమంది భక్తులు తండోపతండాలుగా, పండ్లు, పూలు, దక్షిణలను తీసుకుని ఆయన దర్శనానికి షిర్డీవస్తూ వుండేవారు. ఆయనకి పూజలు చేయడానికి ప్రయత్నించే వారు. ముందు బాబాగారు, ఆపూజలని వ్యతిరేకించేరు. కొన్నిసార్లు అయితే, భక్తులు తెచ్చిన కానుకలని విసరికొట్టేవారు. క్రమక్రమంగా, ఆయనకి, తన మీద భక్తులకి ఉన్న ప్రేమానురాగాలు తెలిసి, వాళ్ళు తనని ఆరాధించడానికి ఆయన అంగీకరించేరు.

సాయిబాబా గారికి చాలా ఇష్టులైన భక్తులు, నానాసాహెబు చందోర్కరు, కాకాసాహెబుదీక్షితు వంటి వాళ్ళు, బాబాగారు నివశిస్తున్న

మసీదులో రాతిదిమ్మలు, మశీదు ముందర పైభాగంలో ఆచ్ఛాదననిచ్చేందుకు పలకవంటివి నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తూ ఉంటే, బాబాగారు తీవ్రమైన ఆగ్రహంతో, వాళ్ళు అందుకోసం ముందుగా పాతిపెట్టిన, ఇనుపస్థంభాలను, పీకిపారేసేరు. ఆయన, చావిడి ఊరేగింపు కోసం, రాధాక్రిష్ణమాయి దాచిపెట్టి ఉంచిన పల్లకీలో ఆయన ఎప్పుడూ కూర్చోనే లేదు. ఆ తోవంతా నడిచి వెళ్ళడానికే ఆయన ఇష్టపడేవారు. ఆయనను చూసేందుకు, హిందువులు, ముస్లింలూ వచ్చేవారు. వాళ్ళు తన మీద గౌరవంతో తనకు నమస్కరించేరో, లేదో ఆయన ఏనాడూ గమనించేవారే కాదు. ఒకసారి నానావలీ అనే వ్యక్తి, ఆయన దగ్గరకు వచ్చి," లే! నేను, నువ్వు కూర్చున్న గద్దెమీద కూర్చుంటాను." అన్నాడు. అతని మాటలకు, ఎటువంటి భావాన్నీ వ్యక్తపరచకుండా, బాబాగారు, వెంటనే లేచి, వలీని తన స్థానంలో కూర్చోమన్నారు. కానీ, వలీ ఆ పని చెయ్యలేదు. ఆస్థానం నుండి కదిలి ముందుకు వచ్చి, సాయిబాబా గారికి, ఎంతో వినయపూర్వకంగా అభివందనం చేసి, ఆయనను యధా ప్రకారం కూర్చోమని ప్రార్థించాడని చెప్పేడు. అందులో ఆశ్చర్య పడవలసినది ఏమీలేదు. – అధ్యాయం10.

శ్రీసాయిబాబాగారిలో ఎన్నో దివ్యశక్తులు, యోగక్రియలు, ఉండేవి. వాటిని, వినియోగించి ఆయన ఎంతో మంది తన భక్తులకు కలిగిన అనారోగ్య సమస్యలను, కష్టనష్టాలను వారి నుండి తొలగించే వారు. పిళ్ళే అనే వైద్యుడి కాలిలోని గినీ పురుగులను, ఆయన తొలగించేరు. (అధ్యాయం34). భీమాజీ పటేలుగారికి ఉన్న క్షయ వ్యాధిని తొలగించేరు. (అధ్యాయం13). అలాగే జట్కాబండి నడిపే వాడు లానటించి, ఆయన' ఉదీ, ఆరతులను, అక్కడకి చాలా దూరంగా ఉన్న జామ్ నర్ పట్టణంలో ప్రసవవేదనలు పడుతున్న, నానాసాహెబు చందోర్కరు గారి కుమార్తె, మైనతాయిని రక్షించేందుకు

శరవేగంగా వెళ్ళేరు. (అధ్యాయం 33). అయితే ఆయన, ఆపనులు తాను చేసినట్టుగా ఎప్పుడూ చెప్పుకోలేదు.

అధ్యాయం 34లో ఆయన షామాతో ఇలా చెప్పినట్టు రాసి ఉంది." నేను ఏపనీ చేయకపోయినా, వాళ్ళు తమ విధిరాతల ప్రకారం, తమకు సంభవించిన ఫలితాలకు నన్ను బాధ్యుడిగా చేస్తున్నారు. నేను, వాటికి సాక్షిగా మాత్రమే ఉన్నాను. భగవంతుడే అన్నిటినీ ప్రేరేపించేవాడు, కార్యకర్త అవుతాడు. ఆయన దయామయుడు. నేను దేవుడినీ కాదు. ఎవరికీ యజమాని కూడా కాదు. నేను భగవంతుడికి అత్యంత విధేయుడైన సేవకుణ్ణి. ఆయనను, ఎల్లప్పుడూ తలుచుకునే వాణ్ణిమాత్రమే." (పేజీలు128,130) అధ్యాయం 34.

తన భక్తులకు, తాను సహాయం చేసేననే మాటను, సాయిబాబాగారు, అంగీకరించే వారు కాదు. కానీ తనకు, వారికి సహాయం చేసేందుకు, అవకాశాలు కల్పించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపేవారు. అందుకు ఒక ఉదాహరణ ఉంది.

ఒకసారి చాలా వినయంగా సాయిబాబాగారు ఈమాటలు చెప్పేరు. "నేను బానిసలకు, బానిసని. నేను మీఅందరికీ రుణపడి ఉన్న వాడిని. మిమ్మల్ని చూడటమన్నది నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. మీరు, మీ పాదదర్శనం నాకు కలిగించడమన్నది, మీరు నాకు చేస్తున్న ఉపకారంగా నేను భావిస్తాను. మీ విసర్జనలో నేను ఒక క్రిమిననుకుంటాను. అది నాకు లభించిన ఆశీర్వాదంగా నేను అనుకుంటాను" (పేజీలు 90,91) అధ్యాయం10.

ఇది ఎంత గొప్పవినయ శీలత..!

ఇది, ఆయన ప్రతీ రోజూ జీవించిన లౌకిక జీవితంలో కనిపిస్తూనే

ఉంటుంది. బాబాగారు, తన భక్తులను ఆత్మసాక్షాత్కారం పొందడానికి, అహంభావాన్నీ, ఆడంబరాన్నీ విడిచిపెట్టమని, అనేక సందర్భాలలో సలహా ఇస్తూనే వుండేవారు.

ఒకసారి జవహర్ ఆలీ అనే పాండిత్యం కలిగిన మౌల్వీ, షిర్డీకి వచ్చేడు (1880, 1890ల్లో బహుశా). అతడు, సాయిబాబాగారిని, తన శిష్యరికం స్వీకరించమనీ, రహతా ప్రార్ధనాస్థలానికి తనతో పాటు రమ్మని ఆదేశించేడు. ఆసమయంలో సాయిబాబా గారి దగ్గర ఎందరో భక్తులు చేరి, ఆయనకు పూజలు చేస్తున్నారు. అయినా, ఎటువంటి మాటా అనకుండా, బాబాగారు, జవహర్' ఆలీచెప్పినట్టే, అతనితో కలిసి, రహతాకు వెళ్ళి, అక్కడ అతనికి సేవలు చేస్తూ, రెండు, మూడు నెలల కాలం గడిపేరు. ఆయన భక్తులు, ఎంతో కష్టపడి, ఆయనను మళ్ళీ షిర్డీ తీసుకువచ్చేరు. ఆవిధంగా శ్రీసాయిబాబా గారు, మనందరికీ, అహంకారాన్ని వొదిలించుకుని, తన భక్తుడి కోరిన పనులు చేసిన సద్గురువులు, తమ జీవిత పరమలక్ష్యమైన ఆత్మసాక్షాత్కారాన్ని ఏవిధంగా సాధించుకుంటారో చేసి, చూపించేరు. అధ్యాయం-5.

అలాగే, ఆయన భగవంతుని సాక్షాత్కారాన్ని పొందాలనే , తన కోరికను నెరవేర్చుకోవటంలో ఎలా సఫలీకృతులయ్యారో మనకి వివరంగా చెప్పేరు. అడవిలో ప్రయాణిస్తున్న ఆయన, ఒక బంజారా ఇచ్చిన రొట్టెముక్కను, తీసుకుని, అతని సలహాని వినయంగా పాటించడం వల్లనే, తన కోరిక తీరిందని చెప్పేరు. తన గురువుకు, తాను పూర్తిగా దాసుడిని అయినందువల్లనే, తనకు ఆత్మసాక్షాత్కారం సిద్ధించిందనీ, ఆయన తెలిపేరు. "నా గురువు, నాకు అన్నిటిలో తానే అయ్యాడు. నా ఇల్లు, ఆస్తి, అమ్మా, నాన్నా అంతా అతనే. నా పంచేంద్రియాలు, తమ స్థానాలను, విడిచిపెట్టినా నేత్రాలనే,

తమ స్థావరంగా మార్చుకున్నాయి. నా చూపు అంతా నా గురువు మీదనే కేంద్రీకరించి ఉంది. అతడు నాగురువు. నా ధ్యాన లక్ష్యం. అంతకు మించి నాకేదీ స్ఫురణలో లేదు. ఆయన అనుగ్రహం వల్లనే, అధ్యయనానికి ఎటువంటి, శ్రమాలేకుండా నాకు ఆత్మసాక్షాత్కారం, మెరుపులా సంభవించింది." (పేజీలు 76,81,88,89) అధ్యాయం32.

సాయిబాబా గారి కోసం, వాసుదేవానంద సరస్వతి అనే ఒకమతాధిపతి, నాందేడు, నివాసి అయిన పుండలీకరావుకి, ఒక కొబ్బరికాయను ఇస్తే, దాన్ని అతడు సాయిబాబా గారికివ్వకుండా, తానే పగలగొట్టి, తిన్నాడు. అందుకు, అతను చింతిస్తున్నప్పుడు, బాబాగారు ఇలా అన్నారు." నువ్వు చేసిన పనిగురించి, నువ్వు బాధపడే అవసరం లేదు. ఆకొబ్బరికాయ, నేను కోరుకున్న వాటిలోకే వస్తుంది. దారిలో అది పగిలిపోయింది. ఆపనికి, నువ్వు బాధ్యత ఎందుకు తీసుకుంటున్నావు? మంచి పనులు చేసినా, చెడ్డపనులు చేసినా, వాటన్నిటికీ, నీవేకర్తగా, నువ్వు భావించకు. నీగర్వాన్నీ, అహంభావాన్నీ పూర్తిగా అన్నిటిలో విడిచిపెడితే, నీ ఆధ్యాత్మక పురోగతి, వేగవంతమవుతుంది." అధ్యాయం 51.

శ్రీసాయిబాబాగారు మనందరికీ ఇచ్చిన, ఒక అందమైన ఆధ్యాత్మిక ఉపదేశం.

నిత్య ప్రాపంచిక జీవితాల్లో మనంచేసే కార్యాల్లోనూ,  లేదా ఆత్మ సాక్షాత్కారాన్ని పొందటం కోసం మనం చేసే ఆధ్యాత్మిక విషయాల్లోనూ, మనం అహంకారాన్ని విడిచిపెట్టి, వినయాన్ని అలవరచుకోవాలని, శ్రీ సాయిబాబా గారు మనకి గట్టిగా చెప్పేరు. దానినిహేమద్పంతు గారు తాను రాసిన శ్రీసాయిసత్చరిత గ్రంథంలో ఒక ఆదర్శభక్తుడు ఎలా ఉండాలో వివరించేరు." తనశరీరానికి ప్రాధాన్యతను ఇచ్చే అతను లేదా ఆమె భక్తుడు

లేదా భక్తురాలు అనే బిరుదుకు అర్హులుకారు. ఎవరికైతే, అహంకారమన్నది అసలు ఉండదో, వారే నిజమైన భక్తిని కలిగి ఉంటారు. తాను చదువుకున్న వాడినని అహంకారము, తన ఆధిక్యతకు, అవసరం లేని గర్వము కలిగి ఉన్నవాడు, మత మిధ్యాచారాలకి కేంద్రం మాత్రమే అవుతాడు." (పేజీలు 13,14) అధ్యాయం 49.

## అధ్యాయం 11

# అహింస

ఎవరినీ శారీరకంగా, మానసికంగా, మాటలతో హింసించక పోవటమే 'అహింస' అవుతుంది. అహింస  అనేది మనందరికి, ఒక అత్యంత ప్రధాన ధర్మమార్గంగా, మనందరి సిద్ధాంతంగా గొప్పగుర్తింపు పొందింది.

మనుస్మృతి గ్రంథం (హిందూ మత శాసనకర్త' మనువు' రచించిన హైందవులు, తమ జీవన సరళిలో పాటించవలసిన నియమ, నిబంధనల గ్రంథం) లో కూడా 'అహింస'కు ప్రథమస్థానాన్ని ఇచ్చేరు.

అహింస, సత్యవాక్పాలన, అపహరించక పోవడం, శుభ్రత, ఇంద్రియని గ్రహం అన్నవి, పురోహితులు, యోధులు, వణిజులు, పరిచర్యలు చేసే వారు మంచి నడవడికతో జీవించటానికి, పాటించవలసిన నియమ, నిబంధనలు అని, మనువు చెప్పేడు.

శ్రీసాయిబాబాగారు కూడా అహింస సూత్రాన్ని ప్రోత్సహించే వారు. దానిని, ఆయన బోధించే పద్ధతి చాలా ప్రయోగాత్మకంగా ఉండేది. ఉదాహరణకు, తమ మతం, లేదా కులాచారం ప్రకారం, తరతరాల నుండీ మాంసాహారం తింటూ వస్తున్న వాళ్ళను, దానిని విడిచిపెట్టమని ఆయన

ఎప్పుడూ చెప్పలేదు. బాబాగారే, తాను స్వయంగా ముస్లిం ఫకీరు వేషధారణలో ఉండి, మశీదులోనే నివశించేవారు. తనరూపు, రేఖలకు అనుగుణంగానే, ఆయన మాంసాహారాన్ని రుచిచూసే వారు. అంత మాత్రమే కాదు. కొన్ని సందర్భాలలో ఆయన, తానే మాంసాహారాన్ని వండి, భక్తులకు వడ్డించే వారు కూడా. మాంసాహారాన్ని తినే వారికి, దానిని తినవద్దని, తినని వారిని, తినమని బలవంత పెట్టడం ఆయన ఎన్నడూ చేయలేదు.

సాయిబాబాగారు హాస్యప్రియులు. మాంసాహారాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడే తన భక్తులు, అతిధులతో, ఆయన, వాళ్ళకు నవ్వు వచ్చేలా మాట్లాడేవారు. ఒక పవిత్ర ఏకాదశిదినం నాడు, ఆయన సనాతన ఆచారపరుడైన బ్రాహ్మణుడు, దాదాసాహెబు కేల్కరుని, బజారుకు వెళ్ళి, మాంసాన్ని కొని తీసుకురమ్మని చెప్పేరు. దానికి ఎటువంటి వ్యతిరేకతా చూపకుండా, ఆ బ్రాహ్మణుడు ఒక అత్యంత విధేయుడైన భక్తుడిలా బజారుకు, బయల్దేరుతుంటే, బాబాగారు, అతన్ని ఆపు చేసేరు.

అలాగే ఒకసారి, ఒక పేద బ్రాహ్మణుడు, బాబాగారిని ధనసహాయం కోరడానికి వచ్చేడు. ఆసమయంలో కొందరు యువకులు, అక్కడ వంటచేసేందుకు గాను, మాంసాన్ని ముక్కలుగా కోస్తున్నారు. బాబాగారు, వాళ్లలో ఒక అబ్బాయిని పిలిచి, కొన్నిమాంసం ముక్కలని, ఆబ్రాహ్మణుడి జోలెలో వేయమని చెప్పేరు. ఆ బ్రాహ్మణుడికి చాలా కోపం వచ్చింది గానీ, అతడు, బాబాగారి మీద భయం వల్ల ఏమీ అనకుండా ఊరుకున్నాడు. అతడు, తన గ్రామానికి తిరిగి వెళ్ళిపోతూ, తోవలో ఉన్న ఒకనీటి కాల్వ దగ్గర ఆగి, తన జోలెలో ఉన్న మాంసంముక్కలని, బయట పారేసి, జోలెని ఉతికేందుకు, నీటిలో ముంచేడు. ఆసమయంలో, జోలెలో ఏదో గట్టిగా తగలడంతో, అతడు అది, ఒక ఎముక ఏమోనని అసహ్యాపడి, దానిని

ఎలాగైనా బయటకు తీయాలని ప్రయత్నించే సరికి, అది మెరుస్తున్న బంగారు కణికెగా కనిపించింది. అతడు వెంటనే, తాను పారేసిన మాంసం ముక్కలని వెతకడానికి పరుగు పెట్టేడు. అతనికి అక్కడ ఏమీ కనిపించలేదు. అతడు, తన దురదృష్టాన్ని నిందించుకుంటూ, మాంసాహార సాయిబాబాగారి మీద, కోపం తెచ్చుకున్నాడు.

శ్రీసాయిబాబాగారి జీవితకాలంలో, బ్రాహ్మణులు, తమ ఆధ్యాత్మిక పురోగమనానికి, మాంసాహారాన్ని తినకపోవటమే మొదటి సోపానంగా భావించేవారు. మాంసాహారాన్ని తినేవాళ్ళ పట్ల చిన్నచూపుతో ఉండేవాళ్ళు. అది గమనించి కాబోలు, సాయిబాబాగారు, వాళ్ళకు ఆధ్యాత్మికంగా పురోగతి సాధించటానికి, మాంసం తినకపోవటమన్నది తప్పనిసరి కాదని, గురువు, శాసించిన కార్యాలను, నిర్వర్తించాలని. ఇచ్చిన వాటిని ఎటువంటి వ్యతిరేక భావననీ దరిచేరనీయ కుండా, అత్యంత విశ్వాసంతో, అతనిపై భక్తితో, వినయంగా, గౌరవంగా స్వీకరించాలని బోధించేరు. సాయిబాబాగారి బోధనసరైనదే అవుతుంది. ఆధ్యాత్మికంగా ముందుకు సాగడానికి, మాంసాహారం అవరోధమైతే, అది తిన్న ఇస్లాంప్రవక్త మహమ్మదు, క్రైస్తవ మత ప్రవక్తజీసస్ 'క్రైస్ట్' వంటి మహాపురుషులు, ఆత్మసాక్షాత్కారాన్ని పొందిన వాళ్ళు ఎలాఅవుతారు? అందువల్ల సాయిబాబాగారు, వాస్తవికమైన అహింస సిద్ధాంతాన్ని ప్రబోధించేరు. ఆయన చెప్పిన ఈ మాటలుచూడండి."

మీదగ్గరకు ఏ మనిషైనా, ఏ జంతువైనా వస్తే నిర్దాక్షిణ్యంగా వారితో ప్రవర్తించకండి. తరిమి కొట్టకండి. వాళ్ళని సాదరంగా ఆహ్వానించండి. వాళ్ళతో గౌరవంగా మెలగండి. మీరు దాహంతో ఉన్న వాళ్ళకి, నీరు, ఆకలితో ఉన్న వాళ్ళకి, ఆహారం, కట్టుకునేందుకు బట్టలు లేని వాళ్ళకి వస్త్రాలు, ఉండడానికి నీడలేని వారికి, మీ వరాండాలో కూర్చునేందుకు

లేదా విశ్రాంతి తీసుకోవడానికి ఆశ్రయం ఇస్తే, శ్రీహరి(భగవంతుడు) ఆనంద పరవశుడవుతాడు. ఎవరైనా, మీదగ్గరకి డబ్బు కావాలని వస్తే, మీకు ఇవ్వడం ఇష్టం లేకపోతే ఇవ్వకండి. కానీ కాట్లకుక్కలా అరవకండి" (పేజీలు 142,143) అధ్యాయం19.

"మీ కోసం చెడ్డగా ఎవరైనా కొన్ని వందల మాటలు, మాట్లాడనివ్వండి. వాటికి బదులుగా, మీకుకోపం వచ్చినట్టుగా, మీరు ఒక్కమాట కూడా వారికి బాధ కలిగించేలా మాట్లాడకండి. మీరు అలాఅన్నిటినీ సహించినట్లైతే, మీరు ఎంతోసంతోషంగా ఉండగలరు"(పేజీ144)అధ్యాయం19.

"ఇతరుల మీద, ప్రతీచిన్న విషయం మీదా అభియోగాలు మోపేవారూ, ఫిర్యాదులు చేసేవారూ, నాగుండెలో తూట్లుపొడిచి, నన్ను గాయపరచినట్టుగా, నేను భావిస్తాను. ఎవరైతే అటువంటి బాధలను, భరించి, సహిస్తారో వాళ్ళు నన్ను ఎక్కువగా సంతోషపెడతారు" (పేజీ175) అధ్యాయం44.

బాబాగారు పైన చెప్పిన ప్రవచనం నిష్ఠుర నిజం అవుతుంది. మాటల్లో ఎవరైనా, పరుష పదజాలాన్ని ఉపయోగిస్తే, ఆ మాటలు అవతలి వారి గుండెల్లో పదునైన బాణాల్లా గుచ్చుకుంటాయి. వాటిని వెనుకకు తియ్యడం అన్నదిజరగదు.

సాయిబాబా గారికి జంతువుల మీద. పక్షుల మీద ఉన్నా అనురాగం, ప్రేమ భక్తులందరికీ తెలిసినవే. ప్రతీరోజు, ఆయన యధావిధిగా తన యాచన, ముగించి రాగానే, ఆయన తన జోలెనుండి, తానుభిక్షగా స్వీకరించిన ఆహార పదార్థాలను. మశీదులో ఉన్న ఒక మట్టి పాత్రలో వేస్తారు. ఆవులు, కుక్కలు, పిల్లులు, దానిలో నుంచి తాము తినగలిగేంత తింటాయి. సాయిబాబాగారు, వాటిని ఎప్పుడూ బయటకి తరిమే వారు కాదు. శ్రీమతి

తార్కాడు గారు ఒకసారి, ఆకలితో ఉన్న కుక్కకు, రొట్టెముక్కను ఆహారంగా పెట్టడంచూసి, బాబాగారు ఆమెను ఎంతో మెచ్చుకున్నారు." ఇలాంటి మంచి పనులే, మిమ్మల్ని ఎప్పుడూ మంచి మార్గంలో నడిపిస్తాయి. ఈ మశీదులో కూర్చున్న నేను ఎప్పుడూ, అసత్యాలు చెప్పను. నన్ను గౌరవిస్తూ ఇలాంటి మంచి పనులు మీరు చేయండి. ముందు ఆకలితో ఉన్న వాళ్ళకు ఆహార మిచ్చి, ఆ తర్వాతనే మీరు తినండి." అన్నారు. (పేజీలు 121, 122) అధ్యాయం 9.

1917 సంవత్సరంలో షిర్డీ గ్రామంలో, ఒక చిన్నకుక్కను, పిచ్చికుక్క కరిస్తే, అది పెద్దకుక్కల వెంటపడటం మొదలు పెట్టింది. గ్రామస్థులు, కర్రలు పట్టుకుని, ఆచిన్న కుక్క వెంటపడ్డారు. అది అన్ని వీధుల్లో పరుగులు పెట్టి, చివరకి ద్వారకామాయి చేరుకుని, అక్కడ సాయిబాబాగారి, ఆశ్రయాన్ని పొంది, ఆయన వెనక నిలబడింది.

అప్పుడు గ్రామస్థులు "బాబా! అది పిచ్చికుక్క. దాన్ని బయటకి పంపండి. మేము దాన్ని చంపేస్తాం." అన్నారు.

బాబాగారు అందుకు సమాధానంగా "మీరే పిచ్చివాళ్ళు. బయటకి పొండి. ఆచిన్న జీవిని మీరు పీడించి, చంపాలనుకుంటున్నారా? "అని వాళ్ళని బయటకి పంపేరు. అలా, ఆయన ఆచిన్న కుక్క ప్రాణాన్ని కాపాడేరు. అది పిచ్చికుక్క కాదని తరువాత తెలిసింది.

సాయిబాబాగారు. విషజంతువులైన తేళ్ళు, పాముల పట్ల కూడా అహింసనే బోధించేరు. ఉదాహరణగా మనకు అధ్యాయం 22లో, హేమద్పంతు, సాయిబాబాగారిని, విషజంతువులను చంపాలా? వద్దా? అనిఅడిగేడు. దానికి, ఆయన" భగవంతుడు అన్ని జీవులలోనూ ఉంటాడు. అవి తేళ్ళయినా. పాములైనా సరే. ఆయనే అన్ని జీవులను ఆడించేసూ

త్రధారి. ఆయన ఆదేశాలకు అందరూ తల దించవలసిందే. ఆయన జరగాలనుకుంటే తప్ప, ఎవరూ, ఎవరికీ అపకారమన్నది చేయలేరు. అందువల్ల మనం, జీవజాలం అంతటి మీదా, కరుణ, ప్రేమ కలిగివుండాలి." అన్నారు. (పేజీలు 230, 233) అధ్యాయం 22.

సాయిబాబా గారి అహింసా ప్రబోధం అద్వితీయమైనది. తప్పు పట్టలేనిది. ఆయన తన భక్తులకు, తానూ, దైవం అంతటా నిండి ఉంటామని, జంతువులు, పక్షులు అన్న భేదం అన్నది ఉండదనీ నొక్కిచెప్పేరు. ఆయన, శ్రీమతి తార్కాడ్' తో అన్న ఈమాట దానిని స్పష్టంగా తెలియచేస్తుంది. "అమ్మా! నువ్వు భోజనం చెయ్యటానికి ముందు చూసి, తినేందుకు రొట్టెముక్కను ఇచ్చిన ఆకలితో ఉన్న కుక్క, నేను ఒక్కటే. నేను అలా అనేక రూపాలలో సంచరిస్తూ ఊంటాను. సకల జీవజాలంలోనూ నన్ను చూసే వాళ్ళు నేను ప్రేమించే వాళ్ళవుతారు." (పేజీలు 126,130) అధ్యాయం 9.

ఆయనకి ప్రీతి పాత్రులైన భక్తులు, ఆయన బోధనలను ఆచరిస్తూనే ఉంటారు. అందుకుఒక ఉదాహరణగా హేమద్పంతు చేసిన ఒక పనిని చెప్పుకోవచ్చు. కాకాసాహెబుదీక్షితు, 'రామవిజయం' ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తున్నప్పుడు, హేమద్పంతు వాటికి హాజరవుతూ ఉండేవాడు. ఒకసారి, అతడు ఆ ప్రసంగాలను వింటూ ఉన్నప్పుడు, అతడి భుజం మీద ఉన్న ఉత్తరీయం మీద ఒకతేలు కనిపించింది. బాబాగారి ప్రవచనాలు గుర్తున్న అతడు, దానిని చంపలేదు. జాగ్రత్తగా తన ఉత్తరీయం మీదున్న దానిని, అలాగే తీసుకు వెళ్ళి బయట ఉన్న తోటలో విడిచిపెట్టేడు. (పేజీలు183,207, అధ్యాయం33). అతని లాగానే, బాలనెవస్కార్' కూడా, తన ఆవుల శాలలోకి, నాగుపాము ప్రవేశిస్తే, దానిని శ్రీసాయిబాబా గారేనని భావించి, అది తాగేందుకు ఒక చెంబుతో పాలు తెచ్చిదాని ముందు పెట్టేడు. అధ్యాయం 35.

ఆయన భక్తులు, అన్ని జీవరాశుల్లోనూ సాయిబాబాగారు వుంటారని, ఒకసారి నమ్మినపుడు, వాళ్ళెవరైనా, ఏరూపంలో ఉన్న మాంసాహారాన్ని అయినా తినే ధైర్యం చేయగలరా?

అయితే, ఇక్కడ మరొక సంశయం కలుగుతుంది. బాబాగారు అహింసా ధర్మాన్ని ప్రబోధించిన సాధుగురువు అయినట్లైతే, ఆయనకి ఉన్నట్టుండి, తీవ్రమైన కోపంవచ్చి, దుర్భాషలాడుతూ, తన చేతిలో ఉన్న కర్రతో, భక్తులనెందుకు కొట్టేందుకు బయల్దేరుతారు? జవాబుగా ఇది, ఆయనను అనవసరంగా ఇబ్బందులు పెడుతున్న వాళ్ళను ఆపేందుకు ఆయనకు అవసరమైన పనే. దానిని సరిగ్గా చెప్పాలంటే" విషసర్పంకానిది కూడా, పడగవిప్పి, బుసకొట్ట వలసిందే. అది పడగ ఎత్తినప్పుడు, విషసర్పం అవునా! కాదా! అన్న ఆలోచనే లేకుండా మనిషి భయభ్రాంతుడవుతాడు కనుక అలా చేయాలి."

ఆ విధంగా సాయిబాబాగారి కోపం, బాహ్య ప్రదర్శన కోసం మాత్రమే. ఆయన, అంతరంగంలో భక్తుల మీద అపారమైన ప్రేమను కలిగి ఉంటారు. హేమద్పంతు ఇలా చెపుతారు" ఆయన కోపంతో ఊగిపోతున్నప్పుడు, ఆయన నేత్రాలు ఎర్రబడి గిరగిరా తిరుగుతున్నప్పుడు, కూడా ఆయన అంతరంగంలో భక్తుల మీద వాత్సల్యం, తల్లిప్రేమ వంటి విప్రవాహంలా సాగుతూనే ఉంటాయి. వెంటనే ఆయన తన భక్తులను పిలిచి," నేను, మీమీద కోపంగా ఉన్నట్టు నాకు తెలియదు. అమ్మ తన పిల్లలని కొట్టేదే అయితే, సముద్రం, తనలో చేరిన నదుల నీటిని, వెనక్కి తిప్పి పంపేదే అయితే, నేనూ, నా భక్తుల యోగక్షేమాలు విస్మరించినట్టే అవుతుంది" (పేజీలు73,75) అధ్యాయం11.

## అధ్యాయం12

# సత్ప్రవర్తన

మన శాస్త్రగ్రంథాలలో, మన జీవితంలో, మనం మసులు కోవలసిన తీరుతెన్నుల గురించి, తెలియచేసిన నియమ, నిబంధనలకు అనుగుణంగానే, మన ఆలోచన, ప్రవర్తన ఉన్నట్టయితే, అది 'సత్ప్రవర్తన' అవుతుంది. అదే శ్రీసాయిబాబాగారు ఎప్పుడూ చెప్పేవారు.

సమాజంలో మన మనుగడ సాగించేందుకు, ఒక పద్ధతి, ఒక లక్ష్యం ఉంటాయి. ఒకరు నిజాయితీగా జీవిస్తూ, ఎవరినీ, ఎప్పుడూ మోసం చేయకుండా ఉన్నట్లయితే, అతను అభివృద్ధి చెందుతూ, విజయాలను సాధిస్తాడు. రావుసాహెబు గాల్వాంకరు (అన్నా సాహెబు ధబోల్కరు గారి అల్లుడు) గారిని రెండు రూపాయలు దక్షిణ నిమ్మని అడిగినప్పుడు, బాబాగారు అతనికి రెండు విషయాలను చెప్పేరు. ప్రవర్తనలో సమగ్రత, రుజువర్తనముతో. శీలంలో స్వచ్ఛత, పవిత్రతతో జీవించాలన్నారు. మనుస్మృతి గ్రంథం, కూడా సత్ప్రవర్తన కలిగి ఉండటం పరమధర్మంగా చెపుతుంది.

స్వచ్ఛమైన మనస్సుని కలిగివుండటమన్నది, జీవన్ముక్తిని సాధించటానికి చాలా ముఖ్యమైనది.

“మనశ్శుద్ధి లేకుండా, ఎవరైనా ముక్తిని పొందటానికి ప్రయత్నాలు

సాగిస్తే, అది శక్తిని వృధాచెయ్యటం, జ్ఞాన ప్రదర్శన మాత్రమే అవుతుంది.” (పేజీ76) అధ్యాయం17.

సత్ప్రవర్తన లేకపోతే, మనశ్శుద్ధిని సాధించలేరు. “శాస్త్రగ్రంధాలు, అనుమతించిన కార్యకలాపాలు నిర్వర్తించ లేని వారికి, మన శ్శుద్ధి సిద్ధించదు. స్వచ్ఛమైన మనస్సు లేని వారికి, బ్రహ్మజ్ఞానం లభించదు. ”(పేజీ44) అధ్యాయం17.

“ఈమనుష్య జన్మ పొందినవారు, తన వంటివారి కోసం, లిఖించబడిన నియమ, నిబంధనల ప్రకారం, ప్రవర్తించాలి. అప్పుడు మాత్రమే పవిత్రమైన మనస్సును, వారు, సాధించగలుగుతారు. ఫలితంగా బ్రహ్మజ్ఞానం వారికి లభిస్తుంది.” (పేజీ88) అధ్యాయం37.

బ్రహ్మజ్ఞానం పొందిన తర్వాత కూడా, స్వచ్ఛమైన మనస్సుతోనే ఉండాలి. “గ్రంధాలలో నిషేధించబడిన దుష్కర్మలను నిరంతరం ఆచరించేవాడు, ఏదైతే తనకు ప్రయోజనం కలిగిస్తుందో, కలిగించదో, గుర్తించలేని వాడు బ్రహ్మజ్ఞానం కలిగి ఉండి సాధించేదేమిటి?” (పేజీ 25) అధ్యాయం17.

“బ్రహ్మజ్ఞానాన్ని, సాధించిన తర్వాత కూడా, ఎవరైనా శాస్త్రనియమ, నిబంధనలను ఉల్లంఘించి ప్రవర్తిస్తే, వారు ఈ భూమి మీద కానీస్వర్గంలో కానీ నివాసులు కాకుండా, రెండిటి మధ్యావేలాడుతూ త్రిశంకుడిలా ఉండిపోతారు. (ప్రఖ్యాతి చెందిన సూర్యవంశ రాజైనత్రిశంకుడుని, భూమి మీదా, స్వర్గంలోనూ నివశించడానికి వీలులేదన్నప్పుడు, రెండిటికీ మధ్య వేలాడుతూ అతడు ఉండిపోయేడు. (పేజి49) అధ్యాయమ్17.

“బాహ్యంగా, బ్రహ్మజ్ఞాన సముపార్జన కోసం తపిస్తున్న వ్యక్తిలా కనిపిస్తూ, ప్రదర్శనలు ఇస్తూ ఆంతరంగికంగా వక్రమైన ఆలోచనలతో ఉండి,

నిర్దేశించబడిన సత్ప్రవర్తనా నియమావళిని విస్మరిస్తూ, దుర్మార్గ చేష్టలను చేస్తున్నవ్యక్తి, ఆధ్యాత్మికంగా అజ్ఞాని అనే చెప్పాలి. " (పేజీలు 70, 73, 75) అధ్యాయం17.

నీతిమంతుడి సత్ప్రవర్తనని, ఉదాహరించడానికి, శ్రీసాయిసత్చరిత గ్రంథరచయిత, అధ్యాయం 24లో సుదాముడి చరిత్రను (సాందీపముని ఆశ్రమంలో, శ్రీకృష్ణుని సహాధ్యాయి) ఇలా తెలిపేరు. "ఒకసారి, బలరాముడు, శ్రీకృష్ణుడు, ఆశ్రమానికి కావలసిన కట్టెపుల్లలుతేవడానికి అడవికి వెళ్ళేరు. వాళ్ళు దాహంవేసి, నీళ్ళు తాగేముందు, తినేందుకు గాను వారి కోసం, సాందీపముని భార్య, సుదాముడితో, కొన్ని వేపిన పప్పుగింజలను పంపింది. తర్వాత అడవిలో, శ్రీకృష్ణుడు, సుదాముడి దగ్గరకు వచ్చి, " నాకు దాహంగా ఉంది" అన్నాడు. అప్పుడు, సుదాముడు" కొంచెం ఆగు. ఎమీ తినకుండా ఎవరూ నీరు తాగకూడదు." అన్నాడు. కానీ అతడి దగ్గర, గురుపత్ని ఇచ్చిన గింజలు ఉన్నా, వాటిని అతడు క్రిష్ణుడికి ఇవ్వలేదు. తర్వాత శ్రీకృష్ణుడు, సుదాముడి, తొడమీద తన తల పెట్టుకుని, నిద్రపోయేడు. అప్పుడు సుదాముడు తను దాచుకున్న వేపిన గింజలను తినడం ప్రారంభించేడు. వాటిని, అతడు నములుతున్న శబ్దాలకు, క్రిష్ణుడికి తెలివివచ్చి, "ఏమిటి. నువ్వు తింటున్నావు? అని అడిగేడు. దానికి సుదాముడు" నేను చలికి వొణికిపోతున్నాను. నాపళ్ళు చలికి తట్టుకోలేక కటకటలాడుతున్నాయి. అంతే, నేను విష్ణుసహస్రనామస్తోత్రాన్ని కూడా చదవలేకపోతున్నాను" అని బొంకేడు. అంతా తెలిసిన వాసుదేవుడు" నాకు ఇప్పుడేకలలో, ఒక మనిషి ఏదో తింటున్నట్టు కనిపించింది. అదేమని నేనడిగితే," నేను తినడానికి దుమ్మూ, ధూళీ తప్ప ఏం ఉంది? అన్నాడు. అంతే అన్నా! నువ్వు, నాకు పెట్టకుండా ఏదీ తినవని నాకు తెలుసు. కానీ కలలో కనిపించిన దాని ప్రకారమే నిన్నడిగేను. " అన్నాడు.

సుదాముడు, శ్రీకృష్ణుడి సర్వజ్ఞత గురించి, అతడి లీలల గురించి, ఏకొంచెం తెలిసినా అలా మాట్లాడి వుండేవాడు కాదు. అందుకు ఫలితంగా, అతడి తర్వాత జీవితంలో చాలా కాలం పాటు, నిరు పేదగానే గడపవలసి వచ్చింది. చాలా కాలం అలాగడిచేక, అతడు తన భార్య కష్టపడి సంపాదించిన అటుకుల్లో, ఒక చేరడు గింజలు, తీసుకువెళ్ళి, శ్రీకృష్ణుడుకి, ఇస్తే అతడు ఎంతో సంతోషించి, సుదాముడుకి బంగారుభవనాన్నీ, అమూల్య సంపదలనీ ఇచ్చి, ఆనందభరితుడిని చేసేడు.

అందుకే శ్రీసాయిబాబాగారు, దుర్మార్గంగా ప్రవర్తించే వ్యక్తుల గురించి, ఇష్టంలేని వారుగానే మాట్లాడేవారు.

వాళ్లతో, ఎటువంటి వ్యవహారాలూ చేయవద్దని చెప్పేవారు." తన ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించే మనుషులు, ఇదితప్పు అని దేని గురించైనా చెపితే, వాళ్ళు మూర్ఖులు. సత్ప్రవర్తన నియమ, నిబంధనలను పాటించని అటువంటి వారిని మీరు ముందు దూరంగా పెట్టండి" అని చెప్పేరు. (పేజీ 78)

"ఎప్పుడైనా, ఏ సందర్భంలోనైనా, వాళ్లు మీముందుకు వస్తే, వాళ్ళు ప్రమాదకారులని తెలిసిన మీరు, వాళ్ల నుండి దూరంగా ఉండండి. అలా చేయడంవల్ల, మీకు ఏదైనా ఇబ్బంది ఎదురవుతుందని తెలిసినా, మీరు వాళ్ళ నీడలో నిలబడకండి" అని కూడా శ్రీ సాయిబాబాగారు చెప్పేరు. (పేజీ 79) అధ్యాయం 3.

# అధ్యాయం 13

# బ్రహ్మానందం

శ్రీసాయిబాబా గారు పరమానందస్వరూపుడు. హేమద్పంతు" శ్రీసాయిసత్చరిత గ్రంథంలో, ఆయన గురించి ఇలా రాసేరు" సాయిబాబాగారిని 'పరమానందగని' అనే చెప్పాలి. అంచుల వరకూ సముద్రంలో నీరు నిండి ఉన్నట్టే, ఆయనలో పరమానందం అవధులు లేనిదిగా ఉంటుంది. భక్తుడు గానీ అదృష్టవంతుడైనట్లైతే, ఆయన దగ్గర నుండి, అతడు ఎటువంటిలోటు లేని అపరిమితమైన ఆనందాన్ని, పొందగలుగుతాడు". (పేజీ 66) అధ్యాయం 1

"సాయిబాబాగారి ఆధ్యాత్మిక స్థితి, పరిపూర్ణ సత్యంతో, బ్రహ్మజ్ఞానంతో మమేకమై ఉంది. ఆయన ఐహిక ప్రపంచంలోని సుఖదు:ఖాలకు, జాగరూకతలకు అతీతుడు. ఆయన పరమానందమే రూపుదాల్చినట్టు, ఉండే మనిషి. పండితులు శాస్త్రాలలో చదివేది, ఆధ్యాత్మిక ప్రసంగాలలో ప్రజలంతా వినేది అయిన బ్రహ్మజ్ఞానం కలిగించే బ్రహ్మానందం, భక్తులు షిర్డీలో అడుగు పెట్టగానే పొందగలరు." (పేజీలు 37,38) అధ్యాయం11.

పైన చెప్పినది సరైనదే. సాయిబాబాగారు, చాలా సరదాగా, ఉల్లాసంగా, నవ్వుతూ ఉండే స్వభావం ఉన్న సద్గురువు. ఆయన యవ్వనప్రాయంలో,

కాళ్ళకు గజ్జెలు కట్టుకుని, ఒకరు వాయించే తంబురావాయి ద్యానికి, తన, మదురంగా గొంతెత్తి పాడుతూ, నాట్యం చేసినవారే. (పేజీ49, అధ్యాయం4). ఆయన, స్వరాన్ని జతచేసి గాఢమైన ఆలోచనా స్థితిలో ఉన్నప్పటికీ, 'మురళీ' స్త్రీల (మహారాష్ట్రలోని ప్రజలు ఆరాధించే శివుడి అవతారానికి, మరొకరూపమైన ఖండోబా దేవుడిని, తమ గానంతో, నాట్యంతో ఆరాధించడానికి అంకితం చేయబడిన స్త్రీలు) నాట్యాలను చూస్తూ, గానాన్ని వింటూ, తల ఊపుతూ మెచ్చుకుంటూ ఉండేవారు. దీపావళి పండగనాడు, ద్వారకామాయి లోనూ, దేవాలయాల్లోనూ, ఆయన దీపాలు వెలిగించడమన్నది కూడా ఆయనకి ఇష్టమైన పని. (పేజీలు103,104) అధ్యాయం5.

సాయిబాబాగారికి హాస్యం అన్నా చతురత అన్నా చాలా ఇష్టం శ్రీసాయిసత్చరిత గ్రంథం, అధ్యాయం 24లో ఆయన ధబోల్కరుగారు, తన కోటు చేయిమడతలో, తాను తినేందుకు దాచుకున్న పప్పు గింజల గురించి చేసిన వ్యాఖ్యానం గురించి మనం ముందే తెలుసుకున్నాం. అదే అధ్యాయంలో, అన్నా చించనీకరుకీ మౌషీబాయికీ మధ్య జరిగిన ఘర్షణను ఆయన ఆనందించడం గురించి కూడా రాసి ఉంది. దానిని ఆయన చాలా సమయోచితంగా" అన్నా! ఒక పసిపాప తన తల్లిని ముద్దాడితే, అది ప్రమాదమా? హక్కు లేకుండా చేసిన పని అని అంటామా?" అని చెప్పిని వారించేరు. (పేజీ119) అధ్యాయం24.

సాయిబాబాగారికి మహిల్సాపతితో, ఒక ప్రత్యేకానుబంధం ఉంది. సాయిబాబా గారు షిర్డీలో అడుగుపెట్టినప్పటి నుంచీ, ఆ ముసలి వ్యక్తి ఆయన భక్తుడిగానే ఉన్నాడు. తాత్యాకోటే పాటిలు అనే అతను కూడా, బాబాగారికి ముందు నుంచీ ఆహారం అందించే యువకుడు. అతడు బైజాబాయి అనే ఆమె చిన్న కొడుకు. మహిల్సాపతి, తాత్యాకోటేపాటిలు,

ఇద్దరికీ ప్రతీరోజూ, బాబాగారుతో కలిసి ద్వారకామాయిలోనే నిద్రించే ప్రత్యేక సదుపాయాన్ని ఆయన ఇచ్చేరు. నిద్రపోతున్నపుడు, వాళ్ళు ముగ్గురూ తమ పాదాలు ఎదురెదురుగా, తలలు మూడు వేరువేరు దిక్కులలో ఉండేలా పెట్టుకుని, నిద్రించేవారు. రాత్రి కొంతసేపు అయ్యేక సాయిబాబాగారు లేచి, ఒకరి పాదాలు, మరొకరి శరీరం మీద ఉంచి, లేదా ఒకరి పాదాలు తన శరీరం మీద ఉండేలాగ చేసి, తాను నిద్రపోయేవారు. పొద్దున్న నిద్రలేవగానే మహిల్సాపతి, పటేలు ఆశ్చర్యపోయి అదెవరు చేసారని అన్నప్పుడు, బాబాగారు చిరునవ్వు నవ్వేవారు. తాత్యా, బాబాగారిని" మామా" అని పిలిచేవాడు. అందువల్ల వారిరువురి మధ్యా చిలిపి తగాదాలు జరుగుతూ ఉండేవి. వారిలాగానే బాబాగారితో మరింత ఆత్మీయంగా ఉండే భక్తుడు షామాలేదా మాధవరావు దేశ్‌పాండే. అధ్యాయం 36లో, బాబాగారు, అతడిని బుగ్గమీద నవ్వుతాలకి, గిల్లడాన్నిమనం చదువుకున్నాం.

ఆయన, తన ఆనంద భరిత స్వభావాన్ని మన ముందు ఉంచడం ద్వారా, మనకి మానవ జీవితంలో విపత్తులు, దురదృష్టాలు సంభవిస్తూనే ఉంటాయని, వాటికి మనం చింతిస్తూ, కుంగిపోతూ ఉండకుండా, అన్ని వేళలా సంతోషంగా, నవ్వుతూనే ఉండాలి అని సందేశమిచ్చేరు. అందుకు ఆయన అన్న మాటలు" మొదటి నుండి చివరివరకూ, విధిఎటువంటి పరిస్థితులని కల్పించినా సరే, ఒకటే లక్ష్యంతో, దిగులు చెందకుండా, మనిషి సంతృప్తిగా జీవించాలి. (పేజీ3) అధ్యాయం13." జీవితంలో ఒక్కక్షణం కూడా చింతించకు. ఎప్పుడూ సంతోషంగానే ఉండు. అన్నది బాబాగారి సందేశం." (పేజీ3) అధ్యాయం17.

దాసగణు మహారాజు, సాయిబాబాగారి ఇటువంటి సందేశాన్నే తాను రాసిన" భక్తి లీలామృతంలో రాసేడు.

“ఒక తెలివైన వ్యక్తి, తన విధి రాతప్రకారం ఎటువంటి పరిస్థితుల్లో జీవించవలసి ఉన్నా, అశాంతిగా ఉండకుండా నిత్యానందమయుడిగానే ఉండాలి.” (పేజీ 66) అధ్యాయం 32.

అన్నా చించనీకరు, తన మామ దభోల్కరు, పదవీ విరమణను పొందేక, ఆయన కోసం ఏదైనా పనికల్పించమని సాయిబాబాగారిని ప్రార్థించినప్పుడు, ఆయన అతడితో, ఇలా అన్నారు.” అతడిని, ఇప్పుడు నాసేవలోనే ఉండనియ్యి. అతడి రోజు వారీ జీవితం సంతోషంగానే గడుస్తుంది. అతడి జీవితంలో అతను ఆహారం తినేపళ్ళెం ఎప్పుడూ నిండుగానే ఉంటుంది. అతడు అన్నివేళలా నన్నుభక్తితో సేవ చేస్తూ ఉంటే, అతని సమస్యలన్నీ పరిష్కరించబడతాయి.” (పేజీ 77) అధ్యాయం 3

అదేవిధంగా అధ్యాయం 35లో, కాకామహాజని సంస్థకు యజమాని అయిన థక్కర్’ ధర్మశ్రీగారికి, బాబాగారు చాలా అందమైన సూచనని పరోక్షంగా తెలిపేరు.” ఒకప్పుడు, ఒక చంచలమైన మనస్తత్వం కలిగినపెద్ద మనిషి ఒకడుండేవాడు. అతడు ఐశ్వర్యవంతుడు. ఆరోగ్యవంతుడు కూడా. అతడికి మానసిక, శారీరకరుగ్మతలు ఏవీలేవు. అయినప్పటికీ, అతను తనకి అవసరం లేని ఆందోళనలను, అక్కర్లేని బాధ్యతలను మీదవేసుకుని, అటూ, ఇటూ తిరుగుతూ తల్లడిల్లుతూ ఉండేవాడు. మనశ్శాంతిని కోల్పోతూ ఉండేవాడు. కొన్నిసార్లు, తనకి అక్కర్లేని బాధ్యతలను పక్కన పడేసేవాడు. కొంతకాలం గడిచేక మళ్ళీ వాటిని తన నెత్తి మీద పెట్టుకునే వాడు. అతని మనస్సుకి స్థిరత్వం ఉండేది కాదు. అతని పరిస్థితికి నాకు, జాలి కలిగి అతనికి ఒక మాట చెప్పేను.” ఇప్పుడు, నువ్వునీ విశ్వాసాన్ని ఏదో ఒకలక్ష్యం మీదనే ఉంచు. ఎందుకలా అన్నిటి చుట్టూతిరుగుతావు? ఒక్క దగ్గరే స్థిరంగా ఉండు.” (పేజీలు 115,118) అధ్యాయం 35.

క్లుప్తంగా శ్రీసాయిబాబా గారి బోధన గురించి చెప్పాలంటే," ప్రతి ఒక్కరూ అన్నివేళలా సంప్తిగా ఉండి, జీవితాన్ని నవ్వుతూ గడపాలి. అలాగే, ఎవరైనా, తమ తుదిలక్ష్యమైన ఆత్మసాక్షాత్కారాన్ని, జీవనముక్తినీ పొందాలంటే, బ్రహ్మజ్ఞానంలో లీనమై పోవడం వంటివాటిలో మునిగిపో కుండా, ఎల్లప్పుడూ సంతోషంగా ఉండే స్వభావాన్ని అలవర్చుకుంటే, వాళ్ళ మనస్సు ప్రశాంతతతో, తృప్తితో, ఆనందంతో నిండిపోతుంది. అదేవాళ్ళ జీవితానికి అంతిమ లక్ష్యం అవుతుంది.

ఆయన ఈమాటలు విన్నవాళ్ళకి ఒక అనుమానం కలిగి, వాళ్ళు' అది ఎలా చేయాలి?' అని ఆయనను అడుగుతారు. అలాటి సందర్భాలు తటస్థించినపుడు, శ్రీసాయిబాబాగారికి,, అపరిమితమైన ఆగ్రహం కలిగి, తన చేతికర్రను, భక్తులను కొట్టేందుకు ఎత్తిపట్టుకుని ఆయన వాళ్ళ వెంటపడే వారు. ఆఆవేశం, ఆయనలో క్షణాల్లో తగ్గిపోయేది. ఆయన మామూలుగా మారిపోయేవారు. ఆయన హృదయంలో భక్తులంటే అంతులేని ప్రేమ ఉండేది.

శ్రీసాయిసత్చరిత' గ్రంధాన్ని రాసిన హేమద్పంతు గ్రంధం అధ్యాయం 11లో ఇలా రాసేరు." ఆయన కోపంతో ఊగిపోతూ కనిపించినా, ఆయన నేత్రాలు అరుణిమదాల్చి, గిరగిరా తిరుగుతున్నట్టు, చూసేవాళ్లకి అనిపించినా, ఆయన అంతరంగంలో భక్తుల మీద ఆప్యాయత, నిరంతరాయంగా ప్రవహిస్తూనే ఉంటుంది. తల్లిప్రేమ వంటిప్రేమ, ఉరకలేస్తూనే ఉంటుంది. ఆకోపంతగ్గిన వెంటనే ఆయన భక్తులను దగ్గరకు రమ్మని కేకవేసి, పిలిచి, తనకు వాళ్లమీద కోపం వచ్చిన సంగతే, తనకు తెలియదనీ, తానేంచేసినా, అది తల్లి, తన పిల్లల్ని కొట్టడం, సముద్రం తనలో చేరిన నదుల అలలను, తిప్పిపంపడం వంటిదనీ, తాను తన భక్తులను, సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తే,

అలా అనుకోవచ్చనీ, తాను ఎప్పటికీ తన భక్తులకి బానిసనే అనీ, ఎప్పుడూ వాళ్లతోనే ఉంటాననీ, వాళ్ళు ఎప్పుడు పిలిచినా, పలుకు తాననీ చెప్పేవారు." (పేజీ69,70)

సత్యం చెప్పాలంటే, సాయిబాబాగారి ఆగ్రహం బయటకు కనిపించినా, అది తన భక్తులు, తనని అనవసరంగా విసిగించాల నిప్రయత్నించినపుడు, ఆయన చూపించే రూపమే. విజ్ఞులు చెప్పినట్టు," విషసర్పంకానిదైనా, ఒక సర్పంతన పడగని ఎత్తి, నిలబడితే, అది ప్రజలను భయపెట్టడానికి మాత్రమే." ఏది ఎలాగైనా, ఆయన మాత్రం తన భక్తులకి ఆగ్రహాన్ని దరిచేరనీయకండి అనే చెప్పేరు. (ఉదాహరణగా ఆయన చెప్పిన రెండు మేకల పునర్జన్మల విషయం (అధ్యాయం46),పాము, కప్పల సంగతి (అధ్యాయం47)మనం చూడవచ్చు.

# అధ్యాయం 14

# నిష్ఠ

శ్రీసాయిబాబాగారి బోధనలలో రెండు ప్రధాన పదాలు ఉన్నాయి. అవి నిష్ఠ (అకుంఠిత విశ్వాసం లేదా స్థిరమైన భక్తి మరియు సబురి (సహనం లేదా పట్టుదల)

అకుంఠిత విశ్వాసం లేదా స్థిరమైన భక్తి అంటే, ఎవరైనా తమ భూత, వర్తమాన, భవిష్యతు విషయాలలో తమను, సంరక్షిస్తూ ముందుకు నడిపించే దైవంగా భావించే తమ కుల దేవతని, లేదా తమని అన్ని వేళలా తోడుగా నిలిచి కాపాడే వ్యక్తిగా తలచి, సద్గురువును భక్తిగా ఆరాధించడం అని చెప్పాలి. అటువంటి భక్తిని తన మీద కలిగి ఉన్న భక్తుడు, తన చింతలను, బాధలను విడిచిపెట్టి ఉల్లాసంగా జీవితాన్ని గడపాలని కోరుకుంటే, శ్రీసాయిబాబా అతడిని ప్రశాంతమైన మనస్సుతో, ఆనందభరితంగా ఈలోకంలో జీవించేలా చేస్తారు.

అందుకు ఉదాహరణగా, 25వ అధ్యాయంలో, అహమ్మదు నగరానికి చెందిన దాముఅన్నా విషయాన్ని మనం చూస్తాము. దాముఅన్నా, బాబాగారిని

తాను ప్రత్తివ్యాపారం చెయ్యవచ్చో లేదో సలహా చెప్పమని అడిగేడు. సాయిబాబాగారు' చెయ్యవద్దు' అని చెప్పగానే, దాముఅన్నా నిరాశపడి, ఆయనని సలహా అడిగినందుకు చింతించేడు కూడా. తర్వాత, ఆ వ్యాపారం చేసిన తన మిత్రులు, తీవ్రంగా నష్టపోవడం చూసి, అతడికి సాయిబాబాగారి మీద భక్తి, పూర్తిగా స్థిరపడిపోయింది. ఆవిధంగా అతడే కాదు, కాకా సాహెబుదీక్షితు, బాపుసాహెబుబుట్టీ వంటిబాబాగారి గొప్పభక్తులు కూడా, ఆయన సలహా లేకుండా ఏపనీ చేసే వారు కాదు. కాకాసాహెబు అయితే, అన్నిటికీ పూర్తిగా సాయిబాబాగారి మీదనే ఆధారపడేవాడు. ముందు బాబాగారికి చెపితేనే కానీ. అతను ఏపనీ చేసేవాడు కాదు. (పేజీ96)

"ఈ స్థిర భక్తిపరుడు, తన జీవితంలో, ఎన్నో లక్షల లాభాలను తిరస్కరించేడు. తన విశ్వాసానికి, బాబాగారి మీద భక్తికి అతను మరణించే వరకు, కట్టుబడి ఉన్నాడు." (పేజీ100) అధ్యాయం45.

"ఏఆలోచన చేయడానికైనా, బుట్టీ ముందు సాయిబాబాగారిని సంప్రదించే వాడు. ఆయన అనుమతి లేకుండా అతను, ఏపనినీ మొదలు పెట్టేవాడు కాదు."(పేజీ150)

"అది బుట్టీఎప్పుడూ, మామూలుగా చేసేపని. బాబాగారి సమ్మతి లేనిదే అతను దేనికీ ముందుకు వెళ్ళే వాడు కాదు."(పేజీ151) అధ్యాయం39.

సద్గురువు మీద స్థిరమైన భక్తి, నమ్మకం ఉండటమన్నది, ప్రత్యేకంగా ఆత్మసాక్షాత్కారం పొందాలనుకునే వారికి చాలా అవసరం. ఆత్మసాక్షాత్కార సాధన మార్గమన్నది చాలా కష్టమైనదీ, బాధలు కలిగించేదీగా ఉంటుంది. అందువల్ల సాధకులకి, అనుభవజ్ఞుడైన సద్గురువు దయతో కూడిన మార్గ దర్శకత్వం, అందుకు చాలా అవసరం అనే చెప్పాలి. సాధన చెయ్యాలనుకునే వారి స్వంత తెలివి తేటలు, తర్కప్రౌఢిమ అందుకు ఉయోగపడవు.

హేతువులను శోధించడం వల్ల ఆత్మసాక్షాత్కార సాధకులకి ఎటువంటి ప్రయోజనమూ, సిద్ధించదు. సద్గురువు మీద అచంచలమైన భక్తి కలిగి ఉండటమే వారికి అత్యవసరమైనది. తమ తెలివైన సూక్ష్మ బుద్ధిని ఉపయోగించాల్సిన అవసరం ఎంత మాత్రం వారికి, లేదు. తమ ఆధ్యాత్మిక గురువు మీద స్థిరమైన భక్తి, నమ్మకం మాత్రమే వారికి ఉండవలసినవి."(పేజీ228)

"ఎవరైతే, కారణాలు వెతకటం, చర్చలకు సిద్ధపడటం, వివాదాలలో పాలుపంచుకోవడం, సిద్ధాంతపరీక్షలు వంటివాటిలో ములిగితేలుతూ ఉంటారో, వాళ్ళు తమ ఆత్మసాక్షాత్కార సాధనకి, సద్గురువు, సూచించే మార్గదర్శ కవి ధానాలను, సరిగ్గా స్వీకరించరు. సద్గురువు మీద స్థిరమైన భక్తి ఉండేవారు చాలా సులువుగా వాటిని ఆచరించి, ఆత్మ సాక్షాత్కారాన్ని సాధించగలుగుతారు. (పేజీ229) అధ్యాయం35.

"తర్కశాస్త్రంలో ఉద్దండులైన పండితులకి ఇది సాధ్యం కాదు. వాళ్లు, సందేహాలు, అనుమానాల సుడిగుండంలో చిక్కుకుంటారు. పవిత్ర గ్రంథాల అధ్యయనం, ఆధ్యాత్మిక గురువు మార్గదర్శకత్వం లేకుండా పరమాత్మ గోచరించడం, పరమాత్మ గురించి తెలుసుకోవడం, వాళ్ళకు స్థిరంగా జరిగేపని కాదు."(పేజీ122)

"84లక్షల జన్మల జనన, మరణాల వలయం నుండి తప్పించుకోవడానికి, తనలోని అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలటానికి, ఒక మనిషిలో ఉన్న అసంఖ్యాక నక్షత్రాలలా మెరిసే తెలివి తేటలు సరిపోవు. ఒక చంద్రుడిలాంటి వెలుగునిచ్చే పవిత్ర గ్రంథాలు, ఆధ్యాత్మిక గురువు వల్ల మాత్రమే అది సాధ్యపడుతుంది." (పేజీ123)అధ్యాయం16

శ్రీసాయిబాబాగారు అదే పనిగా ఒక మాట తన భక్తులతో చెపుతూ ఉండేవారు" అధిక తెలివి తేటలు వుండటం వల్ల, ఉపయోగం ఉండదు. పెద్దవాళ్ళ సలహాలను వినాలి" అన్నది ఆమాట. ఈవిషయంలో బాబాగారు తన స్వీయానుభవాన్ని చెప్పినట్టు అధ్యాయం 32లో రాసి ఉంది. శాస్త్ర గ్రంధాలను చదివి, ఆధ్యాత్మికజ్ఞానాన్ని పొందిన తరువాత, సాయిబాబాగారు, మరో ముగ్గురు మిత్రులు కలిసి, భగవంతుడిని చూడాలని అడవికి బయల్దేరేరు. అలా అన్వేషించే ప్రయత్నంలో వాళ్ళకి, అడవిలో ఒక బంజారీ (ఉప్పు, దినుసులు అమ్మేకొండ జాతి మనిషి) ఎదురయ్యేడు. అతడు, వాళ్ళకి" మీరు కొంత రొట్టె, తిని మీకుతోడుగా ఒక తోవతెలిసిన మనిషిని తీసుకువెళ్ళండి" అని సలహా ఇచ్చేడు. కానీ వాళ్ళు అతని మాటని వినకుండా, తమ అన్వేషణను కొనసాగించేరు. దానికి ఫలితంగా కొంతసేపటికి, వాళ్లు అడవిలో తోవతప్పిపోయి, అటూ, ఇటూతిరిగి, మళ్ళీ మొదటి ప్రదేశానికే వచ్చిచేరేరు. మళ్ళీ అదే బంజారీ వాళ్ళతో ఇలా చెప్పేడు." తెలివి తేటలు, మిమ్మల్ని అనేక ప్రదేశాలకు తిప్పుతాయి. కనుక ఒక తోవచూపించే మనిషి మీకు చాలా అవసరం. ఖాళీ కడుపుతో, అన్వేషణకు బయల్దేరిన వాళ్ళకి విజయం లభించదు." అన్నాడు. (పేజీ56).

సాయిబాబాగారితో వచ్చిన మిగిలిన ముగ్గురూ అతని మాటలని వినలేదు. సాయిబాబాగారు, అతడు ఇచ్చిన రొట్టెముక్కని తిని, నీళ్ళు తాగేరు. అప్పుడు ఒక అద్భుతం జరిగింది. ఒక ఆధ్యాత్మిక ఆచార్యుడు, ఆకస్మికంగా అక్కడకి వచ్చి, సాయిబాబాగారి అన్వేషణకు తాను సహాయపడతానని చెప్పేడు. బాబాగారు అతని వెంటనడిచేరు. ఆ ఆచార్యుడు, బాబాగారి రెండు పాదాలనూ, తాడుతో కట్టి, నీటితో నిండి ఉన్న ఒక బావిలో, ఆయనను తలక్రిందులుగా వేలాడదీసి, ఆతాడు రెండో చివరను పైన ఉన్న చెట్టుకొమ్మకు

కట్టేసి, వెళ్ళిపోయేడు. సాయిబాబాగారు, ఆ ఆచార్యుడి మీద పూర్తినమ్మకాన్ని కలిగివుండడం వల్ల ఆనందంగానే అలా ఉండిపోయేరు. అలా ఐదు లేదా ఆరుగంటలు గడిచేయి. అప్పుడు, అతను వచ్చి, బాబాగారిని కట్టిన తాడును విప్పి, ఆయనను తనతో పాటు, తన ఆశ్రమానికి, బోధించడానికి, తీసుకు వెళ్ళేడు. సాయిబాబాగారు తన అప్పటి పరిస్థితి గురించి, ఇలా చెప్పేరు." అణచి వేసేందుకు, కష్టసాధ్యమైన ప్రాపంచిక ఆశలు, కోరికలు అన్నీ నాలో నుంచి మాయమైపోయేయి. ఆధ్యాత్మిక మార్గంలోనేను పయనించే మార్గానికి అడ్డుగా ఉన్న గొలుసులు తెగిపోయేయి.నా ఆచార్యుడి, మెడ చుట్టూనా చేతులు వేసి, ఆయనను, నాకళ్ళల్లో శాశ్వతంగా నిలుపుకోవాలన్న కాంక్షనాలో కలిగింది." (పేజీ77)

"నాఆచార్యుడి ప్రతి బింబం, నాకళ్ళల్లో, కనబడకపోతే, నాకళ్ళు, గుండ్రంగా ఉండే మాంసపు ముద్దలు అని నాకని పించేది. అవిలేని అంధుడిగా ఉండటమే నాకు చాలనిపించేది. ఆయన ఆశ్రమంలో నేను ఉన్నప్పుడు, నాపరిస్థితి అలా ఉండేది." (పేజీ78)

తన ఆధ్యాత్మిక మార్గదర్శి మీద, శ్రీసాయిబాబాగారిది ఎంతగొప్ప విశ్వాసం?

'శ్రీసాయిసత్చరిత' గ్రంథంలోని అధ్యాయం 23లో ఆధ్యాత్మిక గురువుల మీద ఉండే, అపారమైన విశ్వాసానికి ఉదాహరణలు ఉన్నాయి.

ఒకసారి నానాసాహెబు చందోర్కరుగారితో కలిసి, ఒక యోగావిద్యార్థి, యోగాలో తనకి ఉన్న కొన్ని సందేహాలను తీర్చుకు నేందుకు, షిర్డీ వచ్చేడు. సాయిబాబాగారు అప్పుడు, ఒక ఉల్లిగడ్డను, రొట్టెనూ కలిపి తింటున్నారు (అది యోగులకి తినకూడనిది). అది చూసి, ఆయోగా విద్యార్థికి, బాబాగారు

తన సందేహాలను తీర్చలేరని అనుమానం కలిగింది. అయితే, ఆతర్వాత బాబాగారిలో ఇతరుల ఆలోచనలను, పసిగట్టగలిగే అపారమైన శక్తులు తెలిసేక, అతడు ఎంతోగౌరవంతో ఆయనను ఆశ్రయించి, తన సందేహాలన్నిటినీ తీర్చుకోగలిగేడు.

మరొక ఉదాహరణలో, షామారావుదేశ్' పాండేని ఒక విషసర్పంకాటు వేసింది. గ్రామస్తులు, వెంటనే అతడిని దగ్గరలో ఉన్న' విరోబా' (శివుడు) దేవాలయానికి, నయం చేసేందుకు తీసుకు వెళ్ళాలనుకున్నారు. కానీ, షామా వెంటనే పరుగెత్తి, సాయిబాబాగారి దగ్గరకి వెళ్ళిపోయేడు. అయితే సాయిబాబా, అతడిని చూసి. నాదగ్గరకి రాకు. ఇక్కడి నుంచి వెంటనే వెళ్ళిపో''' అని కోపంగా అరిచేరు. అయితే, షామా నిరాశ చెందలేదు. బాబాగారు ఉన్న మశీదు, మెట్ల ముందేకూర్చుని ఉండిపోయేడు. తర్వాత, బాబాగారు శాంతించి, తాను, నయం చేస్తానని అభయమిచ్చి, షామాను, అతని ఇంటికి పంపించేరు. ఆయన షామాను, విషసర్పంకాటు నుంచి తప్పించి, నయం చేసిన సంగతి, ఆమరు సటిదినం, పొద్దున్నే అందరికీ తెలిసింది. మూడవ ఉదాహరణలో, సాయిబాబాగారు, తనకు పరమభక్తుడైన కాకాసాహెబుదీక్షితు (శుద్ధబ్రాహ్మణుడు)ని, కత్తితో, ఒక మేకని చంపమని ఆదేశించేరు. ఒక విశ్వాస పాత్రుడైన, నిజభక్తుడిలా, అతడా పని చేసేందుకు

సిద్ధమయ్యేడు." మీఅమృతధారల్లాంటి మాటలు మమ్మల్ని శాసిస్తాయి. అవి మాకు శాస్త్రగ్రంథాలతో సమానం" అన్నాడతను.(పేజీ170)

"మాకు ఏ ఇతర మత సాంప్రదాయాలూ తెలియవు. మాగురువు చెప్పే మాటలను శిరసావహించడం ఒక్కటే, అన్ని గ్రంధాల సారాంశంగా, మాకు పవిత్రమైన గ్రంథంలా మేము భావిస్తామని చెప్పడంలో మాకెటు వంటి సంకోచం లేదు. సిగ్గుపడము" (171పేజీ)

"మాకు హింస అంటే అహింస అంటే ఏమిటో తెలియదు. మాగురువు పాదాలే మాకురక్ష. ఆయన ఇదిచెయ్యమని ఎందుకు చెప్పేరు అని మేము ఆలోచించము, చర్చించము. మాకర్తవ్యం ఆయన ఆదేశాలను పాటించడం మాత్రమే"(పేజీ175)

"మేము, మీశిష్యులం. మాకు మీఆదేశాలను ఎలా పాటించాలన్నది మాత్రమే తెలుసు. అవసరమైతే, వాటిని అమలు చేయడానికి, మేము మాప్రాణాలను కూడా త్యాగం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉంటాము."(పేజీ181)

ఒకసారి, సాయిబాబాగారు, కాకాసాహెబుదీక్షితుతో, తాను అతడిని విమానం మీద పైకి తీసుకువళతానని, వాగ్దానం చేసేరు. ఆమాటను, అతడు, తన తోటి బాబాగారి శిష్యుడు అన్నా సాహెబు దభోల్కరు గారితో, తాను బొంబాయిలో ఉన్న సబర్బను రైలులోని బెంచీ మీద కూర్చుని ప్రయాణంచేస్తూ ఉన్నప్పుడు చెపుతూ, ఆకస్మికంగా గుండె ఆగి, అక్కడే మరణించేడు. బాబాగారు తను ఇచ్చిన వాగ్దానాన్నినిలబెట్టుకుంటారనటంలో ఆశ్చర్యం ఏమీలేదు.

సూక్ష్మంగా చెప్పాలంటే, పరిపూర్ణమైన భక్తితో గౌరవంతో, ఎటువంటి తెలివితేటలను, సమర్ధతను ప్రదర్శించ కుండా, ప్రతీఒక్కరూ తమ సద్గురువును సేవించాలని, బాబాగారు బోధించేరు." మీ అగణిత తెలివితేటలను పక్కనపెట్టి, సాయి..సాయి.. అని నిరంతరం సాయినామాన్ని స్మరిస్తూ ఉండండి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నా ఈమాటలను సందేహించకండి." (పేజీ135)అధ్యాయం10.

హిందూ తత్వశాస్త్రంలోని షడంగాలలో పాండిత్యం కలిగి ఉండటం, వాటిలో విజయాలను సాధించటం చేయాల్సిన అవసరం మీకు లేదు.

మీరు, మీకు రక్షకుడిగా, మీకార్యక్రమాలకు, కర్తగా ఉండవలసిన మీకుకావలసిన ఒక ఆధ్యాత్మిక గురువును ఎన్నుకుని, నిష్టగా అతడిని సేవించండి" (పేజీ74) అధ్యాయం19.

# అధ్యాయం 15

# సబురి

శ్రీసాయిబాబాగారి బోధల్లో రెండు ముఖ్యమైన అంశాలు ప్రధానంగా వినిపిస్తాయి. మొదటిది నిష్టఅయితే, రెండవది సహనం లేదా 'సబురి'. ఆయన చెప్పిన దాని ప్రకారం, సబురి అంటే, అనుకున్న ఫలితం సిద్ధించే వరకూ, వేచిఉండటానికి సిద్ధపడటం. ఎవరైనా తమ ఆ రాధ్యకుల దేవత మీద గానీ, ఆధ్యాత్మిక గురువు మీద గానీ, అచంచల భక్తి, విశ్వాసాలు కలిగి ఉంటే, సబురి యాంత్రికంగా జతపడుతుంది. ఒక వేళ తన కోరికలకు భిన్నంగా ఆశించిన ఫలితాలు మొదటలో కనిపించినప్పటికీ, ఏభక్తుడూ, తానునమ్ముకున్న దైవంమీదా, గురువు మీదా, నమ్మకాన్నీ, భక్తినీ వదులుకోడు.

ఉదాహరణకు, అధ్యాయం 11లో కల్యాణ్' గ్రామానికి చెందిన హాజీసిద్దిక్' ఫాల్కే, తానుమక్కా, మదీనా పుణ్యక్షేత్రాలకు వెళ్ళివచ్చేక షిర్డీలోని సాయిబాబాగారి దగ్గరకు వచ్చేడు. బాబాగారు ఉన్న మశీదులోకి అందరూ వెళతారు. అయితే, బాబాగారు, ఫాల్కేని మశీదుమెట్లు ఎక్కడానికి కూడా అనుమతించలేదు. తొమ్మిది నెలలు, ఆయన ఫాల్కేని, అలాగే ఆపినా, ఫాల్కే

దిగులు చెందకుండా, అక్కడఅలాగే, ఆయన అనుమతి కోసం వేచిచూసేడు. అతడు, బాబాగారి ఆంతరంగికుడైన, భక్తుడు షామాని తాను లోపలకి వెళ్ళడానికి ఆయనకి చెప్పివొప్పించమన్నాడు. అప్పుడు బాబాగారు, అతడి సహనాన్ని పరీక్షించేందుకుగాను, అతడికి ఎన్నోప్రశ్నలు వేసి, అతడిని పరుషవాక్యాలతో నిందిస్తూ మాట్లాడేరు. దానికి ఫాల్కేఎటువంటి ప్రతిస్పందనాచూప లేదు. అప్పుడు సాయిబాబాగారు ఎంతో ఆనందించి, ఫాల్కేని, మశీదులోకి రానిచ్చి, అతడికి భోజనం పెట్టి, ధనం కూడా ఇచ్చేరు.

మరొక ఉదాహరణని కూడా అధ్యాయం 48లో చూడవచ్చు. అక్కలకోటకి చెందిన' సపత్నేకరు' అన్న భక్తుడిని కూడా'' నువ్వు బయటకిపో'''' అనికేకలు వేయడం ద్వారా, ఎన్నో సార్లు అతను ముందుకు రావడాన్ని ఆపేరు. అయితే, సపత్నేకరు చాలా సహనంతో, ఆయన మాటలను తల దాల్చి వెళ్ళిపోతూ ఉండేవాడు. చివరకి, సాయిబాబాగారు, అతడి సబురికి, సంతోషించి, అతను కోరినవరమైన సుపుత్రుడుని, ఆదంపతులకు జన్మించేలాదీవించేరు.'' ఈకొబ్బరి కాయను తీసుకువెళ్లి, మీఆవిడ చీరమడతలో ఉంచు. ఆతర్వాత నువ్వు నీచింతలన్నీ తొలగిపోయి నా దగ్గరకు వస్తావు." అని చెప్పేరు. (పేజీ166) అధ్యాయం48.

అలాగే, అధ్యాయం 41లో, దహను గ్రామమామ్లు తాదారు (కరణం) అయిన బాలాసాహెబుదేవు ఉదంతం కూడా ఇందుకు మరొక ఉదాహరణగా మనకి కనిపిస్తుంది. అతను శ్రీసాయిబాబాగారు స్పష్టమైన ఆదేశాలు ఇస్తేనే, తాను' జ్ఞానేశ్వరి' గ్రంథాన్ని చదువుతానని నిర్ణయించుకున్నాడు. తర్వాత, అతను షిర్డీలో సాయిబాబాగారి దర్శనానికి వచ్చినపుడు, బాబాగారు అతని మీద కళ్ళెర్రచేసి, నువ్వు నా బట్టలు దొంగతనం చేసావని నిందించి, ఎన్నోతిట్లుతిట్టి, అతడిని కొట్టడానికి అన్నట్టు, అతని వెంటపడ్డారు." నేను,

నిన్ను గొడ్డలితో నరుకుతాను. నిన్ను చంపి, ముక్కలుగా చేస్తాను. నువ్వెక్కడికి పరుగెత్తి, పారిపోతావు? నేను అక్కడికే వచ్చి నిన్ను చంపుతాను" అని బెదిరించేరు.

ఆయన, అలా అన్నా బాలాసాహెబుదేవు అస్సలు భయపడలేదు. ఆయన తిట్లు, అతని మనస్సులో ఎలాంటి ఆందోళనా కలగనేలేదు. సరికదా.. అతనిలో, ఆయన మీద భక్తిపొంగి, పొరలి అతడు సాయిబాబాగారి దూషణలు, బెదరింపులు, తన మీద జల్లుగా కురుస్తున్న పరిమళించే పుష్పాలుగానే భావించేడు.(పేజీ153)

ఆతర్వాత, సాయిబాబాగారు, బాలాసాహెబు దేవును, తనకు దక్షిణగా డబ్బు ఇవ్వమని పదేపదే అడిగేరు. ఎటువంటి ఆలోచనా చెయ్యకుండా అతను ఆయన అడిగిన ప్రతీసారీ ఇస్తూనే వచ్చేడు. ఆతర్వాత కొంతకాలానికి చాలా సహజంగానే అతడిని' జ్ఞానేశ్వరి' 'గ్రంథాన్ని చదవమని చెప్పేరు. అంతేకాదు అతడికి కలలో కనిపించి, అతను దానిని ఎంత వరకూ చదివేడో పరీక్షచేసి, దానిని ఎలా చదవాలో సూచనలు కూడా ఇచ్చేరు.

సహనం అంటే ధైర్యం, పట్టుదల, ధృఢనిశ్చయంతో ఉండటమని చెప్పాలి. విపత్తులు, దురదృష్టం ఎదురైనా తడబాటులేకుండా వుండాలి. తన భక్తులకు ఎదురయ్యే విపత్తులను, కష్టాలను సాయిబాబాగారు మొదటలో తొలగించే వారు. క్రమేపీ వాళ్ళు ఆధ్యాత్మిక పురోగతిని సాధిస్తున్నపుడు, తమ గతజన్మల కార్యాల వల్ల తమకు ఎదురయ్యే ప్రతిబంధకాలను, తామేధైర్యంగా ఎదుర్కోవాలని సూచించేవారు.

"మీరు వాటిని అనుభవిస్తే, అవే మీకు దూరంగా తొలగిపోతాయి. అన్ని జన్మలకీ, పునర్జన్మలకీ సంబంధించిన సత్యం అదే. కర్మ ఫలితాలను

అనుభవించడమే, వాటి నుండి దూరంగా ఉండటానికి ఉన్నఏకైక పరిష్కారం.” (పేజీ82) అధ్యాయం13.

ఒకసారి బొంబాయిలో, కాకాసాహెబు దీక్షితుగారి అమ్మాయి వత్సల మీద ఇనుపబీరువా పడింది. కానీ సాయిబాబాగారు రక్షించడం వల్ల ఆమెకి ఏమీ కాలేదు. ఆతర్వాత కొంత కాలానికి ఆమె, షిర్డీలో మరణించింది.

కాకాసాహెబు, తీవ్రమైన దు:ఖంలో మునిగిపోయేడు. అప్పుడు సాయిబాబాగారు, ఏక్' నాథమహరాజ్' రచించిన' భావార్ధ రామాయణాన్ని” తీసి, దానిలో రాముడు, వాలి భార్య తారకు, ఆమె భర్త మరణానంతరం ఇచ్చిన సలహా రాసి ఉన్న పేజీని, తెరచి, దానిని చదవమని కాకాసాహెబుకి చెప్పేరు.

అదేవిధంగా అధ్యాయం 33లో, షిర్డీకి మైళ్ళదూరంలో ఉన్న జలగాం జిల్లాలోని, జామ్నర్' గ్రామంలో పురిటి నొప్పులతో బాధపడుతున్న, నానాసాహెబు చందోర్కరుగారి కుమార్తె' మైనతాయి' సుఖప్రసవానికి సాయిబాబాగారు, అత్యవసరంగా ఉదీ, ఆరతిలను, షిర్డీలో ఉన్న' రామగిరిబువా'తో పంపించేరు. అయితే, ఆతర్వాత చాలా కొద్దికాలంలోనే ఆశిశుమరణం సంభవించింది. ఆమె భర్తకూడా అంతకుముందే మరణించేడు. అప్పుడు, ఆమె సంతానంలేని విధవ స్త్రీగా తీవ్రని రాశలో మునిగిపోయింది. ఆమె, తన ఇతర కుటుంబ సభ్యులతో పాటు, మరికొద్ది కాలం తర్వాత నానాసాహెబు, షిర్డీచేరుకుని, సాయిబాబాగారి ముందు చాలా క్రుంగిపోయి నిలబడ్డాడు. బాబాగారు అప్పుడు అతడితో ఇలా అన్నారు.” నానా! నువ్వు నీఅల్లుడు, మనవడు చనిపోయిన బాధతో రావడమంటే, తప్పుచేసినట్టే. నాదగ్గరకి నువ్వు అలా రావద్దు. ఎందుకంటే, నేను జనన, మరణాలను నియంత్రించగలిగే వ్యక్తిని కాను. అవివ్యక్తుల

గతజన్మల కర్మపరిణామాలు. చివరకి ఈసమస్త విశ్వాన్ని సృష్టించిన అపారశక్తివంతుడైన భగవంతుడు కూడా ఇందులో ఎటువంటి మార్పులు చేయలేడు. సూర్యుడిని, చంద్రుడినీ నియమిత కాలాలలో ఉదయించేలా చేసిన ఆదేవుడే, వాటిని రెండుగంటలు ఆలస్యంగా ఉదయించమనీ, రెండురోజులు తర్వాత ఉదయించమనీ చెప్పగలడని నువ్వు, నమ్ముతావా? ఆయన అలా ఏనాడూ చెయ్యడు. ఎందుకంటే అప్పుడు తీవ్రమైన గందరగోళ స్థితి సంభవిస్తుంది."

షిర్డీలోని ఉద్యోగిఅయిన అప్పాకులకర్ణి, లంచంతీసుకున్నట్టు అభియోగాలు రావడంవల్ల, జిల్లాకలెక్టరుగారు అతడిని, అహమ్మదు నగరం వచ్చి, తనకు విషయాన్ని రాసి, ఇవ్వమని ఆదేశించేడు. అప్పా భయపడిపోయి, సాయిబాబాగారి దగ్గరకి వచ్చి, తనని రక్షించమని ప్రార్థించేడు. బాబాగారు, అతడిని రక్షించేరు. కానీ కొన్ని దినాలకు అతడికి, కలరావ్యాధిసోకి, వాంతులు ప్రారంభమయ్యేయి. అతని భార్య, బాబాగారిదగ్గరకి, పరుగెత్తుకుంటూ వచ్చి, అతడికి ప్రాణభిక్షపెట్టమని, ప్రాధేయపడింది. అప్పుడు సాయిబాబాగారు" నువ్వు ఏడవకు. ఎవరైతే జన్మించారో, వారికి ఏదో ఒక రోజు మరణం కూడా తప్పదు." అన్నారు. (పేజీ156)

"ధరించినకోటు, చిరిగిపోతే, లేదా దాని మీద ఇష్టం పోయినట్లైతే, దాని యజమాని, దానిని పక్కన పడేస్తాడు." (పేజీ159)

"శరీరం కూడా ఆత్మ (ఆత్మ అంటే నారాయణుడే) ధరించిన కోటు లాంటిదే. ఆత్మనశించదు, ముక్కలు కాదు. మరొక ప్రత్యామ్నాయాన్ని అంగీకరించదు.' '(పేజీ160)

“అందువల్ల, ఏవైనామాయలు, మంత్రాలూ ఉపయోగించి, ఈ కోటుకు, మాసికలు వంటివి వేసి, నిత్యం ఉపయోగంలో ఉంచడానికి ప్రయత్నిస్తూ, దాని గమ్యం చేరడానికి, ఆపేందుకు ప్రయత్నించకు. దాన్ని గమ్యానికి వెళ్ళనీ.” (పేజీ161)

“అప్పా, నాకంటే ముందుగా, తన కఫనీ (భుజాల వెనుక నుండి వేలాడే పొడవాటి వస్త్రం)ని మార్చుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. అతని దారిని అడ్డుకోకండి.”(పేజీ162)

(దాసగణు మహరాజ్ 'రచించిన' అర్వాచీన భక్తిలీలామృతం' గ్రంథంలోని 31వ అధ్యాయం నుండి సేకరించినవి)

గోపాల అంబాడేకరు' గ్రహాల చెడు ప్రభావానికి గురైనట్టు మనకి తెలుస్తుంది. అతని ఆర్ధిక పరిస్థితి దుర్భరంగా మారిపోయి, విపత్తులు, ఒకదాని తర్వాత వచ్చి, అతని మీదపడ్డాయి. దానికి తట్టుకోలేక, అంబాడేకరు, తన కుటుంబజీవితం మీద విరక్తి కలిగి, షిర్డీవెళ్ళిపోయి, అక్కడ ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. కానీ సాయిబాబా గారు, అతడిని అక్కల కోట స్వామి జీవితచరిత్ర గ్రంథంలో ఉన్నఒకభాగాన్ని చదివింపచేయడం ద్వారా అతడి నిర్ణయాన్నిఅడ్డుకున్నారు. దాని సారాంశం ” ఒకరికి, జీవితంలో కేటాయించబడిన కష్టాలు, బాధలు, సుఖాలు, సంతోషాలు పూర్తిగా అనుభవించవలసి ఉంది.’ అని చెప్పవచ్చు. (పేజీ137)

“ఎవరికైనా తన రోగాలు, కుష్టువంటి వ్యాధులను, నిరాశ, నిస్పృహలను అనుభవించకుండా, ఆనందాలను, బాధలను స్వీకరించకుండా, ఆత్మహత్య సహాయం ఎలా చేయగలదు? (పేజీ138)

“తాను అనుభవించవలసి ఉన్న సంతోషాలను, బాధలను పూర్తిగా

అనుభవించకుండా ఎవరైనా మరణిస్తే, అలా మరణించిన మనిషి, వాటిని పూర్తిచేయడానికి మళ్ళీ జన్మించవలసి వస్తుంది. అందువల్ల నీ ఇబ్బందులను మరింత ఎక్కువైనా భరించు. ఆత్మహత్యకు పాల్పడకు.” (పేజీ139)

కొద్దిమాటల్లోనే చెప్పాలంటే, శ్రీసాయిబాబా గారు నిరంతరం సహనం గానే ఉండమని ఎప్పుడూ బోధించేవారు. మీరు ఆశించిన ఫలితాలు సిద్ధించే దాకా మీరు చాలా ఓపికగా ఎంతకాలం అవసరమైతే, అంతకాలం పాటు వేచి చూడండి. ఆపదలు, ఇబ్బందులు మీకు సంభవించినప్పుడు, మీ మనస్సు స్థిరత్వాన్ని పోగొట్టుకోకండి. ధైర్యంతో, ఓపికతో వాటిని ఎదుర్కోండి.” సహనం లేదా ’సబురి’ ధైర్యం లాంటిది. దానిని ఎప్పుడూ పోగొట్టుకోకండి ఎందుకంటే, అదొక్కటేమీ కెదురయ్యే అన్నికష్టాల నుండి, బాధల నుండి, ఇబ్బందుల నుండి దాటించగలుగుతుంది.” (పేజీ53)

“ఒక మగ మనిషిలో సహనం లేదా సబురి’ అతని పురుషత్వం అవుతుంది. అతనిలో మానసిక అశాంతినీ, నిస్పృహనీ, కష్టాలనీ అది తొలగిస్తుంది. అతడిలో ఏర్పడిన అన్నిభయాలను, కలిగే దిగుళ్లనీ, వాటిని అతడికి కలగజేసే కష్టాలను అనేక విధాలుగా నివారించడం ద్వారా అదిపూర్తిగా పోగొడుతుంది.” (పేజీ54)

“మనిషిలోని సద్గుణాలకు, మరియు ఆలోచనలకు రాజు లేదా రాణి వంటి మంచి ఆలోచనలు కలిగేందుకు సహనం ఒక గనిలా ఉపకరిస్తుంది. సబురి, విశ్వాసం రెండూ, అక్క, చెల్లెళ్ళ లాగా చాలా దగ్గర సంబంధం ఉన్నలక్షణాలు. (పేజీ56) అధ్యాయం 19.


సాయి సచ్చరిత్ర
శివరాత్రినాడు దాసగుణ,
గంగాస్నానానికి సింగబా
వెళ్ళగోరుట, బాబా
తన కాళ్ళవద్దకే
గంగను సృష్టించి, ఆయన
చేతులలో తెప్పించుట

## అధ్యాయం 16

# ఆపద్బాంధవసేవ

శ్రీసాయిబాబా గారు, తానుషిర్డీలో ఉన్న తొలినాళ్ల నుండే ఆపదల్లో, కష్టాల్లో ఉన్నవారికీ, నిరుపేదలకూ సేవచేస్తూ ఉండేవారు. మొదటి రోజుల్లో ఆయన షిర్డీ పరిసర గ్రామాల్లో తిరుగుతూ, అక్కడున్న వ్యాధిగ్రస్తులకు, చికిత్సలు చేసేవారు. ఆయన ఒకవైద్యుడిలాగా అభినయిస్తూ, రోగులను పరిశీలించిన అనంతరం, వారికి, చీటీల మీద మందుల పేర్లురాస్తూ ఉండేవారు. ఆయన వైద్యం అద్భుత ఫలితాలను ఇచ్చి, ఆయన పేరు పొందిన వైద్యుడు అయ్యేరు. (పేజీ46)

"ఆయన ఎవరి దగ్గరా వైద్యపరీక్షకు ఎటువంటి రుసుమునూ ఆశించేవారు కాదు. నిరుపేదలకూ, నిస్సహాయులకూ, ఆరోగ్యాన్ని ఇచ్చేవారు. అటువంటి వైద్యసహాయాన్ని అందించిన ఆయన, ఆప్రాంతంలో పేరెన్నికగన్నవైద్యశిఖామణి అయ్యేరు. (పేజీ47) అధ్యాయం 7.

సాయిబాబా గారు, వ్యాధులతో బాధపడుతున్నవాళ్ళకి చికిత్స చేయడమే కాదు కొన్నిసార్లు వాళ్ళ వంటిమీద ఉన్న జబ్బులను తన మీదకు రప్పించుకునేవారు. ఒకసారి వాళ్ళు షిర్డీలో ఉండగానే దాదాసాహెబు కపర్డీ గారి చిన్న కొడుక్కి , విపరీతమైన జ్వరం వచ్చింది. అప్పుడు, షిర్డీలో

అంటువ్యాధిగా విస్తరిస్తున్న బ్యుబానిక్' ప్లేగువ్యాధి ఉంది. అది తెలిసి, ఆకుర్రాడి తల్లిబాబాగారి పాదాలను పట్టుకుని, తమ స్వగ్రామమైన అమరావతికి వెళ్ళిపోవటానికి అనుమతించమని ఆయనను వేడుకుంది. అప్పుడు, ఆయన ఇలా అన్నారు.”

ఆకాశం నిండా మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. తొందరలోనే వర్షాలు కురుస్తాయి. పంటలు పండుతాయి. అప్పుడు మబ్బులన్నీ మాయమైపోతాయి. ఆకాశం నిర్మలంగా కనబడుతుంది.” (పేజీ106)

“తర్వాత, తన వొంటిమీదున్నకఫనీని, నడుము వరకూ ఎత్తి, పట్టుకుని ఆయన అన్నాడు.” అమ్మా! నువ్వెందుకు భయపడుతున్నావు? అని. ఆయన శరీరం మీద ఉన్న నాలుగు బుబూకురుపులునీ, ఆమెకి చూపేడు.” (పేజీ107)

“ఆ నాలుగు బుబూ కురుపులు, కోడిగుడ్డు పరిమాణంలో ఉన్నాయి. వాటిని, ఆమెకి చూపుతూ” చూడు. నీకోసం, నీ ఈ బాధను నేను భరిస్తున్నాను.” (పేజీ108) అన్నాడాయన. (పేజీ108)

శ్రీసాయిబాబా గారు, ఆపద్బాంధవుడిగా, వ్యాధిగ్రస్తుల, జబ్బులను నయం చేయడం మాత్రమే కాదు. వారి, విపత్తులను తొలగించడానికి, కొన్నిసార్లు, తనప్రాణాలను పణంగా పెట్టేవారు కూడా. ఒకసారి, ఒక కమ్మరి భార్య, ఇనుప కొలిమి తిత్తిని ఊదుతోంది. భర్తతనమీద చూపుతున్న కోపంతో, భయంతో ఉన్న ఆమె తనచేతిలో చిన్నకుర్రవాడున్న సంగతిని మరచి పోయింది. ఇబ్బంది పడుతున్నట్టున్న ఆపసివాడు, ఆమె చేతుల్లోంచి జారిపోయి, మండుతున్న కొలిమిలో పడిపోయేడు. సర్వం తెలిసిన సాయిబాబా, వెంటనే తన చేతిని, తన స్వంతధుని (ద్వారకామాయిలో అహర్నిశలూ మండుతూ ఉండే హోమాగ్ని) లోకి చాపేరు. ఆయన.

ఆరకంగా చేయటం వల్ల, ఎక్కడో దూరంగా మంటల్లో పడిన బాలుడు, బయటకి లాగబడి రక్షించబడ్డాడు. పర్యవసానంగా సాయిబాబాగారి, చేయి బాగా కాలిపోయింది గానీ దానినసలు ఆయన పట్టించుకోనే లేదు. (పేజీలు 73,80) అధ్యాయం7.

కొంతకాలం గడిచేక, సాయిబాబా గారు, వైద్యం చేయటం విడిచిపెట్టి, అనారోగ్యంతో బాధపడుతున్నవాళ్ళకి, తన 'ధుని' లోంచి' ఉదీ' (ధునిలోంచి సేకరించే పవిత్రమైన బూడిద)ని, వాళ్ళ వ్యాధులు తగ్గడం కోసం ఇచ్చేవారు. అందుకు ఉదాహరణగా మనకి అధ్యాయం 33లో ఒక ఉదంతం కనబడుతుంది. బాబాగారు, నానాసాహెబు చందోర్కరు గారి అమ్మాయి, మైనతాయిని ప్రసవ వేదనల నుండి తప్పించేందుకు, దానిని పంపించేరు. అధ్యాయం 34లో, మాలెగావు గ్రామవైద్యుని మేనల్లుడు, చిరకాలంగా బాధపడుతున్న ఎముక మీద ఉన్నకురుపుని కూడా, ఉదీ ద్వారానే ఆయన తొలగించేరు. అని ఉంది. ఆ ఉదీ అన్నది ఈరోజుకి కూడా చాలా ప్రతిభావంతమైన సర్వరోగనివారణి అన్నది అందరికీ తెలిసినదే. (పేజీ224) అధ్యాయం 35.

కొన్ని సమయాల్లో సాయిబాబాగారు, తన భక్తుల అనారోగ్యాలను, తన మానవాతీత శక్తులనుపయోగించి నయం చేసేవారు. భీమాజీపాటిలు, బాధపడుతున్న క్షయవ్యాధిని ఆయన, అతని వీపుమీద కర్రతోకొట్టి, అతనికలలో, అతని ఛాతీమీదపైకీ, కిందకీ, ఒకరాయిని బాబాగారే దొర్లిస్తున్నట్టుగా కనిపించి, పోగొట్టేరు. (అధ్యాయం13) అలాగే, డాక్టరు పిళ్ళేగారిని బాధపెడుతున్న, నారి పురుగులను ఆయన, పిళ్లే ముందుకుచాపి, కూర్చున్న కాలు మీద ప్రమాదవశాత్తూ అబ్దుల్ అడుగుపెట్టి, తొక్కేలాచేసి, వెళ్ళగొట్టేరు. (అధ్యాయం 34)

శ్రీసాయిబాబాగారు నిరుపేదలకు వైద్యం ప్రారంభించిన మొదటిరోజుల్లో, ఆయన వారికి మందులివ్వడం మాత్రమే చేయలేదు. వాళ్ళకి సేవచెయ్యడానికి ఎవరూ లేని సందర్భాలలో, ఆసేవలు కూడా ఆయనే చేసేవారు. ఆతర్వాత రోజుల్లో, ఆయన వయస్సు పెరగడం వల్లా, ఎంతోమంది ఆయన భక్తులు, తాము ఆ సేవలు చేసేటందుకు ముందుకు రావటంవల్లా, ఆయన, అటువంటి సేవలన్నీ వారితోనే చేయించేవారు. ఒకసారి, తీవ్రమైన అనారోగ్యంతో ఎన్నో బాధలు పడుతున్నస్త్రీ, బాబాగారి దగ్గరకి వచ్చి, తనకు భీమాబాయి, ఇంట్లో ఆశ్రయం కల్పించమని. ఆయనను వేడుకుంది. అప్పుడు భీమాబాయి" బాబా! ఆమె తీవ్రమైన అనారోగ్యంతో ఉంది. మాఇంట్లో, నేను ఆమెను ఎలా ఉంచుకోగలను?" అని ఆడిగింది. ఆమెకు సమాధానంగా బాబాగారు." ఆమె అనారోగ్యంతో ఉంటే నీకేమిటి? ఆమె నాసోదరి. నాకు, అత్యంత ఆత్మీయమైన సోదరి. ఆవిడని మీఇంటికి తీసుకువెళ్ళు" అని ఆదేశించేరు. మరేమీ మాట్లాడకుండా, భీమాబాయి, ఆమెని తన ఇంటికి, తీసుకువెళ్ళింది.

అలాగే, బాబాగారి దగ్గరే ఉన్న, బాలాజీపాటిలు నెవాస్కరు, బాబాగారిని, తన ఊరికి వెళ్ళడానికి అనుమతిని కోరేడు. సాయిబాబా గారు, అతనితో," దగ్దుభావు అనారోగ్యంగా ఉన్నాడు. అతడిని ముందుచూసుకో. తర్వాతవెళ్లు."

అని చెప్పేరు. దగ్ధుభావు, నల్లటి కుష్టురోగంతో బాధపడుతున్నాడు. బాలాజీపాటిలు, అతని శరీరం నుండి క్రిములను తీసివేసి, అతని విసర్జనాలన్నిటినీ తొలగించి, అతడిని శుభ్రంగా స్నానం చేయించేడు. అలా మరికొంతకాలం, బాలాజీ అతడి సేవలు చేస్తూనే ఉండిపోయేడు. ఆతర్వాత

దగ్ధభావు మరణించేడు. అప్పుడు సాయిబాబాగారు, బాలాజీపాటిలు నెవాస్కరుని, అతని ఇంటికి తిరిగి వెళ్ళటానికి అనుమతించేరు.

ఇలాటిదే మరోసంగతి, మనం అధ్యాయం 32 లో చదువుతాము. కాకాకేల్కరు గారి దగ్గరకి ఒకమహిళ వచ్చింది. ఆమె బాబా గారిని దర్శించుకున్నాక, మూడురోజులపాటు, తాను ఉపవాసం ఉంటానని, ఆయనతో చెప్పుకుంది. బాబాగారు, ఆమెని ఉపవాసం చెయ్యవద్దని, భోజనం చెయ్యమని చెప్పేరు. పైగా కాకాకేల్కరు గారి భార్య, ఇంట్లోకి రాని సమయం కనుక, వాళ్ళింట్లోనే ఆమె, పోలిపూర్ణాలు వంటి తీపివంటకాలను వండి, అందరికీ కడుపునింపిన తర్వాతే, ఆమెని తినమని చెప్పేరు, అలా ఆమెకు, మతపరమైన ఉపవాసం వంటి సంప్రదాయాలు పాటించడం కన్నా, అవసరంలో ఉన్న ఇతరులకు సాయపడటం ఎంతో మిన్న అని చెప్పేరు.

మనశాస్త్రగ్రంధాల్లో చాలావాటిలో, ఆకలితో ఉన్నవాళ్ళకి అన్నం పెట్టడం గురించి ఎంతో ప్రాధాన్యతతో రాసి వుంది." షడ్రుచులలో (తీపి, పులుపు, కారం, ఉప్పు, చేదు, వగరు) ని వంటకాలలో' వరణ' (మహారాష్ట్రలోని, పప్పుతో చేసే వంటకం) ఎంతగొప్పదో, ఆకలితో ఉన్నవాడికి భోజనం పెట్టడం కూడా అంతగొప్పదే." (పేజీ21)

"మధ్యాహ్నం పన్నెండు గంటలయ్యే సరికి, ఎవరైనాసరే, ఆకలివల్ల, అసౌకర్యానికి గురి అవుతారు, తనకేకాక అదే పరిస్థితి ప్రతీవారికీ కలుగుతుందని గ్రహించిన మనిషే సద్గురువు." (పేజీ14)

"ఎవరైనా అతిధి, భోజనానికి సరైనసమయంలో కానీ, వేళకాని వేళలో వచ్చినా కానీ, గ్రుహస్థుడు అతనిని భోజనంతో సంతుష్టిపరచాలి. అలాకాకుండా, ఎవరైనా, తన ఇంటికివచ్చిన అతిధిని, ఏవో కారణాలతో,

భోజనం పెట్టకుండా తిప్పి పంపినట్టయితే, అతని మరణానంతరం లభించే మరోజన్మలో చాలాబాధాకరమైన జీవితాన్నేఅనుభవిస్తాడు." (పేజీ17)

"తీవ్రమైన వ్యాధులతో, భయంకరమైన జబ్బులతో, బాధపడుతున్న వారికీ, అంధులకూ, చెవిటివాళ్ళకూ, కుంటివాళ్ళుగా వున్నవారికి, నిరాశలో ఉన్నవారికీ ముందుగా భోజనం పెట్టిన తర్వాతే, ఎవరైనా సరే తన బంధువులకు అన్నం పెట్టాలి" (పేజీ23) అధ్యాయం38.

అలా చెప్పిన సాయిబాబాగారు, పదేపదే, ద్వారకామాయి ఎదురుగా ఉన్నఖాళీస్థలంలో ఒకపెద్ద పొయ్యిని ఏర్పాటుచేసి, ఒకపెద్ద వంటపాత్రలో తానే స్వయంగా అన్నంవండి, దానిని పేదలకూ, ఆపదల్లో ఉన్నవారికీ వడ్డించేవారు. బయటిప్రాంతాల నుండి, తనను దర్శించడానికి వచ్చేవాళ్ళకి, షిర్డీలోనే నివశిస్తున్న తన భక్తులు, భోజనాలు పెట్టేందుకు అన్ని ఏర్పాటులూ చేసేవారు. వాళ్ళ, ఇళ్ళల్లో వీలయితే అక్కడేపెట్టేలా, లేకపోయినట్లైతే, ఒకభిక్షాపాత్రని, ఇంటింటికీ పంపించి, సేకరించిన ఆహారపదార్ధాలు అందరికీ పంచిపెట్టేలా చేసేవారు. 1910 సంవత్సరం తర్వాత, అసంఖ్యాకమైన రకరకాల రుచికరమైన వంటకాలు, వేరువేరు ఆహారపదార్ధాలు, ఆయనకు నైవేద్యాలుగా భక్తులు ఇస్తూనే ఉండటంవల్ల, ఆయనకి తానే స్వయంగా వండి, వడ్డించాల్సిన అవసరం తీరిపోయింది.

శ్రీసాయిబాబా గారి అపారమైన కరుణ కేవలం మనుష్యుల మీదనే కాదు, జంతువులు, పక్షులు, క్రిములు, కీటకాలు, చివరకి చీమల వంటి చిన్నప్రాణుల మీదకూడా వెల్లివిరుస్తూనే ఉండేది. ఒకసారి ఒకచిన్నకుక్కని ఒకపిచ్చికుక్క కరిస్తే, అది మిగిలిన కుక్కలన్నిటినీ కరవడం మొదలుపెట్టింది. గ్రామస్థులు, దానిని చంపడానికి కర్రలు తీసుకుని, దాని వెంటపడ్డారు.

దానికి భయపడిన  ఆ కుక్క గ్రామంలోని వీధులు, సందుల్లో పరుగెత్తి, చివరకి ద్వారకామాయిలో ఉన్నసాయిబాబా గారు కూర్చున్నదగ్గరకి చేరి, ఆయన వెనుక, నక్కి దాక్కుంది. గ్రామస్థులు, ఆయనతో, అదిపిచ్చికుక్క కనుక, దానిని తమకి అప్పగించమనీ, దాన్నితాము చంపేస్తామనీ బ్రతిమలాడేరు." మీరు తెలివిలేని వాళ్ళు. ఇక్కడ నుంచి వెంటనే వెళ్ళండి. ఇలాటి మూగజీవిని మీరెందుకు చంపుతారు?" అని బాబాగారు వాళ్ళని గద్దించి, పంపివేసి, ఆకుక్క ప్రాణాలు కాపాడేరు.

శ్రీసాయిసత్చరితను, రచించిన హేమద్పంతు గారు అధ్యాయం 23లో." ఎవరికైతే యజమాని గాని, సహాయకుడు గానీ వుండరో వారికి సంరక్షకుడిగా, తల్లిలాగా సాయిబాబా వుంటారు. ఆయన నివశించే మశీదులో ఎన్నోపాడైపోయినవి, కుళ్ళిపోయినవి, పనికిరానివిగా ఉన్నవి సేద తీరుతూ కనిపిస్తాయి" అని రాసేరంటే, అందులో ఆశ్చర్యం ఏమీ ఉండదు. (పేజీ110) అధ్యాయం 23.

ప్రతీ రోజూ భాగోజీ అనే ఒక కుష్టురోగి, సాయిబాబా గారి పాదాలకు, చేతులకూ నెయ్యి (పరిశుభ్రమైన వెన్నతో కాచినది) రాసి, వాటిని మర్దిస్తూ ఉండేవాడు. ఆయన చాపివుంచిన కాళ్ళను భక్తులు (మగవారు, మహిళలు) నొక్కుతూ పరిచర్య చేసేవారు. ఆయన వాళ్ళతో అలా చేయించుకోవడమన్నది భక్తులకు, ఇతరులకు సేవచేయడంలోని అఔన్నత్యం గురించి బోధించేందుకే గానీ, ఆయన గొప్పతనాన్ని చూపించుకోవడం కోసం, మాత్రంకాదు.

స్పష్టంగా చెప్పాలంటే, సాయిబాబా గారి బోధనల్లో, పేదలకీ, ఆపదల్లో ఉన్నవారికీ సేవచెయ్యటం అన్నది ప్రముఖమైనది. ఆయన మాటల ప్రకారం, మతపరమైన ఉపవాసాలు, మొక్కులు చెల్లించడం వాటికంటే, భవంతుడిని

ఆరాధించడానికి, ఇది ఉత్తమమైనమార్గం. ఈసందర్భంగా నేను, శ్రీస్వామి వివేకానంద గారు చెప్పిన మాటలను పొందుపరుస్తున్నాను.

ఇక్కడ, ఈ ప్రపంచంలో

ఇలాంటి కళ్ళతో?..

అతడి ముఖం ముందు ముఖం పెట్టి

"భగవంతుడిని నువ్వు చూడాలను కుంటున్నావా..!

ఆపదలో ఉన్నఒక మనిషికి సేవచెయ్యి.

అతడి నవ్వులు విరుస్తున్నమొహంలో

అప్పుడునువ్వు భగవంతుడినిచూడు.

## అధ్యాయం 17

# పుస్తకపఠనం

శ్రీసాయిబాబాగారు ఏపాఠశాలలోనూ, చదువునేర్వలేదు. ఏగురువు ఇంటివద్దా విద్యనభ్యసించ లేదు. ఆయన గ్రామీణ మరాఠీభాషనూ, ఉర్దూభాషను మాట్లాడేవారు. ఆయన మరాఠీభాషలోని పుస్తకాలను గానీ,సంస్కృత భాషలోని పుస్తకాలను గానీ కనీసం ఖున్‌ను గానీ చదవడమన్నది ఎవ్వరూ చూడలేదు. కానీ, ఆయనకు చాలా పుస్తకాలలోని విషయాలు తెలుసు. వాటిలోని పదాలను ఆయన గుర్తుంచుకుని, పలకడమే కాదు వాటి సరైన అర్థాలను చెప్పేవారుకూడా.

ఒకసారి ఆయన, కాకాసాహెబు దీక్షితుతో" నువ్వు ప్రతీరోజూ' బృందావనపోతీ' (పోతీ అంటే ప్రార్ధనా పుస్తకం) చదువుతూ ఉండు." అనిచెప్పేరు. దీక్షితుకి ఆయన చెప్పిన పుస్తకం గురించి తెలియలేదు. వెంటనే అతడు తనదగ్గర ఉన్న ప్రార్ధనా గ్రంధాలను వరుసగా ఆయనకి చూపించసాగేడు. ఆయన ప్రతీపుస్తకాన్ని,' అదికాదు' అని,' బృందావన పోతీ' అని చెపుతూ ఉండేవారు. చివరకి దీక్షితుకి, ఏకనాధ మహరాజు, రాసిన' ఏకనాధ భాగవతంలోని 11వ అధ్యాయంలోని వ్యాఖ్యానం గుర్తుకివచ్చి, దానిని బాబాగారికి చూపిస్తే" అది ఇదే" అని చెప్పడం మాత్రమే

కాదు. ఆపేజీలో ఏకనాధ మహరాజ్' తాను రాసిన పుస్తకాన్నితానే" 31 విభాగాలుగా ఉన్నబ్రృందావనం" అని చెప్పుకున్న విషయాన్ని చూపేరు.

అలాగే, శ్రీ సాయిసత్చరిత గ్రంధంలోని అధ్యాయం 39లో సాయిబాబా గారు, నానాసాహెబు చందోర్కరు అనే సంస్రృత పండితుడిని, భగవద్గీతలోని ఒక సంస్కృత శ్లోకం మీద ఎన్నోప్రశ్నలు వేసి, గందరగోళానికి గురిచేసిన సంగతిని మనంచూడవచ్చు. నానాసాహెబు, తనప్రశ్నలకి సరైన సమాధానం ఇవ్వలేకపోయినప్పుడు, బాబాగారు, తాను ఒక విద్యాసంపన్నుడైన పండితుడిలా, ఆశ్లోకానికి ఉన్న అర్ధాన్ని విపులీకరించి, దాని గూఢార్ధాన్ని కూడాచెప్పేరు.

మతపరమైన గ్రంధాలను చదవడంలో, లేదా ఎవరైనా చదువుతున్నప్పుడు వినడంలో ఉన్నవిలువను సాయిబాబాగారు అర్ధంచేసుకున్నారు. అందుకే ఆయన ద్వారకామాయి ముందు ఉన్నఖాళీప్రదేశంలో, లేదాషిర్డీలో ఉన్న ప్రముఖమైన ప్రాంతాల్లోనూ, పండితులనూ, తనభక్తులలో ఉన్నగొప్ప విద్వాంసులనూ కొన్నిగ్రంధాలను ప్రజల ముందు చదవమని ఆదేశించేరు.

ఆ గ్రంధాలను చదువుతున్న వారి సామర్ధ్యాన్ని గుర్తించి, సాయిబాబాగారు, కొన్నిసందర్భాలలో, ప్రత్యేకదినాల్లో, వారిని కొన్ని గ్రంధాలను చదవమని చెప్పేవారు. ఉదాహరణకు, అధ్యాయం27లో మాధవరావుదేశ్' పాండే, తాను చదివేందుకుగాను కాకామహాజనివద్ద నుండి" ఏకనాధ భాగవతం' పుస్తకాన్ని బదులు తీసుకున్నాడు. దానిని, అతడి చేతిలో చూసిన బాబాగారు, దాన్ని అడిగితీసుకుని చూసి, తిరిగి ఇచ్చేస్తూ అతడితో," జాగ్రత్తగా ఉంచుకో. చదువు" అనిచెప్పేరు. మాధవరావు, బాబాగారితో,

ఆపుస్తకం, తనది కాదని చెప్పినా, ఆయన పట్టించుకోలేదు.” నువ్వు ఉంచుకో’ అని చెప్పేరు.

అలాగే, అదే అధ్యాయంలో మరొక ఉదాహరణను కూడా మనం చూడవచ్చు. తాను అప్పుడే తపాలాశాఖ నుండి అందుకున్న, పార్శిలుతో, బాపూసాహెబు జోగి’ అనేభక్తుడు బాబాగారి దర్శనానికి వెళ్ళేడు. అతడు సాయిబాబా గారి పాదాల ముందు వొంగి నమస్కరిస్తున్నపుడు, ఆపార్శిలు జారిపోయి, ఆయన పాదాల ముందుపడింది. బాబా, అప్పుడు జోగిని, అదేమిటని’ అడిగేరు. జోగి, ఆపార్శిలు ఇప్పినపుడు, అందులో శ్రీబాలగంగాధరతిలకు, రచించిన’ గీతారహస్యం’ అన్నపేరుతో ఉన్న భవద్గీత వ్యాఖ్యాన పుస్తకం కనబడింది. ఆపుస్తకాన్ని, తనచేతిలోకి తీసుకున్నసాయిబాబా గారు, దాని పేజీలు తిరగేసి, చూసి, దానిమీద ఒక రూపాయి నాణెంపెట్టి, జోగికి తిరిగిచ్చేస్తూ,” దీనిని చాలా శ్రద్ధతో చదువు. ఇది నీకు ఎంతో మేలు చేస్తుంది.” అనిచెప్పేరు.

పుస్తకపఠనం మీద బాబాగారి అభిమానానికి మరొక ఉదాహరణ కూడా, మనకి అదే అధ్యాయంలో కనిపిస్తుంది. కాకాసాహెబుదీక్షితు గారి కుమార్తె, వత్సల షిర్డీలోనే మరణించినపుడు, అతడు బాగా నిస్పృహతో క్రుంగిపోయి ఉన్నాడు. అతడిని, అలాగచూడగానే, సాయిబాబాగారు, ఏకనాథమహరాజ్’ రచించిన’ భావార్థరామాయణం’ పుస్తకాన్ని తనచేతుల్లోకి తీసుకుని, దాన్నితిరగేసిపట్టుకుని, ఒకవేలుని ఆపుస్తకంలో పెట్టి, ఆపుస్తకాన్ని తెరిచేరు. ఆపేజీలో ప్రభువు శ్రీరామచంద్రుడు, తనభర్త వాలి మరణించేక దు:ఖిస్తున్న తారతో అన్న ఓదార్పు మాటలు ఉన్నాయి. బాబాగారు, దీక్షితుగారిని, వాటిని చదువుకోమని చెప్పేరు.

ఒకభక్తుడు ఎవరైనా, తాను వారం రోజుల్లో ఒక ఆధ్యాత్మిక గ్రంథాన్ని

చదవటం పూర్తిచేస్తానని ప్రతినచేస్తే, సాయిబాబా గారు, అతడిని ప్రోత్సహించడమే కాదు అందుకు సహకరించే వారుకూడా. అధ్యాయం 18లో అందుకు నిదర్శనంగా మనకి ఒకసంగతి కనిపిస్తుంది. తన దైనందిన జీవితంతో విసిగిపోయిన, సాథే అన్నతడు మానసిక ప్రశాంతతని పొందడం కోసం బొంబాయి నుంచి, షిర్డీవచ్చేడు. వచ్చేక అతడు, వారం రోజుల్లో" శ్రీగురుచరిత్ర" గ్రంధాన్నిచదవటం పూర్తిచేసేడు. సాయిబాబాగారు, అతనికి కలలో తనచేతిలో ఆపుస్తకం పట్టుకుని కనిపించి, దానిని సాథేకి వివరించి చెప్పేరు. (పేజీ 44) "బాబా నేలమీద సాథేకి ఎదురుగా కూర్చుని, ఆపుస్తకంలోని విషయాలను చెప్పడం మొదలుపెట్టేరు." (పేజీ45)" బాబాగారు, ఆపుస్తకంలోని విషయాలను ఒక పౌరాణికుడు చదివినట్టుగా, చదువుతూ అర్థాలను వివరిస్తూ వుంటే, సాథే ఒకశ్రోతగా, ప్రశాంతమైన మనస్సుతో, భక్తితో వాటిని వింటూ వుండి పోయేడు." (పేజీ46)

సాథే పైన చెప్పినట్టుగా వచ్చిన కలను అర్థం చేసుకోలేక, కాకాసాహెబు దీక్షితు ద్వారా బాబాగారిని, తన సందేహాన్ని తీర్చుకోవటం కోసం దర్శించేడు. అప్పుడు బాబాగారు'' ఆపుస్తకాన్నిసాథే మరొక్కసారి చదివితే శుద్ధిపొందుతాడు'' అనిచెప్పి, సాథేని ఆపుస్తకాన్ని మళ్ళీ చదవమని ఆదేశించేరు. చదివేలా చూసారు కూడా. (పేజీ56)

ఆధ్యాత్మిక గ్రంధాలను రోజూ చదివేందుకు కుదరని భక్తులకు బాబాగారు, అందుకు వారికి ఎదురయ్యే ఇబ్బందులను తొలగించడానికి సహాయపడేవారు. థానాకి మామ్లతాదారు (తహశీల్దారు) అయిన బాలాసాహెబుదేవ 'జ్ఞానేశ్వరి' (మరాఠీభాషలోని భగవద్గీత)ని చదువుదామని ఎన్ని సార్లు ప్రయత్నించినా అతనికి కుదరలేదు. అతడు, చివరకి దానిని

చదవడానికి, తాను సాయిబాబా గారి అనుమతిని తీసుకోవాలని అనుకున్నాడు. తర్వాత అతడు షిర్డీవెళ్ళినప్పుడు, బాబాగారు అతడిని తనపాత బట్టలను దొంగతనం చేసాడని తిట్టి, కోపంతో అతడిని కొట్టేందుకు వెంటపడ్డారు కూడా. ఆయన, అలా చేస్తున్నంతసేపూ, బాలాసాహెబు దేవు ఆయన నిందలు తనకి దీవెనలు గానే భావించి, ప్రశాంతంగా ఉండిపోయేడు. నిజానికి సాయిబాబాగారు దేవు, జ్ఞానేశ్వరి గ్రంధాన్ని చదివేందుకు ఉన్న అవరోధాలను తొలగించేందుకే అలాచేసేరు. తర్వాత ఆయన కోపం తగ్గిపోయేక, సాయిబాబాగారు దేవును దగ్గరకి పిలిచి, దీక్షితువాడలో కూర్చుని, జ్ఞానేశ్వరి గ్రంధాన్ని ప్రతీరోజూ, క్రమం తప్పకుండా చదవమని ఆదేశించేరు. అంతేకాదు. తాను అలా చదువుతూ, అర్ధాన్ని అందరికీ తెలిసేలా కూడా చెప్పమని కూడా ఆదేశించేరు. ఆవిధంగా సాయిబాబాగారు, బాలాసాహెబుదేవు, జ్ఞానేశ్వరిని చదవాలనుకున్న కోరికను తీర్చివేయటమే కాదు. దానిని ఎలా చదవాలో కూడా అతనికి చెప్పేరు. అంతమాత్రంతోనే, ఆయన ఆగిపోలేదు. దేవుకి కలలో కనిపించి, అతడు ఆ పుస్తకాన్ని చదువుతున్నాడో లేదో పరీక్షించేవారు. అతని తప్పులను దిద్దేవారు." నువ్వు దానిని చదువుతున్నప్పుడు, తొందర, తొందరగా చదివేస్తున్నావు. నా దగ్గరకి వచ్చి, కూర్చుని చదువు. నాకు, నువ్వు చదువుతున్న పద్ధతి తెలుస్తుంది." అని చెప్పేవారు. (పేజీ 164) అధ్యాయం 41.

ఆయనకు, తన భక్తులంటే ఎంతప్రేమ. ఎంత అభిమానం.!

ఆధ్యాత్మిక జీవితం గడపాలని కోరుకునే ప్రతీవ్యక్తి, తన జీవితానికి అంతిమలక్ష్యమైన ఆత్మవిముక్తిని సాధించటం లేదా పరమపదాన్ని చేరుకోవటం కోసం క్రమం తప్పకుండా ప్రతీరోజూ ఆధ్యాత్మిక గ్రంధాలను

చదవాలని భావిస్తాడు. తను చదవాలనుకున్న పుస్తకాన్ని, తన సద్గురువుకు అర్పించి, ఆయన దగ్గర నుండి, ప్రసాదంలాదానిని స్వీకరించి, అప్పుడు చదివినట్లైతే తాను అధిక ప్రయోజనాన్ని పొందగలుగుతానని అనుకుంటాడు. ఈనమ్మకంలో కొంతపరమార్ధం ఉందనే చెప్పాలి. ఎందుకంటే నమ్మకంతో, భక్తితోనే ఆధ్యాత్మిక గ్రంథాలను, ఎవరైనా చదవాలి. అధ్యాయం 21లో ఉన్న ఒక ఉదాహరణ మనకి ఈసంగతి చెపుతుంది. పూణేవాసి అయిన పటాంకరు నాలుగు వేదాలనూ, ఉపనిషత్తులను వాటి వీుద ఉన్న వ్యాఖ్యానలతో సహాచదివేడు. కానీ అతడి మనసుకు, స్థిరత్వం కలగలేదు. అతడు సాయిబాబా గారిని దర్శించేడు. బాబాగారు, అతనితో సరదాగా ఒకవ్యాపారి చేసినపని గురించి చెప్పేరు. ఆవ్యాపారి, తనగుర్రపు లద్దెలు తొమ్మిదింటిని సేకరించి, వాటిని ఒకగుడ్డలో వుంచి, దానిని మడతపెట్టి తన మనస్సులో ఏకాగ్రతను సాధించటం గురించి చెప్పేరు. (ఆయన చెప్పిన తొమ్మిది గుర్రపు లద్దెలు నీ మనం నవవిధ భక్తిమార్గాలుగా భావించాలి)" వేదాలను, ఉపనిషత్తులను చదవటం, భగవన్నామస్మరణని నిరంతరంచేస్తూ ఉండటం, తపస్సుచేయడం, మతపరమైన ప్రమాణాలను చేయడం, యోగాభ్యాసం చేయటం, పరమాత్మ గురించి గ్రహించిన సమాచారం మీద చర్చలు జరపడం మొదలైనవన్నీ, భక్తి అన్నది లేకపోతే ఎటువంటి ఫలితాన్నీ ఇవ్వవు. (పేజీ97)

అలాగే, ఒక గురుపూర్ణిమరోజు, ఇండోరులో న్యాయాధికారిగా పనిచేస్తున్న ఎం.బి.రేగే, ఎంతోమంది సాయిబాబా గారి భక్తులు, అధ్యాత్మిక గ్రంథాలను, బాబాగారికి సమర్పించి, వాటిని ఆయన తిరిగి ఇవ్వగానే, ఆయన దీవెనలతో, చదివేందుకుగాను తీసుకుపోతూ ఉండటం చూసేరు.

తాను ఏపుస్తకం తీసుకురానందుకు, ఆయన బాధపడ్డాడు. ఆ సంగతి అర్థం చేసుకున్న బాబాగారు ఇలా అన్నారు" వాళ్ళు తెచ్చిన పుస్తకాల్లో' బ్రమ' (భగవంతుడు)ని దర్శించాలని వాళ్ళు చూస్తున్నారు. అయితే, అదివాళ్ళకి భారమే (వాటిని చదివేటప్పుడు కలిగే సందిగ్ధం, గందరగోళం, ఆలోచనల సుడిగుండంలో చిక్కుకుని పోవడం) అవుతుంది. మీరు అనుకున్నది నిజం రేగే. మీరు పుస్తకాలను చదవకండి. నన్నుమాత్రం మీరు మీగుండెల్లో పెట్టుకోండి. మీరు మీ మేథస్సు నీ, మనసునీ ఏకీకృతం చేస్తే అది చాలు"

( హెచ్.హెచ్. నరసింహస్వామీజీ రచించిన "భక్తుల అనుభవాలు" గ్రంథం మొదటిభాగం నుండి సేకరించినది.)

పుస్తకాలను చదివితే, సరిపోదు. హేమద్పంతు, తనపుస్తకంలో ఇలారాసేరు." భక్తిలేకుండా భగవంతుడిని పూజించడం, అర్థం తెలుసుకోకండా పుస్తకాలను చదవడం, రెండూ దేనికోసం?" (పేజీ204) అధ్యాయం14.

"ముందు ఒక పుస్తకం చదివేక, దానిమీద స్పందించాలి. మళ్ళీ, మళ్లీ చదవాలి. అప్పుడు దానిలోని విషయాల మీద దీర్ఘచింతన కలుగుతుంది."(పేజీ71)

"ఒకపుస్తకాన్నిసాధారణంగా చదివితే సరిపోదు. దానిలోని బోధనలను ఆచరణలోకి తేవాలి. లేకపోతే అలాగ చదవడమన్నది ఒక తిరగేసిపెట్టిన గిన్నెమీద నీటిని పోయడం లాంటిదే అవుతుంది. (ఆ గిన్నెలోకి నీరు ఏమాత్రం చేరదు)" (పేజీ72) అధ్యాయం21.

ఈమాటకి ఉదాహరణగా 21వ అధ్యాయంలో శ్రీ వినాయకరావు ఠాకూరు, అనే డెప్యూటీ కలెక్టరు చెప్పిన ఒక అనుభవం రాసిఉంది. ఆయన


కర్ణాటక రాష్ట్రంలోని, బెలగాం జిల్లాలోని, వడగావులో భూసర్వే బృందంతో ప్రొబేషనరీ శిక్షణ పొందుతున్న కాలంలో ఒకసాధువుని చూసే అవకాశం అతనికి కలిగింది. ఆ సాధువు, అతడిని దీవించి, నిశ్చలదాసు రచించిన విచారసాగరం' అన్నపుస్తకాన్ని ఇచ్చి ఇలాచెప్పేడు" మీరు ఇక బయల్దేరండి. ఈపుస్తకాన్ని చదివితే మీకోరికలన్నీ నెరవేరతాయని గుర్తుపెట్టుకోండి. తర్వాత మీరు ఉత్తరాదిలో ఉద్యోగంచేసేటపుడు, మీరు పొందిన మహద్భాగ్యం వల్ల,మీరు, మీకు మార్గనిర్దేశనం చేసి, మీకు మానసిక ప్రశాంతతని సిద్ధింపచేసే ఒక మహాసాధువుని దర్శిస్తారు. మీకు ఆత్మజ్ఞానాన్ని ఆయన బోధిస్తాడు."(పేజీలు 33 నుండి 35 వరకూ)

ఆ తర్వాత కాలంలో ఆ డెప్యూటీ కలెక్టరుకి షిర్డీవెళ్ళి, శ్రీసాయిబాబా గారిని కలుసుకునే అవకాశం కలిగింది. అప్పుడు బాబాగారు ఇలా అన్నారు." కర్ణాటకలో అప్పా' మీకు చెప్పినది అంతతేలికైనది మాత్రంకాదు.అది దున్నపోతునెక్కి, పర్వతశ్రేణిని దాటేందుకు సిద్ధపడినట్టే ఉంటుంది. ఒకరు కష్టపడిపనిచేస్తేనే అది సులభమవుతుంది." (పేజీ62) అధ్యాయం 21.

ఆవిధంగా, నిశ్చలదాసు రచించిన' విచారసాగరం' ఒకభక్తుడుకి వడగావులో లభించేక, అతడు దానిని చదివేక, ఆ తర్వాత చేయవలసిన దానిని, సాయిబాబా గారు ఆదేశించేరు.

సూక్ష్మంగా చెప్పాలంటే, శ్రీ సాయిబాబా గారు, తన భక్తులకి, మంచి ఆధ్యాత్మిక గ్రంధాలను చదవమని, లేదా ఎవరైనా చదువుతుంటే వినమని సలహా ఇవ్వడమే కాకుండా, అలా చదివేందుకు తన భక్తులెవరికైనా ఆటంకాలు ఎదురైతే, వాటిని తానేతొలగించి, ఒకపుస్తకాన్నినిదానంగా ఎలాచదవాలో చెప్పేవారు. దానిని పూర్తిగా అవగాహన చేసుకోమనీ, దానిలోని విషయాలను చింతనలో ఉంచుకుని, వాటిని ఆచరణలో పెట్టమనీ,

ఆయన బోధించేరు. అప్పుడు మాత్రమే పూర్తిప్రయోజనం లభిస్తుందని చెప్పేరు. అంతమాత్రమే కాకుండా తాను గ్రంధాన్నిచదివే ప్రతీ భక్తుడూ, పూర్తి విశ్వాసంతో, భక్తితోనే ఆగ్రంధాన్ని చదవమనీ ఆయన చెప్పేరు. లేకపోతే అది తన ఆలోచనలను గందరగోళపర్చుకోవడం, కాలాన్నిదుర్వినియోగమే అవుతుందని హెచ్చరించేరు.




శ్రీమతి ఖర్పడే పూర్వజన్మ వృత్తాంతము తెల్పుట, వైశ్యునిదగ్గర గోవుగా బాబాకి క్షీరము యిచ్చెడిది. తర్వాత తోట పనికత్తెగా, వైశ్యునిగా, బ్రాహ్మణ స్త్రీగా జన్మించెను.

# అధ్యాయం 18

# గురుభక్తి

బ్రహ్మ జ్ఞానం పొందటానికీ, పరబ్రహ్మ సాక్షాత్కారం పొందటానికీ ఒక సద్గురువు (ఆధ్యాత్మిక మార్గదర్శి, శిక్షకుడు) అవసరం చాలా ఉంటుందని వేదకాలం నుండీ, భారతదేశంలో గుర్తించబడింది. ఆ సంగతి' ముండకోపనిషత్తులో ఇలా చెప్పేరు.

"విశ్వానికి మూలకారణమైన బ్రహ్మని గురించి తెలుసుకోవడానికి, ఎవరైనా తప్పనిసరిగా వేదపారంగతుడైన, పరమాత్మ ధ్యానంలో నిమగ్నమై, పవిత్ర హోమం ప్రజ్వలింపచేసేందుకు, చేతిలో సమిధలతో ఉన్న గురువును ఆశ్రయించాలి."

పౌరాణికయుగంలో కూడా శ్రీ క్రృష్ణపరమాత్ముడు, అర్జునుడితో చెప్పిన ఈ వాక్యాలు, శ్రీసాయిబాబా గారి భక్తులందరికీ సుపరిచితాలే." గుర్తుపెట్టుకో అర్జునా! నువ్వు విద్యాసంపన్నులైన, మేధావుల ముందు గౌరవంగా తలవొంచి నమస్కరించు. వారికి నిజాయితీగా సేవచెయ్యి. వారిని, పదే, పదే ప్రశ్నిస్తూనే ఉండు. వారు నీకు బ్రహ్మజ్ఞానాన్ని ఉపదేశిస్తారు." (భగవద్గీతలోని ఈవిషయం, శ్రీసాయిసచ్చరిత అధ్యాయం 33లో రాయబడి ఉంది.)

సరస్వతి గంగాధరు రచించిన' గురుచరిత్ర' గ్రంథంలోని అధ్యాయం 39లో ఒక గురువును బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడిగా మాత్రమే కాకుండా పరబ్రహ్మగా కూడా తెలిపేరు. అదే పుస్తకంలో మానవులకే కాదు. దేవతలు (అతీంద్రియజీవులు), గాంధర్వులు (అమరలోక గాయకులు), పితరులు (మరణించి స్వర్గవాసులైన పూర్వీకులు), రుషులు (సాధు, సన్యాసులు), సిధ్యులు (భూమికీ, సూర్యుడికీ మధ్య ఉండే ప్రదేశాల్లో నివశించే దైవాంశ గలవారు), వంటి వారికైనా జన్మ, పునర్జన్మల చక్రం నుండి విముక్తులు కావాలంటే, వాళ్ళు తప్పని సరిగా గురువుని ఆశ్రయించి, సేవించాలని రాసి ఉంది.

సుమారు 700 సంవత్సరాల క్రిందట, జీవించి 'జ్ఞానేశ్వరి గ్రంధాన్ని రచించిన సాధువు జ్ఞానేశ్వర్', 400 సంవత్సరాల కిందటా జీవించి ఏకనాధ భాగవతాన్ని రచించిన సాధువు ఏకనాథ్' కూడా తమ గ్రంథాల్లో గురువు ఆవశ్యకతను గురించి ప్రాముఖ్యతను గురించి అనేకసార్లు ప్రస్తావించేరు.

జ్ఞానేశ్వర్' తన జ్ఞానేశ్వరి గ్రంధం అధ్యాయం1 లో ఇలా చెపుతున్నాడు." అనంతమైన దాన్నిఎలా చేతుల్లోకి తీసుకోవాలి? గొప్పగా మెరిసే మెరుపుని, మామూలు తెల్లటి దానిలా ఎలాచేయాలి? ఒక దోమ పిడికిటిలోకి ఆకాశం అంతటినీ తెచ్చి ఎలా పెట్టాలి? (పేజీ74)." అందుకు అందరికీ ఒకగొప్ప సహాయ హస్తం ఉంది. అది ఆరాధ్యుడైన గురువు. ఆయన వల్లనే, నేను ఇంతదృఢ విశ్వాసంతో ఇలా మాట్లాడగలుగుతున్నాను." (పేజీ75)

"ఒక మంచి గురువు లేకుండా, విశ్వానికి మూలకారణం అయిన పరబ్రహ్మ సాక్షాత్కారం పొందటమన్నది సాధ్యం కానేకాదు." (పేజీ7)

"నయనం అందమైనది కావచ్చు. ఎటువంటి లోపమూలేనిదే కావచ్చు. కానీ సూర్యభగవానుడి కరుణ లేకపోతే అది, దేనినీ చూడటం జరగదు.

అంధకారంలోనే మిగిలిపోతుంది.'' (పేజీ8) ఏకనాథ భాగవతం అధ్యాయం 10.

సాయిబాబా గారు ఎప్పుడూ గురువుల గొప్పదనాన్ని ప్రశంసిస్తూనే ఉండేవారు. ఆయన చాలా తేలికపదాలనే ఉపయోగించి, గురువు ఆరాధన, సేవ ఎలా చేయాలో చెప్పేవారు. తన అనుభవాలని, కొన్నికథలని, అందు కోసం చెప్పడం ద్వారా మాత్రమే కాకుండా, నిజమైన గురుభక్తికి ఉదాహరణలని ఆయనే స్వయంగా చూపించేవారు. శ్రీసాయిసత్చరిత గ్రంథంలో గురుసేవ, గురుభక్తి గురించి ఆరు అధ్యాయాలు మాత్రమే కాకుండా మొత్తం గ్రంథంలో వాటి గురించి చెపుతున్న పద్యాలు 257 వరకూ ఉంటాయి. అవి 'శ్రీ గురుచరిత్ర'లో సంస్కృత భాషలో కనిపించే' గురుగీత' గా, రూపాంతరం చెందిన మరాఠీ పద్యాలే అని చెప్పాలి.

ఒకసారి (అధ్యాయాలు 18,19) రాధాబాయి అనేముసలి స్త్రీ, కొంతమంది సాయిభక్తులతో కలిసి, షిర్డీదగ్గరలో ఉన్న పూణే జిల్లాలోని' సంగామ్నరు' అనే ప్రదేశం నుండి బాబాగారి దగ్గరకు వచ్చింది. సాయిబాబా గారు, ఆమెకి మంత్రోపదేశం చేసే వరకూ, అన్నం, నీళ్ళు దరిచేరనివ్వనని, ఆమె ఉపవాసం మొదలుపెట్టింది. అయితే బాబాగారు అంతవరకూ ఎవ్వరికీ అలామంత్రోపదేశం చేయలేదు. అయినా ఆమె, మూడురోజుల పాటూ పవాసంతోనే ఉండిపోయింది. ఆయన దగ్గరున్న భక్తుడు మాధవరావు, భయపడిపోయి, బాబాగారిని , ఆమెని పిలిచి, ఏదైనా సందేశం ఇవ్వమని కోరేడు.

అప్పుడు, బాబా గారు ఆమెని పిలిచి," చూడు. నా గురువు చాలా గొప్ప సాధువు. సముద్రమంత కరుణ కలిగిన వాడు. నేను అలసిపోయేంత

వరకూ అతడికి సేవచేసేను. కానీ అతడు నాకు రహస్య మంత్రోపదేశం చేయలేదు.” అని చెప్పేరు. (పేజీ47)

“మొదట ఆయన నన్ను రెండు పైసలు (ఒక్కొక్కటీ రూపాయిలో 64 వంతు విలువ చేసే పాత రాగి నాణెం) అడిగేరు. నేను వెంటనే ఆయనకు, అవి ఇచ్చిమంత్రోపదేశం చేయమని ప్రార్థించేను.” (పేజీ49)

ఆ రెండు పైసలూ విశ్వాసం, ఓపిక తప్పవేరేమీ కావు. వాటిని వెంటనే ఇవ్వడం వల్ల, నాగురువు నావల్ల, ఆనందాన్ని పొందేడు.” (పేజీ52)

“పన్నెండుసంవత్సరాలపాటు,నేనునాగురువువద్దనేఉన్నాడు.ఆయన ఎంతోప్రేమతో, నాకు అన్న వస్త్రాలకు, లోపం లేకుండా నన్ను పెంచేడు.’(పేజీ61)

“నాగురువుకీ నాకు మధ్య ఉన్న ప్రేమను ఎలావర్ణించాలి? ధ్యానంలో లీనమయిపోయిన కళ్లతో, ఒకరిని ఒకరు చూసుకుంటూ, అమితానందంలో మునిగిపోయే వాళ్ళం. నాకు మరిదేనినైనా చూడాలన్న ఆలోచన అన్నదే కలిగేది కాదు.” (పేజీ63)

“రాత్రింబగళ్ళు, నేను నాగురువు ముఖాన్నే చూస్తూ ఉండి పోయేవాడిని. నాకు, ఆకలిగానీ దాహంగానీ ఉండేవే కాదు. నా గురువు లేకపోతే, నాకు మానసిక ప్రశాంతత లేకుండా పోయేది.” (పేజీ64)

“నా గురువు దగ్గర లేకపోతే, నేను చూడటానికి ఏమీ ఉండేది కాదు. ధ్యానం చెయ్యటానికి ఏలక్ష్యమూ ఉందేది కాదు. నాకుప్రధాన ఆకర్షణ నా గురువే. ఎందుకంటే, ఆయన చేసేవన్నీ అద్భుత కార్యాలే.” (పేజీ65)

“తల్లి తాబేలు, తన పిల్లల కడుపులని. తనచూపుతోనే నింపుతుంది. నాగురువు పద్ధతికూడా అదే. ఆయన, తనపిల్లలని లేదా భక్తులని. తన

చూపుల ద్వారానే సంరక్షించేవాడు." (పేజీ68) అధ్యాయం19.

ఆవిధంగా శ్రీసాయిబాబా గారు, ఒకరు, తన గురువు మీదనే ప్రేమతో, భక్తితో ధ్యానాన్ని కేంద్రీకరించడమన్నది, మంత్రోపదేశాన్ని పొంది, నిరంతరం మంత్రపఠనం చేయడం కన్నా చాలా సులభమైన విధానమని, రాధాబాయికి మాత్రమే కాకుండా తన భక్తులందరికీ బోధించేరు. ఆ విషయంలో ఆయన వివరించిన తన అనుభవాన్ని, మనం అధ్యాయం 32లో చూడవచ్చు.

"నా గురువు ఆశ్రమం ఎంత మధురమైనది.! నేను, నాఆత్మీయులతో ఉన్న నా అనుబంధాన్ని మరచిపోయేను. భ్రమ కలిగించే వస్తువుల పట్ల నాకు, ఉన్న మోహం అనే గొలుసును, నేను తెంచుకోగలిగేను. చాలా సులభంగా అన్నింటి నుండీ నేను విముక్తుడనయ్యేను." (పేజీ76)

"నాకు ఉన్న కఠినమైన బంధనాలన్నీ సడలిపోయేయి. లౌకిక జీవితానికి సంబంధించిన చురుకైన అవరోధాలు అన్నీ నాశనమై పోయేయి. నేను, నాగురువు కంఠంచుట్టూ, నాచేతులు వేసి, ఆయన రూపంతో నా కళ్ళకు విందు చెయ్యాలనుకున్నాను." (పేజీ77)

"నా గురువు ప్రతిరూపం, నా కళ్లల్లో లేకపోతే, నా నేత్రాలు మాంసపుబంతులే అని నేను భావిస్తాను. అప్పుడు నేను అంధుడిగా ఉండిపోవాలనే కోరుకుంటాను. నా ఆశ్రమ జీవితం అలాంటిది." (పేజీ 78) అధ్యాయం 32.

అందుకు ఒక ఉదాహరణని మనం చూడవచ్చు. శ్రీ సాయిబాబా గారిని, ఆయన గురువు, నీళ్ళు నిండుగా ఉన్నబావిలో తలకిందుగా వేలాడదీసినా, ఆయన ఆ సంగతిని అసలు పట్టించుకోనే లేదు సరికదా.. ఎంతో ఆనందాన్ని అనుభవిస్తూనే ఉండిపోయేరు. తన గురువు మీద ఆయనకి

ఉన్నభక్తి అంతగొప్పది. సంత్' తుకారాం మాటల్లో చెప్పాలంటే, అటువంటి భక్తులు, తమ గురువుల వల్ల, వారి ఆధ్యాత్మిక స్థాయికి సమానమైన స్థాయికి ఎటువంటి ఆలస్యం లేకుండా తొందరగానే, చేరుకుంటారు.

సాయిబాబా గారు గురుభక్తిని గురించి బోధిస్తూనే, గురువుని ఎలా సేవించాలో, ఒక మంచి గురుభక్తుడికి ఉండవలసిన లక్షణాలేమిటో వివరించి చెప్పేరు.

### 1. గురువు ఆదేశాలను, ఖచ్చితంగా, తప్పని సరిగా అమలు చేయటం

గురువు ఇచ్చిన ఆదేశాలను, అవి ఎంత కఠినమైనవి అయినా, కొత్తవి అయినా సరే, శిష్యుడు కించిత్తు సందేహమన్నది లేకుండా అమలు చేయాలి. కొన్నిసార్లు గురువు, తన శిష్యుడిని పరీక్షించేందుకు కావాలనే కొన్నిఆదేశాలను ఇవ్వవచ్చు. ఉదాహరణకు, అధ్యాయం 38లోసాయిబాబా గారు, తన శిష్యుడు, దాదాకేల్కరు (ఛాందస బ్రాహ్మణుడు) గారిని, ఏకాదశి రోజున, బజారుకుపోయి, మాంసాన్నికొని తెమ్మన్నారు. ఒక నిబద్ధుడైన గురుభక్తుడు లాగా, ఆయన అందుకు సిద్ధపడి, బజారుకి బయల్దేరుతుండగా బాబాగారే, అతడిని వెళ్ళవద్దని ఆపేరు. అధ్యాయం23లో, సాయిబాబా గారు, కాకాసాహెబు దీక్షితు (మత ఛాందసుడైన శాకాహారి) గారిని, ఒక కత్తితో, మేకను నరకమని చెప్పేరు. బాబాగారు చెప్పినది చేయటానికి ఆయన, కత్తి తీసుకుని బయల్దేరుతుంటే, అతడిని ఆపి బాబాగారు సరదాగా ఇలా అన్నారు." కాకా! నువ్వు బ్రాహ్మణుడవై వుండి, ఒకమేకను చంపడం నీకు సిగ్గుగా అనిపించటం లేదూ..!"

దానికి కాకాసాహెబు, ఇలా బదులిచ్చేడు." బాబా! మీ ఆదేశాలు, మాకు అమృతం లాంటి వాక్కులు."

"మాకు మతపరంగా పాటించవలసినవేమీ తెలియవు. మాగురువు మాకు చెప్పిన ఆదేశాన్ని వినయంగా పాటించడమొక్కటే, మాకు పవిత్రమైన శాస్త్రబోధ లాంటిది అని చెప్పేటందుకు మేము సిగ్గుపడే అవసరం లేదు." (పేజీ171)

"మేము, మీ ఆదేశాలకు బానిసలం. మీరు మాకు ఇచ్చిన ఆదేశం సరైనదా! కాదా! అన్న విషయాన్ని మేము పట్టించుకోము. ఒకవేళ అవసరమైతే, మా గురువు ఆదేశిస్తే మాప్రాణాలనైనా త్యాగం చేస్తాము." (పేజీ181)

హేమద్పంతు, తాను రాసిన శ్రీసాయిసత్చరితలో ఒక మంచి శిష్యుడికి ఉండవలసిన లక్షణాలని ప్రత్యేకంగా చెపుతూ," తన గురువు చెప్పకుండానే, ఆయన కోరికలను తెలుసుకునేవాడు, అవి తెలుసుకున్న తర్వాత, ఆయన వాటి గురించి, ఏ ఆదేశాన్నీ ఇవ్వకముందే, వాటిని నెరవేర్చేందుకు సిద్ధపడిన వాడే ఉత్తమశిష్యుడిగా పరిగణింపబడతాడు." అనిపేర్కొన్నాడు.(పేజీ187) అధ్యాయం 23.

**2.గురువు తిరస్కరించినా, విడవవద్దు. ఎంత గొప్పవాడయినా మరొకగురువు ఆశ్రయాన్నికోరవద్దు.**

"ఎవరైనా తన గురువు మీదనే విశ్వాసంతో కట్టుబడి ఉండిపోవాలి. ఇంకొకరి దగ్గరకి పోకూడదు. ఇది ప్రతీ ఒక్కరూ, తమ మనస్సులో దాచుకోవలసిన రహస్యమైన సంగతి." (పేజీ176)

"మరొక సలహా ఏమిటంటే, ఇంకొకరి గురువుచాలా పేరుగల వాడై వుండి, తనగురువు సామాన్యుడైనా సరే.. ప్రతీ ఒక్కరూ తనగురువునే విశ్వసించి తీరాలి."(పేజీ178) అధ్యాయం12.

సాయిబాబా గారు, ఇదే సంగతిని పదేపదే తన బోధల్లో చెపుతూవచ్చేరు.

చూపుతూ వచ్చేరు. అధ్యాయం26లో ఆయన పంత్'ని తనస్వంత గురువు దగ్గరకి తిరిగి వెళ్ళిపొమ్మని చెప్పేరు. హరిశ్చంద్రపితలేనీ, గోపాల అంబేద్కర్'నీ, తమకులాచారం ప్రకారం అక్కల కోటలోని స్వామి సమ్రాత్' ఆరాధననే, కొనసాగించమనీ బోధించేరు.

**3. గురువు ఆదేశాన్ని ఎప్పుడూ మరచిపోకూడదు.**

ప్రతీగురువుకీ, తనశిష్యులశక్తి, సామర్థ్యాల గురించి బాగా తెలుస్తుంది కనుకనే వాళ్ళు వాటికి అనుగుణంగానే, తమశిష్యులకు ఆదేశాలను ఇస్తూ ఉంటారు. కనుక శిష్యులుగా ఉండేవారు, తమ గురువు తమకు వ్యక్తిగతంగా ఇచ్చిన ఆదేశాలను మాత్రమే పాటించాలి. ఇతర గురువుల బోధనలను, వారిభక్తులకు వారిచ్చిన ఆదేశాలను, వారిప్రవర్తనలను, తెలుసుకున్నా లేదా పరిశీలించినా సరే వాటిని పాటించకూడదు.

"ఇతర గురువుల మాటలను గురించి అగౌరవంగా మాట్లాడకూడదు. కానీకన్న తల్లి (స్వంత గురువు) తన గురించి తీసుకున్నంత శ్రద్ధ ఇంకెవరూ తీసుకోలేరన్న సంగతి మరచిపోకూడదు." (పేజీ 117)

"ఒకవేళ ఏఇతర సాధువైనా, ఏదైనా విషయం చెపితే, దానిని వినాలి. కానీ తాను పాటించే ఆదేశాలు మాత్రం తన గురువు ఇచ్చినవే అయి ఉండాలి." (పేజీ 122)

"ఒకవైద్యుడు, తన రోగిలో తాను గుర్తించిన రోగానికి సంబంధించిన మందులనే వాడమని చెప్పి, అందుకు సరిపోయే సూచనలు ఇస్తాడు. అలాగే ఒక సద్గురువు, తనశిష్యుడికి, అతడి ప్రాపంచిక దు:ఖాలు, బాధలు, తెలుసుకుని, వాటి ప్రకారం అతడి భౌతికస్థాయిని గుర్తించి, తగిన సలహాలనిస్తాడు." (పేజీ 113)

“మీ గురువు చేసిన పనులను చూసి, మీరూ అవి చేయకండి. మీకు, ఆయన వ్యక్తిగతంగా చేయమని ఏపనులు చెపితే, వాటిని మాత్రమే చేయండి.” (పేజీ 114)

“గురువు చెప్పిన మాటలనే, మీరు ఎల్లప్పుడూ గుర్తుంచుకుని వాటిమీదనే మీధ్యానాన్ని కేంద్రీకరించండి. ఆ మాటలు మాత్రమే, మిమ్మల్ని మోక్షసాధనకు తీసుకువెళ్ళగలవని మరచిపోకండి.” (పేజీ 115)

“గురువు ఏదైనా ఒక ఆధ్యాత్మిక గ్రంధాన్ని బయటకి చదువుతూ, అందులో ఉన్నవిషయాల అర్ధాన్ని వివరిస్తున్నాడంటే, అది శ్రోతల కోసం మాత్రమే. అదే తన భక్తుడవైన నీదగ్గరకి వస్తే, ఆయన నీతో వ్యక్తిగతంగా ఆగ్రంధం గురించి చెపుతూ, ఏమి చెయ్యమని ఆదేశిస్తే నువ్వు అది చేయాలి. ఎందుకంటే అది ఆయన నీకు ఇచ్చిన శాస్త్రీయమైన పవిత్రమైన ఆదేశం”. (పేజీ 116) అధ్యాయం 45.

### 4. అధ్యయనం చేయండి. కష్టపడి పనిచేయండి

ఆత్మసాక్షాత్కారం పొందాలనుకునే భక్తుడు చాలా కష్టపడి పనిచేయాలి. గురువు మార్గాన్ని నిర్దేశిస్తాడు.” ఎవరైనా పట్టుబట్టలు ధరిస్తే, సన్యాసి అయిపోతాడా? అతడు, తన ఎముకలు పిండి అయేలా, రక్తం పలచనై పోయేలా శ్రమపడాలి.” (పేజీ 79)

“ఎవరైతే, తన జీవితంలో పరమాద్భుతమైన అంతిమలక్ష్యాన్ని చేరుకోవాలని ఆరాటపడుతూ ఉంటాడో, అందుకు, అతను కష్టపడి సాధన చేయాలి. అవసరమైన ప్రమాదాలను ఎదుర్కోవడానికి కూడా, సిద్ధంగా ఉండాలి.” (పేజీ 150) అధ్యాయం 32.

“నువ్వు (సాధన ) వ్యాయామం చేయాలనుకుంటే, తర్వాత తాగేందుకు,

పాలు దొరుకుతాయాలేదా? అని సందేహపడకు. నేను, నీవెనకాతలే, చెంబునిండా ఉన్నపాలతో సిద్ధంగా నిలబడే ఉంటాను.” (పేజీ158)

“కానీ, నువ్వు, నన్ను(సాధన) వ్యాయామం చెయ్యమనీ, గ్లాసుల కొద్దీపాలు, నువ్వుతాగేస్తానని చెపితే, అందుకు నేను అంగీకరించను. ఎవరు చేసే పని ఫలితాన్ని వాళ్లే పొందుతారు.” (పేజీ159) అధ్యాయం 19.

శ్రీ సాయిబాబా గారు ఎప్పుడూ, తనభక్తుల మీద, ఎవరూ కష్టపడి పనిచేయడానికి సిద్ధంగా ఉండరని ఫిర్యాదు చేస్తూ ఉండేవారు. ప్రతీవాళ్ళకీ చాలా సులభంగా తక్షణ ఫలితాలు చేజిక్కించుకోవాలని వుంటుందని ఆయన అంటూ వుండేవారు. నన్ను శాసించే యాజమాన్యం, నన్నునిధి మొత్తాన్ని స్వంతం చేసుకోమటుంది. నాభక్తులు మాత్రం, నేను ఆ నిధిని తీసుకుని, తమందరికీ దాన్నిఇవ్వమని కోరుతున్నారు. కానీ, ఏ ఒక్కరూ, నాపిలుపుకి సమాధానమివ్వరు. నా ఆదేశాలను సరిగ్గా అమలు చేయరు. (పేజీ161)

“నాదగ్గర ఉన్న జ్ఞాననిధి, అంచుల వరకూ నిండిపోయి ఉంది. దానిని నిండుగా నింపి తీసుకువెళ్ళటానికి ఎవరూ ఖాళీబండ్లతో నాదగ్గరకు రావటం లేదు. దానిని తవ్వి తీసుకువెళ్ళమని నేను చెపుతున్నా, ఎవరూ తవ్వడానికి గానీ, కనీసం ఆ ప్రయత్నం చేయడానికి కానీ, నాదగ్గరకు రారు.” (పేజీ162)

“ఆజ్ఞాన ధనాన్ని తవ్వి, బళ్ళకొద్దీ ఉచితంగానే తీసుకుపొండి. అని నేను చెపుతాను. కానీ, ఎవరైతే, ఒక తల్లికి నిజమైన కుమారుడుగా ఉంటాడో (ఎవరైతే కష్టపడేందుకు సిద్ధంగా ఉంటారో) అతడు మాత్రమే ఆ నిధిని తీసుకుపోగలుగుతాడు.” (పేజీ163) అధ్యాయం 32.

### 5. శిష్యుడి తొమ్మిది లక్షణాలు

ఈలోకాన్ని విడిచిపెట్టి, తాను వెళ్ళే సమయంలో, శ్రీసాయిబాబా గారు,

లక్ష్మీబాయి షిండేకి తొమ్మిది రూపాయలు దానమిచ్చేరు. (అధ్యాయం 42). దానిలో ఉన్న పరమార్థాన్ని హేమద్పంతు, శ్రీసాయిసత్చరిత గ్రంథంలో ఇలాచెప్పేరు. భగవద్గీతలో ఉద్ధవుడికి, శ్రీక్రిష్ణ పరమాత్ముడు, శిష్యుడికి ఉండవలసిన తొమ్మిది లక్షణాలు బోధించేడు. శ్రీసాయిబాబా గారు, తన శిష్యురాలికి ఇచ్చిన తొమ్మిది రూపాయల వెనుక ఉన్న అర్థం కూడా అదే. ప్రతీశిష్యుడు లేదా గురుభక్తుడు, తన గురువు ప్రేమను లేదా అబిమానాన్ని పొందటానికి ఆ తొమ్మిది లక్షణాలను గుర్తుపెట్టుకునే ఉండాలి." అవి, శిష్యుడు సదా వినయంగానే ఉండాలి. (అహంకారం ఉండకూడదు), నిరంతరం శ్రద్ధగానే ఉండాలి, ఈర్ష్య, అసూయలు లేకుండా ఉండాలి. ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి లేకుండా ఉండాలి. తన గురువుకు సేవచేయాలనే తపనతోనే నిరంతరం ఉండాలి. జీవన్ముక్తి కోసం ఎడతెగని కుతూహలంతోనే ఉండాలి. ప్రశాంతమైన మనసుతోనే జీవితం గడపాలి. గురువు ముందు చర్చలలో, వాదవివాదాలలో, పాల్గొనకూడదు. అపవాదాలకు పాల్పడటం కానీ అనవసర విషయాలు మాట్లాడటం కానీ చేయకూడదు. ఈ తొమ్మిది లక్షణాలు కలిగి ఉన్నభక్తుడు లేదా శిష్యుడు తన' గురుమహారాజ్'ని సంతుష్టపరచడానికి శ్రమించాలి." (పేజీ125) అధ్యాయం42.

నిజమే. పైన పేర్కొన్న తొమ్మిది లక్షణాలూ సరైనవే. కానీ ఈలక్షణాలన్నీ కలిగి ఉండి, నిరంతరం శ్రమ పడుతుండే శిష్యుడు లేదా భక్తుడు సరైన గురువుని ఎన్నుకోలేకపోతే, అతడి శ్రమ విలువలేనిదే అవుతుంది మరి. అందువల్లనే హేమద్పంతు, తన గ్రంథంలో చాలాచోట్ల, ఆదర్శ గురువు లక్షణాలను కూడా పేర్కొన్నాడు." తెలివైనవాళ్ళు, భారతీయ వేదాంగాలైన న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ, మీమాంస, వేదాంత వంటి ఆరుశాస్త్రాలలో

నిష్ణాతులు అయిన వాళ్ళని, వేదాలలో భాగమైన ఉపనిషత్తులని బోధించే వేదాంత ప్రవచన కారులని, గురువులుగా అంగీకరించరు. (పేజీ3)

“అలాగే, తన శ్వాసను బంధించగలిగే వ్యక్తిని, తనశరీరం మీద, కాల్చిన రాగివస్తువుతో వేయించుకున్న ముద్రలు కలిగి ఉన్నవ్యక్తినీ, పరమాత్మ గురించి శ్రోతలకు ఆనందం కలిగించేలా వేదాంత బోధలు చేస్తూ, స్వీయానుభవాలు ఏమీ లేని పండితుడినీ, ఆదర్శప్రాయుడైన గురువుగా విజ్ఞులెవ్వరూ అంగీకరించరు.” (పేజీ4)

“ఏశిష్యుడికైతే పరిపూర్ణ శబ్దాధికారం వుండి, బ్రహ్మజ్ఞానం గురించి తాను అందరికీ తెలియజేయ గలడో అటువంటి శిష్యుడికి జ్ఞానోదయం కలగచేసిన గురువుమాత్రమే ఆదర్శ గురువుగా గుర్తింపు పొందుతాడు. అతడే పరమ గురువు.”(పేజీ8)

“తన కలలలో కూడా, తన శిష్యుడు లేదా భక్తుడితో ఎటువంటి సేవనైనా చేయించుకోవాలని ఆశించక పోవడమే కాకుండా, తన శరీరాన్ని భక్తులకోసం, లేదా శిష్యుల కోసం ఏదోవిధంగా వినియోగించాలని కోరుకునే గురువునే ’ ఆదర్శ గురువు’గా కీర్తిస్తారు.” (పేజీ 10)

“ఏ గురువైతే తాను అత్యంత ఉన్నతుడు, తన శిష్యులు అత్యంత హీనులు అనే భావన కలిగి ఉండడో, అతడే పరమ ప్రయోజనకారి అయిన ఆదర్శ గురువుగా గుర్తింపు పొందుతాడు.” (పేజీ 11)

“శిష్యుడిని కూడా పరబ్రహ్మగా భావించి, అతడిని, తన కుమారుడుగా ప్రేమించి అతడి నుంచి ఎటువంటి పోషణ, రక్షణ ఆశించని గొప్ప గురువు ఒక్కడే ఆదర్శ గురువు. (పేజీ 12)

"అత్యంత ప్రశాంతతకు నిలయమై, తెలుసుకున్న దానివల్ల అహంకారం కలగనివ్వనిదిగా సామాన్యులను, గొప్పవారినీ ఒకేలా చూసే ఉన్న ప్రదేశమే ఆదర్శ గురువు నివాస స్థలం అవుతుంది." (పేజీ 13) అధ్యాయం 48.

"తనశిష్యుడు ప్రాపంచిక వ్యవహారాలలో మునిగిపోయి ఉన్నప్పుడు తనమనస్సు అతనిపై కరుణతో నిండిపోయి, అతడిని ఎలా శరీరస్పృహ నుండి బయటకు తీసుకురావాలి అని ఆందోళన చెందుతూ ఉండేవ్యక్తే ఆదర్శగురువు అవుతాడు." (పేజీ58) అధ్యాయం10.

"శిష్యులను లొంగదీసుకుని, రహస్యంగాపవిత్రమంత్రాన్ని ఉపదేశించి, ధనార్జనకు వారిని మోసం చేసే గురువులు, దేశంలో లెక్కకు మించేఉన్నారు." (పేజీ61)

"మతప్రవర్తనా నియమావళిని శిష్యులకి బోధిస్తూ, తాను మాత్రం అందుకు వ్యతిరేకంగా ప్రవర్తించే గురువు, మనలను ఎలా ఈ భౌగోళిక జీవితపు కష్టాలనుండీ, బాధలనుండీ, ఉత్పాతాల నుండీ, అలజడుల నుండీ, అనారోగ్యాల నుండీ తప్పించగలుగుతాడు?. పునర్జన్మల చక్రం నుండి వేరు చేయగలుగుతాడు?" (పేజీ62)

గురువులలో రెండు ప్రధాన పాత్రలు ధరించే వారున్నారు. మొదటివారు శాశ్వత గురువులైతే, రెండవరకం తాత్కాలిక గురువులు. వాళ్ళు చేపట్టే లక్ష్యాల ఫలితాలను విశ్లేషణ చేస్తే,తాత్కాలిక గురువుగా బాధ్యతలను స్వీకరించే గురువు లక్ష్యం ఒకటే. అది ముందు తనశిష్యుల మనస్సులను శుద్ధిచేయడం, తర్వాత వారిలోని దైవలక్షణాలను క్రమబద్ధీకరించడం, వారికి ఆత్మసాక్షాత్కారం లభించే మార్గనిర్దేశనం చేయడం మాత్రమే ఆ తాత్కాలిక గురువు తన శిష్యులకు ప్రసాదించే వరాలు అనిచెప్పవచ్చు.(పేజీ66)

“శాశ్వత గురువుతో సహవాసం కలిగినప్పుడు. గురు, శిష్యులిరువురి మధ్య ద్వంద్వత్వ భావన తొలగిపోయి ఏకత్వభావన ఏర్పడుతుంది. అప్పుడు ఆగురువు, వేదాలలోచెప్పబడిన పరమసత్యం లేదా పరబ్రహ్మ నువ్వే అనిఅందుకు సాక్షీకరణచేస్తాడు.” (పేజీ67)అధ్యాయం10.

శ్రీ సాయిబాబా గారు రెండవరకం ఆదర్శ గురువుమాత్రమే కాదు. చాలా శక్తివంతుడైన గురువు కూడా.

”ఈలోకంలో చాలామంది ప్రాపం చికజ్ఞానం కలిగిన గురువులు ఉన్నారు. కానీ ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించగలవాడే నిజమైన ఆదర్శగురువు. ఏదిఏమైనా, నిన్నుసముద్రం అంతటి లౌకిక ప్రపంచాన్నిదాటించి తీసుకుపోగలిగిన వ్యక్తే, ఆదర్శగురువు. ఆయన గొప్పదనం అద్వితీయమైనది. అమోఘమైనదిగా గుర్తింపబడుతుంది.”(పేజీ70)అధ్యాయం10.

సాయిబాబాగారు అటువంటి గురువు కనుకనే, ఆయన తనశిష్యులూ, భక్తులూ అయిన మహల్సాపతి, కాకాసాహెబుదీక్షితు, దాసగణుమహరాజ్’ ఉపాసనిమహరాజ్’ వంటి వారిని అనేకమందిని ఆధ్యాత్మిక ఉన్నతశిఖరాల మీద నిలబెట్టేరు. 1938లో (ఆయన సమాధి చెందిన 20సంవత్సరాల తర్వాత) చాలా ఆశ్చర్యం కలిగించే సంఘటన, కరాచీ (నేటి పాకిస్థాను దేశంలోని పట్టణం)లో జరిగింది. సాయిబాబాగారు అక్కడ ఉన్న శ్రీమోటా’ అనే ఆయన ముందు ప్రత్యక్షమై, ఆయనకు ఆత్మసాక్షాత్కారం కలిగేందుకు కొన్ని యోగవ్యాయామాలను బోధించేరు. వాటిని ఆచరించిన శ్రీ మోటా గారికి 1939. మార్చి29 (శ్రీరామనవమి దినం నాడు)వ తేదీన వారణాసి పట్టణంలో ఆత్మసాక్షాత్కారం లభించింది.

శ్రీ మోటా గారు గుజరాతు రాష్ట్రంలో గొప్ప ఆధ్యాత్మిక సాధువుగా గుర్తింపబడి, గౌరవింపబడ్డారు. ఆయన, తన ఆత్మకథలో” నాఆధ్యాత్మిక

పురోగమనానికి తుది మెరుగులు శ్రీసాయిబాబాగారేదిద్దేరు.” అని రాసుకున్నారు.

సాయిబాబాగారు గురువుల కోసం ఇచ్చిన సూచనలను, చివరగా చెప్పాలంటే, ఒకశిష్యుడు, ఆదర్శ గురువును నిజాయితీగా సేవించినట్లయితే, ఆత్మసాక్షాత్కారం కోసం అతడి పురోగమనానికి ఖచ్చితమైన భరోసా లభిస్తుంది. ఆదర్శ గురువు సామర్థ్యం చాలాగొప్పదిగా, అతనిపట్ల, అతడి శిష్యుడి భక్తి కూడా అంత గొప్పదిగా ఉన్నప్పుడు మాత్రమే అదిసాధ్యమవుతుంది.” ఒకభక్తుడు పూర్తి అంకితభావంతో, భక్తితో తనశరీరాన్ని, మనస్సునూ, సంపదనూ, ఆదర్శ గురువుపాదాల ముందువుంచి, తన జీవితకాలమంతా, ఆగురువు సేవలోనే గడపాలి” (పేజీ 57)

“గురువు నామాన్ని, గురువు సహవాసాన్ని, గురువు అనుగ్రహాన్ని, గురువు పాదాలను శుభ్రం చేసిన నీరుని, గురువు నుండి పవిత్రమై నమంత్రోపదేశాన్ని పొందదడమన్నది చాలా కష్టసాధ్యమైనది. (పేజీ58)

పైన చెప్పినవన్నీ చాలా శక్తివంతమైనవి. అత్యధికంగా గురు భక్తి కలిగిన వారు వాటిని పరీక్షించేరు.” అవి, వాళ్ళను ఎటువంటి శ్రమా అవసరం లేకుండా జీవన్ముక్తిని కలిగించే ముక్తిద్వారం వైపు బలంగా నెట్టివేసేయి.” (పేజీ 59) అధ్యాయం 1

### అధ్యాయం 19

# నభోమండలం

ప్రస్తుతకాలంలో కూడా పెద్దలు కుదిర్చే పెళ్ళిళ్ళలో, ముందుగా వధూవరుల జాతకాలను పరిగణనలోకి తీసుకోవడమన్నది ఒక ప్రధాన అంశంగా కనిపిస్తుంది. పెళ్ళికొడుకు తరపువాళ్ళు, పెళ్ళికూతురు జాతకాన్ని చూడటాన్ని చాలా ముఖ్యమైన విషయంగా భావించి, దాన్నితీసుకుని , పురోహితుడిని సంప్రదించిన తర్వాత, అమ్మాయి జాతకంలో, బుధగ్రహం ఉన్నస్థానం వరుడి జాతకానికి నప్పకపోయినా, మరికొన్ని లక్షణాలు సరిపోకపోయినా, ఆ అమ్మాయితో, వివాహాన్నితిరస్కరిస్తారు. అలాగే ఎన్నికలు జరిగేటప్పుడు, రాజకీయ నాయకులు కూడా, తాము నామినేషన్లు వేయవలసిన సమయాన్ని, అలాగే మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసేటప్పుడు కూడా దిన, వార, సమయాలను జ్యోతిష్కులను సంప్రదించేక, నిర్ణయించుకుని అమలుచేస్తారు.

వాస్తవానికి జాతకాలకి ఆరకమైన ప్రాముఖ్యత ఇవ్వటమన్నది సరికాదు. మొదటగా తెలుసుకోవలసినది ఏమిటంటే, మిగిలిన అన్ని విజ్ఞాన శాస్త్రాలలో జరుగుతున్నంత పరిశోధన జ్యోతిషశాస్త్రంలో జరగటం లేదు. అందువల్ల దానిలో పురోగమనమన్నది పెద్దగాలేదు. అంతేకాదు జ్యోతిషశాస్త్ర ఫలితాలకు

కొంతపరిధి ఉంటుంది. ఎంతపెద్ద జ్యోతిష్కుడైనా సరే, తానుగణించి చెప్పేఫలితాలు గరిష్టంగా 99శాతం వరకూ జరగవచ్చుని, మిగిలిన ఆ ఒక్క శాతం భగవంతుడి దయ మీద ఆధారపడి ఉంటుందని మాత్రం చెపుతాడు. ఏదైనా జరగవచ్చుని కూడా చెపుతాడు.

రెండవది ఏమిటంటే, ఈ జ్యోతిష్యం చెప్పే వారిలో డబ్బుకోసం మోసాలు చేసేవాళ్ళు కూడా చాలా మందే ఉన్నారు. సహజంగానే ఏమనిషైనా, తానుహాయిగా బ్రతకాలని, ఎటువంటి ప్రమాదాలకు, బాధలకు, దురదృష్టాలకు, రోగాలకు గురికాకూడదనే కోరుకుంటాడు. అయితే, వాటినన్నిటినీ పూర్తిగా దరిచేరనీయకుండా చేయటం ఎవరికైనా సాధ్యమవుతుందా? అది తెలిసి కూడా, ప్రతీఒక్కరూ, వాటిని తప్పించుకోవడానికి దారులు వెతుకుతూనే ఉంటారు. జ్యోతిష్కులు, ఇటువంటి బలహీనతలను, తమ డబ్బు సంపాదనకు మార్గంగా మలచుకుంటారు. ఎదుటి వాళ్ళ జాతకచక్రాలను పరిశీలించి లేదా వాళ్ళ అరచేతి రేఖలను అధ్యయనం చేసి, వాళ్ళకష్టాలను, ఇబ్బందులను అంచనావేసి, వారి నమ్మకాన్నిచూరగొంటారు. తర్వాత అవి తొలగిపోవాలంటే, దోష నివారణ చేయాలని, గ్రహాలశాంతి పూజలు చేయాలని, హెూమాలు, మంత్రజపాలు చేయాలని చెప్పి దండిగా డబ్బు వసూలు చేస్తారు.

జ్యోతిష్యాన్ని నమ్మి, గ్రహాలకు శాంతిపూజలు చేయాలని విశ్వసించే వాళ్ళకు, అవిచేసే పద్ధతులు మతగ్రంధాల్లో రాసిపెట్టి ఉన్నాయి. ఉదాహరణకు శనిగ్రహాన్ని, హనుమంతుడిని స్తుతించేస్తోత్రాలు, శని ఏడు సంవత్సరాల దోషాన్ని పోగొట్టేపద్ధతి వంటివి. దేవతారాధన లేదామతాచారాలను పాటించడం ద్వారా ఆశించిన ఫలితాలను సాధించవచ్చునేమో గానీ, గ్రహాల

శాంతి పూజలు, మంత్ర జపాలు తాము జరుపుతామంటూ, విశ్వాసుల దగ్గర నుంచి ధనాన్ని సేకరించే జ్యోతిష్కులు, ఆపనులు సక్రమంగా చేయకపోతే ఆశించే ఫలితాలు దక్కుతాయన్నహామీ ఏదీ ఉండదు.

మరొక చిత్రమైన విషయం ఏమిటంటే, తాము పుట్టిన తేదీ ప్రకారం తాము జన్మించిన రాశి ప్రకారం, వార ఫలితాలను, వార్తాపత్రికల్లో చూసి, చదివి ఆనందించేవారు, బాధపడేవారు లెక్కకి మించే ఉంటారు. ఒకవారంలో రెండువేరు, వేరు వార్తాపత్రికల్లో, ఒకేరాశికి చెందిన వారఫలాలను పోల్చిచూసినట్లైతే, అవి ఒకదానికి ఒకటి భిన్నంగానే ఉంటాయి కానీ సరిపోలవు. నిపుణుడైన జ్యోతిష్కుడు, ఎవరికైనా సరేవారు జన్మించిన రాశిప్రకారం, వారి భవిష్యత్తు విషయాలను ఖచ్చితంగా చెప్పటం కుదరదనే చెపుతాడు. ఒతో పాటు, వారి జాతకచక్రం, వారి గ్రహం మీద, ఇతరగ్రహాల ప్రభావం, ఆ జాతకుల భార్య లేదా భర్త వంటి దగ్గర వాళ్ళ జాతకచక్రాల పరిశీలన వంటివి కూడా చేస్తేనే సరైన ఫలితాలను చెప్పే అవకాశం ఉంటుందని కూడా చెపుతాడు.

ఇంతవరకూ మనం జ్యోతిష్యాన్ని గణన, ఫలితాల అధ్యయనంగా పరిశీలించేం. ఇప్పుడు తాత్విక కోణంలో చూద్దాం. నిజంగా చెప్పాలంటే, ప్రతీఒక్కరూ, తమ గత జన్మలలో చేసిన మంచీ, చెడుపనులకు విధి నిర్ణయించే ఫలితాలను ప్రస్తుతజన్మలో అనుభవించాలి. ఆత్మసాక్షాత్కారం పొందిన వ్యక్తి అయినా, జీవన్ముక్తిని సాధించిన మహాపురుషుడైనా సరే, దీని నుండి తప్పించుకోవడం సాధ్యం కాదు. జ్యోతిషమైనా, హస్తసాముద్రికమైనా కేవలం విషయాలను సూచిస్తాయి. భగవంతుడు, మానవుడికి విచక్షణాశక్తిని (ఏదిమంచి, ఏది చెడు అన్నది నిర్ధారించుకునే శక్తి) ప్రసాదించేడు. దానిని ఉపయోగించి ఎవరైనా తనతలరాతని మార్చుకునే అవకాశాన్నిఆయన ఇచ్చేడు

కూడా. ఒకవేళ అది సాధ్యం కాకపోతే, ఎవరైనా మంచి కార్యాలను ఈజన్మలో చేయడం ద్వారా, తను తర్వాత జన్మలలో మంచి జీవితాన్ని స్వంతం చేసుకునేందుకు, వాళ్ళు పునాది వేసుకున్నట్టు అవుతుంది. ఈ ప్రాపంచిక జీవితంలోనే, ఆనందంగా వుండటం, ఆనందంగా లేకపోవటం అన్నవి అనుభవించవలసి వస్తుంది. అందువల్ల వాటికోసం దు:ఖించడం, ధనాన్నీ, సమయాన్నీ వెచ్చించి, జ్యోతిష్కుల దగ్గరకో, గ్రహశాంతులు, మంత్రజపాలు జరిపించేందుకు బ్రాహ్మణుల దగ్గరకో వెళ్ళటమన్నది సరైనది మాత్రం కాదు. వాళ్ళదగ్గరకు వెళ్ళకుండా, దానికి బదులు తన తెలివితేటలను ఉపయోగించి మరొకమార్గం కనుక్కోవడమన్నది ఉత్తమం అనే చెప్పాలి. దీనికి స్వామిసమర్ధ రామదాసు' చెప్పినట్టు," ఎవరైనా విధిరాత తప్పదని తెలిసిన వారైతే, వారు తమకు ఎదురైన వాటిని, అంగీకారంతో సమర్ధవంతంగా స్వీకరించాలి." అన్నసూచనని పాటించినట్లైతే, అది మాత్రమే సరైన విధానం అవుతుంది.

జ్యోతిష్య శాస్త్రం మీద, శ్రీసాయిబాబా గారి అభిప్రాయాలు అందరికీ తెలిసినవే. ఒకసారి బాంద్రా (బొంబాయి నగరం సమీపంలోని గ్రామం) నుండి రఘునాథ టెండూల్కరు' గారి కుమారుడు బాబాగారి దగ్గరకు వచ్చేడు. అతడు వైద్యకళాశాలలో, వైద్యవిద్యను అభ్యసిస్తున్నాడు. అతడు చాలా కష్టపడి చదువుతున్నప్పటికీ, ఒకజ్యోతిష్కుడు, అతడు, ఆసంవత్సరం జరిగే పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేడని గట్టిగా చెప్పడంతో, అతడు పరీక్షలకి హాజరు కాకూడదని నిర్ణయించుకున్నాడు. ఆసంగతిని, తర్వాత షిర్డీవెళ్ళి, సాయిబాబా గారిని సందర్శించుకున్న అతని తల్లి, ఆయన తన కుమారుడి సంగతి అడిగినప్పుడు చెప్పింది. అది వినగానే సాయిబాబా గారు" అతనికి నామాటగా, తన జాతకచక్రాన్ని చుట్టిపెట్టి, స్థిరచిత్తంతో పరీక్షకి హాజరు కమ్మని చెప్పు" అని ఆదేశించేరు. (పేజీ 109)

“ఎవరిసలహా మీదనో నడవవద్దని చెప్పు. జాతకాన్ని తెలుసుకోవద్దని చెప్పు. హస్తసాముద్రికం మీద ఆధారపడవద్దని చెప్పు. శ్రద్ధగా చదవమని చెప్పు” అన్నారు. (పేజీ 110)

“అతడు పరీక్ష పాసవుతాడని చెప్పు. పరీక్షకి వెళ్ళమని చెప్పు. అధైర్యపడవద్దని కూడా చెప్పు. నన్నునమ్ముకోమని చెప్పు.” అన్ని కూడా చెప్పే (పేజీ 111) అధ్యాయం 29.

ఆమె వెంటనే బాంద్రా వెళ్ళి, తన కుమారుడితో, బాబా గారు తనకు చెప్పిన మాటలు చెప్పింది. అతడు చాలా ఉత్సాహంగా పరీక్షరాసేందుకు సిద్ధమయ్యేడు. ఆతర్వాత, అతడు రాతపరీక్షలోనూ, మౌఖికపరీక్షలోనూ ఘనవిజయం సాధించేడు.

అలాగే నానా డెంగ్లే' అనే ఒక జ్యోతిష్కుడు, బాపూసాహెబు బుట్టీతో, ఫలానా రోజు మీకు శుభదినం కాదు కనుక, ఆరోజున మీరు చాలా జాగ్రత్తగా ఉండండి అని హెచ్చరించేడు. బాపూసాహెబు, అది తెలిసేక దిగులు పడటం మొదలయ్యింది. ఆ సంగతి తెలిసిన సాయిబాబా గారు బాపూసాహెబుతో'' నానా ఏం చెప్పేడు? అతడు గానీ, నిన్ను చంపాలనుకుంటున్నాడా? మనం దేనికైనా ఎందుకు భయపడాలి? చూద్దాం. అతనెలా నిన్ను చంపుతాడో!” అన్నారు. అయితే, నానా చెప్పిన రోజు సాయంత్రం వేళ, బాపూ సాహెబు మరుగుదొడ్డికి వెళ్ళినప్పుడు, అతనికి అక్కడ ఒక పాము ఎదురైంది. అయితే సాయిబాబా గారి అనుగ్రహం వల్ల, అతడికేమీ కాలేదు. (పేజీలు 97,98) అధ్యాయం 22.

అహమ్మదు నగరంలో ఉండే'దామూ అన్న' మంచి పేరున్న వ్యాపారస్తుడు. అతనికి, ఇద్దరు భార్యలున్నా సంతానం కలగలేదు. అతడు

తనజాతకాన్ని పూర్తిగా అధ్యయనం చేసినవాడు. అతనికి తన జాతకంలో మగసంతాన యోగం లేదని తెలిసి, చాలా నిరాశ చెందేడు. శ్రీసాయిబాబాగారు, అతనికి నాలుగు మామిడిపళ్ళు ఇచ్చి, వాటిని అతడి రెండోభార్యకిచ్చి, ఆమెని తినమని చెప్పమన్నారు. ఆమెకి నలుగురు మగపిల్లలు జన్మిస్తారని కూడా ఆయన చెప్పేరు. ఆతర్వాత కాలంలో బాబా గారు చెప్పినదే నిజమని, జాతకంలో ఉన్నది అబద్ధమనీ తేలింది. – అధ్యాయం25.

ఒకసారి ఒక అగ్నిహోత్రి బ్రాహ్మణుడు (ఇంటిలో నిత్యం పవిత్ర అగ్నిహోత్రం నిలిపేవాడు)' మూలేశాస్త్రి, నాసిక్' నుండి షిర్డీకి వచ్చేడు. అతడు సాయిబాబా గారి దగ్గరకు బాపూసాహెబు బుట్టీ గారి కుటుంబంతో కలిసివచ్చేడు. అతను జ్యోతిషశాస్త్రంలో ఉద్దండ పండితుడు. అరచేతిలో ఉన్నగీతలు, మచ్చలు, అరికాలి ముద్రలను బట్టి ఎవరిజీవితాన్నైనా చదివి చెప్పగల హస్తసాముద్రికుడు కూడా. అతడు శ్రీసాయిబాబా గారిని చూడగానే, ఎంతో ఆనందించి, ఆయన చేతులమీద ఉన్న జెండా, మెరుపు, అంకుశం వంటి దైవ చిహ్నాలను చూసి, బాబాగారి హస్తాలను బాగా పరీక్షించాలని ఆశపడ్డాడు. కొంచెం ముందుకువెళ్ళి, సాయిబాబా గారిని, ఆయన చేతులని తాను చూసేందుకు అనుమతించమని ప్రార్థించేడు. అయితే, సాయిబాబా గారు అందుకు అనుమతి నివ్వకుండా, నాలుగు అరటిపండ్లను, అతడి చేతిలో పెట్టి, పంపించేరు.

అలా సమయం, సందర్భం తటస్థించినప్పుడల్లా, బాబాగారు తన భక్తులకు జ్యోతిషశాస్త్ర అంచనాలు పరీక్షకు నిలబడవని చూపిస్తూ వచ్చేరు. తమకోసం జ్యోతిష్కులను, హస్తసాముద్రికులను చూడాలనుకునే వారిని ఆయన నిరుత్సాహపరుస్తూనే వచ్చేరు. ఏహస్త సాముద్రికుడినీ, తన

అరచేతులు చూడటానికి ఆయన అంగీకరించలేదు. అలాటివాటికి పోకుండా, ఏపనిలోనైనా విజయం సాధించాలంటే, కష్టపడి పనిచేయమని మాత్రమే ఆయన తన భక్తులకి బోధించేవారు. అనివార్యమైన ఫలితాలు సంభవించినప్పుడు, తన భక్తులను ఆయన ఓదార్చేవారు కూడా. తన చిన్నకుమార్తె మరణించినప్పుడు, దు:ఖంలో మునిగిపోయి ఉన్న కాకాసాహెబు దీక్షితుని, భావార్ధరామాయణం'లో తన భర్తవాలి మరణానికి దు:ఖిస్తున్న తారతో, రామచంద్ర ప్రభువు చెప్పిన సలహాని చదవమని చెప్పి ఆయన ఊరడించేరు. అలాగే బింద్రే గారి పెద్ద కుమారుడు, నాలుగు రోజుల్లో మరణించ బోతాడన్న సంగతి తెలిసి, శోకసముద్రంలో మునిగిపోయిన అతడిని" ప్రశాంతంగా ఉండండి. విచారం దగ్గరకు రానివ్వకండి" అని సూచించేరు.

నేను, చెప్పవలసివస్తే, శ్రీసాయిబాబా గారి భక్తులకు ఆయనని ఆరాధించడం మాత్రమే గ్రహాల శాంతిపూజ అవుతుంది. ఏముఖ్యమైన పనిచేయాలన్నా, గురువారం మాత్రమే పవిత్ర దినమవుతుంది. ఏ కారణాల వల్లనైనా గురువారం నాడు ఆపని చేయలేకపోతే, ఆతర్వాత ఏరోజైనా సరే ఆ పని ప్రారంభించే సమయంలో బాబా గారి నామస్మరణ చేయటం, ఆయన ఊదిని రాయటం చేస్తే, ఆపని విజయవంతమవుతుందని నేను నమ్ముతున్నాను. ఒకవేళ ఫలితాలు మనం అనుకున్నట్టుగా రాకపోతే, ఏదైనా దురదృష్టపరిస్థితిని మనం ఎదుర్కోవలసి వస్తే, సాయిబాబా గారి మీద నమ్మకాన్నిపోగొట్టుకోకుండా మనం ప్రశాంతంగా ఉన్నట్టయితే బాబా గారి ఆశీస్సులే అన్నిటినీ తొలగిస్తాయి. గుర్తుపెట్టుకోండి.. సాయిబాబా గారికి మన సంక్షేమాన్నిఎలా చూసుకోవాలో చాలా బాగా తెలుసు. ఆయన మనకి అంతిమంగా మంచి జరగే విధంగానే చూస్తారు.

"మనం చేసే సాయిబాబా గారి సేవ ఎన్నటికీ వ్యర్థంగా పోదు. మనం కోరుకున్న లక్ష్యాలను మనం చేరుకునేలా చేసి, ఆయన మనకు సంతృప్తిని కలిగిస్తారు." (పేజీ 15) అధ్యాయం 45

## అధ్యాయం 20

# వేరు వేరు మత ధోరణులు

శ్రీసాయిబాబా గారి వేషధారణ మహమ్మదీయ ఫకీరులా ఉంటుంది. ఆయన తన జీవితంలో చాలాకాలం ఒక శిధిలమవుతున్న మశీదులోనే గడిపేరు. ఎప్పుడూ" అల్లామాలిక్' హై" అనే పదాల స్మరణ చేస్తూ ఉండేవారు. పూర్వపు నిజాం పరగణాల్లో వాడుకలో ఉన్న మరాఠీభాషతో మిళితమైన ఉర్దూ గ్రామ్యభాషని ఆయన మాట్లాడేవారు. ఆయన ఇచ్చేదీవెన కూడా" అల్లాతేరా భలాకరేగా" (భగవంతుడు నిన్ను దీవిస్తాడు) అనే ఉండేది.

అలాగ ఉండే ఆయన, తన హైందవ భక్తులు, తన నుదురు మీద చందనపు పూతపూసినా, మశీదులోనే ఆయనను హారతినిచ్చి, పూజచేసినా, తప్పెటలు, తాళాలు మోగిస్తూ పాటలు పాడుతూ చప్పట్లు కొట్టినా అసలు పట్టించుకునే వారేకాదు. ఆయనే స్వయంగా మశీదులో 'ధుని' వెలిగించేవారు. మశీదులోనే ఒక గోధుమల బస్తా, దానితో పాటు తిరగలినీ ఉంచేవారు.

శ్రీరామ నవమి రోజున, రాముడి పుట్టిన రోజు ఉత్సవాలు జరిపేందుకు మశీదు ముందున్న ఖాళీస్థలంలో ఒక ఊయలను ఏర్పాటుచేసేందుకు,

ఆయన అనుమతించేవారు. అంతేకాదు, ఆ ఉత్సవాల్లో ఆయన కూడా పాలు పంచుకునేవారు. గులాల్' (ఎఱ్ఱరంగులో ఉన్న పొడి) చల్లడం, రామభజన చేయడం, రామాయణ సంగీత కీర్తనలలో పాడటం వంటివి కూడా ఆయన చేసేవారు. అదేవిధంగా మొహర్రం పర్వదినం నాడు, మహమ్మదీయులు, మశీదు ముందు 'తాజియా' (ఇమామ్' హుస్సేను సమాధికినకలు) ను ఉంచడానికి సమ్మతించేవారు. చందనపు ఊరేగింపు చెయ్యటానికి, ఎప్పుడు కావాలంటే అప్పుడు, మశీదులోకి వెళ్ళి, నమాజు' చేసుకునేందుకు వాళ్ళని అనుమతించేవారు. (అధ్యాయం7.)

క్లుప్తంగా చెప్పాలంటే, శ్రీసాయిబాబాగారు, హిందువులనీ, ముస్లింలనీ ఒకేవిధంగా చూసేవారు. ఆరోజుల్లో, ఆరెండు మతాల వాళ్ళ మధ్య ఎప్పుడూ ఏదో ఒకదాని మీద ఘర్షణలు తలెత్తుతూనే ఉండేవి. ఒకరి మతపరమైన ఆరాధననీ, జీవనవిధానాన్నీ మరొకరు అపహాస్యం చేస్తూనే ఉండేవారు. సాయిబాబాగారు ఒక మతపరమైన వ్యవహారాలను గౌరవించడం అన్నది మరొక మతస్థులకి నచ్చేదికాదు. వారు తమకది ఇష్టం లేదని ఆయనతో చెప్పినప్పుడు, బాబాగారు అందుకు చాలా చాకచక్యంతో అందుకు సమాధానమిచ్చి, వారు మరి మాట్లాడలేకుండా చేయగలిగేరు.

అందుకు ఒక ఉదాహరణ 3వ అధ్యాయంలో, మనకి కనిపిస్తుంది. రొహిల్లా (రోహిల్కండ్'కు చెందిన ఒక ముస్లిం తెగవ్యక్తి.) అనే ఒక పొడవుగా ఉన్న బలమైన మనిషి' కఫానీని ధరించి, మశీదులో సాయిబాబాగారి ముందు పెద్దస్వరంతో, రాత్రనక, పగలనక ఖురానులోని. కల్మా'లను ఉచ్ఛరిస్తూ మధ్యమధ్యలో పెద్దగా" అల్లాహెూఅక్బర్" అని కేకలు వేస్తూ ఉండేవాడు. షిర్డీలో ఉన్న చాలామంది సామాన్య ప్రజలు పగలంతా తమపొలాల్లో కష్టపడి పనిచేసి, అలసిపోయివచ్చి రాత్రయ్యేక ప్రశాంతంగా నిద్రపోవాలనునే

వాళ్లు అయితే రొహిల్లా వేసే కఠోరమైన కేకలు, అరుపుల వల్ల వాళ్ళు నిద్రపోలేకపోయేవారు. అందువల్లవాళ్ళు (ఎక్కువ మంది హిందువులు) సాయిబాబా గారి దగ్గరకి వచ్చి రొహిల్లాకి చెప్పి, తమ మీదకి వచ్చిపడుతున్న ఆ ఉపద్రవాన్ని ఆపమని అభ్యర్థించేరు. అయితే, బాబాగారు వాళ్ళ ప్రార్ధనని అంగీకరించలేదు. ఆయన వారికి ఒకసరదా సంగతి చెప్పేరు. రోహిల్లాకి, ఒకగయ్యాళి అయిన భార్య ఉంది. ఆమెకి, అతడితో కలసి ఉండటం ఇష్టం లేదు. ఆసంగతి బాబాగారితో చెప్పాలనుకున్న ఆమె, మశీదులోకి రావడానికి సిగ్గన్నది లేకుండా ప్రయత్నించింది. కానీ, రోహిల్లా బిగ్గరగా అరవటం ప్రారంభించినప్పటి నుండీ, ఆమెలోపలకి రావడానికి భయపడిపోయింది. అందువల్ల సాయిబాబా గారికి ప్రశాంతంగా నిద్రపడుతోంది. ఇది కథ మాత్రమే. రోహిల్లాకి భార్యలేదు. సాయిబాబా గారు బ్రహ్మచారి. రొహిల్లా మీద వచ్చిన ఆరోపణను పక్కనపెట్టేందుకే బాబా గారు దానిని చెప్పేరు.

ఒకసారి అబ్దులు రంగారి అనే ముస్లిం వ్యక్తిబాబాగారిని" మీరు, మీ నుదుటి మీద గంధం పూస్తే, ఎందుకు ఊరుకుంటారు? అది ముస్లిములైన మనసాంప్రదాయం కాదు కదా?" అని అడిగేడు. దానికి బాబాగారు" జైసాదేశ్'.. వైసావేష్' (రోమ్'లో వున్నప్పుడు రోమన్'లా వుండు అన్నసామెత లాంటిది) అన్నారు. హిందువులు నన్ను దేవుడిలా కొలుస్తారు. నేను వాళ్ళ ఆనందాలను ఎలా అడ్డుకోగలను? అందుకే వాళ్ళని అనుమతిస్తాను. నేను దైవభక్తుడిని కదా!" అన్నారు.

కొన్నిసార్లు ఇతర మతాల పట్ల తన సహనం ప్రదర్శించటానికి, సాయిబాబా గారికి తన ప్రత్యర్ధుల మీద తన యోగశక్తులు లేదా దైవశక్తులను కూడా ఉపయోగించవలసి వచ్చేది. బాబాగారు వుండే మశీదు ముందట

రాత్రివేళల్లో 'కల్మాలు' చదువుతూ వుండే బలమైన, పొడుగ్గా ఉండే రొహిల్లాని, బాబా గారి ఉనికి అయోమయానికి గురిచేసింది. ఒకరకంగా బాబాగారిలో ఉండే అపారమైన జ్ఞానం, అద్వితీయశక్తి, ఆయనను ఒక పర్వర్దిగార్' (భగవంతుడి, భూమి మీద రూపం)ను చూస్తున్నట్టుగా, అతడికి అనిపించేది. కానీ బాబాగారు, తనను మశీదులోనే మంత్రపఠనం చేస్తూ, తాళాలతో, ఇతర సంగీతవాయిద్యాలతో, పూజలు చేస్తూ వుండటాన్ని, విఠల్'దత్త, వంటి హిందూదేవతలకు సమర్పించే ప్రసాదాలను తనకు సమర్పించేందుకు అంగీకరించటాన్ని చూస్తున్నప్పుడు అతనికి, ఆయన విధానాలు పూర్తిగా ముస్లిం మతవ్యతిరేకమైనవని అనిపించేయి. అంతేకాదు సాయిబాబాగారు విఠల్' దత్తవంటి దేవతలందరూ 'అల్లాయే' అనిచెప్పడం అతడిని దిగ్భ్రాంతికి గురిచేసింది కూడా. ఇలా ముస్లిం మత విధానాలకు భిన్నంగా వ్యవహరిస్తూ, తమ మత విధ్వంసకుడిగా అనిపిస్తున్న సాయిబాబా గారిని చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఒకరోజు ఒక పెద్దకర్రను, తనచేతుల్లో ఎత్తిపట్టుకుని, బాబాగారి వెనకాతలకి చేరుకుని, దానితో ఆయన్ని చంపేయడానికి సిద్ధమైపోయేడు. ఒక్కదెబ్బతో ఆయనను చంపేసి, ఇతర మతానుసరణలను చెరిపెయ్యవచ్చుని భావించేడు. సర్వజ్ఞుడైన బాబాగారికి అంతాతెలుసు కనుక ఆయన ఒక్కసారి వెనక్కితిరిగి, రొహిల్లా మొహంలోకి దీక్షగాచూస్తూ, తనచూపులని అతడి ఎడమమణికట్టు మీదకి మరల్చారు, వాటి ప్రభావం వల్ల రొహిల్లా శక్తి అంతా హరించుకుపోవటమే కాదు. చేతుల్లో ఉన్న కర్రని కనీసం పట్టుకోవడమైనా చేయలేక, అతడు అక్కడే కుప్పకూలిపోయేడు. అతడిని అక్కడే విడిచిపెట్టి సాయిబాబాగారు, అక్కడ నుండి వెళ్ళిపోయేరు. కొన్ని నిముషాలపాటు, రొహిల్లా అలా కూలబడిపోయే ఉన్నాడు. తర్వాత కొందరు, అతడిని అక్కడ నుంచి లేచి వెళ్ళమని చెప్పినపుడు, అతను" బాబాగారు నాశక్తులన్నీ తీసేసుకున్నారు. నన్ను మీరే పైకిలేపాలి." అని ప్రకటించేడు.

ఒకసారి ఒక తాశీల్దారు, దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన ఒక బ్రాహ్మణ వైద్యుడిని తీసుకుని షిర్డీవచ్చేడు. ఆ వైద్యుడు, తాను రామభక్తుడునని, ఏముసల్మాను వ్యక్తికీ నమస్కరించననీ చెప్పేడు. అందువల్ల తాను, బాబాని చూసేందుకు షిర్డీరానని కూడా, ఆ తాశీల్దారు మిత్రుడితో ముందు ఖండితంగా చెప్పేడు. అయితే, నిన్నెవరూ ఆయనకి నమస్కరించమని చెప్పరు. ఆసంగతిని ఆయన అసలు పట్టించుకోరు. అనిచెప్పేక, అప్పుడతనికి తోడుగా ఆవైద్యుడు షిర్డీవచ్చేడు. ఇద్దరూ, సాయిబాబా గారిని దర్శించుకోవటానికి మశీదులోనికి వెళ్ళేరు. అందరినీ ఆశ్చర్యపరుస్తూ, ఆ వైద్యుడు అందరికన్నా ముందుగావెళ్ళి, బాబాగారికి పాదాభివందనం చేసేడు. అందరూ" నువ్వన్న మాట నిలబెట్టుకోలేదెందుకు? ఒక ముస్లిం వ్యక్తికి నమస్కారం చేసేవెందుకు?" అని, అతడిని నిలదీసేరు. దానికి ఆవైద్యుడు," నేను, నా రాముణ్ణి ఆ సింహాసనం మీద చూసేను. అందుకే నేను పాదాభివందనం చేసేను." అని బదులిచ్చేడు. అలా అతను చెపుతున్నప్పుడు, ఆ పీఠంమీద, సాయిబాబా గారే అతడికి కనిపించేరు. విషయం అర్థంకాక, అతను" నేనేమన్నా కలగంటున్నానా? అతడెలా మహమ్మదీయుడయ్యేడు? అతడు గొప్ప యోగసంపన్న అవతారంలా కనిపిస్తున్నాడు." అని నివ్వెరపోయేడు. (పేజీ162) అధ్యాయం12.

ఆవిధంగా సాయిబాబా గారు తన జీవితమంతా, రెండు పరస్పర విరుద్ధమతాలను, సంఘర్షించుకునే వాటిని, ఏకం చేయాలన్న ఆశయాన్ని ఒకలక్ష్యంగా పెట్టుకున్నట్టు మనకి అనిపిస్తుంది. కొన్నిసార్లు చాకచక్యంగా, కొన్నిసార్లు తన శక్తులను పయోగించీ ఆయన, తనని అందరూ విశ్వసించేలా చేసేవారు." రాముడు, రహీము ఇద్దరూ ఒకటే. వాళ్ళిద్దరి మధ్యా చిన్నతేడా కూడా ఏమీలేదు. అలాంటప్పుడు ఆ ఇరువురి భక్తులూ ఎందుకు

వేరయిపోయి, తమలో తాము కొట్లాడుకుంటారు? అజ్ఞానుల్లారా! చేతులు కలిపి రెండుమతాల వాళ్ళూ ఒక్కటవ్వండి. తెలివిగా ప్రవర్తించండి. అప్పుడు మీరు జాతీయ సమైక్యతా లక్ష్యాన్ని సాధించగలుగుతారు."

"మీకు ఎవరైనా చెడుచేస్తే, మీరు వారిపై ప్రతీకారం తీర్చుకోవద్దు. మీరు ఇతరులకు, ఏదైనా చేయాలనుకుంటే మంచి పనే చేయండి"

శ్రీసాయిబాబా గారు హిందూమతాన్ని ఒక్కదాన్నేగౌరవించలేదు. మహమ్మదీయ మతంతో దానిని సమానంగా చూసేరు. క్రిస్టియను మతాన్నీ, జోరాష్ట్రియను మతాన్నీ కూడా ఆదరించేరు. చక్రనారాయణ అనే క్రైస్తవ మతస్థుడు, రహతా పట్టణానికి పోలీసు ఠాణాకి అధికారిగా వచ్చినప్పుడు, సాయిభక్తులు కొందరు, బాబాగారితో, "బాబా! మన పట్టణానికి ఒక క్రైస్తవ పోలీసు అధికారి వచ్చేడు." అని చెప్పేరు. దానికి బాబాగారు" అయితే ఏమైంది? అతనూ నా సోదరుడే కదా!" అన్నారు.

అదేవిధంగా, రష్యా, జపాను దేశాల మధ్య యుద్ధం జరుగుతున్నప్పుడు' జహంగీర్‌కి ఫ్రాంజీదారువాలా అనే పార్శీ మతానికి చెందిన ఓడకెప్టెను, అతని నౌకల్లో మూడు తప్ప మిగిలిన వాటినన్నిటినీ, శత్రువులు సముద్రంలో ముంచేసేరని, మిగిలిన వాటికి కూడా అదే గతి పట్టబోతోందని తెలిసింది. అతడు వెంటనే, తన జేబులోంచి సాయిబాబా గారి ఫొటోని తీసి, కన్నీళ్ళతో, బాబాగారిని, తననీ, తన నౌకలనీ రక్షించమని ప్రార్థించేడు. అప్పుడు, సాయిబాబాగారు, అక్కడ ప్రత్యక్షమై, మునగబోతున్న జహంగీరు ఫ్రాంజీదారువాలా ఓదలన్నిటినీ, వొడ్డుకు చేర్చేరు. వెనువెంటనే దారువాలా, బాబాగారికి పూజలు చేయటానికి అనుమతించమని, వారిని ప్రార్థించేడు. ఆయన "హా' అని అరిచి, అక్కడే తాను తన మశీదులో ఎలా కూర్చుంటారో,

అలాగే కూర్చుండిపోయేరు. అక్కడ మశీదులో కూర్చుని ఉన్న ఆయన కఫానీ, తలవస్త్రం పూర్తిగా తడిసిపోయి ఉన్నాయి. అర్ధగంటపైనే వాటి నుండి నీరుధారగా కారుతూ, మశీదు అంతా నీటిమడుగే అయిపోయింది. నివ్వెరపడిన భక్తులు, ఆయన బట్టలను పొడిగా మార్చి, మశీదు నుండి నీటిని తొలగించేరు. నాటికిమూడవరోజు సాయిబాబా గారికి, జహంగీరు నుండి ఒకతంతి వార్త వచ్చింది. అందులో అతడు బాబాగారు తన మూడునౌకలను, అందులోని ప్రయాణీకులను కాపాడినందుకు వేయి ధన్యవాదాలు తెలియచేసేడు. ఆతర్వాత అతడు భారతదేశం రాగానే, షిర్డీవెళ్ళి ఆయనను దర్శించుకుని, నివాళులు అర్పించుకుని. ఆయన ఉండే మశీదులో, సభామండపాన్ని కొత్తగా నిర్మించేందుకు, 2,200/-రూపాయలు ఇచ్చేడు.

సాయిబాబాగారు, మిగిలిన మతాలను తాను గౌరవించడమే కాదు తన భక్తులు కూడా అలాగే ఉండాలని కోరుకునేవారు. ఒకసారి, ఆయనకు ఇష్టుడైన కాకాసాహెబు దీక్షితు అనే భక్తుడు తాను ఉంటున్న వసతి గృహంలో క్రైస్తవాన్ని గురించీ, క్రీస్తు గురించీ చెడుగా మాట్లాడేడని తెలిసింది. తర్వాత అతడు బాబా గారి దగ్గరకు వచ్చి, ఆయన పాదాలకు మర్దన చేస్తున్నప్పుడు ఆయన” నువ్వు వెళ్ళిపో! నాకు నువ్వు చేసేసేవ అవసరంలేదు.” అని బిగ్గరగా అరచి చెప్పేరు. దీక్షితుకి, సంగతి అర్ధమై తాను క్రైస్తవం మీద అన్న మాటలకు పశ్చాత్తాపపడ్డాడు. అప్పుడు సాయిబాబా గారు, దీక్షితుని యదావిధిగా తన పాదాలను మర్దన చేయనిచ్చేరు.

బాబాగారికి, ఎవరూ తన స్వంతమతాన్ని వదలి మరో మతాన్ని స్వీకరించడమన్నది గిట్టదు. ఒకసారి ’బడేబాబా’ (ఒక మహమ్మదీయ సాధువు) తనతో పాటు, హిందూమతాన్ని విడిచిపెట్టి, ముస్లింగా మతం

మారిన ఒకవ్యక్తిని తీసుకుని సాయిబాబా గారి దగ్గరకు వచ్చేడు. ఆవ్యక్తి చెంపమీద బాబా గారు, చరిచి," ఆహా! నువ్వు నీ తండ్రిని మార్చుకున్నావన్న మాట" అన్నారు. బాబా గారు తను జీవించి ఉన్నంత కాలమూ, ప్రతీ ఒక్కరినీ తమ మతాన్ని మార్చుకోవద్దనీ, పూజించే కులదైవాన్ని విడిచి పెట్టవద్దనీ, నమ్ముకున్న గురువుని వదలవొద్దనీ చెపుతూనే ఉండేవారు. "అప్నాబాప్'తో అప్నాబాప్ (కన్న తండ్రికన్నా మించిన వారెవరూ వుండరు) అనేవారు.

సూక్ష్మంగా చెప్పాలంటే, సాయిబాబా గారి లక్ష్యం ఏమిటంటే, ఒకే లక్ష్యానికి (భగవంతుడిని చేరుకోవడం) చేరుకునే విభిన్న మార్గాలే మతాలు అనీ, అన్నిమతాల ప్రాథమిక సిద్ధాంతాలు ఒకటే అనీ, ప్రతీఒక్కరికీ తెలియజేయడం. సకలజీవులూ, భగవంతుని సంతానమే. ఈశ్వర్ 'అన్నాఅల్లాహ్' అన్నా లేదా ఇంకేపేరుతో పిలిచినా ఆయన ఒకడే. అందుకే ఆయన పిల్లలందరూ అన్నదమ్ముల్లా, మతాల కోసం ఒకరినొకరు కొట్టుకోకుండా ప్రశాంతంగా జీవించాలి. అని చెప్పడం ఆయన దివ్యమైన సూచన కూడా.

ఆయన జీవితకాలమంతా షిర్డీలో తన చాతుర్యంతో కూడిన సమయానుకూల దివ్యభాషణలు చేస్తూ, అతీంద్రియ శక్తులతో, మహిమాన్విత ఆధ్యాత్మిక, యోగిక, ప్రదర్శనలతో భక్తులను అనుకూలంగా మలచుకుంటూ వేరువేరు మతాల సమైక్యత కోసం నిర్విరామంగా పనిచేసేరు. దాని ఫలితంగా మశీదులో ఆయన కూర్చుని ఉన్నప్పుడు, ఆయన దగ్గర, చుట్టూతా ఉన్నభక్తులలో, హిందువులు, ముస్లిములు ఎటువంటి మతభేదాలు, కులవైషమ్యాలు లేకుండా కలిసిమెలిసి ఉండేవారు. ఆయన

భోజనం వడ్డించేటప్పుడు కూడా ఎటువంటి భేదభావం చూపకుండా అందరూ కలిసి తినేవారు. రోజు విడిచి రోజు ఆయన చావిడిలో ఊరేగింపుగా వెళ్ళేటప్పుడు, హిందువులు మాత్రమే కాకుండా ముస్లింలు కూడా ఆయనతో పాటు నడుస్తూ పొడవైన చామరం, ఛత్రం వంటి గౌరవభక్తి చిహ్నమైన వాటిని పట్టుకునేందుకు పోటీపడేవారు.

శ్రీసాయిబాబా గారి భక్తులలో చాలామంది హిందువులు. పండరీపురంలో దేవుడికి పూజచేసి, హారతులనిచ్చే విధంగానే వాళ్ళు సాయిబాబా గారికి, మశీదులో పూజలుచేసి, హారతినిచ్చేవారు. వారు చేసే సాయిభజనలు అన్నీ హిందూపురాణాల గాధలతోనే ఉండేవి. అయితే ఆ భజనలు జరుగుతున్నంత సేపూ ముస్లిం భక్తులు కూడా వాటిని ఆస్వాదించి, హిందూ భక్తులు పంచిపెట్టే ప్రసాదాల వంటి వాటినన్నిటినీ తీసుకునే వారు కూడా. అంతేకాకుండా, ముస్లిం భక్తులెవరైనా సాయిబాబా గారి ఆశీర్వాదాల కోసం షిర్డీ వచ్చినప్పుడు పువ్వులు, పంచదార పలుకులు, కొబ్బరికాయలు తీసుకువచ్చి' ఫాతియా' (ప్రార్ధన) చేసేవారు. కొన్నిసార్లు బాబాగారు, వాళ్ళతో కూడా ప్రార్ధనల్లో పాల్గొనేవారు. అప్పుడు హిందూ భక్తులందరూ, ఆముస్లిం మతప్రార్ధనా విధానాలను కన్నార్పకుండా నిశ్శబ్దంగా చూస్తూ, వాళ్ళు పంచిన పంచదార పలుకుల, కొబ్బరిముక్కల ప్రసాదాలను ఆనందంగా తీసుకునే వారు. అది ఎంత అమోఘమైన సామరస్యం, సోదరభావం.

ఈ రోజు భారతదేశం ఇటువంటి సామరస్యాన్నీ, సోదరభావాన్నీ కోరుకుంటోంది. మనదేశ సమగ్రతనీ, ఐక్యతా భావాన్నీ నిలుపుకోవాలంటే, మనందరి ధన, మానప్రాణాలను కాపాడుకోవాలంటే అవి చాలా అవసరం.

ఆ దృశ్యాన్ని మనం నేడు కూడా షిర్డీలో చూస్తాము. హిందువులు, ముస్లింలు, శిక్కులు, పార్శీలు, క్రైస్తవులు, అందరూ కలిసి శ్రీ సాయిబాబా గారికి ప్రార్ధన చేయటం మనకి కనబడుతుంది. దీనిని మనం, మన దేశమంతటా ఉండేలా చూడాలి. మనం శ్రీసాయిబాబా గారి భక్తులం, ఇటువంటి పని ఈ దేశమంతటా జరిగేలా చేయడానికి ప్రారంభ కార్యక్రమాన్ని, మనం మొదలుపెడదాం.

## అధ్యాయం 21

# సంక్షిప్తంగా శ్రీ సాయిబాబా గారి బోధనలు

రఘునాధ సావిత్రి రచించిన “సాయినాధ భజనమాల” పుస్తకానికి తానురాసిన ముందుమాటలో, సాయిబాబా గారికి అత్యంత ఆప్తుడైన పరమభక్తుడు కాకాసాహెబు దీక్షితు, సాయిబాబాగారి అత్యంత విలువైన బోధనలను, చాలా కొద్దిమాటలలోనే తెలియచేసేడు.

అవి: భగవంతుడు ఉన్నాడు. అతడిని మించిన వారెవ్వరూ లేరు. అతడు జీవులు, నిర్జీవులు అన్నిటిలో వ్యాపించి ఉండటమే కాకుండా అంతకుమించిన వాటన్నిటిలో విస్తరించి ఉన్నాడు. ఆయన నాటకానికి అంతంలేదు. ఆయనే సృష్టిస్తాడు. ఆయనే రక్షిస్తాడు. ఆయనే సంరక్షణ చేస్తాడు. ఆయనే నశింప చేస్తాడు. ఆయన మనలని నడిపించే విధానంలోనే మనం జీవించాలి. ఆయన కోరిన ప్రకారమే మనజీవనం సాగాలి. మనందేనికీ ఆరాటపడకూడదు. సంతృప్తిగా జీవించాలి. ఆయన తలుచుకోకపోతే, కనీసం ఒక్క ఆకు అయినా కదలదు.

“ప్రతీ ఒక్కరూ నిజాయితీగా (ధర్మబద్ధంగా) ప్రవర్తించాలి. అన్నిసమయాల్లోనూ మంచిచెడ్డలు నిర్ణయించుకునేందుకు తమ మనస్సాక్షిని,

జాగరూకతలోనే ఉంచుకోవాలి. మనం, మనకర్తవ్యాలని ఎటువంటి అహంకారంతోనూ, కర్తను నేనే అన్న గర్వంతోనూ నిర్వర్తించకూడదు. ఆ పనులను, వాటి ఫలితాలతో బాటుగా భగవంతుడికే అంకితంచేస్తే, మనకు వాటివల్ల కలిగే బంధనాలకు దూరంగా ఉండగలుగుతాము."

"మనం సకల ప్రాణకోటితోనూ ప్రేమతోటే జీవించాలి. మనం వాదాలలోకి దిగకూడదు. ఎవరైనా మనని నిందిస్తే, మనం ప్రశాంతంగా వాటిని భరించాలి. తిట్లు, మనశరీరానికి రంధ్రాలు చేయవు. మనం ఇతరులకు శత్రువులుగా ఉండకూడదు. ఇతరులను దూషించకూడదు. ఇతరులు ఏంచేస్తున్నారన్నది మనం పట్టించుకునే అవసరం లేదు. వారి పనులు వాళ్ళవి. మనపనులు మాత్రమే మనవి."

"ఎప్పుడూ పనిచేస్తూనే ఉండండి. సోమరులుగా కూర్చోకండి. భగవంతుడి నామస్మరణలో ఉండండి. ఆధ్యాత్మిక గ్రంథాలను చదవండి. మీరు, తినడం, త్రాగటం, తిరగడం పూర్తిగా మానక్కర్లేదు. వాటిని మీ అదుపులోనే ఉంచుకోండి."